# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక ఫిబ్రవరి, 2015 ₹ 25



లండన్ గ్రేట్ అర్మండ్ సెయింట్ హాస్పిటల్ లోని
సెయింట్ క్రిస్టోఫర్ చర్చి.

# మిసిమి

మాసపత్రిక

**“All that we are is the product of what we have thought”**
***- Dammapada.***

**సంపుటి 25 ఫిబ్రవరి 2015 సంచిక 2**

*ప్రధాన సంపాదకుడు*
చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*
వల్లభనేని అశ్వినీకుమార్

*సహాయ సంపాదకుడు*
కాంఢ్రేగుల నాగేశ్వరరావు

*సాంకేతిక సహాయకులు*
పడవల ఉమాశంకర్, చేపూరి రమేష్,
మహమ్మద్ కుర్రాముద్దీన్ జీ షాన్, వెల్దండ రమేష్,
వేముల రాణి, సారిక నిర్మల,
నీలకంఠం నరసరాజు

*సంస్థాపక సంపాదకులు*
**రవీంద్రనాథ్ ఆలపాటి**

*Printed & Published by*

**Bapanna Alapati**
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
www.misimimonthly.com
e-magazine : www.kinige.com/misimi

| | | | |
|---|---|---|---|
| ప్రతి : ₹ 25 | | సంవత్సరానికి : | ₹300 |
| విదేశాలకు ప్రతి : | $ 2.50 | సంవత్సరానికి : | $ 25 |

(Library of Congress Control Number)
LCCN 91-903060

## ఈ నెల...

కమ్మతెమ్మెరలు ..... 5

చరిత్రలో మహాభారతం ..... 7
*– సాయి పాపినేని & జయశ్రీ నాయని*

బాల సాహిత్య పురస్కారాలు ..... 13
*– ప్రొ. రావినూతల సత్యనారాయణ*

సినిమాలో స్త్రీ ..... 23
*– డా. ఎం. వెంకటేశ్వర్ & డాక్టరు అయ్యగారి సీతారత్నం*

మకర సంక్రాంతి ..... 37
*– ఎం. గిరిధర్*

గిరిజన నృత్యాలలో పశు పక్ష్యాదులు ..... 39
*– సి. సరళాదేవి*

ఎరుకల జానపద వైద్యం ..... 43
*– డా. ఎ.కె. వేణుగోపాల్ రెడ్డి*

ఛత్తీస్‌గఢ్‌లో తెలుగువారు... ..... 46
*– ఎల్. రుద్రమూర్తి*

చాసో కథల్లో సౌందర్య దృక్పథం ..... 52
*– డా. కాకుమాని శ్రీనివాసరావు*

తెలుగు, హిందీ సాహిత్యాలు ..... 59
*– డా. బాలశౌరి రెడ్డి*

సాహిత్యంలో విమర్శ పాత్ర ..... 63
*– గొల్లపూడి మారుతీరావు*

సి. సుబ్బారావు ..... 68
*– నాగసూరి వేణుగోపాల్*

సంగీత నవావధానము ..... 70
*– మీగడ రామలింగ స్వామి*

సి.యస్. రావుతో మాటా మంతి ..... 72
– ***మిసిమి***

ఆరిన గ్రంథాలయ దీపిక ..... 81
*– గుడిపూడి సుబ్బారావు*

తూర్పు యూరప్ కవిత్వం ..... 82
*– ముకుంద రామారావు*

శతవసంతాల రజని ..... 89
*– ఇంద్రగంటి శ్రీకాంతశర్మ*

పుస్తక పరిచయం ..... 96

*ముఖచిత్రం* : ఆమె నడిచే అందం .... చిత్రకారుడు – ఎమిలీ వెర్నన్
*రెండవ అట్ట* : లండన్ గ్రేట్ అర్మండ్ సెయింట్ హాస్పిటల్ లోని సెయింట్ క్రిస్టోఫర్ చర్చి
*మూడవ అట్ట* : రామేశ్వర ఆలయ వైభవం
*నాల్గవ అట్ట* : వసంతం .... – విలియం సావేజ్ కూపర్

*వివరాలు 50వ పుటలో...*

ఇటీవల తెలుగు అకాడెమీ పూర్వ అధ్యక్షులు, తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి **మిసిమి** కార్యాలయానికి వచ్చారు. వీరు ఎన్నో విషయాలు – పత్రిక తీరు తెన్నుల గురించి, తెలుగు భాష, రచనలు, ఆధ్యాత్మిక పుస్తకాలు – ఇలా మరెన్నో సంగతులు మాట్లాడుతూ – రచనలలో విషయ సాంద్రత – విపులత, స్పష్టత కరవవుతున్నాయి, ఇది నిజంగా విచారించ దగినది. – చర్చించ వలసిన విషయమన్నట్లు తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఇందులో కాదనటానికి ఏముంది? రచయితలు, మొదటగా కవులు – ఎవరి సంపుటి వారు ముద్రించుకొని పంచిపెట్టుకుంటున్నారు.

ఇక పత్రికలన్ని కథా – కథానికల, కలకిలలలో కొట్టుకుపోతున్నాయి. కథా వస్తువులన్ని కుడి – ఎడమలే – కాదంటే వార్తా కథనాలే – అవికూడా కొత్తగా చెప్పటానికి ఏమున్నాయి? – కాస్త పేరున్న రచయితలు పురస్కారాల వేటలో తమ సంపుటి, సంకలనాలను రాజభాషలో తర్జుమా చేయించుకుంటూ దేశ రాజధానిలో గుడారాలే వేస్తున్నారని చెప్పటంలో అతిశయోక్తి లేదేమో– ఇవన్ని ఎందుకు ఇప్పుడు మొరపెట్టుకోవటం – తెలుగులో 'క్లాసికల్ సాహిత్యం' పోనీ 'క్లాసికల్ లిటరేచర్' రాదా? టి.వి. ఛానల్లు రేటింగ్‌లకోసం వెంపర్లాడుతున్నట్లు – మనం పురస్కారాల వెంటపడటం కేవలం కీర్తికోసమేనా? ధనప్రాప్తి కోసం కూడానా?

ఏది ఏమయినా– వాసి–వాడి తగ్గి స్తబ్దత ఆవరించిన తెలుగు రచనలకు – ప్రత్యేకంగా సృజనాత్మక సాహిత్యం కోసం ఇంకా ఎన్నాళ్ళు ఎదురు చూడాలి?

గుడ్డిలో మెల్ల అన్నట్లు ఇక విమర్శ – పరిశీలన – పరిశోధన ప్రధానమైన వ్యాసాలు ప్రచురించే పత్రికలు ఒక చేతి వేళ్ళకు కూడా చాలవు. ఇలాంటి వాతావరణంలో రాచపాళెం చంద్రశేఖర రెడ్డి కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం పొందటం హర్షణీయమే. కనీసం అనువాద – అనుసృజన – రచనలలోనైనా ఈ క్లాసికల్ సాహిత్యం రావచ్చని ఆశించిన మనకు కొంత ఊరట – డాక్టర్ లంకా శివరామ ప్రసాద్ అనువదించిన గ్రీకు క్లాసికల్ గ్రంథాలు హోమర్ – ఇలియడ్, ఒడిస్సీ; వర్జిల్ – ఈనీడ్; జాన్ బునియన్ – పిల్‌గ్రిమ్స్ ప్రొగ్రెస్; డాంటే – డివైన్ కామెడీ; జాన్ మిల్టన్ – ప్యారడైజ్ లాస్ట్, ప్యారడైజ్ రీ గెయిన్డ్ – ఈ గ్రంథాలు తెలుగులో అందించటం బృహత్కార్యమే. అలాగే ఈ మధ్యనే **మిసిమి** ప్రచురించిన పి.బి. షెల్లీ – ఏరియల్ (జీవిత కథ), ఎడోనోయిస్; ఆస్కార్ వైల్డ్ – డి ప్రొఫండిస్ (అగాధం), ఓ ఖైదీ వీరగాథ; హెర్మన్ హెస్ – సిద్ధార్థ; చార్లీ చాప్లిన్–నా కథ లాంటి పుస్తకాలు కూడా ఇలాంటి సాహిత్యానికి తెరలేపాయనవచ్చు. సాయి పాపినేని రచన – ఆంధ్రనగరి – చారిత్రక స్ఫూర్తితో వచ్చిన క్లాసికల్ గ్రంథమే. అలాగే యార్లగడ్డ వారి వచన భారతం, హరవిలాసం (వచనంలో) ఈ కోవలోనివే. వీటికి ముందు ఆచార్య గంగిశెట్టివారి 'పర్వ' కూడా విశిష్ట రచనే. రచయితలు – ప్రచురణ కర్తలు కొంతలో కొంత క్లాసికల్ సాహిత్యాన్ని, వెలుగులోకి తీసుకు రావటానికి ప్రయత్నిస్తారని ఆశించవచ్చా?

ఆలపాటి రవీంద్రనాథ్ 19వ వర్ధంతికి మా స్మృత్యంజలి.

**– సంపాదకులు**



# కమ్మతెమ్మెరలు

✶ "...1950లో రవీంద్రనాథ్‌గారు తెలుగు విశ్వవిద్యాలయంలోని నా ప్రసంగ సందర్భంలో హాజరై, నా ప్రసంగ పత్రాన్ని **మిసిమి**లో ప్రచురించారు. అందుకు వారు నాకు రు. 100/- పంపించగా, అలా నాకు నా వ్యాసాలకు డబ్బు పంపవద్దని వ్రాశాను. ఆ తరువాత నా వ్యాసాలు మరికొన్ని **మిసిమి** ప్రచురించింది. రవీంద్రనాథ్‌గారు నాకు డబ్బు పంపలేదు కాని, మా *హేతువాది* పత్రికకు అవసరమయిన సరంజామా పంపించారు. మా హేతువాది అప్పటి నుంచి ఇప్పటి వరకు **మిసిమి**కి చేరుతూనే ఉంది. కాని, ఎందుకు చాలకాలంగా **మిసిమి** మాకు రావడంలేదు. ఇటీవలే హైద్రాబాదులోని మా మిత్రుని ద్వారా **మిసిమి** చందా దారునిగా చేరాను...

... మీరు నా ఫోనుకు అందికలో లేరు. నిన్న నేను మరొక వ్యాసం **మిసిమి**లో ప్రచురణ కోసం పంపించాను. దాన్ని మీరు జనవరి **మిసిమి** సంచికలో ప్రచురించ గలిగితే **మిసిమి** సౌజన్యంతో ఆ వ్యాసాన్ని ఫిబ్రవరి హేతువాదిలో ప్రచురించుకుంటాను. ఈ వ్యాసానికే కాక, మరే నా వ్యాసానికయినా **మిసిమి** నాకు డబ్బు పంపనవసరం లేదు. కాని, ఎక్చేంజి కాపీగా మీరు నాకు **మిసిమి** కాపీలను రెగ్యులర్‌గా పంపే అవకాశాన్ని పరిశీలించండి...

... గత నాలుగేళ్లుగా నేను చాల అనారోగ్యస్థితిని గడిపి, ఇప్పుడే కోలుకొని కొద్దిపాటి రచనలు చేస్తున్నాను. నా వయసు వచ్చే ఫిబ్రవరి 9వ తేది నాటికి 94కు చేరుతుంది. అయినా, హేతువాద ఉద్యమంలో నాకు సాధ్యమయినంత తోడ్పడుతున్నాను...

... మరొక మాట! ఇప్పుడు పంపిన నా వ్యాసం మూడో ప్రపంచ యుద్ధం రాబోతుందేమో నన్న శంకతో వ్రాసింది. పరిశీలించి ప్రచురణార్హ మనుకొంటే ప్రచురించండి. లేకుంటే తిప్పి పంపినా నొచ్చుకోను..."

**– రావిపూడి వెంకటాద్రి,** హేతువాది, చీరాల.

✶ "...**మిసిమి** పాతికేండ్ల సారస్వత సేవ అభినందనీయం. పత్రిక సైజులో మార్పులు వచ్చినా, అందించే సాహిత్య సమాచారంలో మార్పులేదు. – అదే సాంద్రత, అదే ఉత్సుకత...

... డిసెంబర్ 2014 సంచిక *సింగారంపు పల్లకి సెలువు చూడవె* అత్యంత ఆకర్షణీయంగా ఉంది...

... లక్ష్మణ్‌గారి *ఆధునిక కవులు – భాషా దృక్పథం*లో కవుల కవితా శైలి, సామగ్రి గురించిన వ్యాసం ఉపయుక్తమైనది. ఎల్. భాస్కర్‌రావుగారి *అన్నమయ్య సంకీర్తనలలో జాతీయాలు* – ఆసక్తిదాయక వ్యాసం...

... మా ఊళ్ళో తన ప్రవాసాంధ్ర విశేషాలు తెలుపుతూ మాలో ఉత్సుకత నింపి, మిత్రుడు మాధవీసనారా తదితరుల గురించి *120 ఏండ్ల ఖర్గపూర్ ప్రవాసాంధ్రు*ల గురించిన వ్యాసంలో చక్కగా వివరించారు సుందరంగారు. అలాగే *చరిత్రలో చంద్రగిరి కోట* విశేషాలూ ఆకట్టుకున్నాయి. జపాన్‌లోని వ్యవస్థ నీతిని, వ్యక్తి తమ జీవిత విధానంలో ఎలా ప్రతిఫలిస్తున్నారో గొల్లపూడి వారి *జపాకుసుమం – జపాన్* ఆలోచింపచేసే వ్యాసం వారికి ధన్యవాదములు. **మిసిమి** ఒక్క మాసపత్రిక చాలు కొన్ని సంవత్సరాల సారస్వత చింతనను సజీవంగా ఉంచడానికి. మరొక్కమారు **మిసిమి** పత్రిక దక్షతతో తీర్చి దిద్దుతున్న మీకు అభినందనలు..." **– డా॥ ఇమ్మిడి శెట్టి చక్రపాణి,** అనకాపల్లి.

✶ "... చాట్ల శ్రీరాములు ఎం.ఆర్.అప్పారావుగారి గురించి తెల్పిన కొన్ని విషయాలు తప్పు...
... సీతాదేవి ఇస్లామ్ మతం పుచ్చుకొని విడాకులిచ్చిన నాలుగేళ్ళకు, (1947) వీరు తిమ్మాపురం అమ్మాయిని రెండవ వివాహం చేసుకొన్నారు. అంతకుముందే వారు కుటుంబ నియంత్రణ సర్జరీ చేయించుకొన్న సంగతి ఎవరికీ తెలియదు. కాబట్టి సంతానం కోసం వివాహం చేసుకోలేదు. పైగా అప్పటికి కొడుకు బ్రతికే వున్నాడు. విద్యుత్కుమార్ మరణించినది 1988లో. ఆ తరువాతే రెండవ భార్య తరఫు అబ్బాయిని దత్తత తీసుకొన్నది...
... పారిస్‌లో ఉన్న ఒక వకీలు ద్వారా (శ్రీ వి.ఆర్. చెలికాని వారి పేరు; చిత్రాడ గ్రామస్థులు. ఆయన సీతాదేవి వ్యవహారాలు చూసేవారు. వారి కులస్థులే) ఆమె ఆస్తిలో భాగాలు వచ్చే సరికి, ఆమె కుమారుడైన విద్యుత్కుమార్ (మేము టాలీ అనే వారం) మరణించడం వలన తండ్రికి అందినది...
... ఈ విషయాలు నేను కేవలం జ్ఞాపకాల మీద ఆధారపడి వ్రాయలేదు. నా మేనమామ కుమారుని ద్వారా (వారంతా మేకా అప్పారావులే; జ్ఞాతులే) నిర్ధారించుకొని వ్రాశాను...
... *అన్నమయ్య జాతీయాలు* వ్యాసం గురించి : వేర్వేరు పదాల జోడింపుకి విడిగా ఆ పదాల అర్థాలకొక వేరే అర్థం ఉంటే అది జాతీయమన్నారు రచయిత ఎల్. భాస్కరరావు. ఈ నిర్వచనానికి వారిచ్చిన 76 ఉదాహరణలలో సరిపోయేవి ఎన్ని? ఏవి?...
... మరొక ప్రశ్న: జెట్టుడు అంటే, జుట్టు అన్న అర్థం తీసి, గోష్పాదమంత శిఖ అనడం పొరబాటు కాదా! (జుట్టు + ఎడు) విణ. చాపబడిన బొటన వ్రేలికి చూపుడు వేలికి మధ్య కొలత. జానెడు అని ఆచార్య రవ్వా శ్రీహరి *అన్నమయ్య పదకోశం* పుట 271. దీనిపై రచయితల ప్రతిస్పందనకు ఎదురు చూపులతో..."
(ఎమ్.ఆర్. అప్పారావుగారి రెండవ భార్య జనవరి 11, 2015 తేదీన చనిపోయారని తెలియజేయటానికి విచారిస్తున్నాము.)

**– వి.ఎ.కె. రంగారావు,** మద్రాసు.

✶ "... జనవరి నెల ***మిసిమి***లో శ్రీ షేక్ హుసేన్ *సత్యాగ్ని కథలు–ముస్లిం స్త్రీల దృక్పథం* నేపథ్యంలో వచ్చిన కథలపై రచయిత ముస్లింల కట్టుబొట్టు, ఛాందస భావాలు, సాధారణంగా కనిపించే పురుషాధిక్యం, సమాజ పురోగమనానికి అవరోధంగా నిలిచిన సందర్భాలను తమ రచనలో ద్యోతకపరిచారు...
... వాటిని సమీక్షించిన డాక్టర్ ఎస్ షమీ ఉల్లా ఒక ముస్లింగా ముస్లింల పై వచ్చిన కథలను చక్కని భావాలను అర్థం చేసుకొని కథలలోని రాశి, వాసిని విశ్లేషించి తన అభిప్రాయాలను సమగ్రంగా పొందుపరిచారు...
... ఒకే స్థానికతకు చెందిన వారయినా తెలుగు భాషపై మంచి అధికారంలో ఇరువురు ముస్లింలు రచనలోను, సమీక్షలోను స్వచ్ఛమైన తెలుగులో ఆవిర్భవింపజేశారు. ముస్లింలలో విద్యావిషయంలో సంప్రదాయ తెలుగులో పరిశ్రమించిన వారు బహు కొద్దిమంది. నాకు తెలిసినంతవరకు దివంగతులు పిఠాపురం వాస్తవ్యులు 19వ శతాబ్దంలో శ్రీ ఉమర్ ఆలీషాగారు మంచి కవులు. ఆధునికంగా ఇస్మాయిల్ మంచి కవులు. కథ, వ్యాసరచనలో ఖదీర్ బాబు నెల్లూరు మాండలికం జోడించి మంచి కథలు, వ్యాసాలు వెలువరించారు... అలాగే ఖాదర్ మొయిద్దీన్ వచన కవితలో దిట్ట!
... శిల్పాన్ని మలచడంలో ఆనందం కంటె ఆ శిల్పం సౌందర్యాన్ని, పనితనాన్ని ఆస్వాదించడానికి కళాహృదయం కావాలి. రచయిత సత్యాగ్నిగారికి, సమీక్షకులు డాక్టర్ షమీ ఉల్లాగారికి అభినందనలు..."

**– బొల్లోజు బసవరాజు,** కాకినాడ.

✶ "... జనవరి నెల సంచికలో పద్మభూషణ్ ఏ.ఆర్. కృష్ణ గురించి రమణగారు వ్రాసిన వ్యాసం చాలా సమాచారం అందిస్తోంది. ఏ.ఆర్.కృష్ణ నాటక రంగానికి అర్ధ శతాబ్దం పైగా సేవలు అందించారు...
... ముఖచిత్రం చాలా చాలా శోభాయమానంగా వుంది. మిగతా చిత్రాలు కూడా సందర్భోచితంగా వుండి ***మిసిమి***కి మరింత శోభ తెచ్చాయి. కా. నాగేశ్వరరావుగారు వ్రాసిన ***మిసిమి*** ముఖచిత్రాల చరిత్ర తప్పనిసరిగా చదవ వలసిందే..."

**– యస్వీ.ఎల్. నరసింహారావు,** నిజాంపేట, హైదరాబాదు.

# చరిత్రలో మహా భారతం

– సాయి పాపినేని & జయశ్రీ నాయని

రాత మొదలైనప్పుడే చరిత్ర మొదలౌతుంది. అంటే లభ్యమైన ఆధారాలనిబట్టి అలెగ్జాండర్ రాకముందు భారతదేశానికి చరిత్ర లేదనే చెప్పాలి. మనం చదవగల్గిన రాతల్లో మొట్టమొదటిది భట్టిప్రోలులో దొరికిన రేకుముక్క, తరువాత అశోకుడు దేశమంతా చెక్కించిన శాసనాలు. అంతకు ముందుతరాల వాళ్ళు రాతపరంగా మనకేమీ మిగల్చలేదు.

ఈజిప్టు ఎడారుల్లోని రాళ్లపైన చెక్కిన రాతలు చెక్కుచెదరలేదు. మధ్య ఆసియాలో రాసి దాచిపెట్టిన మృణ్మయ ఫలకాల లైబ్రరీలు నిక్షేపంగా ఇప్పటికీ ఉన్నాయి. కానీ మనకలాంటి అదృష్టం లేదు. మనవాళ్లకి రాయడం తెలీదా అంటే అదేమీ కాదు. క్రీపూ. 3000 నాటి కుండపెంకులు, మరో రెండు శతాబ్దాల అనంతరం హరప్పా సంస్కృతి ఆవాసాల్లో దొరికిన ముద్రలమీదా మనకి అర్థంకాని అక్షరాలు ఉన్నాయి. వేదవ్యాసుడు భారతం చెబుతుంటే వినాయకుడు దానిని రాసిపెట్టాడని మన కథలు చెబుతాయి. కానీ క్రీశ. 3వ శతాబ్దికి ముందటి రాతప్రతులేవీ మనకి లభ్యం కాలేదు. ఎంతోమంది రాజులూ చక్రవర్తులూ ఉన్నా, చేసిన గొప్పలు రాళ్లపై చెక్కించిన వాళ్లు చాలా కొద్దిమంది. అందువల్ల మన ప్రాచీన సంప్రదాయంలోని పూర్వీకుల సమాచారాన్ని సమకాలీన రాతలూ శాసనాల ద్వారా నిరూపించడం సాధ్యంకాదు.

**ఋగ్వేదం :**

ప్రపంచ సాహిత్యంలోనే మొట్టమొదటి గ్రంథం ఋగ్వేదం. ప్రాచీన రాతప్రతులు లేకపోయినా ఒకరి నోట పలికింది మరొకరుగా, ఛందస్సు, శ్రుతి, క్రమం తప్పకుండా తరతరాలుగా సాగిన సంప్రదాయం. వేదాల్లో భాష పురాతనం. ఆధునిక భాషా శాస్త్రజ్ఞులు దేశం నలుమూలలా వివిధ శాఖల్లో, చరణాల్లో సేకరించిన ఋక్కుల క్రమంలో కానీ, ఛందస్సులో కానీ, పదజాలంలో కానీ తేడాలు లేవు. ఉచ్చారణలో కొంత తేడాలున్నా బెంగాల్, వారణాశి, కంచి, ద్వారక, ఎక్కడైనా సరే మూలపదార్థంలో తేడాలేదు. అంటే వేల యేళ్లు, తరాలు గడిచినా ఆ సంహితలు మార్పులూ చేర్పులూ లేకుండా నిలిచాయి. భాషాపరిణామ శాస్త్రాన్ని అనుసరించి కూడా ఇండోయూరోపియన్ సాహిత్యంలో ఋగ్వేద సంహిత మొదటిది. ఋగ్వేద కాలానికి సంబంధించి అనేక ప్రతిపాదనలు ఉన్నాయి. కానీ వాటిలో సామ్యంలేదు. మరీ సాగదీసి క్రీ.పూ 6వ సహస్రాబ్దికి ముందే అన్న వాదనలు పక్కనపెడితే, ఋగ్వేదరచన క్రీపూ. 4000 తరువాత జరిగిందనే సుభాష్ కక్ వంటి వారి ప్రతిపాదనల్లో కొంత నిజం ఉండి ఉండొచ్చు.

మన పురాణాల్లోని అంతర్గత సమాచారాన్ని బట్టి, ఋగ్వేదం మహాభారత యుద్ధకాలానికి ముందే ఉంది. పరాశరుడి కుమారుడైన కృష్ణుడనే ఋషి మూలవేదాన్ని మూడుగా విభజించి స్థిరీకరించాడు. అందుకే అతడిని వేదవ్యాసుడు అంటాము. ఈ వేదవ్యాసుడి ప్రసక్తి వేదాల్లో లేదు. అంటే వామదేవ వశిష్ఠాది ఋషుల్లా, కవి ఉషానుడిలా ఆయన వేదాలు రాయలేదు, అప్పటికే ఉన్న ఋక్కులని సేకరించి క్రమబద్ధం చేసాడు. ఆ తరువాతే నాల్గవ వేదమైన అథర్వణవేదం వేదత్రయానికి జోడించబడింది. బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు, వివిధ వేదాంగాలూ జతపర్చబడ్డాయి. ఈ ప్రక్రియ కొన్ని శతాబ్దాలుగా సాగింది.

వేదవాఙ్మయంలోని కొన్ని వ్యక్తినామాలు, భౌగోళికాంశాలు మనకి పురాణాల్లో కూడా తారసపడ్తాయి. అందుకని వేదాలని చరిత్రకి ముఖ్యాధారాలుగా స్వీకరించలేము. ఎందుకంటే ఇతిహాస పురాణ సంప్రదాయంలో అతిముఖ్య పాత్రధారులైన రాముడు, కృష్ణుడు వంటివారు వేదాల్లో కనపడరు. రావణవధ, మహాభారతయుద్ధం వంటి

సంఘటనల ప్రసక్తి వేదాల్లో లేదు. అయితే, వేదవ్యాసుడి వృత్తాంతాన్నిబట్టి ఋగ్వేదం, అతడి ముందుకాలానికి, మిగిలినవి ఆ తరువాత కాలానికి చెందినా, పురాణ సంప్రదాయానికి సంబంధంలేకుండా స్వతంత్రంగా రచించబడ్డాయి. వేదవ్యాసుడు మహాభారతయుద్ధ కాలానికి చెందిన వాడు. ఆది పురాణమూ, జయ అనబడే భారత ఇతిహాసమూ అతడి కాలానికే చెందాయి. కాబట్టి ఆ కాలానికి చెందిన పరిస్థితులపై అవగాహన కల్గితేనే ఈ రెండు భిన్న సంప్రదాయలపై ఏదైనా ఒక అభిప్రాయానికి రాగలం.

**భారతయుద్ధం ఎప్పుడు జరిగింది?**

మన చరిత్ర పుస్తకాల్లో ఆర్యులు తమ వలస క్రమంలో సింధులోయ, పంజాబ్ ప్రాంతాలని దాటి తూర్పు దిశగా యమునా నదీ ప్రాంతానికి ఆపైన గంగా మైదానానికీ విస్తరించారని చదువుకున్నాం. క్రీ.పూ. 14. 13 శతాబ్దాల్లో ఉపఖండంలో ప్రవేశించి కురుక్షేత్రం చేరేసరికి వాళ్లకి మూడు నాలుగు వందలయేళ్ళు పట్టింది. కాబట్టి క్రీపూ. 11, 9 శతాబ్దాల మధ్య ఆ జన జాతుల్లో జరిగిన చిన్న స్పర్ధని తరువాతి కాలంలో కవులు, కాల్పనికులు పెద్ద కావ్యంగా మార్చారనీ; వేదాల్లోనూ, వివిధ వేదాంగాల్లోనూ మహాభారతయుద్ధ ప్రసక్తి లేకపోవడానికి కూడా కారణం అదేనని తేల్చారు. ఈ కాలాన్ని పురాతత్వశాస్త్రంరీత్యా చూస్తే భారతయుద్ధం హరప్పా నాగారికత పూర్తిగా పతనమైన తరువాత, గంగామైదానంలో పట్టణీకరణకి కొన్ని శతాబ్దాల ముందు జరిగినట్లవుతుంది. తవ్వకాల్లో నేటి ఢిల్లీ చుట్టుపక్క ప్రాంతాల్లో కొన్ని జనావాసాలు బయటపడిన మాట వాస్తవమే.

వాటిలో దొరికిన మృణ్మయపాత్రల శకలాలు అంటే కుండపెంకులని బట్టి వాటిని Painted Grey Ware (PGW) సంస్కృతి అంటారు. ఈ సాంస్కృతిక స్తరం క్రీపూ. 1100 – 800 మధ్య కాలానికి చెందినది. అదే మహాభారత కాలానికి చెందిన సంస్కృతి అని ఎక్కువమంది ఆమోదించారు.

| స్తరం | తేదీలు | సంస్కృతి అవశేషాల వివరాలు |
|---|---|---|
| V | క్రీశ. 11 -15 శతాబ్దాలు | ఢిల్లీ సుల్తానుల నుండి మొఘల్ చక్రవర్తుల కాలపు అవశేషాలు, బాల్బన్ సుల్తాను ముద్రించిన నాణెం, కొన్ని జైన ప్రతిమలు. |
| ఖాళీ | | |
| IV | క్రీశ. 2 - 3 శతాబ్దాలు | రాగి, ఇనప పనిముట్లు, యౌధేయ, మథుర రాజుల నాణేలు, బోధిసత్త్వ మైత్రేయ విగ్రహపు తల, బ్రాహ్మి అక్షరాలున్న కుండ పెంకులు. |
| ఖాళీ | | |
| III | క్రీపూ. 6 - 3 శతాబ్దాలు | NBPW సంస్కృతికి చెందిన మృణ్మయ శకలాలు, కొలిమిలో కాల్చిన ఇటుకలతో కట్టిన ఇళ్ళూ, మురుగు కాలువలు. విద్ధాంక నాణేలు. |
| ఖాళీ | | |
| **II** | **క్రీపూ. 11 - 8 శతాబ్దాలు** | **PGW సంస్కృతికి చెందిన పెంకులు, మట్టిగోడలతో కట్టిన పూరిళ్లు, ఒక కాలిన ఇటుక, కొన్ని పూసలు, గాజు గాజులు, మట్టిబొమ్మలు, గుర్రం, పంది, పశువుల ఎముకలు.** |
| ఖాళీ | | |
| I | క్రీపూ. 1200 | అక్కడక్కడా కొన్ని జేగురు రంగు కుండపెంకులే (OCP) కానీ ఎటువంటి కట్టడాలూ లేవు. |

ప్రొ. బి.బి. లాల్ ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ సమీపంలో ఒక గుట్టపై శాస్త్రీయ పద్ధతుల ద్వారా తవ్వకాలు జరిపారు. క్రీపూ. 1200 నుంచీ క్రీశ. 15వ శతాబ్ది వరకూ అంటే దాదాపు 2300ల యేళ్లు అక్కడ జనం నివసించిన ఆధారాలు కనుగొన్నారు. దానికే హస్తినాపురమని నామకరణం కూడా చేసేసారు. ఆ తవ్వకాల్లో బయటపడ్డ స్తరాల వివరాలు కింద పట్టికలో చూడవచ్చు.

**ప్రకృతిసిద్ధమైన ఒండ్రుమట్టి :**

ప్రొ. బి.బి. లాల్ వాదం ప్రకారం మహాభారతయుద్ధం పై పట్టికలోని రెండవ స్తరంలో జరిగింది. అంటే కౌరవుల రాజధాని నగరంలో ఇళ్లు రెల్లుగడ్డిపై తాపడం చేసిన బంకమన్ను భవంతులు. అందుకే భారతయుద్ధం రెండు ఊళ్ల మధ్య జరిగిన ముఠా తగాదా కంటే గొప్పది కానేరదని తీర్మానించారు. ఈ తేదీ మ్యాక్స్ మ్యూల్లర్ పండితుడి అంచనాకి కూడా సరిగ్గా సరిపోతుంది.

అతడి అంచనా ప్రకారం వేదవాఙ్మయంలోని వేదాంగాలు, సూత్రాలు బౌద్ధానికి సమకాలీనం కనుక అవి క్రీపూ. 6వ శతాబ్దం తరువాత లిఖించబడ్డాయి. వేద సంహితలు బౌద్ధయుగానికి ముందువి. వాటిలో బ్రాహ్మణాలు రాయడానికి సుమారు రెండొందల యేళ్ళు వేసుకుంటే, అది క్రీపూ. 800 అవుతుంది. ఇక ఋగ్వేదం కాక మిగిలిన మూడింటికి మరో రెండొందలేళ్లు, అంటే క్రీపూ. 1000. ఋగ్వేదం భారతానికి ముందుంది కనుక, భారతయుద్ధం క్రీపూ. 1000 – 800 ప్రాంతంలో జరిగి ఉండాలని సూచించాడు. బుహ్లర్, వింటర్నిట్జ్, జాకోబీ వంటి ప్రముఖులు మ్యాక్స్ మ్యూల్లర్ చేసిన రెండొందలేళ్ల ప్రతిపాదనని ఆనాడే సందేహించారు. స్వతంత్రంగా వేదాలకి క్రీపూ. 2000కి ముందటి కాలాన్ని ప్రతిపాదించారు. మ్యాక్స్ మ్యూల్లర్ కూడా వారితో అంగీకరిస్తూ, తాను ప్రతిపాదించిన తేదీలు ఒక హైపాథెసిస్ మాత్రమే, అంటే అసలు నిజం తేలేవరకూ ఉజ్జాయింపుగా పరిగణించుటకే అన్నాడు.

**చైద్య క్షత్రియ వంశావళులు, భవిష్యపురాణం**

| తరం సంఖ్య | సంవత్సరం | కౌశాంబి | మగధ | అయోధ్య | |
|---|---|---|---|---|---|
| 1 | 1460 | పరీక్షిత్తు 2 | శ్రుతశ్రవుడు | | |
| 2 | | జనమేజయుడు 3 | అయుతాయుషుడు | | |
| 3 | | శతానీకుడు | నీరమిత్రుడు | ఉరుక్షయుడు | |
| 4 | | అశ్వమేధదత్తుడు | సుక్షాత్రుడు | వత్సవ్యూహుడు | |
| 5 | 1050 | అధిసీమకృష్ణుడు | బృహత్కర్ముడు | ప్రతివ్యోముడు | |
| 6 | 1032 | నిచక్షువు | సేనాజిత్తు | దివాకరుడు | |
| 7 | 1014 | ఉష్ణుడు | కృతంజయుడు | సహదేవుడు | |
| 8 | 996 | సుచిద్రాట్టు | విభుడు | బృహదాశ్వుడు | |
| 9 | 978 | వృష్ణిమతుడు | సుచి | భానురథుడు | |
| 10 | 960 | సుషేణుడు | క్షేముడు | ప్రతీతాశ్వుడు | |
| 11 | 942 | సునీతుడు | సువ్రతుడు | సుప్రతీకుడు | |
| 12 | 924 | రుచుడు | సునేత్రుడు | మరుదేవుడు | |
| 13 | 906 | నృచక్షువు | ధర్మనేత్రుడు | సునక్షత్రుడు | |
| 14 | 888 | సుఖిబలుడు | నివృత్తి | కిన్నరాశ్వుడు | |
| 15 | 870 | పరిప్లవుడు | త్రినేత్రుడు | అంతరిక్షుడు | |
| 16 | 852 | సునయుడు | ధృఢసేనుడు | సుపర్ణుడు | |
| 17 | 834 | మేధావి | మహీనేత్రుడు | అమృతజిత్తు | |
| 18 | 816 | నృపంజయుడు | సుచలుడు | బృహద్భ్రాజుడు | |
| 19 | 798 | దుర్వుడు | సునేత్రుడు | ధర్మ | |
| 20 | 780 | తిగ్మాత్ముడు | సత్యజిత్తు | కృతంజయుడు | కలియుగం |
| 21 | 762 | బృహద్రథుడు | విశ్వజిత్తు | రణంజయుడు | |
| 22 | 744 | వసుధానుడు | రిపుంజయుడు | సంజయుడు | |
| 23 | 726 | శతానికుడు | ప్రద్యోతుడు | శక్యుడు | |
| 24 | | ఉదయనుడు | పాలకుడు | శుద్ధోధనుడు | |
| 25 | 152 సం. | వహీనరుడు | విశాఖయూపుడు | సిద్ధార్థుడు | |
| 26 | | దండపాణి | అజకుడు | రాహులుడు | |
| 27 | | నిరమిత్రుడు | నందివర్ధనుడు | ప్రసేనజిత్తు | |
| 28 | 574 | క్షేమకుడు | శిశునాగుడు | క్షూద్రకుడు | |
| 29 | | | కాకవర్ణుడు | కులకుడు | |
| 30 | | | క్షేమధర్ముడు | సురథుడు | |
| 31 | | | క్షాత్రౌజస్సు | | |
| 32 | | | బింబిసారుడు | | |
| 33 | 163 సం. | | అజాతశత్రువు | | |
| 34 | | | దర్శకుడు | | |
| 35 | | | ఉదయినుడు | | |
| 36 | | | నందివర్ధనుడు | | |
| 37 | | | మహానంది | | |
| 38 | 411 | | మహాపద్మనందుడు | | |
| 39 | 90 సం. | | నందులు 7గురు | | |
| 40 | | | ధననందుడు | | |
| 41 | 321 | | చంద్రగుప్తమౌర్యుడు | | |

మరి భారతయుద్ధం తేదీ గురించి ఇతర అభిప్రాయాలు చూద్దాం.

క్రీశ. 7వ శతాబ్దిలో ఆర్యభట్టు ప్రాచీన గ్రహస్థితుల ప్రమాణాలని అనుసరించి యుగారంభం క్రీపూ. 3102లో ప్రారంభమైందని సెలవిచ్చాడు. ఇదే తేదీ రెండవ పులకేశి కాలపు అయ్యావోలు శాసనంలో కూడా కనిపిస్తుంది. అది కలియుగారంభమనీ, భారతయుద్ధానంతరమే కలియుగం ప్రవేశించింది కనుక యుద్ధం క్రీపూ. 3100 ముందు జరిగిందనే ఒక వాదం ప్రచారంలోకి వచ్చింది. కలియుగమంటే చీకటియుగం. క్రీపూ. 3100 నుండి భారతీయుల కాంశ్యయుగ నాగరికతలో ప్రగతి కనిపిస్తుంది కానీ వెనుకబడటం కనపడదు. మరి అదేలా? ఆర్యభట్టు యుగారంభం అన్నాడే కానీ కలియుగారంభం అనలేదు. కాబట్టి ఆ తేదీని కాసేపు పక్కన పెడదాం.

భవిష్యపురాణంలో కౌశాంబి, అయోధ్య, మగధల క్షత్రియ వంశావళులు ఉన్నాయి. (పట్టిక) పట్టికలో పరీక్షిత్తుకి ఐదవ తరంవాడైన నిచక్షువు రాజధానిని హస్తినాపురం నుంచి కౌశాంబికి మార్చాడు. ఈ మూడు రాజవంశాలనూ చైద్య క్షత్రియులు అన్నారు. అంటే వీళ్ల మూలపురుషులు చేది ప్రాంతంనుండి వచ్చి గంగానదీ మైదానంలో రాజ్యాలు స్థాపించారు. కానీ వీరందరూ మహాభారతవీరుల సంతతిగా చెప్పుకున్నారు.

చంద్రగుప్తమౌర్యునికి ముందు నందరాజులు 90 యేళ్లు, వారికి ముందు పదిమంది శైశునాగులు 163 యేళ్లు, ఐదుగురు ప్రాద్యోతులు 152 యేళ్ళు రాజ్యం చేసారు. అంతకు ముందు బ్రాహద్రథుల్లో భారతయుద్ధం తరువాత ఆరవతరం వాడైన సేనాజిత్తు, అయోధ్య వంశంలో నాల్గవరాజు దివాకరుడు, కురుపాంచాల వంశపు నిచక్షువు తండ్రి అధిసీమకృష్ణుడి సమకాలీనులు. అధిసీమకృష్ణుని యాగశాలలో భవిష్యపురాణం మొట్టమొదటిసారి చెప్పబడిందని ఐతిహ్యం. నిచక్షువుకీ ప్రద్యోతుడికీ మధ్య అంతరం 16 తరాలు. తరానికి 18 యేళ్లు కేటాయిస్తే 288 యేళ్లు. అంటే కోశాంబి రాజ్యస్థాపన (321+90+163+152+288=1014) క్రీపూ. 1014లో జరిగినట్లు. ఆ తేదీ గంగామైదానంలో పట్టణీకరణ శైశవదశకి సరిగ్గా సరిపోతుంది. ఆ తేదీకి ఐదు తరాల ముందు కోశాంబికి 400 మైళ్లు వాయవ్యంలో కురుక్షేత్రంలో యుద్ధం జరిగింది అనుకోవాలి.

కానీ, పురాతత్వశాస్త్రజ్ఞుల తవ్వకాలు పరిశీలిస్తే క్రీపూ. 1400 తరువాత ఉత్తరభారతదేశంలో పట్టణాలు పూర్తిగా క్షీణించాయి. మరో ఐదు శతాబ్దాలవరకూ చెదురుమదురుగా కనపడే గ్రామీణ ఆవాసాల సంఖ్య కూడా చాలా తక్కువ. దీన్నిబట్టి ఆనాడు దేశంలో జనసంఖ్య కూడా బాగా తగ్గివుండాలి. రాజస్థాన్‌లోని పుష్కర, దిద్వానా సరోవరాల అడుగున ఒండ్రుమట్టి స్తరాల్లోని పుప్పొడి రేణువుల సంఖ్య ఇన్ఫ్రారెడ్ ల్యూమినిసెన్స్ పద్ధతి ద్వారా పరిశీలించిన మియాకీ యూనివర్సిటీ (జపాన్) శాస్త్రజ్ఞులు, అదే కాలంలో వృక్షసంపద కూడా క్షీణించిందని ప్రతిపాదించారు. కనుక మహాభారతంలో కనిపించే రాజకీయ వాతావరణాన్నిబట్టి, ఆ యుద్ధం క్రీపూ. 1400 తరువాత, 800కి ముందూ జరిగి వుండటానికి అవకాశం తక్కువ.



**తుది హరప్పా యుగం :**

ఇక పురాణాల్లోని మగధ రాజవంశాల పట్టికలో మహాపద్మనందుని ప్రసక్తి ఇలా ఉంది.

**మహాపద్మ అభిషేకత్ స్తు యావజ్జన్మ పరీక్షితః / ఏవం వర్ష సహస్రంతు జ్ఞేయం పంచదశుత్తరం**

అంటే పరీక్షిత్తు తరువాత 1050 సంవత్సరాలకి మహాపద్మనందుడి రాజ్యాభిషేకం జరిగింది. నవనందులు 90 యేళ్ళు రాజ్యం చేసారు. ఆ తరువాత ఆఖరి నందరాజుని వధించి చంద్రగుప్తుడు క్రీపూ. 321లో అధికారంలోకి వచ్చాడని అందరూ అంగీకరించినదే (321+90+1050=1461). పరీక్షిత్తు యుద్ధానంతరం పుట్టాడు. అదే నిజమైతే, భారతయుద్ధం 1460కి కొంత ముందు జరిగిందనుకోవాలి.

ఈ తేదీని సమర్థించే ఆధారాలేమైనా ఉన్నాయా? నిరూపణలకి ముందు పురాతత్త్వ ఆధారాలనుబట్టి ఆనాటి పరిస్థితులని అంచనా వేద్దాం.

క్రీపూ. 1900 నుంచి 1400 వరకూ ఆ ప్రాంతంలో లభించే పురాతత్త్వ సంస్కృతులను 'తుదిహరప్పా యుగం' అంటారు. క్రీపూ. 1900 నాటికి సింధులోయలో హరప్పా సంస్కృతి క్షీణదశ ఆరంభమైంది. హరప్పా, మొహెంజొదారో వంటి పట్టణాలు అప్పటికే పతనమయ్యాయి. దాని కారణాల గురించి చరిత్రకారుల్లో అనేక అభిప్రాయాలు ఉన్నాయి. ఆ కాలంలో నదీ పరివాహక మార్గాల్లో వచ్చిన మార్పులు ఒక ముఖ్యకారణంగా కనిపిస్తాయి. అక్కడి మానవ సమూహాలు వలసపోక తప్పలేదు. వలసలు ముఖ్యంగా తూర్పు, దక్షిణ దిశల్లో సాగాయి.

ఇప్పటి సత్లూజ్, యమున మధ్యప్రాంతంలో సుమారు 550 హరప్పా తుదిదశ ఆవాసాలు వెలుగుచూసాయి. ఇవన్నీ క్రీపూ. 1900 నుండి 1400 మధ్యకాలానికి చెందినవి. వేదవాఙ్మయంలో సత్లూజ్, యమునల మధ్య ప్రాంతానికి మధ్యదేశం అని పేరు. భారతయుద్ధభూమి కురుక్షేత్రం అక్కడే ఉంది. ఈ ప్రదేశం క్రీపూ. 1500 ప్రాంతంలో ఉత్తర భారతదేశపు నాగరికతకి కేంద్రబిందువు. భారత కథలోని ముఖ్యరాజ్యాలైన కురు, పాంచాల దేశాలు (కౌరవపాండవులు, ద్రుపదుడు) అదే ప్రాంతానికి చెందినవి. కథలో ప్రముఖ పాత్రధారులై వైవాహిక సంబంధాలు నెరపిన మద్ర (మాద్రి), గాంధార (గాంధారి), మత్స్య (విరటుడు) దేశాలు మధ్యదేశానికి పశ్చిమంగా ఒకప్పటి హరప్పా నాగరికతా మూలప్రాంతంలో తక్కువ ప్రాముఖ్యంతో కనిపిస్తాయి. ఇక గుజరాత్, సింధూ తీరప్రాంతం (సైంధవుడు-దుస్సల భర్త), మాల్వా, వింధ్యశ్రేణి ప్రాంతంలో మరో తుది హరప్పా నాగరకతా క్షేత్రం కనిపిస్తుంది. యాదవ రాజ్యాలైన, ద్వారక (కృష్ణుడు), చేది, విదర్భ(కుంతిభోజుడు) ఈ ప్రాంతానికి చెందినవే. భారత కథలోని ముఖ్యులు, వారితో వైవాహిక సంబంధాలు నెరపిన రాజ్యాలన్నీ భౌగోళికంగా తుది హరప్పా యుగపు నాగరికత విస్తరించిన ప్రాంతాలకే పరిమితమై కనిపిస్తుంది (పటం). కనుక భారతయుద్ధం తుది హరప్పాయుగపు చివరిదశలో అంటే క్రీపూ. 15వ శతాబ్దిలో జరిగి ఉండేందుకు అవకాశం ఉంది.

**కలియుగం :**

మన పురాణాలు శ్రీకృష్ణుడు అవతారం చాలించడంతో కలియుగం ఆరంభమయిందని చెప్తాయి. యాదవుల్లో ముసలం పుట్టి ఆ జాతి ప్రాముఖ్యం కోల్పోవడం, వారి ముఖ్యపట్టణమైన ద్వారక సముద్రపు ఉప్పెనలో మునిగిపోవడం, కలియుగారంభంలోనే జరిగాయి. మన ఇతిహాస పురాణసంప్రదాయం ప్రకారం ఈ సంఘటనలు భారతయుద్ధం తరువాత కొద్దికాలానికే జరిగాయి. గుజరాత్ పశ్చిమతీరంలో సముద్రాంతర పురాతత్త్వ పరిశోధనల్లో వెలుగుచూసిన ద్వారకా నగరం గురించి ఇంతకు ముందు కూడా ప్రస్తావించాము. ప్రొ. షికారీపుర రంగనాథరావ్ ఆధ్వర్యంలో, గోవాలోని న్యాషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓషియానోగ్రఫి సంస్థ 2001 నుంచీ 2009 వరకూ జరిపిన పరిశోధనల్లో, నేటి ద్వారక వద్ద సముద్రగర్భంలో ఆరు కిలోమీటర్ల నిడివిలో తుదిహరప్పా కాలపు రేవు పట్టణాన్ని కనుగొన్నారు. పురాతత్త్వ అవశేషాలు, రేడియో కార్బన్ కాలనిర్ణయాన్ని బట్టి ఆ పట్టణం క్రీపూ. 1520 తరువాత 1400కు ముందు సముద్రంలో మునిగిపోయింది. ఆ మునిగిన పట్టణమే కృష్ణుని రాజధాని ద్వారక అయితే, అది మనం ప్రతిపాదించిన మహాభారతయుద్ధ కాలాన్ని నిరూపిస్తుంది.

భారతీయ ప్రాచీన చారిత్రక సంప్రదాయానుసారం యుద్ధానంతరం ఆదిపురాణ సంకలనం జరిగింది. అది భారత యుద్ధంతో పరిసమాప్తం అయింది. తరువాత కలియుగానికి చెందిన వంశావళులని చెప్పే భవిష్య పురాణం, మొదటిసారిగా అధిసీమకృష్ణుని కాలంలో (క్రీపూ. 1014) చెప్పబడిందని పైన ప్రస్తావించాం. అంటే ఈ రెండు పురాణ సంప్రదాయాల మధ్య నాలుగు శతాబ్దాల కాలవ్యవధి ఉండాలి. ఆ నాలుగు వందల యేళ్లలో రాజులు, రాజ్యాల ప్రసక్తి లేదు. వంశావళుల్లో గాయబ్ అయిన ఈ నాలుగు శతాబ్దాల్లో ఉత్తరభారతదేశంలో పరిస్థితులు ఒకసారి పరిశీలిద్దాం. పురాతత్వ ఆధారాలనుబట్టి అదొక చీకటి యుగం. క్రీపూ 1400 తరువాత హరప్పా సంస్కృతి పూర్తిగా పతనమైంది. అక్కడక్కడా వెలికివచ్చిన గ్రామీణ ఆవాసాలు తప్ప పట్టణాల జాడే కనుపించదు. క్రీపూ 15వ శతాబ్ది ముందు 500 పైగా పట్టణ గ్రామీణ స్థావరాలున్న ప్రాంతంలో మచ్చుకి 20 గ్రామీణ ఆవాసాలు కూడా వెలుగుచూడలేదు. జనసంఖ్య తగ్గింది. వ్యవసాయం వృక్షసంపదా క్షీణించాయి. మళ్లీ క్రీపూ. 10వ శతాబ్ది వరకూ ఏమాత్రమూ ప్రగతి కనిపించదు. అభివృద్ధి చెందిన పట్టణాలు క్రీపూ 8వ శతాబ్ది వరకూ కనపడవు.

అవే పరిస్థితులని పురాణాలు కూడా ఏకరువు పెట్టాయి. రాజ్యాలు నశించాయి, గ్రామాలు పట్టణాలూ వల్లకాళ్లయ్యాయి, ఋషులకూ, బ్రాహ్మణులకూ అడవుల్లోని ఆశ్రమాలే దిక్కయ్యాయి. బిచ్చమేసే దాతలు కరువయ్యారు. ఇక వేద వాఙ్మయంలో ఆరణ్యకాలు అదే కాలంలో రచించబడ్డాయి. ఇతివృత్తాలు కూడా పట్టణాలు, రాజులు, యజ్ఞయాగాదుల ప్రస్తావనలు కాక తాత్త్వికవాదాలు, పరలోక చింతనల్లో పడ్డాయి. ఇక పురాణాల విషయానికొస్తే, రాజులే లేని కాలంలో వందిమాగధులకి భుక్తి ఏపాటికి? మళ్లీ నాగరిక సమాజం పునరుద్ధరించబడే వరకూ ఆ సంప్రదాయం కూడా మూలబడింది. అడవుల్లో కందమూలాలు తింటూ, సరైన ప్రతిఫలం లేకపోయినా సంప్రదాయాన్ని సజీవంగా ఉంచిన ఆనాటి ఆశ్రమవాసులు ధన్యులు. వారికి ముందు యుగాల్లోని కథలూ, గాథలూ, సంస్కృతి ఒక అద్భుతంగా కనిపించింది. వాటితో బేరీజు వేస్తే ఆనాటి సాంఘిక పరిస్థితులు అన్ని అంశాల్లో పతనం చెంది కనిపించాయి. ఆ చీకటియుగానికే 'కలియుగం' అని పేరు పెట్టారు. తరువాతి కాలంలో కొన్ని శతాబ్దాల అనంతరం వచ్చిన ప్రగతి కూడా ముందుయుగాల్లో అద్భుతంగా చిత్రించబడ్డ వృత్తాంతాల ముందు దిగదుడుపే అయింది.

**ముగింపు :** భారతయుద్ధ కాలాన్ని గురించి ప్రస్తుతం ప్రచారంలో ఉన్న ముఖ్యమైన ప్రతిపాదనలు రెండు:

1. ఆర్యభటుడు ప్రతిపాదించిన యుగారంభం – క్రీపూ. 3102
2. మాక్స్ మ్యూల్లర్ తదితరుల (PGW) సంస్కృతి – క్రీపూ. 900

క్రీపూ. 3100 నుంచీ హరప్పా తొలియుగం నాగరికతలో ప్రగతి కనిపిస్తుందే కానీ క్షీణదశని సూచించదు. అదే విధంగా క్రీపూ. 900 నుంచీ ఉత్తరభారతదేశపు జనపథాల్లో రెండవ పట్టణీకరణ మొదటిదశ ఆరంభమయింది. పురాతత్వ ఆధారాలను బట్టి చూస్తే ఈ రెండు తేదీలూ ఇతిహాసపురాణ సంప్రదాయంలో వివరించబడ్డ పరిస్థితులతో ఏకీభవించవు. కనుక పౌరాణిక వాఙ్మయంలో సూచించబడ్డ క్రీపూ. 1461 తేదీ మహాభారత యుద్ధకాలానికి చెందిన భౌగోళిక, సామాజిక పరిస్థితులకి, ఆనాటికి చెందిన పురాతత్వ ఆధారాలకీ సరిపోతుంది. ద్వారక పరిశోధనల్లో లభ్యమైన కార్బన్ 14 తేదీలు, సరస్వతీ, దృషద్వతీ లోయల్లో, గుజరాత్‌లో అసంఖ్యాకంగా వెలుగుచూసిన తుదిహరప్పా యుగపు గ్రామీణ పట్టణ స్థావరాలు ఈ తేదీని బలపరుస్తాయి. అంతేగాక భాషాపరిణామ శాస్త్రాన్ని బట్టి చూసినా వేదవ్యాసుడి ద్వారా భారత యుద్ధకాలంలో సంకలనం చేయబడ్డ సంహితల్లోని భాష అదే కాలానికి చెందుతుంది. భారతీయ ప్రాచీన చారిత్రక సంప్రదాయంలో అంతకు ముందటి క్షత్రియ వంశావళులని, సమకాలీన సామాజిక, రాజకీయ సమాచారాన్ని, గాథలని పరిశీలించి, అవి హరప్పా యుగపు భౌగోళిక, పురాతత్వ ఆధారాలతో సరితూగితే మన ఇతిహాసపురాణ వాఙ్మయంలోని చారిత్రక వాస్తవికతపై ఒక నిర్ణయానికి రాగలం. ఆ ప్రయత్నం వచ్చే సంచికలో చేద్దాం.



సాయి పాపినేని

సాయి పాపినేని
బెంగుళూరు

# బాలసాహిత్య పురస్కారాలు

– ప్రొ. రావినూతల సత్యనారాయణ

**ప్రవేశిక :**

ఉత్తమ అధ్యయనం పరిపూర్ణ వ్యక్తిత్వానికి ఉపకరిస్తుంది. చక్కని భావ ప్రకటనకు మంచి పుస్తకాలు యెక్కువగా తోడ్పడతాయి. పెద్దలు చెప్పినది విని, జ్ఞాపకం ఉంచుకోగల వయసు కలిగినవారు, బాలురని శ్రీ పరవస్తు చిన్నయసూరి గారి అభిప్రాయం. ఇటీవల కాలం (20వ శతాబ్ది) వరకు పిల్లల కోసం సాహిత్య (వ్మాయ) సృష్టి జరుగ లేదనే చెప్పాలి. ఏవో కొన్ని కథలు, పాటలు, మన పెద్ద వారు (నాయనమ్మలో, అమ్మమ్మలో, తాతయ్యలో) చెప్పి, లేక పాడి, పిల్లలను సంతోషపెడుతూ ఉండేవారు. అయితే, పిల్లల కోసం మౌఖికంగానే సాహిత్య సృష్టి చేసింది తొలితొలుత, జానపదులనే చెప్పాలి. పిల్లల కోసం ప్రత్యేకించి, వాళ్ళ వయసును దృష్టిలో పెట్టుకొని, వారికి అనుగుణ్యమైన భాషా దృష్టితో, వైజ్ఞానిక దృష్టితో, ప్రమాణాలను ఏర్పరచి, సాహిత్య రచన చేసే పద్ధతి, 20వ శతాబ్దికి చెందిన ప్రక్రియ అనుటలో సందేహము లేదు. గడచిన కొన్ని దశాబ్దములుగా బాలవాఙ్మయ సృష్టి వివిధ ప్రక్రియలలో ఎక్కువ పరిమాణంలో జరుగు తున్నది. అయితే, పశ్చిమ దేశాలలో జరిగినంత కృషి మన దేశంలో జరుగలేదనే చెప్పాలి.

పైన పేర్కొనిన వివరాలు కొన్ని ఈ క్రింది వాక్యాలు స్పష్ట పరుస్తాయి. ప్రచురణ పరిజ్ఞానం ప్రారంభం కాని దశలోని బాలసాహిత్య చరిత్ర తెలుసుకొనుటకు తగినన్ని ఆధారాలు లభ్యంకాలేదు. ముద్రణా విధానాలు బాగా ప్రచారం పొందిన తరువాత గూడా పిల్లల ప్రాచీన కథా సాహిత్య మంతా పెద్దలను దృష్టిలో ఉంచుకొని రచింప బడినప్పటికీ, పిల్లల కనుగుణ్యంగా మలచబడింది. అందులోని చాలా భాగం నీతిబోధకమైన మత విషయాలతో నిండివుండేది. 19వ శతాబ్ది చివరి దశ, 20వ శతాబ్దిలోని తొలి భాగ కాలాన్ని "బాలసాహిత్య స్వర్ణ యుగంగా పేర్కొంటారు (వికీపీడియా)".

**బాలసాహిత్యం అంటే? :**

బాలసాహిత్యాన్ని గురించి విజ్ఞులు అనేకులు తమ తమ అభిప్రాయములను వ్యక్తపరచారు. అయితే, అందరికీ సమ్మతమైన, అనుసరణ యోగ్యమైన "నిర్వచనం" రూపొంద లేదనే చెప్పాలి. ఒకవిధంగా ఆలోచిస్తే, పాఠశాలకు వెళ్ళని దశ నుండి యవ్వనం వచ్చేవరకు గల బాలలకు నచ్చే అనంతమైన సాహిత్యాన్ని బాలసాహిత్యంగా పరిగణింపవచ్చు. ఈ విషయమై నిఘంటువులు, విజ్ఞాన సర్వస్వాలు రక రకములైన వివరణలు తెలియజేస్తున్నాయి! ఉదాహరణకు "The International Encyclopedia of Children's Literature ననుసరించి "The boundaries of genre... are not fixed but blurred". Sometimes, no agreement can be reached about whether a given work is best categorized as literature for adults or children. Some works defy easy categorization J.K. Rowling's Harry Potter Series is written and marketed for children, but, it is also popular among adults". పెద్దలసాహిత్యం, పిల్లలకు ఉపకరించేదంతా, పిల్లల సాహిత్యంగా పరిగణించడవే మన సాంప్రదాయమైంది" అంటారు సుప్రసిద్ధ సాహిత్యవేత్త శ్రీకొడవటిగంటి కుటుంబరావు. బాలసాహిత్య పరిధిని వివరిస్తూ" శిశువు జన్మించినది మొదలు, బాల్యదశ వీడే వరకు కూడా, వాని మనసుకు రంజకంగా ఉండేది బాలవాఙ్మయం" అంటారు శ్రీ చింతాదీక్షితులు.

బాలసాహిత్యం ఉండవలసిన విధానాన్ని ముచ్చటిస్తూ ''నిజమైన సాహిత్యం తియ్యని మామిడిపండులా ఆపాతమధురంగా ఉండాలి. భాష సరళంగానూ, లలితంగానూ ఉండాలి. చెప్ప వలసిన విషయం పండు

ఒలిచి చేతిలో పెట్టినట్లు ఉండాలి... బాలసాహిత్య వేత్తలు ఈ మూల సూత్రాన్ని పాటించినంతవరకూ బాలవాఙ్మయం బాలల ఆదరణ పొందుతుంది "అంటారు దాశరథి. బాలసాహిత్యపు మూలధ్యేయం పాఠకులలో విజ్ఞాన, వినోదాలతో పాటు, సత్ప్రవర్తన కలిగించడం, వారిని మాతృభూమిని ప్రేమించు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం అని పేర్కొనబడినది. ఉత్తమ రకమైన బాలసాహిత్యం ఏకాలం లోనైనా తక్కువేనని చెప్పవచ్చు. పాత కథలనే తిరిగి చెప్పడం, బొమ్మల గారడి చేయడం, ఇది మాత్రమే కాదు బాలసాహిత్య సృజన అంటే! బాలసాహిత్య నిర్మాతలు బాల్యాన్ని పునఃదర్శించ గలగాలి! పాఠకులను బాల్యంలోనికి పయనింప జేయాలి! ఆ రోజులను, ఆలోచనలనూ, శైశవాను భూతులను మరోసారి అనుభవించగలగాలి. బాల్యం అమాయకతతో కూడినది. బాల్యంలో నిజమైన స్వచ్ఛతను గమనించ గలం. అందుకే, శైశవంలో స్వర్గం అందుబాటులో ఉంటుంది. అంటారు పెద్దలు. అంటే, స్వర్గాన్ని తమలో చూస్తున్నారనీ, వానకురిసినా, మెరుపు మెరిసినా, అవి తమ కోసమేనని ఆనందిస్తారని అంటారు శ్రీశ్రీ. క్రమ క్రమంగా బాల్యావస్థ తగ్గిపోయే కొలదీ, ఆ స్వర్గం వారి చేయిజారి, కొంత కాలానికి వారి నుండి మాయమౌతుందట!

**బాలసాహిత్యవికాసం :**

తెలుగులో పత్రికా ప్రచురణ దాదాపు 1830 తర్వాత ప్రారంభమైనదని చెప్పుకోవచ్చు. *మద్రాసుక్రానికల్*ను తొలి తెలుగు వార్తా పత్రికగా పేర్కొన్నారు విజ్ఞులు. అలాగే, తొలి సాహిత్యపత్రిక 1863లో శ్రీవింజమూరి కృష్ణమాచారియార్ సంపాదకత్వంలో ప్రచురితమైనట్లుగా శ్రీ ఆరుద్రగారు పేర్కొన్నారు. 1908వ సంవత్సరంలో డా. గిడుగు సీతాపతిగారు బాలగేయాలను *వివేకవతి* అనే పత్రికలో ప్రచురించారు. తర్వాత కాలంలో (అనగా 1940లో) *గృహలక్ష్మి*లోను, *భారతి*లోనూ, *బాలవిజ్ఞాన, బాలానందం,* శీర్షికల క్రింద బాలసాహిత్యం ప్రచురణ మొదలైనదని చెప్పవచ్చును. 1940లో *బాల కేశరి* అను పేరుతో బాలల కోసం ప్రత్యేక పత్రిక ప్రారంభమైంది. అదే విధంగా 1945లో *బాల,* 1946లో *చందమామ* అనే పత్రికలు పిల్లల కోసమే ప్రచురణ మొదలెట్టాయి. 1939-40 మధ్యకాలంలో శ్రీయుతులు న్యాపతి రాఘవరావు, శ్రీమతి కామేశ్వరిగారు రేడియో ద్వారా *బాలానందం* కార్యక్రమాలకు నూతన రూప కల్పన కల్పించారు. *బాలానంద సంఘం* 1940లో స్థాపింపబడింది. అటు తర్వాత పెక్కుమంది ప్రముఖ రచయితలు బాలసాహిత్య రచనకు అనేక విధాలతోడ్పడ్డారు. వారిలో ముఖ్యంగా పేర్కొన తగిన వారు: చింతా దీక్షితులు, ఏటుకూరి నరసయ్య, న్యాపతి రాఘవరావు, చక్రపాణి, అడవి బాపిరాజు, ఏడిద కామేశ్వరరావు, కె.సభా, కరుణశ్రీ, శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవిలాంటివారు నవరచయితలకు స్ఫూర్తినిచ్చి ప్రోత్సహించారు. కొడవటిగంటి కుటుంబరావు, ముళ్ళపూడి వెంకటరమణ, వెలగా వెంకటప్పయ్య, నార్ల చిరంజీవి, ఆలూరి బైరాగి లాంటి వారు బాలసాహిత్యానికి ఇతోధికంగా సేవ చేశారు. దాదాపు అన్ని ప్రక్రియలలోను, బాలసాహిత్యం విరివిగా పెంపొందింది. బాలురకై *శతకాలు, గేయ కావ్యాలు, గేయ కథానికలు, కథలు, నవలలు, నాటకాలు, నాటికలు,* హెచ్చు సంఖ్యలోనే వెలుగు చూచాయి. కొత్త రచయితలు చాలా మంది పిల్లలకోసం వ్రాయటం మొదలెట్టారు. శ్రీయుతులు వేమరాజు భానుమూర్తి, మహీధరనళినీ మోహన్లాంటి రచయితలు విజ్ఞాన విషయాలను గురించి సరళమైన భాషలో పిల్లల కొరకై కథలూ, పుస్తకాలు ప్రచురించారు.

విజ్ఞానశాస్త్రాలు, సాంఘికవిషయాలపైపుస్తకాలు, జీవితచరిత్రలు, దేశచరిత్రలు, కళలూ, ఆటలూ మొదలైన విషయాల పై చెప్పుకోదగిన స్థాయిలో మంచి పుస్తకాలు తగినన్ని రాలేదనే చెప్పాలి. *బాలవిజ్ఞాన సర్వస్వ సంకలనం* పైన జరిగిన ప్రయత్నాలు అసంపూర్తిగానే ముగిశాయి. బాలలకోసం వెలువడిన విజ్ఞాన శాస్త్ర రచనలలో ఎక్కువ భాగం ఖగోళ శాస్త్రానికి సంబంధించినవి. ఎ.వి.యస్. రామారావుగారి *విశ్వదర్శనం* (1965), *అంతరిక్షయానం,* వసంతరావు వెంకటరావుగారి *చంద్రుని కథ* (గేయ రూపంలో), విస్సా అప్పారావుగారి *ఆకాశం,* వేమరాజు భానుమూర్తి గారి *భూమికథ* ఈ సందర్భములో ముఖ్యంగా పేర్కొన తగిన రచనలు. 1940-60 మధ్యకాలంలో ప్రచురింపబడిన ముఖ్యమైన బాలసాహిత్య సమగ్ర సమీక్ష వ్యాస రూపంలో *ఆంధ్రప్రభ* ఆదివారం సారస్వత అనుబంధంలో శ్రీయుతులు రావినూతల సత్యనారాయణ, పమిడిముక్కల లక్ష్మణరావు ప్రభృతులు ప్రచురించారు.

ఆ వ్యాసశృంకల విజ్ఞుల ప్రశంసలనందుకొన్నది. తర్వాత కాలంలో డా.వెలగా వెంకటప్పయ్యగారు బాలసాహిత్యం పై సమగ్ర పరిశోధనజేసి డాక్టరేటు పట్టాపుచ్చుకొన్నారు. అంతేకాక వారి రచనలకు *ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ* పురస్కారం లభించింది. డా.వెంకటప్పయ్యగారు బాలబంధు బిరుదాంకితులు. వారు బాలసాహిత్య పరిషత్తు వ్యవస్థాపక అధ్యక్షులు. బాలసాహిత్య విషయాలపై పరిపూర్ణ పరిజ్ఞానం గల వ్యక్తిగా (Authority), నేటి రచయితలు డా. వెంకటప్పయ్య గారిని పరిగణిస్తారు.

**బాలవాఙ్మయవికాసం – పత్రికలపాత్ర :**

తెలుగులో ఇప్పటి వరకు దాదాపు 70 నుండి 80 వరకు పత్రికలు కేవలం పిల్లల కోసమే, వెలువడినవి. అయితే ప్రస్తుతం నిలబడిన వాటి సంఖ్య వేళ్ళపై లెక్కించ వచ్చు! అయినప్పటికీ, బాలసాహిత్య వికాసంలో ఆయా పత్రికలు చేసిన సేవ గణనీయమైనది. ఈ సందర్భము లో *బాల మాసపత్రిక* చేసిన సేవ ప్రశంసించ తగినది! నేడు గొప్ప బాలసాహిత్య రచయితలుగా ప్రసిద్ధులైన వారంతా, బాల పరిచయం చేసినవారే! అలాగే, నాగిరెడ్డి, చక్రపాణి గారలు స్థాపించిన *చందమామ* దాదాపు 60 సంవత్సరాలకాలం 16 భారతీయ భాషల్లో నిర్విరామంగా నడిచింది.




చందమామ పత్రికలో కేవలం పురాణ, వైజ్ఞానిక, లౌకిక కథలే కాక, *బేతాళ, పంచవింశతి* లాంటి కథలు కూడా ప్రచురించే వారు. *చందమామ* పెట్టిన వరవడి ఆకర్షణీయం, అనుసరణయోగ్యం. బాలసాహిత్య ప్రచారంలో చందమామ పాత్ర ప్రశంసనీయం. అలాగే, బాలల అకాడమీ ఆధ్వర్యంలో వెలువడిన బాలచంద్రిక శ్రీ ఏడిద కామేశ్వరరావు గారి సంపాదకత్వంలో మంచి మంచి రచనలు ప్రచురించింది. పిల్లలకు సామాన్య పరిజ్ఞానం (General Knowledge) అందజేసే రచనల ప్రచురణలో *బాల చంద్రిక* కృషి పేర్కొన తగినది. 1980లో శ్రీ నండూరి రామమోహనరావుగారు స్థాపించిన బాలజ్యోతి పత్రిక వైజ్ఞానిక రచనలకు ప్రత్యేకించి చెప్పుకోదగినది. ఆ పత్రిక ఆధ్వర్యంలో నిర్వహించబడిన వైజ్ఞానిక నవలల పోటీలు విజ్ఞుల మన్ననలనందు కొన్నవి. బి.వి.నరసింహారావుగారు తమ సంపాదకత్వంలో వెలువరించిన చిరుమువ్వలు ద్వారా అందజేసిన గేయ సాహిత్యం, అత్యంత ఆహ్లాదకరంగానూ, ఆడుచూ పాడుటకు అనుగుణ్యంగాను ఉంటుంది. మద్రాసు నుండి ప్రచురిత మౌతున్న, బుజ్జాయి, బొమ్మరిల్లు, బాలమిత్ర, బాలభారతి పత్రికలు పిల్లలకు వినోద, విజ్ఞాన రచనలు అందజేయుటలో చేసిన కృషి తప్పక పేర్కొన తగినది.

**కేంద్రసాహిత్యఅకాడమీబాలసాహిత్యపురస్కారాలు :**

బాలసాహిత్యం చెప్పుకో తగిన విధంగా వర్ధిల్లాలంటే, అందులకై ప్రజలు, సంస్థలు, ప్రభుత్వ అకాడమీలు పెద్ద పెట్టున పూనుకోవాలి. వ్యూహాత్మక ప్రణాళికలు రచించి, వాటి అమలుకు తగిన కార్యాచరణ పథకాలు సిద్ధం చేయాలి! కేంద్రసాహిత్య అకాడమీ 2010వ సంవత్సరము నుండి ప్రతియేటా, తెలుగులో ప్రచురితమగుచున్న బాలసాహిత్యంలో ఉత్తమ రచనను ఎంపికచేసి, ఆ పుస్తక రచయితను జాతీయపురస్కారంతో సత్కరించాలని తీర్మానించారు. ఇది ముదావహం! ఆ పథకాన్ని అనుసరించి 2010 నుండి 2014 వరకు ఐదుగురు బాలసాహిత్య వేత్తలను జాతీయపురస్కారాలతో సత్కరించారు. ఆయా రచనల విశ్లేషణాత్మక సమీక్షయే ఈ వ్యాసం యొక్క ముఖ్యోద్దేశం. ఇందు ఉల్లేఖించిన ప్రధాన రచనల వివరణాత్మక పరిశీలన విజ్ఞులైన పాఠకులను ఆకర్షించి, ఆయా రచనలను వారి వారి పిల్లల దృష్టికి తెస్తారని, పిల్లలు సహితం పుస్తకాలను చదివి ఆనందిస్తారని ఆశిద్దాం. అలా జరిగినప్పుడే రచయితల లక్ష్యం సఫలమౌతుంది. పిల్లలు మంచి చదువరులుగా తయారవుటలో తల్లిదండ్రుల పాత్ర, ప్రోత్సాహం ఎక్కువ మాత్రలో ఉండుట వాంఛనీయం. ఇదివరలో పేర్కొనినట్లుగా కేంద్రసాహిత్య అకాడమీ 2010 నుండి తమ బాలసాహిత్య పురస్కారాలను శ్రీయుతులు కలువకొలను సదానందగారికి (2010), భూపాల్గారికి (2011), రెడ్డి రాఘవయ్యగారికి (2012), శ్రీమతి డి. సుజాతాదేవిగారికి (2013), దాసరి వెంకటరమణ గారికి (2014) అందజేసింది.

తొలి పురస్కార విజేత కలువకొలను సదానంద. వీరు 1939, చిత్తూరు జిల్లాలోని పాకాలలో జన్మించారు.

వృత్తి రీత్యా ఉపాధ్యాయులు. మంచి అధ్యాపకునిగా పేరు గణించారు. ఉత్తమ ఉపాధ్యాయునిగా రాష్ట్ర ప్రభుత్వ పురస్కారం, జాతీయ బహుమతి అందుకొన్నారు. ఆధునిక సాహిత్యంలో విశేష కృషి చేశారు. వారు రచించిన కథా సంకలనానికి ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు పొందారు. వీరు రచించిన *అడవితల్లి (కాపవ్యునికథ)* ఉత్తమ బాలసాహిత్య రచనగా ఎంపిక జేసి కేంద్ర సాహిత్య అకాడమీ, న్యూ ఢిల్లీ, వారు తమ 2010వ సంవత్సరపు (తొలి) జాతీయ పురస్కారాన్ని కలువకొలను సదానందగారికి అందజేసి గౌరవించారు. సదానందగారు ఇతర పురస్కారాలు కూడా అందుకొన్నారు. వానిలో వారి *బంగారు నడచిన బాటకు* లభించిన భారత ప్రభుత్వ పురస్కారం పేర్కొనదగినది.

***అడవితల్లి* (కాపవ్యునికథ) :**




అడవితల్లి 9-12 సంవత్సరాల పిల్లలను దృష్టిలో ఉంచుకుని, సరళమైన భాషలో వారికి అనుగుణ్యంగా వ్రాసిన నవల. మానవజాతిని మంచి దారిలో నడిపించే ఉత్తమోత్తమ కథా వస్తువు దీనిలోని విషయం. తిక్కన మహాకవి భారతంలో ఈ కథను ప్రస్తావించి నట్లు రచయిత సదానందగారు పేర్కొన్నారు. కాపవ్యుని కథలోని నాయకుడు కాపవ్యుడు. తిక్కనగారు చూచాయుగా సృజించిన వృత్తాంతాన్ని అనేక కల్పనలతో, ఆటవిక - జానపద జీవన నేపథ్యానికి అనువైన తెనుగు నుడికారంతో ఒక సంపూర్ణమైన కథగా విస్తరించి మంచి నవలగా మలచి బాలలకు సమర్పించారు రచయిత సదానందగారు. శంభుడి భార్య రుద్రాణికి, అడవితల్లి (వనదేవత) స్వయంగా వచ్చి పురుడు పోయటమే గాక, పుట్టిన మగశిశువుకు కాపవ్యుడు అనే పేరు పెట్టింది!" కాపవ్యుడు అంటే కాపాడేవాడు, కాపు కాచే దొర అని అర్థం! అంటే భవిష్యత్తులో అరణ్యలోకాన్ని ఉద్ధరించే గొప్ప ఏలిక అవుతాడు" అని కూడా తెలియజేసి వెళ్తుంది ఆ వనదేవత.!

ఈ నవల ఒక ఇతిహాసం. ఎప్పుడో జరిగిన కథ. రామాయణ, మహాభారతాలు కూడా లేని రోజుల్లోది! తర తరాలుగా పెద్దలు పిన్నలకు చెప్పిన కథ. జీవారణ్యం ఈకథ జరిగిన ప్రాంతం. ఆ అరణ్యంలో అనేక ఆటవిక జాతులు నివసిస్తున్నాయి. అయితే, వారి మధ్య ఐకమత్యం లేదు. ఉమ్మడి నాయకత్వం అసలే లేదు. ఎవరి జీవిత విధానం వారిదే! జీవారణ్యంలో ఎందరో దుష్టులు తారసిస్తారు! వారిలో తోడేళ్ళ తండాలో ఈహ అనేవాడు, గవికొండలో కటారిగాడు, జువ్విగడ్డలో గరుటామంతుడు, మైలారు కొండలో బూంబాదేవర, పులిమీదపుట్రలో అసుర పోతులరాజు, విచిత్ర ద్వీపంలో దాగిన వికల్పుడు, పక్కలో బల్లెంలాంటి శత్రురాజు టంకు బాతి ఈ కథలో భాగంగా వచ్చేముఖ్య పాత్రలు! ఈ దుష్ట పాత్రల నుండి కాపవ్యుడు తన పరిజనాన్ని ఏవిధంగా రక్షించుకొన్నాడో, అతడు చూపిన సాహసకృత్యాలన్నీ పిల్లలకు సులువుగా అర్థమయ్యే శైలిలో ఆకర్షణీయంగా కథ చెప్పబడింది. నవల మొత్తం 28 చిన్న చిన్న అధ్యాయాలుగా విభజింపబడింది. మొదటి అధ్యాయం పేరు పులికోనలో ఒక పున్నమ రేయి! జీవా రణ్యంలో ఒక చిన్నపల్లె పేరు పులికోన. పల్లె నడిబొడ్డున బోయల ఇలవేలుపైన అడవి తల్లి రాతి విగ్రహం అలంకరించబడి చుట్టూ కర్ర దివ్వెలతో దేదీప్యమానంగా వెలుగు తుంది! ఆ వాతావరణంలో బోయలు ఆడా, మగా కలసి జాతర చేసుకొంటున్నారు. ఇప్పసారా తాగి ఉత్సాహ, ఉల్లాసాలతో పాడుతూ నృత్యం చేయసాగారు. అలసి పోయి నిద్రావస్థలో ఒళ్ళు తెలియని స్థితిలో పడిఉంటారు. శంభుడు బోయదొర. అతని భార్య రుద్రాణి ఆ రోజు రాత్రి మూడో ఝామున ప్రసవిస్తుంది. పురుడు పోయటానికి అక్కడి వారెవ్వరూ లేచి రారు. రుద్రాణి పిలుపు వినిపించుకొనే స్థితిలో లేరు వారెవ్వరూ! ఆ తరుణంలో వనదేవత ఒక స్త్రీ రూపంలో అచ్చటికి వచ్చి రుద్రాణికి పురుడు పోసి పసిబిడ్డకు చేయవలసిన పనులన్ని చేసి, కాపవ్యుడనే పేరు సూచించి, పిల్లవాని భవిష్యత్తును గురించి వివరంగా రుద్రాణికి తెలియపరచి వెళ్ళిపోతుంది. శంభుడు సంభ్రమానందాలతో బిడ్డను ముద్దాడుతాడు!" సాహో అడవితల్లో! జయహో అడవితల్లో!" అను జయ జయధ్వానాలతో అడవికోన మారు మ్రోగుతుంది! రెండవ అధ్యాయంలో నెమలికోన అందం, ఇతర వివరాలు ముచ్చటగ వర్ణించబడినవి. ఆ పల్లెకు ఒక

చివర ఋష్యాశ్రమం ఒకటుంది. అందులో దస్రు అనే ఒక ముని తన శిష్యులతో ఉంటాడు. ఆయన వృక్షాలను గురించి, పక్షులను గురించి పరిశోధనలుచేస్తూ, తను సాధించిన విజ్ఞానాన్ని తాళపత్రములపై వ్రాసిపెడుతూ ఉంటాడు. ఆయన కుమారుని పేరు చంద్రజ్యోతి. ఒక నాడు ఎక్కడి నుండో వినిపిస్తున్న పసిపాప ఏడుపు విని ఆశ్చర్యముతో చెంచులు చుట్టు పక్కలంతా కలియ తిరిగారు. కాని ఆ పసిపాప జాడ తెలుసుకో లేక పోతారు. ఆ అలికిడికి దస్రు ఆశ్రమం బయటికి వచ్చి విషయమేమిటో తెలుసుకొన్నాడు. ఏడుపు కొండ పై నుండి వస్తున్నట్లు గ్రహించాడు. కాని ఆ కొండ శిఖరం చాలా ఎత్తైనది. దానిని ఎక్క గలిగిన వారు చాలా తక్కువ. శంభుడు తను వెళ్ళి వస్తానని అంటాడు. అన్నట్లుగానే, అతడు శిఖరం పైకి చేరుకొని అక్కడ ఒక చోట మెత్తని పచ్చికపై నున్న ఆడ శిశువును చూస్తాడు. శంభుడు ఆ శిశువుతో జాగ్రత్తగా శిఖరం దిగి వస్తాడు. బిడ్డను చూచి అందరూ సంతసిస్తారు. దస్రు మహాముని ఆ బిడ్డను తన ఆశ్రమంలో పెంచి పెద్ద దాన్ని చేసి, విద్యాబుద్ధులు నేర్పడానికి అంగీకరిస్తాడు. బిడ్డ పేరు కాకలీ అని పెడతాడు.

ఇదంతా జరిగి, శంభుడు తన ముద్దుల కొడుకు కోసం, నెమలి ఈకల తల పద్దెడలు, చందనపు కర్రలతో మలచిన బొమ్మలు తీసుకొని ఇంటికి పయనమౌతాడు. శంభుడు పులికోన చేరుకొనే సరికి, పల్లె అంతా విచారగ్రస్తంగా వుంది. కాపాను బూంబాదేవర పట్టుకు పోయాడన్న వార్త బోయల నోటంట వినవస్తున్నది. ఇది వినగానే శంభుడి నెత్తి మీద పిడుగు పడినట్లయింది! శంభుడు బోయ వీరులందరితో రకరకాల ఆయుధాలు ధరించి శత్రువుల పైకి దండెత్తి వెళ్ళుతాడు. అందరూ మైలారు కొండచేరు తారు. బూంబాదేవర కాపవ్యని మైలారు దేవతకు బలి ఇచ్చే ప్రయత్నంలో అతని ఆఖరి కోరిక అడిగి తెలుసుకుంటాడు. "నా కట్లువిప్పమని" అడుగుతాడు కాపవ్యుడు. అలాగే చేస్తాడు బూంబాదేవర. అప్పుడు కాపా రెండు చేతులూ బూరాలా నోటి వద్ద చేర్చి "ఓ, హో..య్" అంటూ పెద్ద కూత పెట్టాడు. ఆ కూతకు సమీపంలోని పులి గాండ్రించింది. అది విని అందరూ అదిరిపడ్డారు. వెను వెంటనే ఏనుగుల ఘీంకారాలు వినిపించాయి! మైలారులు హడలి పారిపోయారు! అంతలో నాలుగైదు పెద్దపులులు గాండ్రుమంటూ మైలారు దేవత ముందుకు దూకాయి! దాంతో బూంబాదేవర వణికి పోయాడు! అందరూ పారి పోయారు! ఇంతలో ఒక ఏనుగు కాపవ్యణ్ణి తొండంతో ఎత్తి తన మూపున కూర్చోబెట్టుకొన్నది! మరో ఏనుగు బూంబాదేవరను తొక్కి చంపింది. బోయలతో కలసి శంభుడు కొండ పైకి వచ్చే సరికి, కాపాను మూపు కెక్కించు కొన్న ఏనుగు తప్ప మిగిలిన జంతువులు వెళ్ళిపోయాయి. ఈవిధంగా కాపవ్యునికి పెద్ద ఆపద తప్పిపోయింది. కాలం ఆగదు కదా!

కాపా పెరిగి పెద్ద వాడయ్యాడు. తండ్రి దగ్గర విలువిద్య నేర్చుకొని గొప్ప విలుగానిగా రూపొందాడు! ఎంతటి దూరం నుంచైనా లక్ష్యాన్ని ఛేదించేవాడు! అతని బాణానికి తిరుగు లేదు. ప్రకృతి బడిలో పాఠాలు నేర్చుకొని మహావీరుడయ్యాడు కాపా. తర్వాత అనేక వీరకృత్యాలు సలిపి యుద్ధాలలో శత్రువులందరినీ ఒకరి తర్వాత ఒకరిని సంహరించి, చివరకు అజేయుడై కాకలీని పెండ్లి చేసుకుంటాడు. అప్పుడు అడవితల్లి "కాకలీ నువ్వు నా కూతిరివమ్మా! కాపవ్యని కివ్వడానికే నిన్ను కన్నాను. అతడిని సుఖపెట్టి నువ్వు సుఖపడు తల్లీ! నాయనా కాపవ్యా! నీ వల్ల నీ ప్రజలు సుఖపడతారు. నీ పాలనలో ఈతి బాధలు వుండవు. నీ జీవితం చరితార్థమౌతుంది. నీ కథ సువర్ణాక్షరాలతో వ్రాయ బడుతుంది! మీ ఇరువురికీ శ్రీరస్తు శుభమస్తు!" అని దీవిస్తుంది. అడవితల్లి దీవనలందుకొన్న కాకలీ, కాపవ్యులు అలౌకికానందములో పూల తెప్పలై తేలిపోయారు! కాపవ్యుడు చిరకాలం పరిపాలన చేశాడు, అతడు ఆటవికులను పాపాలనుండి తొలగించి, సాధు వర్తనులను చేసి, మేలు చేగూర్చాడు. అతని వల్ల వారికి ఇహపర సౌఖ్యాలు రెండూ లభించాయి. మహాభారత కథలో మహాకవి తిక్కన కాపవ్యోపాఖ్యానం ఆరేడు పద్యాలలో ప్రస్తావించి చివర ఈ ఫలశ్రుతిని కూడా చెప్పినట్లుగా నవలా రచయిత సదానంద పేర్కొన్నారు. *కాపవ్యోపాఖ్యానము-పాపహరము!* దీని శ్రవణ పఠనములటవీ వ్యాపారక్షేమంకర- రూపములగు, దస్యు మృగ విరోధములడచున్.

ఎం. భూపాల్రెడ్డిగారికి 2011లో కేంద్ర సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీ వారి జాతీయ పురస్కారం లభించింది. వారు రచించిన *ఉగ్గుపాలు* (కథాసంకలనం) అనే రచన 2011లో బాలసాహిత్యంలో ప్రచురితమైన పుస్తకములలో ఉత్తమ రచనగా ఎంపిక చేయబడింది.

ఎం. భూపాల్రెడ్డిగారు 1959లో హైదరాబాదు పరిసరాలలోని గ్రామంలో జన్మించారు. వారి తండ్రి Central Excise Departmentలో Constablగా ఉద్యోగం నిర్వహించి పదవీ విరమణ చేశారు. భూపాల్రెడ్డి గారిది పేద రైతు కుటుంబము. వారి విద్యాభ్యాసం హైదరాబాదులోనే జరిగింది. ఉస్మానియ విశ్వ విద్యాలయంలో యం.ఏ తెలుగు చదివిన తర్వాత, అదే విశ్వ విద్యాలయంలో శ్రీ పొట్లపల్లి రామారావుగారి రచనలపై పరిశోధన చేసి, డాక్టరేటు పట్టాపుచ్చుకొన్నారు. శ్రీ భూపాల్రెడ్డిగారు రచనా వ్యాసంగంలోనే కాక నటనారంగంలో ఆరితేరిన వారు. కొమరంభీమ్సినిమాలో నటించడమే కాక, ఆ సినిమాకు కథ, సంభాషణలు వారే స్వయంగా సమకూర్చారు. అలాగే మరికొన్ని తెలుగు సినిమాలలో నటించారు. ఎం.భూపాల్రెడ్డి కలం నుండి దాదాపు 19 పుస్తకాలు వెలుగు చూచాయి. వానిలో ఎక్కువ భాగం పిల్లల కోసం ప్రత్యేకంగా రచించినవే! బాలసాహిత్య రచయితగా రెడ్డిగారు ప్రఖ్యాతి పొందారు. అటువంటి వారిని తమ జాతీయ పురస్కారంతో గౌరవించిన కేంద్ర సాహిత్య అకాడమీ వారు అభినందనీయులు.

***ఉగ్గుపాలు* (పిల్లలకథలు) :**

*ఉగ్గుపాలు* పుస్తకంలో ఎనభై అయిదు చిన్న కథలున్నవి. ఇవి పిల్లలను గురించి పిల్లలు చెప్పే కథలు. కథలన్నీ పిల్లల ప్రపంచాన్ని పెద్దవారికి పరిచయం చేసేవే! ఇవి అన్నీ కూడా 4 నుండి 6 సంవత్సరముల వయసు పిల్లలను దృష్టిలో ఉంచుకొని వ్రాసినవి. రచయిత స్వయంగా వాళ్ళలో ఒకడై ఆడి పాడి, అల్లరిచేసి వ్రాసినట్టుగా ఉంటాయి! అందుకే పుస్తకములోని కథలన్నీ మనలను ఆకర్షిస్తాయి. మన మనసులను ఆకట్టుకొంటాయి. పిల్లల ప్రవర్తన, ఆలోచనా, వారి అంతరగం ఏవిధంగా వికసిస్తుందో ఈ కథలు అద్దం పడతాయి. శైశవదశలో తల్లిదండ్రుల పెంపకం, వారు స్పందించే తీరును బట్టి పిల్లలో కొన్ని దృఢమైన అభిప్రాయాలు చోటుచేసుకొంటాయి. అటువంటి నిశ్చితాభిప్రాయాలు తరువాతి దశలో వారి జీవనగమనాన్ని ప్రభావితంచేస్తాయి. అందుచేత పిల్లల మనసెరిగి తల్లిదండ్రులు తమ ప్రవర్తనను మార్చుకొనుటకు ప్రయత్నించాలి. మన నిజ జీవితంలో చూస్తూ కూడా పట్టించుకోని అనేక చిన్న విషయాలు, ఆ విషయాల్లోని గాఢత ఈ కథలు మనకు జ్ఞప్తికి తెస్తాయి. కథను సూక్ష్మంగా చెప్పడమనేది ఒక కళ. భూపాల్రెడ్డిగారు అలాంటి కళలో ఆరి తేరినవారిగా మనకు దర్శనమిస్తారు. అద్దంలో చందమామని చూచినట్లు ఈ కథలు పిల్లలను గురించి వారికి తెలియపరుస్తాయి. అందుచేత ఈ కథలు పిల్లలకు స్వయంగా చదివి వినిపిస్తే, మంచి ఫలితం వస్తుంది. అలాంటి పాత్రను తల్లిదండ్రులు పోషిస్తారని ఆశిద్దాం. ఉగ్గుపాలలోని ప్రతి కథా పిల్లలకు ఏదో ఒక విధమైన నీతి బోధ సూటిగానో, పరోక్షంగానో సూచిస్తుంది.

కొన్ని కథలు చదివిన వెంటనే వాటి వలన పిల్లలు తెలుసుకోదగిన విషయమేమిటో స్ఫురిస్తుంది, కాని ఉగ్గుపాలు పిల్లలు తమంతట తాము తాగరు. తల్లులు ఉగ్గుగిన్నెతో నోట్లో జొప్పించవలసినవే! అలాగే ఈ కథలను పిల్లల మనసులలోకి చతురతతో ఎక్కించాలి. కథలలో పిల్లల ఊహలకు పదునుపెట్టి ఉత్సుకత కలిగించే చమత్కార సంఘటనలు కాని, సన్నివేశాలు కాని మచ్చుకైనాలేవు. అలాంటివి చేర్చి ఉంటే పుస్తకం విలువ మరింత పెరిగేది! పెద్దల ప్రవర్తన పిల్లలు అనుకరిస్తారు కాబట్టి తల్లిదండ్రులు తమ అలవాట్లను అతిజాగ్రత్తగా మలచుకోవలసి ఉంటుంది. ప్రఖ్యాత బాలసాహిత్య రచయిత శ్రీ రెడ్డి రాఘవయ్యగార్కి 2012వ సంవత్సరపు బాలసాహిత్య జాతీయ పురస్కారం లభించింది. వారి రచన చిరుదివ్వెలు ఉత్తమ బాలసాహిత్య రచనగా కేంద్ర సాహిత్య అకాడమీ, న్యూ ఢిల్లీ ఎంపిక చేసినది. శ్రీ రెడ్డి రాఘవయ్య రేపల్లె వాస్తవ్యులు. బాలసాహిత్య రంగంలో చాలా కాలం నుండి రచనా వ్యాసంగం చేస్తూ, కీర్తినార్జించారు. పిల్లల కొరకై వారు వివిధ రకమైన రచనలు ముఖ్యంగా గేయం, గేయ కథ, నాటిక, జీవిత చరిత్ర మొదలైన సాహిత్య ప్రక్రియలు రచించారు. వారి కలం నుండి వెలువడిన కొన్ని ముఖ్యమైన రచనలు : *బాల కవితలు, చందమామరావే, పూలతోట, బామ్మచెప్పిన బంగారు నీతి కథలు, గలివర్సాహసయాత్రలు, ప్రపంచ అద్భుత కథలు* మొదలైనవెన్నో వున్నాయి. వారికి చక్రపాణి బాలసాహిత్య అవార్డు (2004), ఇంకా ఎన్నో అవార్డులు లభించాయి. వారి రచనలన్నీ మంచి ప్రచారాన్ని పొంది పిల్లలకు ప్రీతిదాయకమైనవి.

**చిరుదివ్వెలు :**

ఇది ఒక గేయ కథల సంకలనం. “పాడుటకు అనువైనది గేయం” అన్నారు పెద్దలు. చిరుదివ్వెలలోని గేయ

కథలు మహాపురుషుల జీవితాలలోని కొన్ని సంఘటనలు పురస్కరించుకొని రచించారు రాఘవయ్యగారు. చిరుదివ్వెలు పుస్తకంలోతొమ్మిదిగేయకథలున్నవి. వాటిలో అధిక భాగం కథలు తెలుగు విద్యార్థి అనేమాసపత్రికలో ప్రచురితమైనవి. చివరి రెండు కథలు మాత్రం, ఆకాశవాణి, హైదరాబాదు వారి బాల కార్యక్రమం బాలానందం కార్యక్రమంలో భాగంగా సంగీత రూపకంగా ప్రసారమైనవి. చిరుదివ్వెలు కావ్యంలో తొమ్మిది గేయ కథలున్నవి. ఒక్కొక్క కథలో ఒక్కొక్క సందేశం ఇమిడి ఉంది. పిల్లలు ఈ కథలన్నిటినీ చదివి అర్థం చేసుకొని వాటిలో వివరించబడిన విషయాలు ఆచరిస్తే, అవి పిల్లల భవిష్యత్జీవితానికి వెలుగును ప్రసారిస్తాయి. *చిరుదివ్వెలు*లోని బాలల గేయ కథల పరిశీలన. ఇందులో చెలిమి విలువ, సత్యమార్గము, సామ్యవాది, చిన్ననాటి హితవు, చెట్లు చేయు మేలు, ఔదార్యం, కాని వారి చెలిమి, ఆదర్శం, సమ భావం శీర్షికలు కల గేయకథలున్నవి. ప్రతి గేయకథలోను ఒక మహావ్యక్తి బాల్య జీవితంలో జరిగిన సంఘటన వివరింపబడినది. దానివలన ఆ మహాపురుషుని గూర్చిన విశేషాలు పిల్లలు సులభంగా అర్థం చేసుకోగల గేయాల రూపంలో చెప్ప బడింది. గేయాలు పిల్లలు చదువుకొని, జ్ఞాపకముంచుకొని, పాడుకొనే సరళభాషలోను, చక్కని శైలిలోను వర్ణించబడింది. చెలిమి విలువలో ఒక బాలుడు తన స్నేహితుని ఆపద నుండి రక్షించిన విధం సుళు వైన గేయ రూపంలో వ్రాయబడింది. గమనించండి!

**ఊరిలోన జరుగుతున్న – తిరునాళ్ళను చూడ గోరి**
**బాల డొకడుమిత్రుని తో – వెళ్ళినాడు ఆ చోటికి.**

**. . .**

**చక్కనైన శివుని బొమ్మ – చూసి భక్తి పెంపొందగ**
**ముచ్చట పడి తగిన వెలను – ఇచ్చి కొనెను ఆ బాలుడు.**

**. . .**

**తీర్థమంత తిరిగి చూచి – తిమిరమలుము కొన్నంతనె**
**వింత లెల్లజెప్పు కొనుచు – వచ్చు చుండినారు వారు.**

**. . .**

**మాటలందు మునిగి వారు – చూడలేదు బండిరాక**
**ప్రక్కనున్న మిత్రుడపుడు – పడబోయెను బండి కింద!**

**. . .**

**అపాయమ్ముగాంచినట్టి – ఆ బాలుడు బొమ్మ విసిరి**
**పారవేసి తన మిత్రుని – దూరముగా నెట్టినాడు.**

**. . .**

**బొమ్మ పగిలినందు కతడు – ఏ మాత్రం ఏడ్వలేదు**

**. . .**

**అపాయమ్ము నుండి చెలుని – ఆదుకొంటి చాలనుచును**
**సాగిపోయె మిత్రునితో – సరదాగా తన ఇంటికి**
**చిన్ననాడె సాహసమును – చూపి చెలుని రక్షించెను**
**బాలలందర కతడొక్క – మేలుబాట చూపించెను.**
**నరేంద్రుడను పేరు తోడ – మురిపెముగా పెరిగి నాడు**
**ఆధ్యాత్మిక తత్త్వమ్మును – అతడు బాగ ఎరిగినాడు**
**పరదేశము లందాతడు – భరత వాణి వినిపించెను ...**
**వివేకానందస్వామిగ – విమల యశము గడియించెను.**

అదేవిధంగా, సత్యమార్గము అనే మరో గేయకథలో గాంధీజీ చిన్నతనంలోని ఒక సంఘటనను తెలియపరుస్తూ, ముచ్చటైన గేయంలో జాతిపిత గాంధీజీని గురించి తెలియజేస్తాడు.

**ఆ గేయ కథలోని చివరి భాగం గమనించండి :**

**చిన్ననాడె సత్యసంధత – పెద్దల మెప్పు పొందిన**
**బాలుడె మన జాతిపితయై –**
**పూజలందిన ఘనుడు మన బాపూ ...**
**సత్య మంటే దేవుడని యెడు –**
**నీతి బాపూ తెలియ జెప్పెను**
**కాన బాలా సత్యమెప్పుడు –**
**మనసు నందున మరువ బోకుము ...**

అలాగే సామ్యవాదిలో నెహ్రూ బాల్యంలో జరిగిన పెన్ను ను గురించిన సంఘటనను చక్కగా వర్ణించి ఇలా అంటాడు రాఘవయ్య :

**సామ్యవాద భావాలను – చిన్ననాడే తెలిపినాడు**
**పెద్దయైన పిదప నవియె – ప్రజలలోన నిలిపినాడు ...**
**అతడే ప్రజానాయకుడు – అతడే ఇట శాంతి దూత**
**అతడే మన తొలి ప్రధాని – అతడే చాచా నెహ్రూ.**

చిన్ననాటి హితవు అను గేయకథలో శ్రీ లాల్ బహదూరు బాల్యంలో జరిగిన ఒక చిన్న సంఘటనను వర్ణించి, ఆయనను తోటమాలి పూలు కోసినందుకు దండించిన విధానం, దానికి బాలుడైన లాల్బహదూర్ చెప్పిన వివరణ, ఆ తర్వాత తోటమాలి హితవు ముచ్చటైన గేయాల ద్వారా వెల్లడించిన విధమూ, తోటమాలి హితవును పాటించి లాల్బహదూర్ గొప్పవాడైన విషయాలు తెలియజేస్తాడు రచయిత రాఘవయ్య!

*చిరుదివ్వెలు* సంపుటిలోని గేయకథలన్నీ సరళభాషలో చక్కని శైలిలో రచింప బడినవి. గేయములన్నియు పిల్లలు తమంతట తాము చదివి ఆనందింపతగినవి. కథలలోని నీతివాక్యాలు పెద్దలు వివరించి చెబితే పిల్లలకు చక్కగా బోధపడుతుంది. అలాగే, గేయాలన్నీ పెద్దలు చదివి పిల్లలకు నేర్పితే, పిల్లలకు సులభంగా కంఠస్థమౌతాయి.

ఇంగ్లీషు Nursery Rhymes లాగా ముద్దుగా పాడి వినిపించుటకు అనువుగానున్నవి. ముఖ్యంగా 5 నుండి 10 సంవత్సరముల వయసు బాల బాలికలకు ఎక్కువగా ఉపకరిస్తవి. ఇలాంటి మంచి పుస్తకాన్ని తమ జాతీయ పురస్కారానికి ఎంపిక చేసిన కేంద్ర సాహిత్య అకాడమీ వారు అభినందనీయులు.

**2013వ సంవత్సరపు బాలసాహిత్య పురస్కారం :**

పెద్దల వైపు నుండి పిల్లలకు నడవడి నేర్పించే రచనలు చాలామంది వ్రాస్తున్నారు. కాని, పిల్లల వైపు నుండి పెద్దలకు ఏమైనా తెలియ జేసే రచనలు తక్కువగానే ఉన్నవి. ముఖ్యంగా ఊహ తెలిసే వయసులోనున్న పిల్లలతో పెద్దలు యెలా ప్రవర్తించాలి, వారినెలా ప్రభావితం చేయాలి అనే అవగాహనతో రచించిన వ్యాసాలుగాని, పుస్తకాలుకాని తెలుగులో తక్కువగానే కనిపిస్తాయి. అటువంటి అరుదైన పుస్తకాలలో శ్రీమతి డి. సుజాతాదేవిగారు రచించిన *ఆటలో అరటిపండు* అనే పుస్తకం పేర్కొనతగినది.

ఆటలో అరటిపండు అనే పుస్తకాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ వారు బాలసాహిత్యంలో ఉత్తమ రచనగా ఎంపికచేసి, ఆ గ్రంథ రచయిత్రి డి.సుజాతాదేవిగారిని జాతీయ పురస్కారంతో గౌరవించారు. సుజాతాదేవిగారు 1946వ సంవత్సరంలో ఏలూరులో జన్మించారు. ఆంధ్ర విశ్వ విద్యాలయము నుండి తెలుగులో యం.ఏ. పట్టా పుచ్చుకొన్నారు. సుజాతాదేవిగారి సాహితీ ప్రస్థానం కథలు, పాటలు, బాలసాహిత్యం అనే మూడుభాగాలుగా వికసించింది. మూడు ప్రక్రియలలోను విశిష్టత సాధించినప్పటికీ, బాలసాహిత్య రచయితగానే ఎక్కువ గుర్తింపు పొందారు శ్రీమతి డి.సుజాతాదేవిగారు. ఇప్పటి వరకు వారి కలము నుండి బాలసాహిత్యంలో మూడు పాటల పుస్తకాలు, మూడు నవలలు, కొన్ని వ్యాసాలు వెలుగు చూచాయి. వారికి ఎన్.సి.ఇ.ఆర్.టి. నుండి అందరం ఒకటే పాటల పుస్తకానికి 1985 లోను, *సుజలాం సుఫలాం* అనే బాలల నవలకు 1989 లోను జాతీయ బహుమతులు లభించాయి. ఆటలో అరటిపండు పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ వారి జాతీయ పురస్కారం 2013లో అందిన విషయం పైన పేర్కొనటమైనది.

**ఆటలో అరటిపండు :**

ఈ పుస్తకాన్ని గురించి ముచ్చటిస్తూ "చిన్న చిన్న పిల్లల్ని పెద్దమనుషులుగా తయారు చేసే బంగారు తల్లుల కోసం "తాము ఈ పుస్తకాన్ని రచించి నట్లుగా పేర్కొన్నారు సుజాతాదేవిగారు. అంటే, పిల్లలను, వారి మనస్తత్త్వాన్ని దృష్టిలో ఉంచుకొని, పెద్దలను ఉద్దేశించి వ్రాసిన పుస్తకం ఆటలో అరటిపండు. అంటే పిల్లలను బాగా పెంచడానికి, సుశిక్షితులుగా, ప్రయోజకులుగా మలచడానికి, విచక్షణ జ్ఞానం పెంపొందించడానికి తల్లిదండ్రులకు శ్రీమతి సుజాతాదేవిగారు చూపే రహదారి ఈ పుస్తకం. ఆటలోఅరటిపండుపుస్తకంలో 25 గల్పికలు (వ్యాసాలు?) పొందుపరచబడ్డవి. ప్రతి రచనలోను, ఒకహితం – ఒక సూచన, ఒక సందేశం, ఇమిడి ఉంది. రచయిత్రి ఒక అమ్మగా, అమ్మమ్మగా సునిశిత పరిశీలనా దృష్టితో ఈ వ్యాసాలు రచించారని భావించవచ్చు. ప్రతి చిన్న విషయానికీ, యేదో ఒక సంఘటననూ, సన్నివేశాన్ని కల్పించి, దానిచుట్టూఒకకథఅల్లుతూ, చెప్పవలసిన విషయాన్ని పఠితలకు తెలియజేయడం సుజాతాదేవిగారి ప్రత్యేకత! మంచి రచయిత చేయవలసిన పద్ధతి.

తొలి రచన అమ్మకావాలిలో పసిపాపలు స్కూలు నుండి ఇంటికి వచ్చేసరికి తల్లి ఎదురుగా వెళ్ళి పలుకరించి, స్కూలు బట్టలు మార్చి, వారికి ఏదో ఒక తినుబండారం (అన్నంకాని, టిఫినుకాని) ఆప్యాయతతో పెడితే సంతసిస్తారు. అలాజరగాలని ఆశిస్తారు! జరుగకపోతే విచారిస్తారు. పసిపాపలకు తల్లి చేసే ముద్దు మురిపాలు ఇచ్చి నంతటి సంతోషం మరేది ఇవ్వజాలదు! ఈ విషయం చక్కగా వెల్లడించారు రచయిత. అలాగే పిల్లల పైన మన ఆలోచనలు రుద్ద కూడదని వివరిస్తూ చక్కగా నిరూపించారు కాసేపు ఆడుకోవద్దా! అనేకథలో.

పిల్లలు ఆటాపాటల్లో తరుచుగా పోట్లాడుకుంటారు. వెంటనే మళ్ళీ కలిసిపోతుంటారు. ఆ పోట్లాటల్లో పెద్దలు జోక్యం చేసుకొని ఒకరితో ఒకరు వైషమ్యాలు పెంచు కోకూడదని వివరిస్తుంది ఆటలో *అరటిపండు*. అదే విధంగా తోబుట్టువుల మధ్య ఏర్పడే అసూయాద్వేషాలను ఏ విధంగా నివారించాలో విశదపరుస్తుంది *నేనెప్పుడు పెద్దయ్యాను* అనే కథ. శ్రీను అనే బాలునికి అంగవైకల్యం ఉంటుంది. కర్రల సహాయంతో కాని నడువలేడు. అలాగే బస్సు ఒంటరిగా తనంతట తాను యెక్కలేడు. కాని మంచి తెలివైన వాడు. డ్రాయింగ్ పోటిలో జూనియర్సు విభాగంలో శ్రీనుకి

బహుమతి వచ్చింది. ఆ సందర్భములో డ్రాయింగు టీచరు శ్రీనును పొగుడుతూ "శ్రీనుని చూడండి వాడు మీలా నడవలేడు... అంటూ శ్రీను కుంటితనానికి జాలిని వ్యక్తపరుస్తాడు." ఆ విషయం శ్రీనుని దుఃఖపరచింది. అంగవైకల్యం ఉన్న వారి మీద చూపవలసింది జాలి కాదనీ, సానుభూతితో కూడిన ప్రోత్సాహమనీ, *అయ్యోపాపం అనకండి* అనే కథానిక నిరూపిస్తుంది. అలాగే పెద్దల గురించి పిల్లల ముందు ఎలాంటి వ్యాఖ్యానాలు చేయుట మంచిది కాదు. అలాచేస్తే, పిల్లలకు పెద్దల పై గౌరవ మర్యాదలు తగ్గిపోతాయి. ఈ విషయాన్ని చక్కగాను, సన్నివేశ సహితంగాను నిరూపించారు రచయిత సుజాతాదేవి *అమ్మకు మార్కులెన్ని?* అనే రచనలో. ఇలా విశ్లేషిస్తూ పోతే, పుస్తకం లోని కథలు (గల్పికలు) అన్నింటిలోను పెద్దలు గ్రహించదగిన సందేశం ఏదో ఒకటి తప్పకుండా కనిపిస్తుంది. *ఆటలో అరటిపండు* తల్లిదండ్రులందరూ తప్పక చదువవలసిన రచన.

కథలు చదవడం అందరికీ ఇష్టమే! అయితే, అందరూ ఇష్టపడేలా కథలు వ్రాయడం అంత తేలికైన పనికాదు. బాలసాహిత్య రచయితగా తెలుగు పాఠకులకు పరిచయమైన దాసరి వెంకటరమణ సరళ సుందరమైన భాషలో అందరి మనసులూ ఆకట్టుకొనే విధంగా కథలు వ్రాయుటలో అందెవేసినచేయి. శ్రీ వెంకటరమణగారు చందమామ కథల రచయితగా 1982లో తమ రచనావ్యాసంగం మొదలుపెట్టారు. *చందమామ* కథలకు శ్రీ కొడవటిగంటి కుటుంబరావు ప్రవేశపెట్టిన ఒక ఒరవడిని దాసరి వెంకటరమణ బాగా అలవరచుకొనుటయేకాక, సరళమైన భాషను సహితం సొంతం చేసికొన్నారు. ఎలాంటి కథలు పిల్లలను ఎక్కువగా ఆకర్షిస్తాయో బాగా తెలుసుకున్నారు. చిన్న చిన్న కథల ద్వారా బాలల వ్యక్తిత్వ వికాసం పెంపొంద జేయవచ్చు నన్న భావం శ్రీ వెంకటరమణగారు గ్రహించినంత చక్కగా ఇతర బాలసాహిత్య రచయితలు అలవరచుకోలేదనుటలో అతిశయోక్తిలేదు. చందమామ కథలు అందరికి అద్భుతంగా నచ్చటానికి కారణం ఆ కథలలోని ప్రత్యేకత. అంటే, అన్ని సమస్యలను జానపద శైలిలో చెప్పటం, ఆబాలగోపాలాన్నీ ఆలోచింపజేయటం, వినోదింపజేయటం, తెలివికి పట్టం కట్టటం, ఇలాంటి మంచి లక్షణాలతో, కథల ద్వారా పిల్లలలో వ్యక్తిత్వ వికాసాన్ని కలిగించడం *చందమామ* కథల ప్రత్యేకత. అదే మార్గాన్ని వెంకటరమణ తమ కథలలో చాలా వరకు అనుసరించారు.

శ్రీ దాసరి వెంకటరమణగారు కర్నూలు జిల్లాకు చెందినవారు. వెంకటరమణమ్మ, రంగయ్య దంపతులు వారి తల్లిదండ్రులు. శ్రీ రమణగారు 22-03-1965లో జన్మించారు. చిన్న వయసు నుండి హైదరాబాదులోనే నివసిస్తూ, విద్యాభ్యాసం సహితం ఇచ్చటనే పూర్తిచేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయము నుండి తెలుగులో ఎమ్.ఎ. డిగ్రీ అందుకొన్నారు. ఉద్యోగరీత్యా Registration శాఖలో Sub-Registrar and Registrar of Marriages పదవి నిర్వహిస్తున్నారు. శ్రీ వెంకటరమణగారి కలం నుండి ఇంత వరకూ దాదాపు 300 వరకూ కథలూ, కవితలూ, వ్యాసాలు ప్రచురితమయ్యాయి. వారి తొలి కథల సంపుటి అమ్మ మనసు బహుళ ప్రచారాన్నీ, పాఠకుల మన్ననలను అందుకొన్నది. ఆ పుస్తకానికి, తెలుగు యూనివర్సిటీ వారి ఉత్తమ బాలసాహిత్య పురస్కారం లభించింది. శ్రీ దాసరి గారి రెండవ పుస్తకం *ఆనందం* (కథలసంపుటి) ని కేంద్ర సాహిత్య అకాడమీ (న్యూఢిల్లీ) వారు 2013లో ప్రచురింపబడిన ఉత్తమ బాలసాహిత్య రచనగా ఎంపిక చేసి, 2014వ సంవత్సరపు జాతీయ బాలసాహిత్య పురస్కారంతో సన్మానించారు. పైన పేర్కొనిన సన్మానాలే కాకుండా వెంకటరమణగారికి, చక్రపాణి - కొలసాని అవార్డు (2008), అర్వపల్లి సుబ్బారావు స్మారక అవార్డు, మంగాదేవి బాలసాహిత్య పురస్కారం (2010), చొక్కాపు ఫౌండేషన్ బాలసాహితీ రత్న బిరుదు మొదలైన సన్మాన-సత్కారాలు లభించాయి. శ్రీ రమణ సమకూర్చిన భారవి టి.వి. సీరియల్కు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నుండి నంది అవార్డు అందుకున్నారు.

**ఆనందం (కథల సంపుటి) :**

ఆనందం సంపుటిలో 22 కథలున్నవి. పిల్లలు తెలుసుకో దగిన విషయాలను ఈ కథల ద్వారా, లేదా సంఘటనల ద్వారా పిల్లల మనసులకు హత్తుకునేటట్లు చెబుతారు రచయిత. ప్రతి కథలోనూ ఒక మంచి విషయం సున్నితంగా వివరిస్తారు. కథలోనికి ఆసక్తిగా కొని పోయేటందుకు కొత్త పద్ధతిలో ప్రతి కథ ముందూ ప్రవేశిక పొందుపరచుట జరిగినది. ఈ ప్రవేశిక చదువగానే పాఠకులకు

తెలియకుండానే వారిలో కథ చదవాలన్న ఉత్సుకత కలుగుతుంది. కథను పూర్తిగా చదివాక, వెనక్కు వెళ్ళి ప్రవేశికను మరోసారి చూడాలన్న భావం కలుగుతుంది. అంతేకాదు, పాఠకులకు (ముఖ్యంగా బాల బాలికలకు) కథలో సూచితమైన సందేశం మనసుకు తడుతుంది! ఇలా చేయటం ఒక మంచి పద్ధతి. పేరుకు తగినట్లుగా ఈ సంపుటిలోని కథలన్నీ పఠితలకు ఆనందం కలిగించేవే!

ఇతరులు మంచిదని భావించేదే కాక తమ మనసుకు నచ్చిన దానిని పొందడమే నిజమైన ఆనందం. ఆశ, ధనం పట్ల విపరీతమైన మోజు, మనిషిలోని తృప్తిని పోగొట్టి, నిజమైన సంతోషానికి దూరం చేస్తాయని ఆనందం కథ నిరూపిస్తుంది. ఈ కథ, ఈ కథా సంపుటికి మణిపూస లాంటిది. అలాగే, *సుప్రతీకుడి ప్రశ్నలు* అనే కథానికలో ఒక పశుల కాపరి ఉద్దండులైన పండితులనెందరినో ఓడించిన ఒక మహాజ్ఞానిని మూడు చెరువుల నీళ్ళు త్రాగించాడు! విద్యా, విజ్ఞానాలకన్నా లోకజ్ఞానం (ఇంగితం) గొప్పదని తెలియజేశాడు. ఇది మెదడుకు పదును పెట్టే కథ అనుటలో సందేహం లేదు.

ఈ కథలోని కంకణుడి పాత్ర గర్వానికీ, అహంభావానికీ ప్రతీక! ఆ అహంభావం పశులకాపరి ఇంగిత జ్ఞానం ముందు దెబ్బతినింది. అది తెలుసుకున్న బాల పాఠకులు ఉల్లాసంతో నిండి / పొంగి పోతారు! *ఆనందం* లోని ఏడు కథలను మంచి కథలుగా ఎంపిక జేసి, వికాస విద్యావనం హైస్కూలు వారు 6వ తరగతి పిల్లలకు పాఠ్యాంశాలుగా ఎంచుకోవడం, ఈ కథల విలువను ఇనుమడింప చేస్తుంది. వారు ఎంపిక జేసిన కథలన్నీ ముఖ్యంగా *ఆనందం, సుప్రతీకుడి ప్రశ్నలు, రూపాయి సమస్య, ఆటలో ఆనందం, కూర్మావతారం, మేలు కుట్టిన దొంగ, త్రిధాముడి కల* మొదలైనవి చాలా బాగున్నాయి. పిల్లల మనో ప్రపంచాన్ని విస్తరింప జేస్తాయి.

పిల్లలలో సృజనాత్మకత పెంచి, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడానికి ఎక్కువ దోహదపడుతవి. దాసరి వెంకటరమణ వ్రాసిన *ఆనందం* కథల సంపుటి బాలసాహిత్యంలో విశిష్టమైనది. కథలన్నీ పిల్లల ఆలోచనలను విస్తరిస్తాయి, విలువలను పెంచుతాయి. ఈ కథలన్నీ పిల్లలే కాక పెద్దలు కూడా చదివి ఆనందింప తగినవి.

**ముగింపు :**

ఒకప్పుడు ఆనాదృత వాఙ్మయంగా పండితుల ఆదరణకు నోచుకోని బాలసాహిత్యం ఇరవయ్యోశతాబ్దం ఉత్తరార్థం నుంచే రచయితలను ఆకర్షించి అన్ని ప్రక్రియల లోను రచనలకు దారి తీసింది. ప్రభుత్వ సంస్థలు, అకాడమీలు బాలసాహిత్యానికి ప్రోత్సాహమివ్వడం ప్రారంభించాయి. నేషనల్బుక్ట్రస్టు చాలా కాలం నుండి భారతీయ భాషల్లో రచింపబడిన పిల్లల పుస్తకాలను ప్రచురిస్తున్నది. కేంద్ర సాహిత్య అకాడమీ 2010 నుండి తెలుగులో బాలసాహిత్య జాతీయ పురస్కారాలను మొదలు పెట్టింది. 2010 నుండి 5గురు బాలసాహిత్య రచయితలను జాతీయ పురస్కారాలతో సన్మానించి ప్రోత్సహించింది. ఆ పురస్కార సాహిత్యం యొక్క సమీక్ష ఈ వ్యాసం చిత్రిస్తుంది. దానితో పాటు బాలసాహిత్యంలో జరుగుతున్న రచనా వ్యాసంగ విహంగ వీక్షణం కూడా సృజించడమైనది. అయితే పిల్లలను మంచి మార్గంలో నడిపించి, వారి వేదస్సును పెంచి, సహజీవనాన్ని కలిగించి, వారిలో మానసిక వికాసాన్ని, మంచి వ్యక్తిత్వాన్ని, ఆత్మస్థైర్యాన్ని పెంచే రచనలు మరిన్ని రావల్సి ఉంది. ఈ మార్గంలో ఆలోచించి ఈ నాటి రచయితలు తెలుగులో ఉత్తమ బాలసాహిత్యాన్ని మునుముందు సృజింప గలరని ఆశిస్తున్నాను.

**కృతజ్ఞతలు :**

ఈవ్యాస రచనలో అవసరమైన సమాచారాన్ని అందించి సహకరించిన నా చిరకాల మిత్రుడు స్వర్గ శ్రీ వెలగా వెంకటప్పయ్యగారి ఆకస్మిక మరణానికి విచారిస్తూ, వారి దివ్య స్మృతికి ఈ వ్యాసాన్ని అంకితం చేయడమైనది. అలాగే ఈ సమీక్షలో ఉల్లేఖించిన రచయితలందరికీ నా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియ జేయడమైనది.



ప్రొఫెసర్ రావినూతల సత్యనారాయణ
విశ్రాంత ఆచార్యులు, హైద్రాబాదు.

# సినిమాలో స్త్రీ

*- ఎం. వెంకటేశ్వర్*

**భారతీయ చలన చిత్రాలలో స్త్రీ పాత్రలు :**

**చ**లన చిత్రాలలో ప్రదర్శించబడుతున్న స్త్రీయొక్క పతనోన్ముఖ స్వరూపపు విశ్లేషణాత్మక వ్యాఖ్య నేటి భారతీయ చలనచిత్ర సమీక్షా క్షేత్రంలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్న అంశంగా పరిణమిస్తోంది. అనాదిగా భారతీయ చలనచిత్రాలు స్త్రీ కేంద్రితంగానే సాగుతున్నాయి. ఐతే నేడు భారతీయ చలన చిత్రాలలోనేకాక, విదేశీ చలన చిత్రాలలో సహితం ఇదే పరిస్థితి నెలకొని వుంది. స్త్రీ యొక్క పరిధిని ఆధారంగా చేసుకునే నేటి చలనచిత్రాల కథాగమనం సాగుతోంది. చిత్ర కథాంశం చారిత్రాత్మక మైనా, పౌరాణికమైనా, సామాజిక పరమైనదైనా లేక ఏదైనా క్షేత్ర విశేషానికి సంబంధించిన దైనా ఏ తరహాకు చెందిన చిత్రంలోనైనా స్త్రీ యొక్క సమస్యలు, స్త్రీ పురుష సంబంధాలు, స్త్రీ యొక్క కామ ప్రవృత్తి, శృంగార భరితమైన భావ వ్యక్తీ కరణలు, ఆమె యొక్క దైహిక సౌష్ఠవం, సమ్మోహనకరంగా వుంటే ఆమె యొక్క దేహాంగ ప్రదర్శన మొదలైన అంశాలన్నీ పురుష దృక్కోణంతో పురుషుని దృష్టిలో ఉంచుకునే చిత్రీకరించ బడతాయనేది స్త్రీ వాదచింతకుల ప్రగాఢ విశ్వాసం.



నర్గీస్

హిందీ చలనచిత్ర పరిశ్రమ బాలీవుడ్ పరిశ్రమగా పరిగణించబడుతుంది. ఇది భారతీయ చలనచిత్ర పరిశ్రమకు హాలీవుడ్ రీతిలో లభించిన ప్రత్యేకమైన గుర్తింపు. హాలీవుడ్ మాదిరిగానే బాలీవుడ్ అనే పదం హిందీ చలనచిత్ర పరిశ్రమకు స్థిరంగా నిలిచిపోయింది.

స్త్రీలు చలనచిత్రాలలోనికి అడుగిడటం అనేది నారీ సశక్తీకరణకు ఒక సజీవ తార్కాణం. నేటి స్త్రీలు నటనలోకానీ, చిత్ర నిర్మాణ రంగంలోకానీ లేక చిత్ర దర్శకత్వంలోకానీ సాంకేతిక సహకారంలోకానీ ఏ రంగంలోనైనా నిస్సంకోచంగా, ఏ రకమైన నిర్బంధాలకూ, గురికాకుండా చక్కని క్రియాశీలతను కనపరుస్తున్నారు. భారతీయ చలనచిత్ర పరిశ్రమ శైశవదశలో ఉన్నప్పుడు ఈ పరిస్థితి ఎంత మాత్రమూ సంభవమయ్యేది కాదు. ఆ రోజులలో స్త్రీలకు చలనచిత్రం చూడటమే నిషిద్ధమైన అంశంగా ఉండేది. ఐతే ఈ నేపథ్యంలో నాటకాలలో స్త్రీ పాత్రలను సహితం పురుషులే పోషించేవారు. ఉదయకాలపు చలనచిత్రాలలో సహితం ఇదే పరిస్థితి నెలకొని వుండటంలో చలనచిత్రాలలో స్త్రీ పాత్ర స్థానం కూడా పురుషులకే దక్కేది.

దాదాసాహెబ్ ఫాల్కే 1913 లో *రాజాహరిశ్చంద్ర* చిత్రాన్ని చిత్రీకరించినపుడు "రాణీ తారామతి" పాత్రను పోషించటానికి స్త్రీ కళాకారిణులెవ్వరూ ముందుకు రాలేదు. కనీసం వేశ్యా గృహాలలో నివసించే స్త్రీలు కూడా లభ్యపడలేదు. ఆ సందర్భంలో ఫాల్కేకు ఒక మరాఠీ నాటక సంస్థను గూర్చిన సమాచారం లభించింది. అప్పట్లో ఆ సంస్థ యొక్క నాటక ప్రదర్శనలు వాయిదా వేయబడ్డాయి. ఆ నేపథ్యంలో దాదాసాహెబ్ ఫాల్కేకు ఈ సంస్థ యొక్క సహకారంతో కమలాబాయి గోఖలేతో పరిచయం ఏర్పడింది. ఆయన తన తదుపరి చిత్రం ఐన *మోహినీ భస్మాసుర* లో ఆమెను కథానాయికగా తెరమీదకు తీసుకువచ్చారు. ఈ విధంగా కమలాబాయి మరియు ఆమె తల్లి దుర్గా గోఖలేలకు ప్రప్రథమ స్త్రీ కళాకారిణిలుగా గౌరవం దక్కింది.

1931లో ఆర్దేశీర్ ఇరానీ నిర్మించిన ప్రప్రథమ మాటల

చిత్రం (టాకీ చిత్రం) *ఆలమ్ ఆరా*లో మాస్టర్ విఠల్‌తో "జుబేదా" కథానాయిక పాత్రను పోషించారు. ప్రారంభిక దశలోని చిత్రాలలో ఆంగ్లో ఇండియన్ స్త్రీలు చిత్రాలలో నటించటానికి సంతోషంగా అంగీకరించేవారు. ఆ క్రమంలో విదేశీ మూలానికి చెందిన "రూబీ మేయర్" హిందీ చలన చిత్రాలలో 'సులోచనా' అనే పేరుతో ప్రసిద్ధ కళాకారిణిగా పేరు ప్రఖ్యాతులు గడించారు. 1925లో నిర్మించబడిన 'హిర్‌బాలా'లో 'మోహన్ భవ్‌నానీ' దర్శకత్వంలో 'సులోచన' నటించారు. ఆ వరుసలోనే 'ఎస్తర్ అబ్రహమ్' 'ప్రమీల' పేరుతో ఫారసీ సంచార రంగస్థలం నుంచి బొంబాయి చలన చిత్రాలలో స్టంట్ కళాకారిణిగా స్థిరపడ్డారు. బొంబాయి చలన చిత్రాలపైన ఫారసీ రంగస్థల ప్రభావం మెండుగా వుండేది. ఆ దశలోనే 'పేటెన్ కపూర్' అదే పేరుతో నర్తకిగా మంచి గుర్తింపును పొందారు. ఆమె యురేసియన్, ఫారసీ మరియు మదన్ నాటక జట్టుల మీదుగా బొంబాయి చలన చిత్రాలలో పాదం మోపారు.

1922లో *మదన్ నాటక సంస్థ* వారి *పతిభక్తి*లో ఈమె పరిపూర్ణ అంకిత భావం కలిగిన అర్ధాంగిని ఐన "లీలావతి" పాత్రను పోషించి ప్రేక్షకులను తన నటనతో మంత్రముగ్ధులను కావించారు. సీతాదేవిగా ప్రసిద్ధిచెందిన 'రేనీస్మిథ్' హిమాంశురాయ్ యొక్క *ప్రేమ్‌సన్యాస్* చిత్రంలో నటించి ప్రసిద్ధ కళాకారిణిగా ప్రేక్షక హృదయాలలో చెరగని ముద్రను వేసుకున్నారు. విదేశీమూలం కలిగిన తక్కిన కళా కారిణులతో ఇరీస్ గస్పార్ (సబితాదేవి), సుజాన్ సోలోమన్ (ఫిరోజా బేగమ్), ఎఫీస్టీవర్ట్ (మనోరమ) మొదలైనవారు ప్రప్రథమంగా బొంబాయి చలనచిత్ర పరిశ్రమలోని స్త్రీ పాత్రలకు ఒక సామాజిక పరమైన గుర్తింపును తెచ్చిపెట్టారు. భారతీయ మూలానికి చెందిన ప్రథమ అభినేత్రి 'దుర్గాఖోటే' 1932లో *అయోధ్యా ఎచారాజా*లో నటించారు. దుర్గాఖోటే ఒక ప్రతిష్ఠాత్మక కుటుంబానికి చెందిన సుశిక్షితురాలైన స్త్రీ. చలనచిత్ర రంగం కేవలం నిమ్నవర్గానికి చెందిన స్త్రీలకు మాత్రమే పరిమితమైనదికాక, ఉన్నత మరియు సుసంపన్నమైన కుటుంబాలకు చెందిన స్త్రీలు కూడా అభినయ కళను ప్రదర్శించటంలో పాలుపంచుకో గలుగుతారని నిరూపించారు. ఈ పరంపరకు ఒక బలమైన పునాదిని వేసినది మాత్రం 'దేవికారాణి' అని భావించక తప్పదు. ఈమె ఆ కాలానికి చెందిన సుప్రసిద్ధ సర్జన్ జనరల్ ఎమ్.ఎస్. చౌదరి కుమార్తె. ఈమె కేవలం నటనలోనే కాక సినిమాటోగ్రఫీ, దర్శకత్వం, చిత్రనిర్మాణం, దర్శకత్వ రంగాలలో కూడా ప్రతిభాపాటవాలను కలిగివున్నారు. 1930వ దశకంలో నెమ్మది నెమ్మదిగా స్త్రీలు తమ నటనా కౌశలంతో చలనచిత్రాల స్వరూపాలనే మార్చసాగారు. 1932లో వి. శాంతారామ్ తన *దునియానమానే* చిత్రంలో 'శాంతా ఆప్టే'ను సమాజానికి పరిచయం చేశారు. 1935లో 'శోభనా సమర్థ్ చిత్ర రంగంలోనికి ప్రవేశించారు. 1942లో విజయభట్ నిర్మించిన 'భరత్ మిలాప్' చిత్రంలో సీత పాత్రను పోషించి, ఆ పాత్రకు జీవంపోశారు. స్త్రీలు చలనచిత్ర రంగంలోనికి అడుగిడటం భారతీయ సందర్భంలో స్త్రీల యొక్క అధికారాల దృష్ట్యా ఒక మహత్తరమైన ఘటనగానే భావించ తగుతుంది. నవ జాగృత కాలపు ఉద్యమంలో స్త్రీల యొక్క సామాజిక దుర్దశను వ్యతిరేకిస్తూ స్త్రీ జనోద్ధరణకై పోరాటం జరుగుతున్న నేపథ్యంలో స్త్రీ విద్య, స్త్రీ యొక్క ఆర్థిక స్థితి, ఆమెపై జరిగే అత్యాచారాలు, శోషణ మరియు దుర్నీతికి విరుద్ధంగా సమాజంలో ఒక నవ్యచైతన్యం ఉదయించింది. ఈ వినూత్న చైతన్యం తాలూకు ప్రభావం భారతీయ చలనచిత్రాలలో ప్రస్ఫుటంగా గోచరమవుతూ వస్తోంది. అంతేకాక, ఈ సంస్కరణల ఫలితంగా చిలనచిత్రాలలో స్త్రీలపట్ల ఒక వినూత్న దృష్టికూడా ఊపిరిపోసుకుంది. ప్రాథమిక దశకు చెందిన చిత్రాలలో ముఖ్యంగా స్త్రీ సమస్యలే అత్యధికంగా చిత్రీకరించబడినాయి. ఇది భారతీయ సమాజాన్ని పునర్ జాగృతపరచి, సాఫల్యాన్ని సాధించే దిశగా ఒక గొప్ప ప్రయత్నమై నిలిచింది. ప్రాంతీయ చలన చిత్రాలన్నిటిలోనూ స్త్రీ విమర్శకు సంబంధించిన విషయాలు ఎక్కువగా ప్రదర్శించబడ్డాయి. హిందీ చిత్రాలలో నారీ చరిత్ర ప్రధానమైన చిత్రాలు ఒక ప్రత్యేకమైన వర్గంగా ఏర్పడినాయి. ఈ తరహా చిత్రాలలో



మీనాకుమారి

స్త్రీ జీవితానికి సంబంధించిన సుఖదుఃఖాలను రెండింటినీ సమానంగా చిత్రీకరించటం జరిగింది. స్త్రీ యొక్క త్యాగమయ ప్రవృత్తి, ఆమె కనపరిచే అనురాగం, మాతృత్వం, ప్రేమ, అంకితభావం వంటి గుణాలను ఒకవైపు ప్రదర్శిస్తూనే, మరొకవైపు స్త్రీ యొక్క దుశ్చరిత్ర, లోభిత్వము, కుట్ర, ఉగ్రరూపం, క్రోధ స్వభావం, ప్రతీకారవాంఛ, అనైతికత్వం, దేహవాదం, పురుషలోలత్వము, కాముకత, దుస్సాహసం మొదలైన దుర్భావాలతో కూడిన ప్రతినాయిక స్వరూపాన్ని కూడా చిత్రీకరించటం జరిగింది. ఈ రెండు స్వరూపాల ప్రదర్శనలోనూ, అతిశయోక్తి, కాల్పనికత మిళితమై వుంటుంది. సమాజం ఆకాంక్షించే స్త్రీ యొక్క దేవతాస్వరూపం భారతీయ స్త్రీ పై ఆపాదించబడ్డ ఒక ఛాయ. స్త్రీ యొక్క నైతికతకు పరాకాష్టగా భావించబడే ఈ స్వరూపమై లోకరంజకమైన స్వరూపం. కానీ సత్యమనే దర్పణం లో స్త్రీ యొక్క ఆ స్వరూపం మసకబారిపోతోంది.


నిమ్మి

హిందీ చిత్రాల కథాంశం పురుషుని దృష్టిలో వుంచుకునే రచింపబడుతుంది. చిత్ర నిర్మాత కానీ, దర్శకుడు కానీ, కథారచయిత కానీ లేదా నటుడో, నాయకుడో ఐన ట్లైతే తరచుగా వారు చిత్ర కథను తమకు అనుకూలంగానే మలుపులు త్రిప్పటం పరంపరాను గతంగా వస్తున్న ఆనవాయితీగా మారింది.

ఈ నేపథ్యంలో కథానాయిక పాత్రను క్రిందికి నెట్టివేసే పూర్తి ప్రయత్నం జరుగుతుంది. ఆర్.కె. నారాయణ్ రచించిన నవల ఆధారంగా రూపొందించబడిన 'గైడ్' చిత్రంలో రాజు గైడ్ (దేవానంద్), రోజీ (వహీదా రహమాన్) పాత్రను మూలకథాంశానికి భిన్నంగా చిత్రీకరించి, పూర్తి అపరాధాన్ని రోజీ పాత్రపైకి నెట్టి నాయకుడు మాత్రం ప్రేక్షకుల సానుభూతిని పుష్కలంగా దక్కించుకుంటాడు. స్త్రీ యొక్క నిస్సహాయతను కూడా పురుషపాత్రలు తమకు అనుకూలంగా మలచుకుంటారు.

కొన్ని చిత్రాలలో పురుషాధిపత్యాన్ని అంగీకరించే మానసిక స్థితి కలిగిన నిస్సహాయ స్త్రీలను చిత్రీకరించటం గోచరిస్తూ వుంటుంది. 1966లో విడుదలైన 'దిల్‌దియా దర్ద్‌లియా' చిత్రం 'ఎమిలీ బ్రాంటి' రచించిన 'ఉదరింగ్ హైట్స్' అనే ఆంగ్ల నవలకు హిందీ రూపాంతరం. దీనిలో 'కైథరిన్' పాత్రధారిణి వహీదా రహమాన్ (రూప) తన బాల్య ప్రేమికుడు హిధ్‌క్లిప్ దిలీప్‌కుమార్ (శంకర్ రాజాసాహెబ్) చనిపోయినట్లు భావించి, ఠాకుర్ రమేష్ స్నేహితుడు సతీష్ (రహమాన్) వత్తిడితో వివాహం చేసుకోవటానికి రాజీపడుతుంది.

ఐతే రూప ప్రేమపట్ల అవిశ్వాసము మరియు ఒక విధ్వంసకరమైన ఆక్రోశం శంకర్‌లో చోటుచేసుకుంటాయి. శంకర్ మనస్తత్వం స్త్రీ పట్ల పురుషాధిక్య అహంకారాన్ని నిరూపిస్తుంది. నవలలోని మూలకథ అన్యదిశలో సాగుతుంది. 'ఉదరింగ్ హైట్స్' నవల విఫలమైన ప్రేమకు సంబంధించిన ఒక విధ్వంసాత్మక గాథ. *ధూల్‌కాఫూల్* (1959) చిత్రం స్త్రీ పైన పురుషుని ద్వారా ఆరోపించబడ్డ అసామాజిక మాతృత్వం పైన చేయబడిన ఒక కటు విమర్శ. చలన చిత్రాలలో దోషియైన పురుష పాత్రధారి తన ఆభిజాత్య సంస్కృతి ముసుగులో స్త్రీ యొక్క అస్తిత్వాన్ని భంగ పరచటంలో విజయాన్ని సాధిస్తాడు. అతడు స్త్రీని దుస్థితి నుంచి ఉద్ధరించే ఆలోచన వెనుక పరో పకార భావన మెండుగానూ, సామాజిక పరివర్తనను ఆకాంక్షించే ధోరణి స్వల్పంగానూ గోచరమవుతుంది. చిత్ర ప్రారంభంనుంచే స్త్రీ యొక్క ఉనికి పురుష భోగవాద దృష్టితోనే ప్రదర్శించబడుతుంది. దీనికి కారణం చిత్రపరిశ్రమ వ్యాపారంతో ముడిపడి వుండటమే. నేటి ఉత్తరాధునిక సమాజంలో స్త్రీ యొక్క దేహాన్ని ఒక వస్తువుగా, ఒక భోగ్యసామాగ్రి రూపంలో ప్రదర్శించే చలనచిత్ర సభ్యత వికసించిపోయింది. ఇది చూస్తూచూస్తూ వుండగానే బలమైన వేళ్ళతో పాతుకుపోయింది. చలనచిత్రాల వాస్తవికత యొక్క మూలంలోకి వెళితే తెరపైన ప్రదర్శించబడే స్త్రీ యొక్క శృంగార భావన మరియు సౌందర్య ప్రదర్శనల మోజులో ఆమెను పురుషునికి కనువిందుచేసే ఒక బొమ్మ మాదిరిగా తయారుచేశారని అవగతమవుతుంది.

ఐతే ఈ సభ్యత స్త్రీలపైన రుద్దబడిన అంశంగాకాక నేటి సమాజంలో అతి సాధారణ అంశంగా పరిణమిస్తోంది.

19వ శతాబ్దపు అంతిమ చరణం మరియు 20వ శతాబ్దపు ఆరంభిక కాలం నుంచీ సుశిక్షితులైన స్త్రీలు తమ ఓటుహక్కుని వినియోగించుకునే నిమిత్తం ఉద్యమించటం ప్రారంభించారు. అది మొదలుకొని పాశ్చాత్య దేశాలలో ఉద్యమాలు ఊపందుకున్నాయి. ఇది తొలివిడత స్త్రీ ఉద్యమ కెరటంగా చెప్పబడుతుంది. ఫ్రెంచ్ సాహిత్యవేత్త మరియు దార్శనికురాలైన 'సయమన్ ద బూవే' కొంతకాలం విశ్వసించారు. అందుకే ఆమె తనను సమాజవాద రచయిత్రిగా ప్రకటించుకున్నారు. అటుపిమ్మట సమాజం నుంచి ఆమెకు ఆశాభంగం ఎదురవ్వటంతో Movement dela Liberationdisfemmes అనే స్త్రీ సమూహంతో కలిసి తనను తాను స్త్రీవాద రచయిత్రిగా ప్రకటించుకున్నారు. ఇది స్త్రీవాదానికి తొలి మజిలీ అని భావించవచ్చు. 1963లో అమెరికాకు చెందిన పాత్రికేయురాలు బేటీ ఫ్రాయిడన్ యొక్క గ్రంథం *The Feminine Mystique* వెలువడింది. ఈ గ్రంథంలో స్త్రీల స్థితిగతులను గూర్చిన విమర్శ పొందుపరచబడింది. ద్వితీయ ప్రపంచ యుద్ధం అనంతరం మాతృత్వపు బాధ్యతను ఒంటరిగా అనుభవిస్తున్న స్త్రీల మానసిక స్థితిపట్ల కూడా ఈ గ్రంథంలో కూలంకషంగా విశ్లేషించబడింది. తత్ఫలితంగా 'బేటీఫ్రాయిడన్' రెండవ విడత స్త్రీ ఉద్యమానికి ఉద్ఘాటకురాలిగా చరిత్రలో నిలిచిపోయారు.



నూతన్

ఫ్రాయిడన్ అనంతరం 1969లో 'కేట్ మిలేట్' యొక్క *Sexual politics* అనే గ్రంథం స్త్రీ వాదాన్ని మరింతగా బలపరచి సమాజంలో వికసింపజేసింది. అమెరికాలో పౌరహక్కుల ఉద్యమం మరియు వియత్నాం యుద్ధ వ్యతిరేక సంఘర్షణల ప్రారంభంలో పైన ఉదహరించిన గ్రంథాలు వెలుగులోనికి వచ్చాయి. దీనితో స్త్రీలు వారి అధికారాలను దక్కించుకోవటానికై సిద్ధాంతపరమైన మరియు వ్యవహారికమైన పోరాటం వారికి వారే చేసుకోవాలని విశ్వాసం పెంపొందించుకున్నారు. ''వైయక్తిక్ హీ రాజనైతిక్‌హై'' అంటూ ఎలుగెత్తి ప్రకటించిన రెండవ విడత స్త్రీ ఉద్యమకారులు, స్త్రీల యొక్క దైహిక శోషణ, మాతృత్వము, ప్రజననము, సౌందర్య స్పర్ధలు మరియు ప్రకటనల వ్యాపారాలకు సార్వజనిక పోరాటస్థాయిని కల్పించారు. కాలక్రమంగా స్త్రీవాదం సాహిత్యంలోనేకాక, చలనచిత్రాలలో స్త్రీని ప్రదర్శించే తీరుతెన్నులపైన కూడా పరిశీలనలు మొదలుపెట్టింది. 1971లో లండన్‌లో 'లండన్ మహిళా ఫిల్మ్ సంగఠన్' అనే సంఘం స్థాపించబడింది. ఆ సమయానికి చెందిన స్త్రీ ఉద్యమకారులందరూ ఇందులో భాగస్వాములయ్యారు. దానికి ఒక సంవత్సరం తర్వాత 'ఎడిన్‌బరా'లో ప్రపంచ ప్రథమ స్త్రీ చిత్ర మహోత్సవం ఏర్పాటు చేయబడింది. ఈ విధంగా చిత్రాలలో స్త్రీవాద విశ్లేషణలు చేసే రచయితలకి ఒక వేదిక లభించింది.

1975లో బ్రిటన్‌లో స్క్రీన్ పత్రికలో ప్రచురించబడ్డ వ్యాసంలో 'మార్వి' ఈ విధంగా వ్రాసారు- సమగ్ర చిత్ర పరిశ్రమలో ''పితృస్వామ్యమనే యంత్రాంగం తెరపైన కనిపించే స్త్రీని మూగరాలైన యవ్వనోత్తేజకురాలికి ప్రతీకగా నిలబెట్టింది''. చలనచిత్రాలను ప్రదర్శించే పరంపరానుగత పద్ధతిని వ్యతిరేకిస్తూ ఆమె ఈ విధంగా తర్కిస్తారు – చిత్రాన్ని వీక్షించే సమయంలో అప్పుడప్పుడూ పురుషుని దృష్టిలో 'వాయరిజమ్' అనగా (ఇతరుల జీవితంలో తొంగిచూసే ఒక మానసిక అవస్థ) యవ్వనిక దృష్టిలో చూసే ప్రవృత్తి ప్రబలమవుతుంది. చిత్రాలయాలలో (సినిమా హాళ్ళలో) అమర్చబడే తెరలు ఒక విశాలమైన దర్పణాన్ని పోలివుంటాయి. దాన్ని చూస్తూ వారు కేవలం స్వయంగా ముగ్ధులవ్వటమేకాకుండా వారిలో అణగద్రొక్కబడ్డ వాంఛలు చిత్రనాయకుని క్రియాకలాపాలతో చరితార్ధమవుతాయి. తాదాత్మ్యత యొక్క ఈ నూతన ప్రక్రియను 'మార్వి' 'స్కోఫోఫీలియా' అనగా తనను తాను ఆ పాత్రలో చూచుకునే ఆనందం అని అంటారు. తెరమీద కనుపించే ఆకృతితో తాదాత్మ్యత చేకూరగానే వారిలోని ప్రేక్షకుడు మేల్కొంటాడు. మార్వి యొక్క ఫిర్యాదేమంటే ప్రేక్షకులు అనగా కేవలం పురుషులే. అనగా ఆ దృశ్యాన్ని చూచే ఆనందం కేవలం పురుషులకు మాత్రమే కలుగుతుంది. ఇక్కడ

చెప్పుకోదగ్గ విషయమేమంటే ఆ ప్రేక్షకుడు, చిత్రదర్శకుడు కావచ్చు లేదా ఆ కథానాయకుడు కూడా కావచ్చు. మొత్తంమీద చిత్రం పురుష పాత్రలను పురుష ప్రేక్షకులనూ క్రియాశీలకంగానూ, స్త్రీ పాత్రలను, స్త్రీ ప్రేక్షకులను నిష్క్రియులుగానూ మార్చేస్తుంది. 'మార్వి' యొక్క ప్రతిపాదనలు స్త్రీవాదానికి సంబంధించిన సినిమా రచనలను లోతుగా ప్రభావితం చేసినాయి. ఈ క్రమంలో ఇతర స్త్రీవాద చిత్ర రచయితలలో జేన్‌స్టన్, మేరీ ఎన్‌డో ఆన్, కాజాసిల్వర్ మైన్ మరియు టెరీసాదే లారిటిస్ చెప్పుకోదగినవారు.

భారతీయ చలనచిత్ర సమీక్షకురాలైన 'ఆశాకస్ బేకర్' ననుసరించి హిందీ సినిమా ఈ పరస్పర విరుద్ధతల నుంచి నివృత్తి మార్గాన్ని అన్వేషించే క్రమంలో ఒక ఆదర్శవంతమైన, నైతిక పరమైనదిగా అనిపించే ఒక ప్రపంచాన్ని సృష్టిస్తుంది. స్త్రీయొక్క మర్యాదకు అధికారికంగా భంగం వాటిల్ల కుండా అనధికారంగా పురుషులకు శృంగార దృశ్య సౌఖ్యాన్ని చేకూర్చేదిగా వుంటుంది ఆ ప్రపంచం. అంతేకాక ఆ ప్రపంచం ఎంతో కుటిలమైన ధూర్త నీతిని కూడా సిద్ధంచేస్తుంది. ఉదాహరణకు నృత్యగీతాల అభినయ సందర్భంలో స్త్రీల యొక్క అంగాంగ ప్రదర్శన జరిగే విధంగా నృత్యభంగిమలు రూపొందించుట, దుస్తులను రూపొందించుట 'కస్‌బేకర్' ఈ రణనీతిని మూడు ఖండాలుగా విభజిస్తుంది.



మధుబాల

1. **యవ్వనత్వాన్ని ప్రశంసించుట** :

హిందీ చిత్రాలలో స్త్రీ పవిత్రమైనది – గంగానది జలం లేక సీతామాత సదృశంగా.

2. **ప్రదర్శన** :

ప్రదర్శన ఎల్లప్పుడూ సార్వజనిక రూపంలోనే చేయబడుతుంది. అది థియేటర్ ఐనా బార్ ఐనా డిస్కోటెక్ లేదా బహిరంగంగా వుంటే బాటమీద ఐనా ఈ ప్రదర్శనను ఆ సందర్భంలో లోపల వున్నవారు, బైట ప్రేక్షకులూ అందరూ సమానంగా దర్శిస్తారు.

3. **చూచే ప్రవృత్తిని వ్యతిరేకించుట** :

చిత్రాలలో నృత్యప్రదర్శన జరిగే దృశ్యంలో ఆ ప్రదర్శన శాల లోపల వున్న ప్రేక్షకులు మాత్రమే ఆ సన్నివేశాన్ని దర్శిస్తున్నట్లుగా భ్రమను కలిగించే విధంగా ఆ సన్నివేశంయొక్క వ్యవస్థీకరించబడుతుంది. తత్ఫలితంగా బైటవున్న ప్రేక్షకులందరూ ఎంతమాత్రం అపరాధ భావనకులోను కాకుండా నిస్సంకోచంగా ఆ సన్నివేశ సౌఖ్యాన్ని అనుభవిస్తూ వుంటారు. భారతీయ సెన్సార్ బోర్డువారు నగ్న చిత్ర ప్రదర్శనను అంగీకరించరన్న సంగతి ముందరగానే తెలియటంతో తమ లక్ష్య సాఫల్యానికై వక్రమార్గాన్ని అనుసరిస్తారు. తత్ఫలితంగానే వానపాటలు చిత్రీకరణ సాగుతోంది.

హిందీ చిత్రాలలో ప్రదర్శించబడుతున్న స్త్రీ యొక్క వివిధ రూపాలలో అత్యధికంగా ప్రచారంలో వున్న రూపం అమ్మవారి స్వరూపం. చలనచిత్ర కారులు కథానాయికల యొక్క అత్యున్నత నైతికత్వాన్ని స్థాపించ టానికి వారిని రాధ, సావిత్రి, సీత, దుర్గ, కాళి మాతలతో తుల్యమైన వారుగా ప్రకటించారు. స్త్రీ యొక్క దేవతాస్వరూపం ఆమెయొక్క పవిత్రతకు సంకేతం-పృథివిపై తాండవిస్తున్న అరాజకత్వాన్ని రూపుమాపి వినూత్న వ్యవస్థను స్థాపించాలి. కావున ఆమె ఎన్నో అవమానాలను సహించవలసి వస్తుంది. ఆ సందర్భంలో ఆమె పుత్రులు ఆమెను రక్షించటానికి తత్పరులై వుండవలసి వస్తుంది. న్యాయపోరాటం అంటే అమ్మవారినీ, ఆమె మర్యాదనీ కాపాడటానికి చేసే పోరాటమే. 1957లో విడుదలైన *మదర్ ఇండియా* చిత్రంలో అమ్మవారి యొక్క స్థాయి, ఆమె యొక్క శక్తివంతమైన ప్రతిబింబం ప్రదర్శించబడ్డాయి. అమ్మవారి పాత్రలో నర్‌గీస్ (రాధ) భారతమాత యొక్క ప్రతిరూపము. పెడదారినపట్టిన ఆమెయొక్క కుమారుడు బిర్జూ (సునీల్‌దత్) ఆమెను అవమానించటానికి ప్రయత్నిస్తే భారతమాత అతనిని తుపాకీ గుండ్లతో పేల్చి చంపటానికి ఏమాత్రం సంకోచించదు. రాధ దృష్టిలో (నర్గీస్ భారతమాత) అతడు ఒక పుత్రుడుకాక, కేవలం ఏహ్యతను కలిగించే దొంగ మాత్రమే.

అమ్మవారియొక్క రెండవ స్వరూపం రాధ (మీరా) లాంటి స్వరూపం రాసలీల పరంపరలో రాధ యొక్క

స్వరూపం మూడు విధాలుగా ప్రతిబింబిస్తుంది. మొదటి స్వరూపం దివ్యత్వం కలిగిన స్వరూపమైతే, రెండవది శృంగార రసాధిదేవత కాగా మూడవ స్వరూపం రతికేళీ విలాసానికి సంబంధించినది. రాధాకృష్ణుల పౌరాణిక నేపథ్యాలను హిందీ చలన చిత్రాలు పూర్తి స్థాయిలో వినియోగించుకోవటం జరిగింది. 1975లో విడుదలైన *గీత్‌గాతాచల్* లాంటి చిత్రాలైనా *బోల్ రాధాబోల్*, *ముకద్దర్ కా సికందర్*, లేక *దేవదాస్* లాంటి ఏ తరహాకు చెందిన చిత్రాల్లోనైనా రాధాకృష్ణుల ప్రణయగాథా నేపథ్యాలు ఉపయోగించుకోబడ్డాయి. అమ్మవారి మూడవ స్వరూపం 'సీతామాత' స్వరూపం. ఆమెకు భర్త చేతులలో అవమానపడవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆమె తన పవిత్రతను నిరూపించుకోవటానికి అగ్ని పరీక్షకు సహితం సిద్ధపడవలసి వస్తుంది. 1988లో ఎ. చంద్ర దర్శకత్వంలో విడుదలైన *తేజాబ్* 1986లో వచ్చిన 'బాసు భట్టాచార్య' యొక్క *పంచవటీ* శ్యామ్ బెనగల్ తీసిన *నిశాంత్* (1975) చిత్రాలలో నాయిక పాత్రలు సీతామాత స్వరూపానికి ఉత్కృష్టమైన ఉదాహరణలు.


ఐశ్వర్యారాయ్

వాస్తవానికి మనకు స్వాతంత్ర్యం లభించిన ఎన్నో దశాబ్దాల అనంతరం కూడా సామంతవాద మరియు సామ్రాజ్యవాద ఒత్తిడుల నుంచి విముక్తిని పొందలేక పోయింది. కొన్ని మినహాయింపులను వదిలితే మిగిలిన సందర్భాలలో హిందీ చిత్రాల తెరపై కనిపించే స్త్రీ ఉమ్మడి కుటుంబాలలో ఏర్పరచబడిన నిబంధనల చట్టంలో జీవిస్తూ, పితృస్వామ్యాన్ని యథాతథంగా అనుసరించేదిగా రూపొందించబడుతుంది. ఐతే దీనికి పూర్తిగా విరుద్ధమైనది ఆధునిక స్త్రీ యొక్క స్వరూపం. ఆధునిక స్త్రీ విద్రోహపూర్ణమైన మరియు మహత్వాకాంక్ష కలిగినదిగా వుంటుంది. ఆమెకు పితృస్వామ్య వ్యవస్థతో పూర్తి ప్రమాదం వుంటుంది. అందుకే 1948లో వచ్చిన *అందాజ్* లో వ్యంగ్యంగా ఆమెను, పాశ్చాత్య దుస్తులు ధరిస్తూ, సిగరెట్ త్రాగుతూ క్లబ్బులకు వెళ్ళి డాన్సులు చేస్తూ ఉచ్చస్వరంలో మాటాడే మరియు పురుషులతో వాగ్యుద్ధాలకు దిగుతూ కుట్రలు చేసేదిగా చిత్రీకరించబడింది. పితృస్వామ్యం స్త్రీలయొక్క స్వాతంత్ర్యానికి భంగం కలిగించే ఒక అడ్డంకి. తత్‌కారణంగానే, పితృస్వామ్యం స్వాతంత్ర్యాన్ని కోరుకునే స్త్రీని దండనకు అర్హురాలిగా భావిస్తుంది. స్వేచ్ఛగా జీవించాలనుకునే స్త్రీకి లభించే దండన బలాత్కారం.

ఈ దండనలో ప్రథమ సోపానం స్త్రీని వివస్త్రగా చేయటం. సెన్సార్‌బోర్డు ఇలాంటి దృశ్యాలను అతి సమీపం (క్లోజప్)లో చిత్రీకరించటానికి అనుమతించదన్న విషయం చలన చిత్రకారులకు విదితమే అవ్వటంతో, ఆ దృశ్యంలోని యవ్వనోత్తేజకతను స్థిరంగా వుంచటానికి కెమేరాను వివస్త్ర కాబడుతున్న స్త్రీని ఏమాత్రం సిగ్గులేకుండా చూస్తూవుండే ప్రేక్షకులవైపుకు కేంద్రీకరిస్తారు. తదనంతరం పరాభవానికి గురి ఐన స్త్రీ, తనకు ఆ స్థితిని కలిగించిన పురుషునిపై ప్రతీకారం తీర్చుకోవటానికి అతనిని అంతం చేయటంలో సఫలీకృతురాలవుతుంది. దుర్గామాతకు ప్రతీకగా రూపొందించబడిన ఈ స్త్రీ పాత్రకు తన ప్రతీకారం తీర్చుకునే క్రమంలో ఏ సంస్థయొక్క సహకారంకానీ, ఏ పోరాటంకానీ చేయవలసిన అవసరం ఉండదు. ఈ విధంగా అమ్మవారి స్వరూపాన్ని అడ్డంపెట్టుకుంటూ చలనచిత్రకారులు వక్రమార్గంలో యౌవనికతను ప్రదర్శింప చేయటంలో సఫలీకృతులవుతారు.

ఈ నేపథ్యంలోనే హిందీ చలనచిత్రం మరొక గొప్ప ప్రయోగం కూడా చేసింది. చిత్రాలలో దుశ్చరిత్ర కలిగిన స్త్రీ పాత్రను ప్రత్యేకంగా వ్యాంప్ పాత్ర రూపంలో తెరమీదకు తీసుకురావటం. అమ్మవారిలో లేని గుణాలన్నీ ఈ పాత్రలో వుంటాయి. దుశ్చరిత్రకల ఈ (వ్యాంప్) పాత్రధారిణి ఐన స్త్రీ హద్దులేని కామవికారాలకు చిహ్నం. ఈమె నైట్ క్లబ్బుల్లోను, మధుశాలలోను లేక నృత్య గృహాలలోను దర్శనమిస్తుంది. ఈవెు పాశ్చాత్య స్త్రీ మాదిరిగా చరిత్రహీనురాలు. పరాయి పురుషులతో నాట్యం చేయటానికి ఏమాత్రం సంకోచించదు. స్వాతంత్ర్యోత్తరకాలపు ఆరంభంలో వ్యాంప్ పాత్ర ఒక విదేశీ మహిళకు ప్రాతినిధ్యం

వహించేదిగా వుండేది. ఆమె నాట్యగృహాల సంస్కృతికి ప్రతినిధిగా వుండటంతో కేబరే దృశ్యాలలో ఆమెకు ముఖ్యపాత్ర వుంటుంది. ఈ విధంగా 50-60వ దశకాల వరకూ హిందీ సినిమా వ్యాంప్ లేదా కేబరే నృత్యం ద్వారా యౌవ్వనిక దృష్టిని ప్రోత్సహిస్తూ వచ్చింది.

1954లో విడుదలైన *శ్రీ 420*, *నౌదోగ్యారహ్* (1957) మరియు *ఆర్‌పార్* (1953) మొదలైన చిత్రాలు వ్యాంప్ మరియు ఆమె కపట వ్యవహారానికి ముఖ్య ఉదాహరణలు. 1970 వరకూ వచ్చాక వ్యాంప్ పాత్రల సృష్టి అర్థరహితమయ్యింది. ఇప్పుడు స్వయంగా కథానాయికే ప్రదర్శన వస్తువుగా మారింది. ఐతే నాయిక దేహ ప్రదర్శనను చేయటానికి ఒక సార్వజనిక స్థలం అన్వేషించబడింది. ఫలితంగా ఈ అవకాశాన్ని తీర్చుకోవటానికి కళాశాలల వార్షికోత్సవాలు, నాట్యస్పర్థలు, సంస్థాపనాదినోత్సవాలు మొదలైన సందర్భాలను సృష్టించటం జరుగుతుంది. 1998లో నిర్మించబడిన *దిల్‌తో పాగల్ హై* చిత్రం యొక్క పూర్తి కథాగమనంలో నాట్యప్రదర్శన ప్రధానాంశంగా ఉంటుంది. ఈ ప్రకారమైన నృత్య ప్రదర్శనలకు మరొక పరివర్తిత రూపం కూడా మనకు గోచరమవుతుంది. అదేమంటే కథానాయిక అపహరించబడటం మరియు ఆమె నాయకుణ్ణి రక్షించే నిమిత్తం విలన్ పాత్రధారికి ఆహ్లాదాన్ని కలిగించే ఉద్దేశ్యంతో నాట్యం చేయటానికి సంసిద్ధురాలవటం.

1967లో విడుదలైన *జ్యువల్ థీఫ్* 1972లో వచ్చిన *సీతా ఔర్ గీతా* మరియు 1971లో వచ్చిన *షోలే* చిత్రాలలో ఈ రకంగా నాయిక తప్పనిసరి పరిస్థితులలో తనని తాను బలిచేసుకుని నర్తించటం గోచరమవుతుంది.

హిందీ చిత్రాలలో చారిత్రక ప్రధానమైన చారిత్రాత్మక చిత్రాలకు, మహమ్మదీయ సామాజిక చిత్రాలుగా చెప్పబడే సామాజిక చిత్రాలకూ కూడా ఒక ప్రత్యేకమైన స్థాయి వుంది. అందుకు కారణం హిందీ చలనచిత్రకారులకు నవాబుల సభ్యత అనే పరదాపై మహలుల్లో నివసించే వేశ్యాస్త్రీల చరిత్రలను నిరూపించటానికి ఒక మహత్తర అవకాశం రావటమే. వేశ్యామహళ్ళ భౌగోళిక ప్రదేశం ఎలాంటిదంటే "అది గతించిన కాలానికి మిగిలిన చిహ్నం మరియు ఆధునికత అనే ప్రభావానికి ఏమాత్రం లోనుకాని అంధకారం బంధురం''. ఆ ప్రదేశం కావలసినంతమంది ముషాయిరాలు, తుమరీ మరియు గజల్ గాయిక ఆ మహలుల్లో ఉండే ఈ వేశ్యా స్త్రీలు సాధారణమైనవారుగా వుండరు. అత్యంత ప్రతిష్ఠాత్మకస్థానంలో వున్న ఉన్నత స్థితికల పురుషులు, సర్దార్‌లూ వారిని పోషిస్తూ వుంటారు. కాలక్రమేణా వీరి గౌరవం కూడా దిగజారిపోయింది. కానీ, వీరు, జీవితాన్ని వారి షరతుల పైన జీవించటం చేతనైనవారు. ఈ విధంగా వేశ్యామహళ్ళు మరియు వేశ్యల జీవిత గమనంపై ఆధారపడిన ముస్లిం సభ్యతాచిత్రాలు అత్యంత జనాదరణను పొందుతూ లోకప్రియ చిత్రాలుగా వెలుగొందినాయి. అందుకు కారణం ఆ ప్రదేశంలో నాట్యమాడే స్త్రీలు పురుషుల కామపూరిత దృష్టియొక్క అవసరాలను సంపూర్తిగా తీర్చటమే.

1993వ దశకంలో హిందీ చిత్రాలలో స్త్రీ పాత్రలు మరియు నర్తకీమణుల దేహ ప్రదర్శన నిమిత్తం ఐటమ్ గీతాల పరంపర ఆరంభమయింది. ఈ పరంపరకు చెందిన చిత్రాలు చిత్రపరిశ్రమ యొక్క వ్యాపార దక్షతకు ఊహాతీతంగా వృద్ధిని చేకూర్చాయి. గమనించ యోగ్యమైన విషయం ఏమంటే హిందీ చిత్రాలలో కథావస్తువు అదృశ్యమవుతూ చలనచిత్రాలు ఎంతగా నిరర్థకమవుతూ వస్తున్నాయో అంతగా స్త్రీ దేహాన్ని అశ్లీలంగా ప్రదర్శించటానికి బజారు యొక్క స్వీకారం లభిస్తూ వస్తోంది.

ముఖ్య చరిత్రలు చిత్ర కథలో భాగం కాకపోవటం, ద్వంద్వార్థాల ప్రయోగాలు, వ్యంగ్యపూర్ణమైన భావ భంగిమలకు ప్రాధాన్యత మరియు కెమేరాను వివిధ కోణాలలో త్రిప్పి అతి సన్నిహిత షాట్‌ల (క్లోజప్ షాట్) ద్వారా ప్రేక్షకుల యొక్క కామపూరిత వాసనలను జాగృతపరచటం ఈ ఐటమ్ గీతాల విశేషాలు. 1997లో విడుదలైన *ఖల్‌నాయక్ లో చోళీకే పీఛే క్యాహై* అనే ఐటం గీతం రూపొందించబడినప్పటినుంచీ, ఐటమ్ గీతాల ఆరంభం జరిగిందని కొంతమంది చిత్ర విశేషజ్ఞుల అభిప్రాయం. ఈ గీతంపై దేశ వ్యాప్తంగా మాధ్యమాలలో ఎన్నో ప్రతిస్పందనలు చోటుచేసుకున్నాయి. ఢిల్లీకి చెందిన ఒక వకీలు ఈ గీత ప్రదర్శనను నిషేధించాలని ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అంతేకాక ఈ గీతప్రదర్శన స్త్రీలకు తీరని అవమానం అని ప్రకటించారు. ఇదేవిధంగా ఫరీదాబాద్‌కు చెందిన వినీత్ కుమార్ కూడా స్థానీయ వినియోగదారుల ఫోరంలో ఈ గీతంపై నిషేధం

విధించాలని కోరారు. ఈ గీతం భారతీయ సంస్కృతి మరియు భారతీయ అంతరాత్మయొక్క నైతికత్వానికి విరుద్ధమని వినీత్ కుమార్ వాదించారు. ఖల్‌నాయక్ చిత్రం విజయం సాధించిన అనంతరం ఐటమ్ గీతాలు హిందీ సినిమా యొక్క ఒక విధానంగానూ మరియు హిందీ సినిమాలకు ఒక చిహ్నంగానూ పరిణమించాయి. *ఛమ్మాఛమ్మా* (1998), *మహబూబ్ మేరీ* (2000), *ధూమ్‌మచాలే* (2004), *ఖజురారే* (2005), *బీడీజలయికే, రేస్, ఖాకీ, అగ్నిపథ్* మొదలైన డజన్లకొద్దీ చిత్రాలు విడుదలైనాయి. వీటన్నింటిలోనూ ప్రేక్షకులను ఆహ్లాదపరచే నిమిత్తం ఐటమ్ గీతాలు ప్రయోగించబడ్డాయి. ఐతే ఈ ప్రయోగం ఇప్పుడు అపరిహార్యంగా పరిణమించింది. చలనచిత్ర పరిశ్రమ నెలకొన్న ఆరంభిక కాలంనుంచీ చలనచిత్రకారులను ఉద్వేగపరుస్తున్న ప్రశ్న స్త్రీని తెరపైన ఎలా ప్రదర్శించాలి అన్నదే. గత శతాబ్దకాలంగా చిత్రకారులు దీనికొరకై స్త్రీ యొక్క భిన్న భిన్న బింబాలను ప్రయోగించారు.

ఐతే వీరు రెండు విధాలైన ఒత్తిడుల కారణంగా, వారు విసిగిపోయినవారుగానూ నిస్సహాయులుగానూ మిగిలారు. మొదటిరకమైన ఒత్తిడి ఆర్థికపరమైనదికాగా, రెండవరకమైన ఒత్తిడి అనుభూతితో ముడిపడి వుంది. ఈ రెండు ఒత్తిడుల ప్రభావంతో చిత్ర దర్శకులు, మరియు నిర్మాతల ప్రధాన లక్ష్యం, స్త్రీ దేహాన్ని వీలైనంతగా ప్రదర్శించటంగా వుంటుంది. ఎందుకంటే కామాసక్తులైన పురుష ప్రేక్షకులకు ఆనందాన్ని కలిగించటమే దీనిలో ఇమిడివున్న ఉద్దేశ్యం. ప్రపంచీకరణ నేపథ్యంలో ఈ ఒత్తిడి చిత్రనిర్మాతలకు, దర్శకులకూ మరింతగా పెరుగుతూనే ఉంటుంది. కానీ చిత్రకారులకు ప్రతిబద్ధత కూడిన దర్శకుల యొక్క నైతిక చింతనపట్ల కూడా ధ్యాసపెట్టవలసి ఉంటుంది. అందుకనే వారు స్త్రీయొక్క మర్యాద మరియు గౌరవాన్ని నిర్లక్ష్యం చేయలేరు.

ప్రొఫెసర్ ఎమ్. వెంకటేశ్వర్
హైదరాబాదు.

---

# తెలుగు సాంఘిక సినిమాలో స్త్రీ :

*- అయ్యగారి సీతారత్నం*

సమాహార కళయైన సినిమా సమాచార ప్రసార మాధ్యమాలలో బలీయమైనది. సెల్‌ఫోన్ రింగ్‌టోన్ మొదలు రెడియో, టీవీ, కంప్యూటర్, థియేటర్స్‌ద్వారా బలీయంగా ప్రజలలోకి చొచ్చుకుపోయిన బలమైన ప్రచార సాధనం సినిమా. నిజం చెప్పాలంటే మధ్యతరగతి, దిగువ తరగతి వాళ్ళ దైనందిదిన జీవితంలో సినిమా భాగమైనది. పండుగలలో పర్వదినాలలో విజయానికి, అపజయానికి, నలుగురు కలిసినప్పుడు, విడిపోయినప్పుడు ప్రధానమైన కాలక్షేపంగా సినిమా చూడటం జరుగుతుంది.

తెలుగు సినిమా నిజానికి స్త్రీల జీవితం చుట్టూనే ఎక్కువగా తిరిగిందని చెప్పాలి. ముఖ్యంగా కుటుంబ జీవనానికి సంబంధించిన సమస్యలు ముందుగానే గుర్తించింది. కుటుంబపరంగా, సామాజికంగా స్త్రీకి సమస్యలున్నాయనేది అందరూ అంగీకరించే విషయమే. కానీ అవి ఎంతవరకు వాస్తవికంగా చిత్రించబడ్డాయి. వాటికి సినిమా ఇచ్చిన పరిష్కారాలలో ఎంత సహేతుకత ఉన్నది అనేదే ఆలోచించవలసిన విషయాలు.

సినిమా అనేది మామూలు ప్రపంచానికి ప్రతిబింబంగా పూర్తి వాస్తవికతతో వుండదనేది అందరికీ తెలిసిన విషయమే. కళగామాత్రం అంతా అంగీకరిస్తున్నా, అది కళకాదు. (***మిసిమి*** 2013 అక్టోబరు సంచికలో *నూరేళ్ళు నిండిన వెండితెర* చదవండి) సినిమా ప్రపంచం గురించి చెప్తూ కొడవటిగంటి కుటుంబరావు నిజజీవితానికి కళకూ మధ్య వుండే సజీవమైన సంబంధాలు ప్రధానంగా రెండు. ఒకటి వాస్తవికత. ఇది కళ యొక్క బాహ్యరూపానికి చెందినది. రెండోది జీవితసత్యం. ఇది కళ యొక్క అంతస్తుకు సంబంధించి ఉండేది.

సినిమా ప్రపంచానికి, వాస్తవ ప్రపంచానికి మధ్య ఈ రెండు రకాల సంబంధాలూ కనబడవు. సాధారణంగా మనం సినిమాలలో మధ్యతరగతి ఇళ్ళు చూడం. చూడటానికి బాగుంటాయిగానీ వాటిని మనం నిత్యజీవితంలో

భరించలేం. ఆ సోఫాలు, ఫర్నీచరు, బీరువాలు, ఆ కిటికీలు, తివాసీలు, దీపాలు వాటి షేడ్‌లు, మంచాలు, మెట్లు... ఇవన్నీ మామూలు వాళ్ళు నిభాయించలేరు'' అని అభిప్రాయపడ్డారు (కొడవటిగంటి కుటుంబరావు సినిమా వ్యాసాలు - 250లో).

అయితే ఎంత అవాస్తవికత చిత్రీకరణలో ఉన్నా, కథకుడు సామాజిక వ్యక్తి అవడంవలన సమకాలీన సమాజ చిత్రీకరణ కొంతైనా ఉండక తప్పదు. ఆ దృష్ట్యా చూస్తే సామాజిక సమస్యలు జీవనయానంలో ఉన్నవి తప్పక గుర్తించగలము. ఆ సమస్యల్ని ఏ దృక్కోణంలో చిత్రించారు. వీటికి పరిష్కారాలుగా చూపినవాటిలో వాస్తవికత, ఆచరణాత్మకత చర్చించుకోవలసిన అంశాలు.

తొలిదశలో తీసిన సాంఘిక సినిమాల్లో సంస్కరణ దృష్టి కనబడుతుంది. *గృహలక్ష్మి* సినిమా నుండి స్త్రీల సమస్య, భర్త తాగుడు, భర్త వేశ్యావ్యామోహం నిజానికి పురుషుడు పరస్త్రీ వ్యామోహంలో పడి జీవితాన్ని పాడుచేసుకోవడమనేది పురుషుడి సమస్య. కానీ కుటుంబ జీవితానికి పరిమితమయి, ఆర్థికంగా భర్తపై ఆధారపడిన స్త్రీకి జీవనం దుర్భరమయి ఆమెకి సమస్యగానే పరిణమిస్తుంది. దీనికి పరిష్కారంగా భార్య సహనంగా వేచి చూడడమే చిత్రించారు. స్వర్గసీమ చిత్రంలో వేరొక వూరు వెళ్ళి కుట్టుమిషన్ మీద సంపాదించి బిడ్డను చదివిస్తుంటుంది. భర్త వేశ్య స్వార్థం గుర్తించి ఆమెచే గెంటివేయబడి తిరిగి భార్య దగ్గరకి వస్తే ఆమె క్షమించి భర్తతో కలిసి ఉంటుంది.


కాంచనమాల

ఈ స్థితి మరో దశాబ్దం నాటికి మారిందనే చెప్పాలి. పురుషుడికి ఇతర స్త్రీ పట్ల ప్రేమ ఉన్నా భరింపలేని స్థితి, అనుమానించే దశ కనిపిస్తుంది. భర్తకి ఇతర స్త్రీతో పెళ్ళయిందనిగానీ, సంబంధం ఉందనిగానీ తెలిస్తే, చట్టరీత్యా పోరాటానికి సిద్ధపడటం కనిపిస్తుంది. *గోరింటాకు* సినిమాలో స్వప్న, భర్తకి ముందే పెళ్ళి అయిందని తెలిసి, తాళిబొట్టు తీసి మొహాన పారేసి, ముందు పెళ్ళి చేసుకున్న స్త్రీకి న్యాయం జరిగేటట్టు చేస్తుంది. అదే సినిమాలో ముందు తరమైన సావిత్రి విద్యారహితురాలు. ఆమె భర్త తాగుబోతు. వేరొక స్త్రీతో ఉన్నవాడు. తన ఆడపిల్లని చంపినవాడు అయినప్పటికీ పసుపుకుంకాల కోసమన్నట్టుగా అతనిని ఆదరిస్తుంది. కానీ స్త్రీలు చైతన్యవంతులయి భర్త దౌష్ట్యాన్ని ఇక భరింపరు అన్నట్టుగా భర్త, వివాహం లేకపోయినా కుమారిగా ఉండటం అంతకన్నా సుఖమైన పరిష్కారంగానూ స్వప్న జీవితం ద్వారా చూపారు. భార్యాభర్తలు పెళ్ళి అయ్యేక సర్దుకోకుండా విడిపోతే పిల్లలు తల్లి ప్రేమనో, తండ్రి ప్రేమనో కోల్పోతారని సర్దుబాటు ధోరణిని పరిష్కారంగా చూపారు. ఉదాహరణకి ఆలుమగలు.

*కొంచెం ఇష్టం కొంచెం కష్టం* సినిమాలో భర్తలు అనవసర పంతాలకి, అహంకారాలకీ పోకుండా క్షమాపణ అడగగలిగే సహృదయాన్ని చూపించి మానసిక అంతరాలు పోగొట్టుకోవాలని సూచించారు.

సాంఘిక సినిమాల్లో ఎక్కువ వివాహ వ్యవస్థ సంబంధితాలే. తొలిదశ సినిమాల్లో 'వైధవ్యం' అనేది స్త్రీ సమస్యగా కనిపిస్తోంది. వైధవ్యం వలన అసంతృప్తి, లైంగిక అణచివేత కనిపిస్తుంది. దీనికి పరిష్కారం మళ్ళీ పెళ్ళి చూపించారు. అయితే వైధవ్యం వలన అసంతృప్తి నుండి గయ్యాళితనం మనుషులతో సర్దుకోలేకపోవడం, మానవ సంబంధాలలో అశాంతిని కలుగజేయటం కనిపిస్తుంది. *గుండమ్మకథ*లో గుండమ్మ, *అందాల రాముడు*లో విధవ, స్త్రీలలో గయ్యాళితనం, వెనుకబడినతనం వలన పెత్తనం కావాలనుకునే స్వభావం కూడా చిత్రించారు. *దసరాబుల్లోడు* లో సూర్యకాంతం, ఇలాంటి పాత్రలకి పరిష్కారంగా భర్త భార్యని గొడ్డుని బాదినట్టు బాదడమే అని చూపారు. ఇది విచారకరమే. భార్యలని హింసించటం దానితో మారిపోయినట్టు చూపడం ఆరోగ్యదాయకమైన పరిష్కారం కాదనే చెప్పాలి. మొట్టమొదటి నుండీ ఆమె ప్రవర్తనని వ్యతిరేకించకుండా పరిస్థితి చేయి దాటాక ఆమెను కొట్టి మొదటి నుండీ స్త్రీలని కొట్టి దారిలో పెట్టాలన్నట్టు చూపడం సరియైనది కాదు.

*దేవత, మళ్ళీ పెళ్ళి* లో విధవ వివాహాలు పరిష్కారంగా చూపించారు. బాల్యవివాహాలు తగ్గడం వలనేమో నేడు విధవల చిత్రణ తగ్గిందనే చెప్పాలి. అయితే ఈ విధవ

నమూనాలని సమాజం నుండి తొలగిపోవాలన్నట్టుగా భర్త పోయిన విజయలక్ష్మిని బొట్టుతో చూపించడం *తోడు* సినిమాలో కనిపిస్తుంది. స్త్రీ పురుషుల సంబంధంపై ఉన్న సామాజిక నిఘాని వదుల్చుకుంటే అస్థిత్వ రాహిత్యానికి గురికాకుండా ఉంటే ఎంతటి మానవీయ సంబంధ మాధుర్యాన్ని పొందగలరో తెలియజెప్పి ఇంటి చాకిరీకోసం ఎక్కువమంది పురుషులు పెళ్ళి చేసుకుంటారనే నిజాన్ని చాలా సున్నితంగా చెప్పి దానికి అతీతమైన మానవ సంబంధాలని అందిపుచ్చుకోవాలని తెలిపిన మంచి సినిమా *తోడు.*

స్త్రీ శీలం పట్ల అనుమానం కూడా స్త్రీలకి పెద్ద సమస్యే. చలం *దోషగుణం* కథే *గ్రహణం* సినిమాగా తీసారు. ఈ సినిమాలో ఎంత మంచి వ్యక్తిత్వం ఉన్నా ఎంత మానవత్వం ఉన్నా స్త్రీలపట్ల లైంగికత పట్ల సమాజం కుటుంబం ఎంత అజ్ఞానంగా, అమానుషంగా వర్తించగలదో ఎంత కంట్రోలు చేయగలదో స్పష్టంగా బయటపెట్టిన సినిమా. ఇందులో మానవీయమూర్తియైన శారదాంబకి చిన్నవాడైన వారాల అబ్బాయితో అక్రమ సంబంధం అంటగట్టి ఒంటరిదాన్ని చేస్తారు. పురుషుడికి అవసరములేని శీలం, స్త్రీకి విధాయకం చేసి ఆ శీలంపై లేనిపోని నిందలు వేసి ఆమె జీవితాన్ని ఛిద్రం చేసిన పితృస్వామ్య వ్యవస్థ భావజాలం అజ్ఞానంపై రోత కలిగించి స్త్రీలపట్ల వారు ఎదుర్కొనే సమస్యలపట్ల మనసుని సున్నితపరచి స్త్రీలని ఆమె లైంగికతని చూపే దృక్కోణంలోనే ఈ వ్యవస్థకి దోషగుణం వుందని తెలిపిన సినిమా. స్త్రీ చదువు సంధ్యలో సంగీత సాహిత్య అభిరుచులలో స్నేహశీలిగా ఇతర పురుషులతో వుంటే చూడలేనితనంతో ఇతరులు ఆమెపట్ల నిందవేసినా భార్యకన్నా ఇతరుల భావనకే విలువనిచ్చి ఆమెని అనుమానించి మానసికంగా హింసించడం కనిపిస్తుంది. ఉదాహరణకి *డాక్టర్‌చక్రవర్తి* తన భార్య, సంగీత సాహిత్యాభిరుచికి, ప్రవర్తనకి ఎంతగానో మురిసిపోయి, స్నేహితుడిని తానే పరిచయంచేసి, తానే ఆమెని జాగ్రత్తగా చూడమని అప్పజెప్పి, తానే మళ్ళీ అతనితో అక్రమ సంబంధం కలిగి వుందని నిందించి ఇంట్లో నుంచి గెంటేస్తాడు. చివరికి నా చెల్లి ఇలాగే ఉండేదన్నాక అంతా సుఖసంతోషాలతో ఉంటారు. స్త్రీ పురుషుల మధ్య చెల్లి సంబంధం కాకుండా స్నేహంగా ఉండడం అనేది తెలియదు. తర్వాత తర్వాత స్నేహభావం సినిమాల్లో పెంపొందిందనే చెప్పాలి. 2003 సంవత్సరంలో వచ్చిన *వసంతం* సినిమాలో ఇది తెలుస్తుంది. వెంకటేష్ స్నేహితురాలు కళ్యాణి. తండ్రి పోయి ఒంటరిదయిన ఆమెని ఇంటికి తీసుకువస్తాడు. క్రిస్టియన్ అమ్మాయి అయినా పెళ్లి చేసుకోమంటే అతను కేవలం స్నేహితురాలు అని చెప్తాడు. అతనిని పెళ్ళి చేసుకున్న ఆర్తి అగర్వాల్ కూడా మనసులో అనుమానం లేకుండా నెమ్మదిగా అర్థం చేసుకోవటం కనిపిస్తుంది. స్త్రీ పురుషుల మధ్య లైంగిక బంధం తప్ప మరొకటి ఊహించలేని సమాజాన్ని లక్ష్యపెట్టకపోవటమే పరిష్కారంగా చూపారు. స్త్రీ పురుష సంబంధాన్ని మొదట లైంగిక సంబంధంగా అనుమానించడం తర్వాత అన్నాచెల్లెళ్ళ అనుబంధంగా తర్వాత స్నేహ సంబంధంగా ఆమోదించడం స్పష్టమవుతుంది.


శ్రీరంజని

అత్యాచారం అనే సమస్య చాలా బలీయంగా చిత్రించారు. అత్యాచారం జరిగితే, జీవితాన్ని అంతం చేసుకోవడం పరిష్కారంగా *నిమజ్జనం* లాంటి సినిమాల్లో అక్కడక్కడా చూపించినా అత్యాచారాన్ని వ్యతిరేకించి 70వ దశకం నాటికి స్త్రీని అత్యాచారం చేసినా పురుషునితో ఒకరోజు వున్నట్టుగా శీలం కోల్పోయినదిగా చేస్తే ఆ స్త్రీపై పూర్తి ఆధిపత్యం వచ్చినట్టుగా పురుషుడు భావించినట్టు చిత్రించారు. *విచిత్రబంధం* సినిమాలో హీరోయే అత్యాచారం చేస్తాడు. తర్వాత ఆమెనే పెళ్ళి చేసుకొని ఆమె బిడ్డకి తండ్రినని ఒప్పుకుంటాడు. తర్వాత ఈ ధోరణి మారింది. *పెళ్ళి చేసుకుందాం* అనే సినిమాలో అత్యాచారం జరిగిన తర్వాత కూడా మానసికంగా తమ ప్రమేయం లేకపోయినా తప్పుచేశామని, పెళ్ళికి పనికిరామనే భావంలో స్త్రీలు ఉండకూడదని, శీలం చుట్టూ ఉండే పితృస్వామ్య భావజాలంలో భ్రమని పోగొట్టటం కనిపిస్తుంది. అత్యాచారం చేసినవాడిని శిక్షించాలే తప్ప అత్యాచారం చేయబడిన స్త్రీని సమాజం శిక్షించకూడదని తెలుస్తుంది.

వివాహేతర పునరుత్పత్తి స్త్రీలకి పెద్ద సమస్య. *బంగారు కలలు* సినిమాలో తల్లినని చెప్పకుండా ఆంటీనని చెప్పుకొని బిడ్డని పెంచుతుంది. ఆమె బిడ్డ ఉమ భవిష్యత్తు అని ఆమెని కట్టడి చేస్తాడు ఆమె అన్న. *విచిత్రబంధం* లో కూడా బిడ్డని తల్లికి చూపకుండానే బిడ్డ చనిపోయిందని చెప్పి చర్చిలో అనాథగా పెంచుతారు. చిన్ననాటి స్నేహితులలో అమ్మాయి గర్భవతియైందని ఎవ్వరికీ తెలియనివ్వకుండా బిడ్డని స్నేహితుడు పెంచుతాడు. పెళ్ళికాని తల్లి బిడ్డని కనడం అనేదాన్ని సామాజికామోదం పొందకపోవడం తెలుస్తుంది. *శంకరాభరణం*లో మాత్రం అత్యాచారం వలన గర్భవతియైన ఆ బిడ్డని తన కలలకి సాకారంగా తీర్చిదిద్దుతుంది తన తల్లి. అయితే వేశ్యాకుటుంబంలోని స్త్రీ అవడంవల్ల సామాజికామోదాన్ని ఆశించలేదు.

గృహహింస సినిమాలే మొదట గుర్తించాయని చెప్పవచ్చు. తాగి కొట్టటం అనేది చాలా సినిమాల్లో కనిపిస్తుంది. *గృహలక్ష్మి* సినిమా నుండి తాగుడు కుటుంబ జీవనానికి అవరోధకంగానే చిత్రీకరించారు. *ఆకలిరాజ్యం* సినిమాలో శ్రీదేవి తండ్రి పచ్చి తాగుబోతు. కూతురి సంపాదనని దోపిడీ చేస్తుంటాడు. అతనివలన సామాజికంగా గొడవలు కూడా ఎదుర్కొంటుంది. అయితే 90వ దశకం తర్వాత తాగుడువలన కష్టాలు ఉన్నా అదొక ఫ్యాషన్‌గా, అనివార్యమైనదిగా చిత్రించటం కనిపిస్తుంది. స్త్రీలు తాగకూడదను కొంటారుకానీ అది పురుషులు పట్టించుకోనక్కరలేదన్నట్టుగా చిత్రించారు. కాస్త హాస్యంగా *నువ్వు నాకు నచ్చావ్* సినిమాలో ప్రకాష్‌రాజ్ స్నేహితుడు వచ్చాడని పొద్దున్నే తాగడానికి సిద్ధపడితే భార్య ముద్దుగా విసుక్కొంటుంది. పెళ్ళికి ముందే నీకు చెప్పానని అంటే ''అందరి అమ్మాలలాగా నేనూ మాన్పించేయ గలననుకొన్నా''నంటుంది. *వసంతం* సినిమాలో స్నేహితురాలు తాగడానికి 1000 రూపాయలు ఇస్తుంది. *బాయ్స్* సినిమాల్లో తనతో సమానంగా ఉన్న మగపిల్లలు తాగితే పెద్దగా పట్టించుకోదు. వేశ్య దగ్గరికి వెళ్ళారని తెలియగానే ప్రేమించిన వ్యక్తిని వదిలేయడానికి సిద్ధపడుతుంది తప్ప తాగుడుని పెద్దగా వ్యతిరేకించదు.


అంజలీదేవి

*ఆడవాళ్ళ మాటలకి అర్థాలే వేరులే* సినిమాలో బాధని తట్టుకొందుకిగానూ తండ్రీకొడుకూ కలిసి తాగుతారు. 'పోకిరి' సినిమాలో హీరో బాటిల్ పట్టుకొని తాగడం హీరోయిజమ్ లాగా చిత్రించారు. *కల్లుమానండోయ్ కళ్ళు తెరవండోయ్* అనే స్థితినుండి *ఒక ఫుల్ కొట్టాలి* అనే పరిస్థితికి వచ్చింది. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ సరళీకృత ఆర్థిక విధానాల లక్ష్యం వస్తువినిమయానికి మార్కెట్‌ను విస్తృతం చేయడం. కాబట్టి దానికి అనుకూలమైన సంస్కృతిని ప్రచారం చేయడం స్థిరపరచటం, బలోపేతం చేయటం జరుగుతుంది. ఈ తాగుడు సంస్కృతీ ప్రచారం సినిమాల ద్వారానే జరుగు తుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో మంచిచెడ్డలు రెండూ వినిమయ మవుతాయి. పాశ్చాత్య సంస్కృతిలో భాగమైన తాగుడుని వారికి అనుకూలంగా ప్రచారం చేసి స్థిరపరచి బలోపేతం చేయడంలో భాగమే సినిమాల్లో తాగుడిని తప్పు లేదన్నట్టుగా చిత్రీకరించటం. ఆధునికత, పబ్ సంస్కృతి పేరుతో స్త్రీలకి కూడా తాగుడిని అలవాటు చేసే దిశలో దానికి అనుకూలమైన సంస్కృతీ ప్రచారంలో భాగమే తాగుడిని గ్లోరిఫై చేయడం.

స్త్రీలకి చుట్టుపక్కలవాళ్ళు గాసిప్స్ ప్రచారం చెయ్యటం ఒక సమస్యగానే చెప్పాలి. *కలెక్టర్ జానకి*లో జానకి బిడ్డని పెంచుకుంటూ కలెక్టర్ హోదాలో సామాజికంగా సుఖంగా ఉన్న మనిషి కేవలం నాగభూషణం మొదలెట్టిన ప్రచారం ఆమె జీవితాన్ని నాశనం చేసింది. స్త్రీలు ఉద్యోగంలోకి వచ్చిన కొత్తల్లో ఈ దుష్ప్రచారాల వలన చాలా హింసింపబడ్డారు. తర్వాత వచ్చిన సినిమాల్లో ఈ గాసిప్స్ ప్రభావం కనిపించదు. పెళ్ళికి ముందున్న సంబంధాల గురించి పట్టించుకోకపోవటమే కనిపిస్తుంది. *నువ్వు నాకు నచ్చావ్* సినిమాలో పెళ్ళికొడుకు తోనే అతను చేసుకోబోయే ఆశ తనని ప్రేమించిందని చెప్పినా చాలా తేలికగా తీసుకొంటాడు. గాసిప్స్‌ని లెక్క చేయకపోవడమే పరిష్కారంగా తెలిపారు.

పెళ్ళి, పెళ్ళిచూపుల సమస్య చాలా సినిమాల్లో చిత్రీకరించారు. *పెళ్ళి చేసి చూడు* సినిమాలో హాస్యం పాలు ఎక్కువైనా పెళ్ళిలోని కష్టాన్ని చూపించారు. పెళ్ళికి కట్నం

బాధ, కట్నకానుకలు చాలలేదని అత్తింటివారి హింస బలీయంగా చిత్రించారు. దీనికి పరిష్కారంగా వరకట్నాన్ని ఆడపిల్లలే వ్యతిరేకించాలని తమ అస్తిత్వాన్ని తామే నిలబెట్టుకోవాలని పెద్దలమీద ఆధారపడకుండా తామే పెళ్ళి చేసుకోవాలని *శుభలేఖ* మొదలగు సినిమాల్లో చూపించారు. పెళ్ళి సమస్యకి ప్రేమని పరిష్కారంగా సినిమాలు చూపాయనేది అక్షరసత్యం. కొన్ని సినిమాల్లో *రాధాకళ్యాణం* వంటి వాటిలో ప్రేమకంటే పెళ్లి ఉన్నతమైనది చెబితే *సప్తపది*లో ప్రేమకి పెళ్లికంటే విలువ నివ్వడం కనిపిస్తుంది. పెద్దలని ఎదిరించి కులభేదాలని, వర్గభేదాలని ఎంచక, యుద్ధం చేసి అయినా పెళ్లి సమస్యలకి పరిష్కారంగా ఎక్కువ సినిమాలలో చూపించారు. పెద్దలని ఒప్పించి పెళ్లి చేసుకోవటం *ఆకాశమంత, పరుగు, కొంచెం ఇష్టం కొంచెం కష్టం* మొదలగు సినిమాలలో చూపించారు. వివాహ వ్యవస్థలో మరో పెద్ద సమస్య బహుభార్యాత్వం. చట్టం నిషేధించినా, సినిమాలలో మాత్రం సమర్థించటం, మరీ ముఖ్యంగా శోభన్‌బాబు సినిమాలలో 70వ దశకంలో చాలా ఎక్కువ. 2010లో *బృందావనం* సినిమాలో ఇలా చూపటం విచారకరమే. ఇద్దరు భార్యలను కోరిన సినిమాలో మాత్రం నాయిక కూడా ఇద్దరు భర్తలను కోరినట్టుగా నటించి, అందులో ఇబ్బందిని బయటపెట్టి బుద్ధిచెప్తుంది.



భానుమతి

*ఆమె, పెళ్లి, స్నేహితులు* మొదలైన సినిమాలలో పెళ్లి అయిన స్త్రీల కష్టాల్ని బీభత్సంగా చూపించి తాళి నుంచి విముక్తవటమే పరిష్కారంగా చూపారు. ప్రేమలో మోసాల వలన కూడా మళ్లీ స్త్రీలు ఇబ్బంది పడటం కనిపిస్తోంది. మోసాన్ని, అణచివేతని గుర్తించగానే బాధపడి క్రుంగి పోకుండా నిలబడాలని బోధించే *నేనున్నాను, ఆనంద్* లాంటి సినిమాలు చెప్తున్నాయి.

ఇంటిచాకిరీ, పిల్లల పెంపకంలో ఒంటరిగా స్త్రీ బాధపడే వైనాన్ని బలీయంగా బైటపెట్టారు. *ఇంటింటి రామాయణం, మిస్టర్ పెళ్ళాం, సీతాపతి సంసారం, పెళ్లాం చెబితే వినాలి* మొదలగు సినిమాల్లో స్త్రీల పనిని పురుషులతో చేయించి అందులోని కష్టాన్ని అర్థం చేసుకొన్నట్టుగా చూపుతారు. ఇంటిచాకిరీని 1980ల దాకా గృహిణీత్వాన్ని చాలా గ్లోరిఫై చేసి చూపించి తద్వారా స్త్రీల పై కుటుంబం ఎంత ఆధారపడి ఉందో చూపారు. ఉద్యోగినిగా స్త్రీ, ఇంటా బయటా కష్టపడుతున్న వైనం భర్త ఇంటిపనిలో భాగస్వామ్యం తీసుకోవలసిన అవసరం చిత్రీకరించారు.

స్త్రీలకి కళాభిరుచికి ప్రోత్సాహం లేకపోవటం కనిపిస్తుంది. *శంకరా భరణం*లో నిర్మల, సంగీతం పట్ల తనకుండే ఇష్టం "శంకరశాస్త్రి పాట వినాలని తహతహలాడి పోయేదాన్ని. కానీ మా ఆయన ఎక్కడికీ పంపేవారుకాద"ని చెప్పడంలో తెలుస్తుంది. అయితే చాలా సినిమాల్లో స్త్రీల కళాభిరుచిని ప్రోత్సహించే పరిస్థితులు ఉన్నట్టుగానే చిత్రించారు.

అనుబంధాలలో అసమానత, మొరటుతనం కూడా స్త్రీలు ఎదుర్కొనే సమస్యే. స్త్రీ పురుష సంబంధాలలో పురుషాధిపత్యం కొత్త సినిమాలలో విమర్శకి లోనవుతుంది. *పెళ్లయిన కొత్తలో* సినిమాలో చాలా చక్కగా స్త్రీలని తక్కువగా చూడటాన్ని ఆధిపత్యాన్ని కోరడంలోనూ ఉన్న డొల్లతనాన్ని బయటపెట్టారు. అత్తా కోడళ్ళ మధ్య మొరటు తనం అవగాహనా రాహిత్యం కొత్త సినిమాల్లో తగ్గిందనే చెప్పాలి. *పెళ్లి* సినిమాలో శాడిస్ట్ కొడుకుని వదలి కోడలితోనే కలిసి ఉండి, ఆమెని ఎంతో ప్రేమగా చూస్తుంది. కోడలుని రక్షించడానికి కొడుకుని హత్యచేసి, స్త్రీల ఐక్యతని చాటుతుంది. ఆడపిల్లలపై అన్నదమ్ముల పెత్తనం కూడా ఒక సమస్యే. కానీ నేడు ప్రేమతో చేసిన పెత్తనం కూడా ఆడపిల్లలు భరింపలేరని, లైంగికత రక్షణ పేరుతో చేసే అదుపుని ఎదుర్కొంటారని *హిట్లర్* సినిమాద్వారా తెలుస్తుంది. *బొమ్మరిల్లు, 100% లవ్, యువకుడు* మొదలైన సినిమాల్లో వాత్సల్యపూరిత పితృస్వామ్యం వలన అణచివేత, ఆధిపత్య ధోరణి కూడా స్త్రీలకి ఇబ్బందిదాయకమేనని చాలా సున్నితంగా, సూటిగా తెలియజెప్పి ఆ ధోరణిని మార్చుకోక తప్పదని పురుషులకి సూచించారు. ఫ్యాక్షనిజం పెరగడం, దానివలన పురుషుల కక్ష కార్పణ్యాలతో స్త్రీలు అనుబంధాలు

సున్నితత్వాన్ని పోగొట్టుకొంటున్నారు. స్త్రీలు కూడా ఫ్యాక్షనిస్ట్‌గా కనిపిస్తారు. *నరసింహ* సినిమాలో ఇది స్పష్టమవుతుంది. ఫ్యాక్షనిజానికి పరిష్కారంగా అవగాహన, చైతన్యం పెంచుకోవాలన్నట్టుగా చిత్రీకరించారు.

లైంగిక వేధింపులకు స్త్రీలు గురవడం చాలా సినిమాల్లో చిత్రీక రించారు. *మేడమ్, సత్యభామ* సినిమాల్లో స్త్రీ వేషధారిగా ఉండి మానసికంగా స్త్రీత్వం లేని వాడైనప్పటికీ విపరీతమైన లైంగిక వేధింపులకి గురై ఎంతో చికాకుకి గురవడం తెలుస్తుంది. అలాగే *ఆడవాళ్ళే అలిగితే* సినిమాలో లైంగిక వేధింపులకి గురిచేస్తున్న మేనేజర్‌ని బంధించి, తామే ఆఫీస్ మొత్తం వ్యవహారాలని స్త్రీలు సంఘటితంగా చూసుకొంటారు. స్త్రీ లైంగిక వేధింపులకి గురై తమలో తాము ముడుచుకుపోయే స్థితి నుండి వాటిని నిర్భయంగా బయటపెట్టి ఎదుర్కొనే స్థితికి వచ్చారని తెలుస్తుంది. స్త్రీల సమస్యల్ని నిజాయితీగానే చిత్రీకరించినా, పరిష్కార మార్గాలలో కొంత కాల్పనికత కనిపించినా మంచి దిశానిర్దేశం ఉందనే చెప్పాలి.


సావిత్రి

సినిమా చరిత్ర ప్రారంభమయిన రెండు మూడు దశకాలు సంఘసంస్కరణ, సామ్యవాద దృష్టి కనిపిస్తుంది. అటుపిమ్మట ఎక్కువ సినిమాలు ప్రేమే ఇతివృత్తంగా కొనసాగుతాయి. మిస్సమ్మలాంటి సినిమాలో బాధ్యత నుండి ప్రేమ పుడితే తర్వాత ప్రేమే ప్రధానంగా, ప్రేమ వలనే ఏర్పడిన సామాజిక దృష్టి కనిపిస్తుంది.

నేడు సినిమా యువతీ యువకుల ప్రేమమయ రంగుల కలగానే భాసిస్తోంది. సినిమాల్లో టీనేజ్ లవ్‌ని ప్రోత్సహించటం కనిపిస్తుంది. దీని ప్రభావం సమాజంపై ఖచ్చితంగా ఉంది. పెద్దల్ని ఎదిరించి పెళ్లి చేసుకోవాలనే భావన పెద్దలనుమతి అవసరం లేదనుకోవటం కనిపిస్తుంది. విద్యార్థులుగా ఉన్నప్పుడే ప్రేమించుకోవటం, కులవివక్ష తగ్గి కులాంతర వివాహాల్ని చేసుకోవటం గుర్తించగలం. విద్యార్థి దశలోని ప్రేమ వలన వారికి రావలిసిన స్థాయి రాకపోవడం కూడా గమనించగలం. సినిమాలోలాగా ఇబ్బందులు పడిన ప్రేమికులు ఆకస్మికంగా ఉన్నతులుగా వృత్తిలోనూ, ధనంలోనూ కూడా మారడం కనిపించదు. ఈ ప్రేమ అనేది నిరక్షరాస్యులలో కూడా ఎక్కువయిపోయి చిన్న వయసు పెళ్లిళ్లకి, ఇబ్బందులకీ కూడా కారణమవుతోంది. ఈ స్త్రీ పురుష ఆకర్షణలో ఆడపిల్లలు ఇబ్బందులకి గురవడం, మోసపోవడం కూడా జరుగుతోంది. లైంగికపరమైన వ్యాధుల బారిన కూడా పడుతున్నాయి. సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, ఆరోగ్య అవగాహన లేకుండా ప్రేమలో పడడమనేది సినిమా దుష్ప్రభావంగానే చెప్పాలి. ఈ ప్రేమ ఎంతగా అమ్మాయిలని ఇబ్బంది పెడుతుందో దినపత్రిక తిరగేసిన ప్రతి ఒక్కరికీ తెలుస్తుంది. ప్రేమించలేదని కత్తితో పొడిచిన మనోహర్‌లు, ప్రేమించలేదని యాసిడ్ ముఖాన పోసేవారు ఉన్మాదులైనవారు, ఆత్మహత్యా ప్రయత్నం చేస్తామని బెదిరించేవారు రోజురోజుకీ ఎక్కువ వుతున్నారనిపిస్తోంది. ఈ అవాంఛనీయమయిన ప్రేమని ఇంతలా యువతీ యువకుల్ని రెచ్చగొట్టేవిధంగా చూపించటం, చిన్నతనంలోనే ప్రేమ పుట్టినట్టు చిత్రించటం, సామాజిక అనారోగ్యానికి కారణమనే చెప్పాలి. సినిమాల్లో ప్రేమ పేరుతో బాల్యవివాహాలకి దారితీస్తున్నాయి.

ప్రేమ ముసుగులో స్త్రీలపట్ల ఆకర్షణ పెంచుతున్నారు. స్త్రీల వస్త్రధారణ చూపే యుగళగీత నృత్యాలు, గీతాలుకూడా యువతీయువకుల్ని రెచ్చగొడ్తున్నాయనడంలో అతిశయోక్తి లేదు. ఏ సినిమాలోనైనా ఒకప్పుడు, వేశ్య తర్వాత వేంప్ పాత్ర వలన మాత్రమే ఈ విధమైన శృంగార ధోరణిని రెచ్చగొట్టటం కనిపించేది. నేడు 1985 తర్వాత వేంప్ పాత్ర ప్రత్యేకం కనిపించదు. వేంప్, వేశ్య పాత్రలు సామాజికామోదం, గౌరవం లేనివి అవడం వలన కొంత మానసికంగానైనా శృంగార ధోరణి తప్పనిపించే అవకాశం ఉంది. కానీ నేడు నాయిక పాత్ర వస్త్రధోరణి, యుగళగీతాల చిత్రీకరణ, ముద్దుపై నిషేధం ఎత్తివేయటం, మొదలయిన వాటి వలన శృంగార ధోరణి సామాజికామోదం, గౌరవం పొందినదిగా యువత మనసుకి తోస్తుంది. అంతేగాక ఎంతో మానసిక ఒత్తిడితో చాలామంది నిగ్రహాన్ని ప్రదర్శిస్తే కొంతమంది ప్రేమ పేరుతోనో, కవ్వించి

అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తించటం కనిపిస్తోంది. అన్ని జీవులలోవలె. మనిషిలోకూడా ఆహార, మైథునాలు అతి సహజమైనవి. అంతేగాక మిగిలిన జీవులకన్నా కొంత ప్రత్యేకమైనవి. జంతువులలో శృంగారానికి కాలం సీజన్ నిర్దేశం ప్రకృతి సిద్ధంగా ఉంటుంది. కానీ మానవులలో బుద్ధిచేత మాత్రమే నియంత్రించబడుతుంది. మరి అటువంటి బుద్ధిని మార్చగలిగే శక్తి ఉన్న ప్రసార మాధ్యమంగా సినిమాలు ఇలాంటి శృంగారాన్ని అతిగా చూపించటం ఆరోగ్యదాయకం కాదనే చెప్పాలి. అంతేగాక స్త్రీలపట్ల దృక్కోణం మారే ప్రమాదం ఉంది. స్త్రీ అనగానే ఒక లైంగిక పరికరంగా చూసే దృష్టే తప్ప వ్యక్తిగా గౌరవించలేని దుస్థితిలోకి వ్యక్తులు నెట్టివేయబడుతున్నారు.

ఏ భావాల్ని సినిమా ప్రచారం చేసినా స్త్రీల చిత్రీకరణబట్టీ స్త్రీని వినిమయ వస్తువుగా మార్కెట్ చేస్తున్నారనేది అక్షరసత్యం.


జమున

విధవల కష్టాల్ని, వేశ్యల ప్రవృత్తిని పురుషుని బలహీనతల్ని, పేదల జీవనాన్ని జనావళికి చూపడంలో సినిమా విజయం సాధించింది. అత్యాచారంపట్ల స్త్రీ పురుష సంబంధాలో సమాజ దృక్కోణాన్ని మార్చడమేగాక స్త్రీ పురుషులిరువురూ సమానమనే భావాన్ని ప్రచారం చేసింది. వ్యక్తిగతాభిరుచుల్ని నిలబెట్టుకోవాలనే బోధించింది. ఒకప్పుడు పిల్లల ప్రేమలకి వ్యతిరేకించిన పెద్దలు కనిపిస్తారు సినిమాల్లో. కానీ నేడు పిల్లల ప్రేమని స్నేహపూర్వకంగా అర్థం చేసుకొని ప్రోత్సహించే తల్లిదండ్రులు వారి నిర్ణయాన్ని కాదనని పెద్దల పాత్రల ప్రభావం సమాజంపై కనిపిస్తుంది. *నిమజ్జనం* సినిమాలో అత్యాచారానికి పరిష్కారంగా ఆత్మహత్య చేసుకొంటే, *ప్రతిఘటన* సినిమాలో చంపడమే పరిష్కారంగా చూపిస్తే, *స్వర్ణక్కలో* ఆత్మవిశ్వాసం తమని తాము రక్షించుకొనే విధానాన్ని నేర్పడం ద్వారా సినిమా స్త్రీలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించింది. గాసిప్స్ పట్టించుకోకపోవటం, వాటికి విలువ లేకపోవటం కనిపిస్తుంది. అసలు స్త్రీల లైంగికతే ఒక గోప్య విషయంగా ఉన్న సమాజంలో, లైంగిక వేధింపులు మౌనంగా భరించడమే జరిగేది. అలాంటిది సినిమాల్లో స్త్రీల పట్ల ఉండే అనేక రకాలైన అన్ని వయసులవారూ మాటద్వారా, చేష్ట ద్వారా, రాతల ద్వారా హావభావాల ద్వారా కలుగజేసే లైంగిక వేధింపులని బహిర్గతం చేసి, స్త్రీలలో ఆత్మన్యూనతని, భయాన్ని పోగొట్టటమేగాక, పురుషులలో ఆ మేరకు మార్పును తీసుకువచ్చినదనే చెప్పాలి. పురుషులలో పూర్తి చైతన్యం రాకపోయినా స్త్రీలు వేధింపుని బయటపెట్టి, ఎదుర్కొనే స్థితికి రావడంలో సినిమా ప్రభావం ఉందనే చెప్పాలి. స్త్రీలు అన్ని రంగాలలో ఎదుగుతున్న క్రమంలో ఎన్నో సమస్యలున్న పోరాట పటిమని పెంచుకోవాలని ప్రబోధించే *కర్తవ్యం, మయూరి* లాంటి సినిమాలు వచ్చాయి.

అలాగే *అంకురం* సినిమాలో సింధూర ఒక న్యాయంకోసం, సత్యంకోసం అత్త ఇంటికి రానివ్వకపోయినా, భర్త విడాకులు ఇచ్చినా, పోలీసులు వ్యభిచారం కేసులో ఇరికించినా, సాక్షులు మౌనం వహించినా, ఏదైనా చెదరని ధైర్యంతో ప్రజాస్వామ్య పోరాటం జరిపి, మానవిగా చైతన్యవంతమైన పాత్రగా కనిపిస్తుంది.

జీవన వైవిధ్యాన్ని అనేక దృక్కోణాలను చిత్రించే సినిమా ఏ ఒక్క పరిష్కారమో కచ్చితంగా ఇవ్వాలని, ఇచ్చిందని చెప్పలేం. అయితే జీవన ఘర్షణలని బాగా చిత్రీకరించిందనే చెప్పాలి. ఆచార్య మృణాళిని గారు "మనిషి జీవితంలోని విభిన్న సంఘర్షణలను చిత్రించగలగడమే సినిమా ఒక కళగా చేసేపని. ఈ పనిని కొంతవరకు సినిమాలు సమర్థంగానే చేసాయని చెప్పవచ్చు" (తెలుగు సినిమా – భాష 50వ పేజీ) అని చెప్పినది అక్షరసత్యం.

**డాక్టరు అయ్యగారి సీతారత్నం**

*(ప్రపంచ మహాసభల ప్రత్యేక సంచిక)*

# మకర సంక్రాంతి

- ఎం. గిరిధర్

సాధారణంగా ఒక జాతి జాతీయతకు పండుగలు ప్రతీకలు. అందుకే ఏ పండుగ-పబ్బం లేని దేశం కాని, రాష్ట్రం కాని, జాతి కాని, మతం కాని లేదు అంటే అతిశయోక్తి కాదు. ప్రాచీనకాలంలో మన పండుగల స్వరూపం ఎలా ఉండేదో తెలియదు. కానీ పండువు - పండుగు - పండుగ అనే పదానికి వ్యుత్పత్తిని ఆలోచించినపుడు పండు+అగు+ఫలించు పరిపూర్ణమగు అను అర్థం తోస్తుంది.

పండుగ అంటే కోరికలు ఫలించినవేళ, శుభవేళ, ఉత్సవ వేళ అని మనం గ్రహించవచ్చును. ఒకానొక కాలంలో ఆయా సంఘజీవులకు విజయం చేకూరినపుడు, భయ కారణాలు సమసినపుడు ప్రగతి పథం కనిపించినపుడు పరవశించి ఆనందంతో గంతులు వేస్తూ పండుగను జరుపుకుంటారు.

పండుగలు మనోవికాసానికి, విజ్ఞానానికి పరమార్థిక చింతనకు దోహదకారకాలైన ఈ పండుగలు జాతి సాంప్రదాయపు తంతువు చెడకుండా భద్రంగా కాపాడుతూ తరాల వెంట తరాలకు ఒక వారసత్వంవలె అందిస్తున్నాయి. కొన్ని పండుగలు పోరాని చుట్టాలవలె ప్రవహిస్తూ మన జాతీయతకూ, సాంస్కృతిక వికాసానికి నిలువుటద్దాలై స్థిరపడ్డాయి. ఇలా 'పండుగలు' అంటేనే భారతీయులలో కొంగొత్త ఉత్సాహం, మగువల రంగవల్లుల కోలాహలం, ప్రాతః కాలాన గృహప్రాంగణాల్లో కమనీయ దృశ్యతోరణంగా భాసిస్తోంది. బంధుమిత్రగణంతో కొత్త సంవత్సరంలో జరుపుకొనే పండుగ. ప్రతి ఇంటిలోనూ ఆనందపు పరవళ్ళు తొక్కిస్తుంది.

ఇంటికొచ్చే పాడిపంటలు, గొబ్బెమ్మలు, గంగిగోవుల ఆరాధనలు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దులు, బుడబుక్క లోళ్ళ ఢమరుక నాదాలు, సంక్రాంతి ఆనందకర వేడుకలు. ఈ నాటికీ నిజమైన జానపదుల పండుగ పల్లెలోనే కనబడుతుంది. భోగి, సంక్రాంతి, కనుమ ఈ మూడు రోజుల్లో చేసే సందడి అంతా ఇంతా కాదు. ప్రాచీన సంస్కృతికి సాంప్రదాయాలకు ఈ మూడు దినములు ప్రతీకలే. ఇలా తెలుగువారు జరుపుకునే పండుగలలో ముఖ్యమైనది మకర సంక్రాంతి.

**మకర సంక్రాంతి :**

*"రవి సంక్రాంతి సౌభాగ్యః తుషార రుణ మండలః విశ్వవాధ ఇనాధర్మాః చంద్రమాన ప్రకాశలే"* అని వాల్మీకి రామాయణంలో సంక్రాంతి శోభను గూర్చి హృద్యంగా వర్ణించారు. *"తత్రామేసాధిషు ద్వాదశరాశి క్రమేణేషు సంచరతః సూర్యస్య పూర్వన్మాద్రాణే ఉత్తరః రశాసంక్రమణ ప్రవేశం సంక్రాంతి"* అని జయసింహ కల్పద్రుమమున సంక్రాంతిని గురించి వివరించబడింది.

మకర సంక్రాంతిని పుష్యమాసాన కృష్ణపక్షమున జరుపుకుంటారు. ఇంగ్లీషు నెల తత్సమానమయిన జనవరి నెలలో వస్తుంది. సూర్యుడు ఆయా రాసులలో ప్రవేశించే కాలాన్ని సంక్రమణంగా భావిస్తారు. అన్ని సంక్రమణాల్లో మకర సంక్రమణానికి ప్రాముఖ్యం ఎక్కువ. హిందువుల పండుగలలో సంక్రాంతి పండుగ మాత్రమే సౌరగమనాన్ని అనుసరించి ప్రతీ సంవత్సరం ఒకే దినమున వస్తుంది. మిగిలిన పండుగలన్నీ భారతీయ సాంప్రదాయం ప్రకారం చాంద్రమానాన్ని అనుసరించి వస్తాయి. ఇది ఉత్తరాయణ పుణ్యకాలం. ప్రొద్దుకు నిలకడ ఏర్పడే వేళ పంటలన్నీ ఇంటికి వచ్చేకాలం. రైతు సంతోషంతో నవ్వేకాలం. అందుకే ఇది పంటల పండుగ. స్త్రీల పండుగ. ప్రకృతి సంబంధమైన పండుగ. పితృదేవతల పండుగ. సూర్యోపాసకులకు పండుగ. మనకు సంవత్సరానికి 12 సంక్రాంతులు వస్తాయి. ప్రతినెల సూర్యుడు మేష, వృషబాది ద్వాదశ రాశుల్లో ప్రవేశిస్తుంటాడు. సూర్యుడు ధనురాశి నుంచి మకర రాశిలో ప్రవేశించే కాలం 'మకర సంక్రాంతి'. ఈ కాలాన్ని ప్రాచీనులు శుభముహూర్తంగా, సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని కలిగించేదిగా ప్రజలందరికీ మంచి ఫలితాలను అందించే కాలంగా పేర్కొన్నారు. సంక్రాంతి 3 రోజుల పండుగ.

ఈనాడు స్నానం చేయని మానవుడు ఏడు జన్మల వరకు నిర్ధనుడూ రోగి అయి ఉంటాడని ధర్మసింధువు చెప్పింది. అందుకే ప్రతివారికి తలంటు స్నానం తప్పదు. అదేవిధంగా సంక్రాంతి రోజున చేసే దానాల్లో నువ్వులకు ప్రాధాన్యం ఎక్కువ. ఈ నువ్వులనే తిల అని కూడా అంటారు. ఈ పేరుమీదుగానే సంక్రాంతికి తిలసంక్రాంతి అనే మరో పేరుకూడా ఉంది. నువ్వుల నూనెతో వివిధ వంటకాలు చేసి ఆరగించడం వలన చేసిన పాపాలు పోతాయని పెద్దవారి నమ్మకం. అలాగే నువ్వుల నూనెతో దీపం వెలిగించి, నువ్వులు కలిపిన బియ్యంతో శివపూజ చేస్తే ప్రశస్తం. తొలినాడు భోగి, శక్తికీ, అనురక్తికీ, దీప్తికీ సంకేతాలు భోగిమంటలు. భోగి పండుగకు ముందురోజు రాత్రి ఇంటిలోని పాత చీపుర్లు, చేటా, పాత తట్టలు మొదలైన వస్తువులన్నీ సేకరించి, తెల్లవారకముందే లేచి ఈ వస్తువులతో భోగిమంటలు వేస్తారు. కాలిపోయిన పనికి రాని వస్తువులు తమలో దారిద్ర్యాన్ని భస్మంచేస్తూ లక్ష్మిని కటాక్షింప చేస్తాయట. ఇంట్లో ఆడపిల్లలు తలంటుపోసుకుని గలగల నవ్వులతో, కళకళలాడుతూ ఒకరితో ఒకరు పోటీపడుతున్నట్లు వాకిళ్ళలో ముగ్గులు పెడతారు. ముగ్గుల మధ్యలో ఆవుపేడతో చేసిన గొబ్బెమ్మలు పెడతారు. వీటిపైన గరిక పెట్టి పుసుపు కుంకుమలతో అలంకరిస్తారు. తరువాత పంచధాన్యాలతో రేగిపళ్ళు, చెరకు ముక్కలూ, పచ్చి సెనగకాయలూ, రాగి, పెసలు, చిల్లర నాణాలు కలిపి ముత్తయిదువులు పిల్లల తలలపై భోగిపళ్ళను పోయడంవల్ల దృష్టిలోపంతొలగి పిల్లలకు శు భం కలుగుతుందని నమ్మకం.



గొబ్బెమ్మలు

మరునాడు సంక్రాంతి. దీనినే పెద్దపండుగ అని కూడా అంటారు. ఈ రోజు పితృదేవతలను ఆరాధించి ఏమి దానం చేస్తామో అవి జన్మజన్మలకు కూడా శుభాన్ని కలుగజేస్తుందని నమ్ముతారు. ఉదయాన్నే మహిళలు ఇంటిముందు ఆవుపేడతో కళ్ళాపు చల్లి, వివిధ రకాలైన రంగు రంగుల ముగ్గులను వేసి, బంతి, చేమంతి మొదలైన పూలతో ఇంటిని అలంకరిస్తారు. వివిధ రకాలైన పిండివంటలు చేస్తారు. ఈ వంటలలో నువ్వుల లడ్డూలు, పులగం, గుమ్మడి తప్పక చేర్చిన కలగూర ముఖ్యం. కొంతమంది సంక్రాంతి బొమ్మల కొలువు పెడతారు. కొన్ని ప్రదేశాలలో కొత్త పెళ్ళి కూతుళ్ళు కలశ రూపంలో నోములు నోచుకుంటారు. పితృదేవతలకు బట్టలు ఉంచి, వారిని ఆరాధించి ఏమి దానం చేస్తామో అవి జన్మజన్మలకూ కూడా శుభాన్ని కలుగజేస్తుందని నమ్ముతారు. ధాన్యం, గోవులు, కంచు, బంగారం లాంటి పితృదేవతల పేర దానం చేస్తారు. శక్తి లేనివారు నువ్వులు, నెయ్యి లేక వస్త్రాలు దానం చేస్తారు.

సంక్రాంతి పర్వదినాలలో చివరిది కనుమ పండుగ. ఈ రోజు కొన్ని జాతుల వారు పచ్చని బట్టలు కట్టుకుని, బంధుమిత్రులను కలుసుకొంటారు. ఇది ముఖ్యంగా వ్యవసాయదారుల పండుగ. రైతుల పండుగ. ఈ రోజు ముఖ్యంగా పశువుల పండుగ. ఉదయాన్నే పశువులను శుభ్రంగా కడిగి పసుపు కుంకుమలు పెట్టి పూజిస్తారు. ఆ రోజంతా పశువులకు ఎలాంటి శ్రమలేకుండా చూసు కుంటారు. కొన్ని గ్రామాలలో పశువుల పరుగుపందాలను నిర్వహిస్తారు. అలాగే ఈ రోజున బుడబుక్కల వాళ్ళు, దాసర్లు వారివారి కళలను ప్రదర్శిస్తూ వారికి కావలసిన ధాన్యాన్ని భిక్ష రూపంలో తీసుకుంటారు. వీటి అన్నింటికంటే గంగిరెద్దుల ఆట చాలా ముఖ్యం. ఈ రోజునే పొలాల్లో "పొలి" పేరుతో పొంగలి చల్లుతారు. దృష్టిపరిహారార్థం గుమ్మడికాయను కొడతారు. కొన్ని ప్రాంతాలలో గాలిపటాలను ఎగురవేసే ఆనవాయితి కనిపిస్తుంది. ఈ విధంగా సంక్రాంతి పండుగ అంటేనే గ్రామసీమల పచ్చని పందిళ్ళతో కళకళలాడుతూ, ఎంతో సందడి సందడిగా వింతవింత రంగవల్లులతో, గంగిరెద్దులు, బుడబుక్కలవారు, దాసర్లు, గొబ్బిళ్ళు, ఎడ్లపందాలు, కోడిపందాలతో చిన్నా-పెద్ద తేడా లేకుండా అందరూ ఎంతో ఉల్లాసంగా కుల, మత భేదాలు మరచి ఆనందంగా జరుపుకుంటారు. దయ, కరుణ, శాంతి గుణాలను ప్రజలు అలవర్చుకొనుటకు ఈ పండుగ హేతువవుతుంది. ఈ పండుగ హైందవజాతికి ప్రతీకై ప్రపంచంలోనే గొప్ప సంస్కృతి గల దేశంగా పేరుప్రఖ్యాతులు పొందింది.

ఎం. గిరిధర్
తెలుగు డిపార్ట్‌మెంట్,
ఝహోభారతి క్యాంపు, బెంగళూరు

# గిరిజన నృత్యాలలో పశు పక్ష్యాదులు

– సి. సరళాదేవి

జానపదం అంటే పల్లె లేదా చిన్న గ్రామం. గ్రామంలో నివసించేవాళ్ళను జానపదులు అంటారు. కానీ ప్రస్తుతం జనపదంలో ఉండేవారు జానపదులు. జానపదం అనే ఈ పదం అమరకోశంలోనూ, వ్యాసమహర్షి భారతంలోనూ ఇదే అర్థం కనిపిస్తుంది.

**"జానపదుల్ పురాజనుల సంతసముంబ్రమదం బెలర్పనీ
దైన శుభోదయంబ హృదయంబుల గోరుచునున్నవారు స
మ్మానము నొంది కౌరవ సమాజము నిన్ను భజింపభూరితే
జోనిధివై వెలింగెదవు సూర్యుని చాడ్పున నీవయిమ్మహిన్"**

ఎఱ్ఱన అరణ్యపర్వంలో జానపదులు గ్రామీణులనే అర్థంలోనే ప్రయోగించారు. కర్ణ, శకుని, దుర్యోధనుల ఆలోచనల్లో పల్లె ప్రజలు, పురజనులు అనే అర్థంలో చెప్పారు. పల్లీయులు, గ్రామీణులవారు ఈనాడు గ్రామాల్లో వుండటం లేదు. నగరాల్లోనూ, పట్టణాల్లోనూ జీవిస్తున్నారు.

జానపద విజ్ఞానంలో గిరిజన విజ్ఞానం అంతర్భాగం. జానపదంలోనే గిరిజన జీవనాన్ని, ఆచార వ్యవహారాల్ని, విశ్వాసాల్ని, కళల్ని. సమీక్షించేవాళ్ళు. గిరిజనులు అడవులకు దగ్గరలో, అడవులలో జీవిస్తున్నా, గిరిజనులు వారి జీవనం ప్రకృతిపై ఆధారపడి వుంటుంది. "ఓ వరుణుడా! వర్షం కురిపించు; బీభత్సం సృష్టించకు! ఓ ధాత్రీ! నీవు పొరలకు! ఓ ఇంద్రా! మా ప్రాణాలు కాపాడు. ఓ అగ్నీ! నీవే మాకు దిక్కు. మా ఆకలిని తీర్చు. ఎక్కువగా మండకు! ఓ గాలీ! మాకు ప్రాణాలివ్వు." ఇవీ వేదాల్లో అక్కడక్కడ కనిపించే మాటలు. గిరిజనులు పంచభూతాల మీద ఆధారపడి జీవిస్తుంటారు. ప్రకృతి ప్రశాంతంగా ఉండాలని కోరుకుంటారు. వారి విశ్వాసాలు, కళలు, ఆచారాలు, అన్నీ ప్రకృతిపై ఆధారపడి వుంటాయి. దానితోపాటు గిరిజన నృత్యాలకు ఒక ప్రత్యేకత సంతరించుకున్నది.

గిరిజనుల నృత్యప్రదర్శనలో వాడే, వాద్యాలు విశిష్టతను కలిగివుంటాయి. వస్తుజన్య శబ్ద వాద్యాలు గంటలు, తాళాలు, చర్మవాద్యాలు చర్మం సాగదీసి కట్టబడి వుంటుంది. తప్పెట, డప్పు, తంత్రీవాద్యాలు, జంతువుల నరాలతో తయారుచేసిన విధంగా వుంటాయి. చెట్ల తీగలలో తయారు చేసేవి వయొలిన్, గాలి ఊదాలి, పిల్లనగ్రోవి, గుమేళా, డగ్గుడు, తురుబలి, టాబోర్, కింగ్రి, రగుబరాయి, పారా, గోగోడ్, నాగస్వరం మొదలైనవి గిరిజనులు ఉపయోగించే వాద్యాలు.

**గిరిజనుల నృత్యాలు :**

**థింసా :** ఆంధ్రప్రదేశ్‌లోని అరకులోయలో గిరిజనులున్నారు. వీరి భాష 'ఒరియా'. వీరు మూడు తెగలుగా ఉంటారు. వాల్మీకి ఒగట, ఖోండో, కొండదొర, కోటియా ప్రధానమైనవి. వీళ్ళందరూ కలిసి పండుగ రోజుల్లో 'థింసా' నృత్యం చేస్తారు. ఒక గ్రామంలో వాళ్ళు మరో గ్రామానికి వెళ్ళి నృత్యంలో పాల్గొని సామూహిక భోజనాలు చేస్తారు. ఈ నృత్యాన్ని 'సంకిడికెల్వార్' అపక 'కిందిరి కెల్బార్' అంటారు. జోడుకొమ్ములు ఊదుతూ, రంగురంగుల వినూత్న వస్త్రాలు ధరించి, సాంప్రదాయక ఆభరణాల అలంకరణలతో ఈ నృత్యాల్లో గిరిజనులు పాల్గొంటారు.

ఈ థింసా, 'గుందేరి' థింసా, 'ఉస్కు' థింసా, 'బోడె' థింసా, 'భాగ్' దింపా అని వివిధ రకాలుగా కనిపిస్తుంది. గుందేరి స్త్రీ పేరు. ఆ పేరు పెట్టి పిలవగా ఓ స్త్రీ వస్తుంది. పురుషునితో చేతులు కలిపి నృత్యం చేస్తుంది. దీనికే ఉస్కు థింసా అంటారు. బోడె (బడా) అంటే పెద్ద అని అర్థం. 'భాగ్' అంటే ఒరియాలో పెద్దపులి అని అర్థం.

గిరిజనులు 'నిసాని దేవత' పూజల సందర్భంగా ఎక్కువగా ఈ థింసా నృత్యాన్ని చేస్తారు. స్త్రీ పురుషులు వరుసలుగా నిలబడతారు. వీపుమీదుగా ఒకరి చేతులు, మరొకరు గట్టిగా పట్టుకొని లయబద్ధంగా అడుగులు వేస్తూ వర్తులాకార పద్ధతితో నృత్యం చేస్తారు. వర్తులం చెదరకుండా

నృత్యం కొనసాగుతుంది. కుడివైపున పురుషులుంటారు. ఎడమవైపున స్త్రీలు ఉంటారు. కుడివైపు మొదట ఉండే పురుషుడు కథానాయకునిగా వ్యవహరిస్తాడు.

'కుందా దింసా'లో స్త్రీ పురుషులు ఒకరినొకరు భుజాలతో తోసుకుంటారు. 'బాయదింసా'లో పూనకం వస్తుంది. 'బాయా' అంటేనే పూనకం అని అర్థం. ఈ దింసా గిరిజనుల సామూహిక నృత్యం కావడం విశేషం.

**గోండుల గుసాడి :**

ఆదిలాబాద్ జిల్లాలోని గోండులందరికీ దీపావళి పెద్ద పండుగ. గోండుల పురాణ గాథల్లోని దండారియా రేడ్, సిపి సెర్మా రేడ్ అనే కథానాయకుల్ని అనుసరిస్తూ ప్రతియేటా ఈ పండుగ రోజుల్లో గోండులు నృత్యాలు చేస్తారు. 20 మంది నుండి 40 మంది వరకు యువకులు నృత్యంలో పాల్గొంటారు. ఇలా ఎక్కువమంది పాల్గొంటే దానిని 'దండారి' నృత్యమంటారు. ఇద్దరి నుండి అయిదుగురి వరకు పాల్గొంటే గుసాడీ నృత్యమంటారు. దండారీలో గుసాడీ ఒకటి. నెమలి పింఛాల పాగ, గొఱ్ఱెపోటేలు కొమ్ములతో తీర్చిదిద్దబడి ఉంటుంది. కృత్రిమ గడ్డాలతో మీసాలతో వారి వేషం ఆకర్షణీయంగా వుంటుంది.

'దండారి'లోకి గుసాడి బృందం అకస్మాత్తుగా ప్రవేశిస్తుంది. గుసాడి అంటే 'అల్లరి' అని అర్థం. ఈ రెండు నృత్యాల వారి చేతుల్లో కోలల వంటి కఱ్ఱలుంటాయి. బృంద నృత్యం నడుస్తుంది. దండారి, గుసాడి. రెండు నృత్యాలు ఒకే కాలంలో నడుస్తున్నప్పుడు కోలాటంలోని రెండు ఉద్దీల (జట్టుల) దృశ్యం కనిపిస్తుంది. ఒక్కోసారి గుసాడీలు ప్రవేశించగానే దండారీలు చెల్లాచెదురవుతారు. చుట్టూ చూస్తున్నవారికిది వినోదంగా ఉంటుంది. ఆట పూర్తికాగానే ఆటగాళ్ళకు గ్రామస్తులు కాళ్ళు కడిగి ఆతిథ్యమిస్తారు.

**కొండరెడ్ల మామిడి కోత నృత్యం :**

ఖమ్మం జిల్లాలోనూ, ఉభయ గోదావరి జిల్లాలోనూ గిరిజన తెగ కొండరెడ్లు కొండ ప్రాంతాల్లోని గూడేల్లో ఉన్నారు. వీరు పోడు వ్యవసాయం చేస్తారు. మామిడి పండ్లను తెంపే రోజుల్లో ఈ రెడ్లు మామిడి కోతల నృత్యాలు చేస్తారు. తప్పెట వాద్యాల శబ్దాలకు లయబద్ధంగా నృత్యం చేస్తారు. స్త్రీలు-పురుషులు వేర్వేరుగా చెట్టాపట్టాలు పట్టి నృత్యాల్లో పాల్గొంటారు. నృత్యాల్లో ఒకేసారి పాల్గొన్నా చివరి వరకూ కూడా స్త్రీలు పురుషులు కలవరు.

ఇరువురికీ అరచేతుల్లో గలగలలాడే వాద్యాలుంటాయి. రెండు రకాల చర్మవాద్యాలు కూడా ఈ నృత్యాలకు తోడ్పడతాయి. పురుషులు అడుగుల వేసే పద్ధతికి, స్త్రీలు అడుగులు వేసే పద్ధతికీ భేదముంటుంది. స్త్రీలు పాదాన్ని నేలకు తాకిస్తూ నాలుగు అడుగులు ముందుకు వేస్తారు. ఇలా ముందుకు వెళ్ళడం ప్రత్యేకంగా కనిపిస్తుంది. కుడి పాదంతో ఐమూలగా నాలుగు అడుగులు ముందుకు వేసి ఒక అడుగు అలాగే వెనక్కు వేస్తారు. గుండ్రంగా మారి అందరూ కేంద్ర స్థానానికి ముందువైపు వస్తారు. మళ్ళీ అలాగే వెనక్కు వెళుతూ చేతుల్లోని వాద్యాలను గలగలలాడిస్తారు. కాళ్లను ఎడంగా ఉంచి కుడి పాదం వెనక్కు, ఎడం పాదం ముందుగా వచ్చేలాగా గెంతుతారు. ఇదే స్త్రీ విశేష నర్తనం.

పురుషుల నృత్యంలో చర్మవాద్యకారులు కూడా వారితోపాటే దూకుతారు. వేదిక మధ్యలో కనిపించే వాద్యకారులు తర్వాత నటుల్లో కలిసిపోతారు. వాద్యాల వేగాన్ని బట్టి నృత్యం వేగం పెరుగుతుంది. సన్నివేశం పతాక స్థాయినందుకొనే వరకు పాట పూర్తవుతుంది. అలాంటి సమయంలో కొండరెడ్లు ముత్యాలమ్మనూ, కొండ దేవతలనూ ఆహ్వానిస్తూ సుదీర్ఘ గీతాల్ని ఆలపిస్తారు. ఆట రక్తికట్టినప్పుడల్లా ఆ ఉత్సాహంతో కేకలు వేస్తారు. అర్ధరాత్రి విందుతో ప్రారంభమయ్యే మామిడి కోతల నృత్యం మరుసటిరోజు ఉదయం 10 గంటలవరకు పూర్తవుతుంది.

**మయూర నృత్యం :**

శ్రీకాకుళం, విశాఖపట్టణం జిల్లాల్లోని దుర్గమగిరి కంధరాల్లో జీవించే సామంతులు, జానపదులకు సన్నిహితులవుతున్నారు. సామంతులనే 'ఖోండు' అని పిలుస్తారు. వారి జీవనాధారం పోడు వ్యవసాయం, వనసంపద. వీరు నివసించే స్థలాన్ని ఖోండు ప్రాంతమంటారు. నడుముకు వెనుక భాగంలో నెమలి పింఛాల గుత్తిని కడతారు. నడుము వంచినపుడు అది విచ్చుకొని అచ్చంగా అది నెమలి నృత్యమే అనిపిస్తుంది. తెల్ల ధోవతి, పాదాలకు గజ్జెలు (వీరి భాష 'మయ్యుంగ' అంటారు) నెత్తికి తలపాగా (తోయంగ) ధరిస్తారు. ఆ పాగాకు రంగురంగుల గుడ్డపేలికలను చుట్టచుట్టి తలపై ధరిస్తారు.

ఈ నృత్యం వరుని పక్షం వారి ఇంటి దగ్గర వధువు పక్షం వారింటి దగ్గర జరిగినట్లనిపిస్తుంది. ప్రారంభంలో అరచేతిని నోటివద్ద ఉంచి నెమలిలా అరుస్తారు. వివాహంలో

అశుభం జరగరాదని దేవతను ప్రార్థిస్తారు. మయూరంలాగా ముందుకు వంగి భూమాతకూ, సూర్యభగవానునికీ నమస్కరించి, వధూవరుల చుట్టూ ప్రదక్షిణలు, వివాహానికై విజ్ఞాపనలు, అడుగులు ముందుకు వెనుకకు, పక్కలకు వేయడం, గొంతుక్కూచొని పక్కతలకు గెంతడం, వధువు కొరకై వరుని పక్షం వారి ప్రార్థనలు, వరుని ఆపసోపాలు, అపూర్వంగా ప్రదర్శితమవుతాయి. వరుడు తన కొరకు పడే బాధ చూడలేక, వధువు వినమ్రురాలై ముందుకు వచ్చి తన ఇష్టాన్ని ప్రకటిస్తుంది. ఆ తర్వాత వధువును సంరక్షిస్తున్న పద్ధతిలో నృత్యం సాగుతుంది. నృత్యం చివరిఘట్టంలో వధువు వరుని ఇంటికి చేరుతుంది. అప్పుడందరూ కుడిచేతితో రుమాలు ఊపుతూ గుండ్రంగా తిరుగుతూ నృత్యం చేస్తారు. కనులపండువగా ఈ నృత్యం ముగుస్తుంది.

**బంజారుల లంబాడీ నృత్యాలు :**

మధ్యయుగాల్లో ఉత్తర భారతం సరిహద్దులపై జరిగిన మహమ్మదీయుల దండయాత్రల కారణంగా, వారి మతోన్మాదచర్యల కారణంగా, రాజస్థాన్, బుందేల్‌ఖండ్ ప్రాంతాల నుండి వలసవచ్చి దక్షిణ భారతంలోని అనేక ప్రాంతాల్లో స్థిరపడ్డ గిరిజన తెగే బంజారులు. ఆ కారణంగానే వీరి నృత్యాల శైలి మీద రాజస్థాన్, పంజాబ్ ప్రాంతాల నృత్య ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. తెలంగాణ ప్రాంతంలోని పాలమూరు, నల్లగొండ, కరీంనగర్, రంగారెడ్డి, వరంగల్లు, ఇందూరు, ఆదిలాబాద్ తదితర జిల్లాలలోని లంబాడీలందరూ సాంస్కృతీకరణవైపు ఆకర్షితులౌతూ ఇప్పుడిప్పుడే తామూ బంజారులమే అంటున్నారు. గిరిజనులు నివసించే ప్రాంతాన్ని 'తండా' అంటారు. 'తండ' అంటే లంబాడీల ఆవాస స్థలమైన చిన్న పల్లె అని అర్థం.

తెలంగాణ లంబాడీల నృత్యాలన్నీ సాంప్రదాయక వాదం కిందికి వస్తాయి. జనన, మరణాల మధ్యలో జరిగే ప్రతికర్మ కాండలోనూ శోకోత్సాహానందాన్ని ప్రదర్శించే నృత్యాలంటారు. ఉత్సవాలలోనూ, జాతర్లలోనూ వీరి నృత్యాలుంటాయి. కొమరెల్లి మల్లన్న జాతరలో, ఐనవోలు మల్లన్న జాతరలో, వేములవాడ జాతరలో, మన్యంకొండ జాతరలో, సిర్పనగండ్ల గట్టు జాతరలో కూడా లంబాడీ నృత్యాలు ఇప్పటికీ కనిపిస్తాయి.

శ్రీరాముడే వీరికి దైవం. తమ పూర్వీకుల్లో సుగ్రీవుడే గుర్తు. ఆయన వారసత్వానికి చెందినవాళ్ళమే తాము అని వాళ్ళ విశ్వాసం. ఎవరైనా చనిపోయినపుడు మండలాకారంలో స్త్రీ పురుషులు వేరు వేరుగా వుండి నృత్యం చేస్తారు. పురుషులు మద్దెల, లేదా డప్పు వాయిస్తుంటే కేవలం స్త్రీలే నృత్యం చేసే పద్ధతి కూడా ఉంది. హోలి పండుగ (కామదహనం) సందర్భంలో వీరు గ్రామాల్లోనూ, నగరాల్లోనూ ఆనందంగా కేరింతలు కొడుతూ నృత్యాలు చేస్తారు. ప్రజలు ఇచ్చే కానుకల్ని స్వీకరిస్తారు.

ఈ నృత్య శైలి అంతా వర్తులం (మండలం) మీద ఆధారపడి ఉంటుంది. పాటపాడుతూ, చేతులు పైకెత్తటం, ముందుకు అడుగులు వేయటం, మొదట కుడికాలి ముందుకూ కుడివైపుకు సాగుతుండటం నృత్యంలోని ప్రత్యేకత. సుఖదుఃఖాల్ని కలిసి పంచుకొనే ఏకత్వం లంబాడీ నృత్యాల్లో స్పష్టంగా కనిపిస్తుంది.

కర్నూలు, పాలమూరు జిల్లాల్లో ఉన్న చెంచుల గురించి, కర్నూలు, పాలమూరు, ఆదిలాబాద్ మొదలైన ప్రాంతాల్లో ఉన్న కోయల గురించీ, కోయల రాజుల గురించీ, వారి నృత్యాలను ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. జన సామాన్యంలో తిరుగుతూ మందో-మాకో అమ్ముకొని జీవించే చెంచులు, కోయలు మొదలైన గిరిజనుల్లో వచ్చిన పరివర్తన కూడా మనం గమనించవచ్చు. గిరిజనుల నృత్యసంబంధి, దైవ సంబంధి పూజాపునస్కారాలు కొనసాగుతూనే ఉన్నాయి.

**జంతువుల నృత్యాలు :**

పండితారాధ్య చరిత్రలో దేశి నృత్య పద్ధతుల్ని చెబుతూ శివభక్తులు పక్షుల్ని, జంతువుల్ని ఎలా అనుకరిస్తూ నృత్యాలు చేశారో వివరించారు.

"నెమలి, భ్రమరం, చిలుక, హంస, జింక, కోయిల, కోతి, అంబోతు (కోడె), కొండముచ్చు (గోలికాదు), ఏనుగు, పెద్దపులి, సింహం, పాము, పక్షి (గరుడ పక్షి లేదా మరేదైనా కావచ్చు)" ఈ పశుపక్ష్యాదుల్ని వారు అనుకరించారు.

ప్రకృతి నుండి మానవుడెన్నో నేర్చుకొన్నాడు. పశు పక్ష్యాదుల నుండి కూడా నేర్చుకొన్నాడు. వీటిలో ఒక్కొక్కటీ ఒక్కొక్క నృత్యంగా అనుకరణ చేస్తారు. భ్రమరానికి సంబంధించి భ్రమర నృత్యం ప్రత్యేకంగా వుంది. వ్యాయామంలో 'షట్పదీ' పదాలున్నాయి. ఇవి అచ్చంగా చిందే. అడుగులు వేసే పద్ధతివల్ల ఇది నృత్యంగా

అనిపిస్తుంది. మయూరం శునకం, హంస, హరిణం, కోయిల, వానరం, ఎద్దు, కొండముచ్చు, గజం, వ్యాఘ్రం, సింహం, నాగం, పక్షి మొదలైన పశుపక్ష్యాదులు సహజ గమనాన్ని మానవుడు నృత్యంగా అనుకరిస్తున్నాడు. మానవుడు క్రూరజంతువుల్ని తనదైన శైలిలో మచ్చిక చేసుకొని, ప్రజల వినోదం కోసం నడి రోడ్లపై ఆడిస్తున్నారు.

**కోతి నృత్యం :**

భిక్షకులు, గారడీవారు కోతులు ఆడిస్తారు. కోతికి ఆసరాగా ఒక కట్టె పట్టుకొని ఆడే విధంగా వాటికి శిక్షణ ఇస్తారు. తాడు మీద నుండి దూకుతుంది. మద్దెల డప్పు దరువులకు అనుగుణంగా చిందులు వేస్తుంది, గెంతుతుంది.

**ఎలుగుబంటి నృత్యం:**

ఎలుగుబంటిని పట్టుకొని దాని కోరలు పీకి, గోళ్ళు తీసి ఆటలాడించే ఎలుగుబంట్లవారున్నారు. వారు కొన్ని ప్రత్యేకమైన రోజుల్లో, పండుగ రోజుల్లో వస్తారు.

**పాముల నృత్యం:**

పాముల వారు అనే జాతి ఒకటి ఆంధ్ర దేశంలో ఉంది. వీరు నాగస్వరం ఊదుతూ నడి వీధుల్లో గృహం లోపల పాములతో నృత్యం చేయిస్తారు. త్రాచుపాములూ, నాగుపాములే నృత్యానికి ఎక్కువగా ఉపయోగిస్తారు.

**గంగిరెద్దుల నృత్యం :**

ప్రతి సంక్రాంతి పండుగకు ముందు ఒక నెల నుండి గంగిరెద్దులాటను ఆడించేవాళ్ళు ప్రతి గ్రామానికి వస్తూ, గంగిరెద్దుల ప్రదర్శనలు ఇస్తూ వుంటారు. వాద్యాలు మద్దెలను కుట్టకొంకితో గీకడం వల్ల వచ్చే శబ్దాన్ని, తగ్గట్టుగా గంగిరెద్దు ఆడుతుంది.

**"డూ డూ డూ డూ బసవన్నా దొడ్డ దొరండీ బసవన్నా**
**అయ్యగారికి దండంబెట్టూ బాబుగారికి సలాముగొట్టు"**

ఈ ఆటలో ఎద్దుకు మంచి అలంకరణ చేస్తారు.

పిచ్చుకలా గంతులు వేయవచ్చు. చిలుకలా పలుకులు పలుకవచ్చు. కోడి పందాలను ప్రదర్శించవచ్చు. కుందేళ్ళతో వినోదాలు చేయించవచ్చు. కుక్కల నూరేగించవచ్చు. గొఱ్ఱె పొట్టేళ్ళ పందాలు ప్రదర్శించి వినోదించవచ్చు, అశ్వాలతో పాద ప్రహారాలు చేయించవచ్చు. దున్నపోతులనూ కోడెదూడలనూ పోటీకి దించవచ్చు. చెక్కమీద మేకను నడిపించవచ్చు. పాము ముంగీసల పోరాటాన్ని చూపించ వచ్చు. ఆ సంప్రదాయంతో ఈ నృత్యాలకు శాస్త్రనిర్మాణం కూడా జరుగుతున్నది. వృత్తిలో ఆచార సంప్రదాయాల్లో ఏ రాత్రివేళో, ఏ పండుగ పూటనో వినోదం కోసం ఈ నృత్యాలు ప్రదర్శిస్తూ వుంటారు.

డాక్టరు సి. సరళాదేవి, రీసెర్చ్ అసోసియేట్, తెలుగు అధ్యయన శాఖ,
శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి

## పాలిడ్రోమ్

పాలిడ్రోమ్ (Polymdrome) ఒక వాక్యాన్ని ముందునుంచి లేదా వెనుకనుంచి, ఎటునుంచి చదివినా ఒకే అర్థాన్ని స్ఫురింపచేసే అలంకారం పేరు. ఇంగ్లీషులో Able was I ere I saw Elba అనే ఒక వాక్యం ఉంది. ఈ వాక్యాన్ని తిరగేసి చదివినా అలాగే ఉంటుంది. ఇందులో Elba అనేది వ్యక్తి పేరు వతీవ అంటే మునుపు అని అర్థం. "ఎల్బాను చూసే మునుపు వరకు నేను సమర్థుడుగానే ఉన్నాను" అని దీని అర్థం. ఇది 17వ శతాబ్దం నాటి వాక్యం. ఇదేమీ గొప్ప కాదు. ఇంతకంటే గొప్ప విన్యాసాలు సంస్కృత భాషలో జరిగాయి. 14వ శతాబ్దంలో దైవజ్ఞ సూర్య పండితుడు రామకృష్ణ విలోమ కావ్యం రచించాడు. ఈ కావ్యంలో మొత్తం నలభై శ్లోకాలు ఉన్నాయి. ఇది మొదటి నుంచి చివరి వరకు చదివితే *రామాయణం* చివరి నుంచి మొదటి వరకు చదివితే *భారతం* అవుతుంది. మచ్చుకు ఈ శ్లోకం చూడండి.

తాం భూసుతా ముక్తి ముదారహాసం। వందేయతో లవ్య భవం దయాశ్రీ..... ఇది వెనకనుంచి మొదటికి చదవితే....

శ్రీ యాదవం భవ్య లతోయ దేవం। సంహారదాముక్తి మూతాసు భూతాం

మొదటి శ్లోకంలో భూసుతా అంటే సీతను గురించి, రెండవ వాక్యంలో శ్రీయాదవం అంటే కృష్ణుని గురించి ప్రస్తావించ బడింది. దరహాసం చిందే దేవుని ప్రేమించే దయగల లక్ష్మి అయిన సీతను నమస్కరించుచున్నాను ఇది మొదటి పాదపు అర్థం. మంగళ ప్రదమైన ఆకర్షణ గలిగిన కృష్ణుని గీతబోధ చెడును సంహరిస్తూ ప్రాణపదమైనది అని రెండవ వాక్యం అర్థం చెపుతుంది. ఈ భాషా విన్యాసం ప్రపంచంలో ఏ భాషలోనూ సాధ్యం కాదు. ఇది సంస్కృతం యొక్క ప్రత్యేకత.

- ఎన్నార్కె

# ఎరుకల జానపద వైద్యం

- ఎ.కె. వేణుగోపాల్ రెడ్డి

**సంక్షిప్తం :**

పుట్టిన ప్రతి ప్రాణిలోనూ ఏదో ఒక కొరతను సూచించేది వ్యాధి. జీవకోటి ముఖ్యంగా మానవులు తమ అసౌకర్యాలను తీర్చుకోవడానికి పలు విధాలుగా ప్రయత్నిస్తూనే ఉంటారు. వైజ్ఞానికంగా ఎంతో ముందంజ వేసిన ఈ కాలంలో కూడా ఇంకా కొన్ని ఆటవిక జాతులు తమ జానపద వైద్య విధానాన్నే అనుసరిస్తున్నాయి. ప్రస్తుతం ఈ పత్రం తడికల బైలు గ్రామం, ఓబులవారి పల్లె మండలం, కోడూరు తాలూకా, కడప జిల్లాలో జరిపిన పరిశోధన ఆధారంగా రచింపబడింది.

**ముందుమాట :**

భారతదేశంలో నేటికీ అధికశాతం ప్రజలు గ్రామ ప్రాంతవాసులే. గ్రామీణ ప్రజలు విద్యావాసన లేనివారుగా ఉన్నారు. ప్రస్తుతం అవి నాగరీకరణ దిశగా అభివృద్ధి చెందుతున్నాయి. కానీ ఈ నాగరికత ప్రపంచంలో కూడా కొన్ని జాతులవారు తమ జానపద జీవనాన్ని, మూఢనమ్మకాలను ఇంకా పాటిస్తూనే ఉన్నారు. ఈ పత్రం తడికలబైలు గ్రామం, ఓబులవారి పల్లె మండలం, కోడూరు తాలూకా, కడప జిల్లాలో చేసిన కొన్ని పరిశీలనల ఫలితంగా అక్కడి నివాసులైన ఎరుకల వారిలో ఉన్న వ్యాధి నిరోధక చర్యలను వివరిస్తుంది. జానపద వైద్య విజ్ఞానాన్ని ప్రస్తుతం ప్రపంచీకరణ నేపథ్యంలో నాగరికత పేరుతో విదేశీయ వైద్య విధానం ఆక్రమించుకుంటూ ఉంది. నేడు ఎందరో సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థానాన్ని అందుకొని విద్యాబుద్ధులు నేర్చుకొని ఆధునిక వైద్యవిధానాన్ని పాటిస్తున్నారు. కానీ ఇంకా కొన్ని పల్లెల్లో ప్రాచీన జానపద వైద్యవిధానం జీవించి ఉంది.

అతిసార వ్యాధిని నిరోధించడానికి మంచినీటిని కానీ, సగ్గుబియ్యం జావను కానీ కోల్పోతున్న ద్రవపదార్థాలకు బదులు తీసుకుంటే అది అతిసార వ్యాధిని అరికడుతుందని నమ్మకం. అతిసార వ్యాధిని వీరి వాడుకలో ఉన్న మరో మందు పల్చటి మజ్జిగలో పసుపు, ఉప్పు కలిపి తాగటం. ఈ పసుపు ఉప్పు కలిపిన మజ్జిగను సాధారణంగా అతిసార వ్యాధిని అరికట్టేదాకానూ లేదా రోజుకు మూడు, నాలుగు సార్లు తాగుతారు. ఈ వ్యాధి అధికమైనప్పుడు ఉల్లిరసం, నిమ్మరసం కలిపి ఇవ్వటం కూడా ఉంది.

మామూలుగా కనిపించే మరొక వ్యాధి అజీర్ణం లేదా వాయువు (పొట్ట ఉబ్బరం). దీనికి సాధారణంగా ఎరుకల్లో ప్రసిద్ధంగా వాడబడేవి రెండు. ఒకటి చిటికెడు ఇంగువను నీటిలో కలుపుకొని తాగటం. దీనివల్ల వాయువు పిగిలి స్వస్థత చేకూరుతుంది. అదే అజీర్ణం వల్ల పుల్లటి త్రేన్పులు ఎక్కువైతే వెల్లుల్లిని రసంచేసి తాగటం. ఇది జీర్ణశక్తిని వృద్ధిచేస్తుంది. నెలకొకసారి ఒక చెంచా వేపరసంతో రెండు చెంచాల ఆముదం కలిపి ముఖ్యంగా పిల్లలకు తాపుతారు. దీనివల్ల జీర్ణకోశం పరిశుభ్రమవుతుంది. నులిపురుగులు ఎక్కువై కడుపునొప్పి వచ్చినప్పుడు ముళ్ళచెట్టు వేళ్ళను రుబ్బి నీళ్ళలో కలిపి తాగిస్తారు.

జలుబుకు మిరియాల రసం, వెల్లుల్లి రసం మామూలుగా అలవాటులో ఉన్నాయి. పిల్లల్లోని జలుబును పోగొట్టడానికి జానపద విజ్ఞానంలో మరొక మందు కూడా ఉంది. మరగకాచిన నీటిలో పసుపు కలిపి చల్లార్చిన తరవాత తేనె కలిపి రోజుకు మూడుసార్లు తాపుతారు. పాలతో మిరియాలను రుబ్బి నుదుటికి పట్టు వేయటంద్వారా తలనొప్పి తగ్గిపోతుందని వీరి నమ్మకం. దీనికి యూకలిప్టస్ ఆయిల్‌ను కూడా వాడతారు. చిన్నపిల్లలకు తల్లిపాలతో కుంకుమపొడి కలిపి నుదుటికి, ముక్కుకి రాస్తారు. శరీరంలో వేడి అధికమై వచ్చే ఎన్నో జబ్బులకు అడవివుట్టి బెరడు రుబ్బి నీటిలో కలిపి తాగుతారు. వేడి నేయిని చీము పట్టిన

కురుపుల మీద రాయటం ఒక మందైతే, సెగ్గడ్డలు త్వరగా పగలటానికి విభూతిని వేడి నేయిలో కానీ, కొంచెం వెచ్చబెట్టిన వెన్నతోకానీ కలిపి పూస్తారు. సెగ్గడ్డలు పగిలిన తరువాత అక్కడ మచ్చపడకుండా వేపాకు ముద్దను పూస్తారు. దీనివల్ల మచ్చలు పూర్తిగా పోతాయి.

గడ్డిపూల ఆకును పొడిచేసి కొబ్బరినూనెతో కలిపి తలకు పట్టిస్తే చుండ్రు పోవటమేకాకుండా తలలో ఉన్న కురుపులు కూడా పోతాయట. దీనివల్ల పేలు కూడా పడవు. అడవి గుమ్మడిని రుబ్బి తలకు పట్టిస్తే అది పేలను, చుండ్రును అరికడుతుంది. గంగరావి బెరడును రుబ్బి ఆ ముద్దను మేకపాలతో కలిపి పట్టించటం మరోపద్ధతి.

వాపులకు నిమ్మరసంలో పసుపు కలిపి రాయటంవల్ల వాపులు తగ్గుతాయని నమ్మకం. కీళ్ళనొప్పులకు, కీళ్ళు పట్టుటకు వేడి కొబ్బరి నూనెలో కానీ, ఆవనూనెలో కానీ కర్పూరాన్ని కలిపి రాయటం ఒక మందు. కండరాల నొప్పులకు, బెణుకులకు యూకలిప్టస్‌నూనెతో మర్దన చేస్తారు. ఇప్పట్లో అన్ని నూనెలతోపాటు కొందరు కిరసనాయిల్‌ను కూడా వాడుతున్నారు. పొగాకు పంటినొప్పికే కాక ఇతర నొప్పులకు కూడా ఉపయోగపడుతుందని వీరి నమ్మకం. పొగాకు కానీ, దాని రసం కానీ గాయాలకు, గాట్లకు, దెబ్బలకు కూడా మందుగా ఉపయోగిస్తారు. సాధారణంగా ఉపయోగించే మరొక ఆకు బందారాకు. గాట్లకు ఇది వాడటంవల్ల త్వరగా మానుతాయని, ఈ ఆకే ఒక కట్టులాగా ఉపయోగ పడుతుందనీ వీరి నమ్మకం.


ఎరుకల జానపద వైద్యం

చెవినొప్పికి వీరు నమ్మే ఉత్తమ వైద్యం పుట్టలో పాలు పోసి సుబ్రహ్మణ్యస్వామిని వేడుకోవడం. వెల్లుల్లి రెబ్బను దంచి, వేరుశనగ నూనె లేదా వెచ్చని ఆముదంతో కలిపి చెవిలో పోయటంవల్ల చెవిపోటు తగ్గిపోతుందని వీరి నమ్మకం. ఈ మందులేవీ పనిచేయకపోతే వీరు వైద్యుణ్ణి కలుస్తారు. గర్భిణీ స్త్రీల ఆహార వ్యవహారాలలో సంస్కృతికి ప్రధానపాత్ర ఉందనిపిస్తోంది. ఎరుకలవారి ఆహార విషయంలో చాలా నిషేధాలు కనిపిస్తున్నాయి. మంత్రసానులు గర్భిణీ స్త్రీలకు ఆహారం విషయంలో సలహాలు ఇస్తుంటారు. ఏఏ పదార్థాలు తినకూడదో ఒక పట్టిక వేస్తారు. ఉదాహరణగా పప్పుదినుసుల్లో ఉలవలు, మైసూరి బేడలు – కూరగాయల్లో వంగ, మిరప, పొట్ల, కాకర, సొరకాయలు వాడరు. అలాగే కొన్నిరకాల ఆకుకూరలు, మునగకాయలు కూడా తినకూడదంటారు. మాంసాహారంలో గొడ్డుమాంసం, కోడిమాంసాలను తినకూడదు. పానీయాల్లో కాఫీ, టీలు – పళ్ళల్లో మామిడి, బొప్పాయి వంటివి అనాలోచితంగా గర్భస్రావానికి కారణమవుతాయని వాటిని నిషేధిస్తారు.

ఎరుకలు సాధారణంగా పిల్లల జబ్బులకు అతీంద్రీయ శక్తులే కారణమని నమ్ముతారు. ఎరుకల్లో వున్న మరో నమ్మకం వారి జానపద వైద్యానికి నయం కాకపోతే ఆ వ్యాధి ఏ అతిమానుష శక్తులవల్ల వచ్చిందేమోనన్న భావనతో మంత్ర తంత్రాల వంటివి చేస్తారు. జ్వరతీవ్రత ఎక్కువై రాత్రుళ్ళు మూలుగులు, అరుపులు మొదలైతే అవి ఏ భూత, ప్రేతచేష్టలో అని నమ్ముతారు. శక్తి క్షీణించటం, పాలిపోవడం, వాపులు, జుట్టు రాలటం వంటివి కూడా అతీంద్రియ శక్తుల వల్లనే వచ్చాయని భావిస్తారు. ఏ వ్యక్తి అయినా ఇటువంటి వాటివల్ల బాధింపబడితే ఆ కుటుంబీకులు తమ ఇంట్లోనే శాంతిపూజలు నిర్వహిస్తారు. తమ పూజారితో మాటలాడుకొని మంచిరోజున నిర్ణయించుకొని రాత్రిపూట ఈ పూజ చేయిస్తారు. దీనికి కొబ్బరికాయ, అగరువత్తులు, పువ్వులు, తమలపాకులు, ఒక కొత్త కుండ తెచ్చిపెడతారు. పూజారి మంత్రాలు చదువుతూ దీపం వెలిగిస్తాడు. సాధారణంగా ఆ కుటుంబీకులు తమ కులదైవానికో లేదా వేరే దైవానికో మొక్కిన మొక్కులు తీర్చకపోవటంవల్లే ఆ వ్యక్తి బాధకు గురయ్యాడని నమ్ముతారు. పూజారి సలహాతో ఆ దేవతకు మేకపోతును, కోడిపుంజును బలియిచ్చి ఆ రక్తాన్ని నివేదించడంవల్ల ఆ ఆపద తొలగిపోతుందని నమ్మకం.

దృష్టిలోపాలను కూడా మంత్రోచ్చారణవల్ల పోగొట్టవచ్చని వీరి విశ్వాసం. మామూలుగా ఆ కుటుంబానికో లేక బంధువర్గానికో చెందిన ముసలి లేదా వితంతు స్త్రీ ఈ దిష్టి తీసే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

ముందు మూడు ఇళ్ళ చూరు నుంచి గడ్డి లేదా బోద, ఎండుమిరపకాయలు, ఉప్పు, బాధపడుతున్న వ్యక్తి తల వెంట్రుకలు దిష్టితీసి కుంపట్లో ఉన్న నిప్పుల్లో వేస్తారు. ఆ కుంపటి ఆ వ్యక్తి ముఖానికి ఆరుసార్లు ఎడమ వైపు నుంచి కుడి వైపుకు తిప్పుతారు. ఇలా చేసేటప్పుడు ఆమె కొన్ని మంత్రాలను చదువుతుంది. తరవాత దాన్ని నాలుగు రోడ్ల కూడలిలో పారేస్తారు. సాధారణంగా దీని తర్వాత ఆ వ్యక్తి మెల్లమెల్లగా కోలుకుంటాడు. కొన్నిసార్లు ఈ పనికి చీపురుపుల్లలు వాడుతారు. దిష్టి తీసే స్త్రీ ఆ మంటను చూసి మూడుసార్లు ఉమ్మివేసి ఆ అతీత శక్తులను తిడుతుంది.

సాధారణంగా 8 నుంచి 10 నెలల మధ్య కాలాన్ని అలాగే 2 నుంచి 4 సంవత్సరాల ప్రారంభ కాలాన్ని పిల్లలకు అనారోగ్య కారకంగా భావిస్తారు. ఈ సమయంలో ఆ వూరి పూజారి వీటిని మంత్రతంత్రాలతో చక్కబరుస్తాడు. 4వ సంవత్సరం పడేటప్పుడు ఈ మంత్రపూజ చేయిస్తే ఇక జీవితాంతం కష్టాలు రావని ఎరుకలవారి మూఢనమ్మకం. పిల్లవాళ్ళ ముందు పసుపు నీళ్ళు కొన్ని అక్షతలు వేస్తారు. వారు క్రమంగా కోలుకుంటారు. అలా కాకపోతే వారు అల్లోపతి వైద్యుణ్ణి సంప్రదిస్తారు. కానీ చాలామంది తల్లులు పూజారిమీదే నమ్మకం ఉంచుతారు.


ఎరుకల జానపద వనమూలికలు

జంతువుల విషయంలో కూడా వారిలో కొన్ని నమ్మకాలు ఉన్నాయి. ఆడగాడిదపాలు అత్యధిక పోషక విలువలు కలిగి ఉంటాయని, ఆవుపాలకన్నా ఎక్కువ శాతం చక్కెరను కలిగి ఉంటాయని క్షయవ్యాధి బాధితులకు ఇవి మంచిమందని వీరు నమ్ముతారు. దీనికి ఉదాహరణగా క్లియోపాత్ర గాడిదపాలతో స్నానం చేసేదని చరిత్ర చెప్పిన దాన్నిబట్టి చూస్తే గాడిదపాలకి వైద్యపరమైన గుణాలు ఉన్నాయని అర్థమవుతుంది. గాడిద మూలుగ, రక్తం వీటితోపాటు తీసుకోవటంవల్ల అది విషానికి విరుగుడుగా పనిచేస్తుందని వీరి నమ్మకం. దీనివల్ల విషం విరగడ మేమోకానీ తగినంత వాంతులై లోపల ఉన్నదంతా బయటకు వస్తుంది. ఇదే వైద్యాన్ని తేలుకుట్టినప్పుడు కూడా ఉపయోగిస్తారు. కొందరు తేలుకుట్టినప్పుడు గాడిద చెవిలో తొంగిచూడటంవల్ల విషం విరుగుడవుతుందని నమ్ముతారు. దాని వీపుమీదున్న వెంట్రుకలు కత్తిరించి ధరించడంవల్ల మూర్ఛ రోగం నయమవుతుందట. తాయత్తుగా చేసి పిల్లల మెడలో ధరింపజేస్తారు. కోరింత దగ్గు వచ్చిన పిల్లలను అది తగ్గడానికి గాడిద పక్కన పడుకోబెడతారు. అలా తగ్గకపోతే దాని పొట్టకింద నుంచి వీపు పైకి బిడ్డను మూడుసార్లు తిప్పుతారు. ఇలా చేసేటప్పుడు గాడిద చర్మం పిల్లవానికి తగులుతూ ఉండటంవల్ల భయం లేకుండా ఉంటుంది.

మేక కాలేయాన్ని (లివర్) టి.బీ.కి మందుగా వాడతారు. కుక్క మూత్రం, చీము కారుతూ సరిగా వినిపించని చెవికి మందుగా వాడతారు. కుక్కను పెంచుకోవటం వల్ల భూత ప్రేత పిశాచాలు దగ్గరకు రావని నమ్మకం. అడవి పావురాల మాంసం ఉదర సంబంధిత వాయువులకు, నొప్పులకు మంచిది. తేనెటీగను మింగడం ద్వారా దగ్గు వాపు తగ్గుతాయట. తేనె పాలలో కలిపి తాగటంవల్ల వాంతులు తగ్గుతాయట. నెమలి కొవ్వు నుంచి తీసిన నూనె కీళ్ళ నొప్పులకు బాగా ఉపయోగపడుతుంది.

ప్రకృతిలో కలిసి బతికే వీరిలో ప్రకృతి ప్రసాదించిన చెట్లు, వాటికి సంబంధిత విషయాలు, జంతువులు, వాటి నుండి పొందే వివిధ వస్తువులు, వాటి వాడుక, వ్యాధి నివారణ ఇవన్నీ ఈనాటికీ సజీవంగా ఉండి ప్రాచీన జానపద వైద్య విధానాన్ని పరిరక్షిస్తున్నాయి. కానీ విజ్ఞానం, వైద్య విజ్ఞానం ఇంత అభివృద్ధి చెందినప్పటికీ తమ మూఢనమ్మకాలవల్ల వీరు కొన్ని అనవసరమైన చర్యలకు పాల్పడుతూ కొన్నిసార్లు ప్రాణాల మీదికి కూడా తెచ్చుకుంటున్నారు. జానపద వైద్య విజ్ఞాన పరిరక్షణ ఎంత ముఖ్యమో ఆధునిక వైద్య విజ్ఞానాన్ని అవసరమైనచోట ఉపయోగించుకోవటం అంతే అవసరమన్న విషయాన్ని వారు అర్థంచేసుకోవాలి.

డాక్టరు ఎ.కె. వేణుగోపాల్ రెడ్డి
సహాయాచార్యులు, తెలుగు శాఖ
ద్రావిడ విశ్వవిద్యాలయం,
కుప్పం-517426.

# ఛత్తీస్‌గఢ్‌లో తెలుగువారు....

- ఎల్. రుద్రమూర్తి

ప్రపంచంలో మరెక్కాడా లేని భాషా సాంస్కృతిక వైవిధ్యం మన దేశంలోనే ఉంది. వీటి సాధనకై ఒకవైపు ప్రయత్నాలు జరుగుతుంటే, మరోవైపు వందలాది భాషలు ఇంకా ప్రభుత్వం గుర్తింపు నోచుకోక పోరాటాలు జరుపుతున్నాయి. ఏ ప్రాంతీయ భాషయినా, మాండలికమైనా ఆ భాషలో చదువుకొనే అవకాశం, ఆ సంస్కృతిని పెంపొందించుకొనే అధికారం, వారికి ప్రభుత్వం కల్పించాలి తప్ప ఒకరి భాషను మరొకరిపై రుద్దకూడదు. వాటిని పరిరక్షించుకోవలసిన బాధ్యత కూడా ఆ జాతీయులదే.

బ్రతుకుతెరువుకై ఆంధ్ర రాష్ట్రాన్ని విడిచి ఏ రాష్ట్రం/దేశానికి వెళ్ళినా తన పుట్టిన గడ్డమీద మమకారం, మాతృభాషమీద అభిమానం, మహోన్నతమైన మన సంస్కృతికి వారసులమన్న గర్వాన్ని తమవెంట తీసుకువెళ్ళారు తెలుగువారు. తెలుగువారు ఎక్కడున్నా తమదైన ప్రత్యేకతను చాటుకుంటూ తమ భాషా సంస్కృతీ పరిరక్షణ ప్రయత్నంలో క్రియాశీలంగా ఉంటారు. 1888లో రైల్వే స్థాపన, 1954లో భిలాయి స్టీల్ ప్లాంటు స్థాపనతో ఇతర ప్రాంతాల వారిలాగానే ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా వచ్చి, ఛత్తీస్‌గఢ్‌లోని భిలాయి - దుర్గ్, రాయిపూర్, బిలాస్‌పూర్, జగదల్‌పూర్, కోర్బా, కోండాగాం తదితర పట్టణాల్లో లక్షలాదిమంది స్థిరపడ్డారు. తెలుగు పాఠశాలలు, రామాలయాలు, బాలాజీ (శ్రీ వేంకటేశ్వర) మందిరాలు నిర్మించుకొని తెలుగు పండుగలయిన సంక్రాంతి, ఉగాది, శ్రీరామనవమి, ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలతో పాటు తెలుగువారు మరచిపోలేని యుగకవి 'గురజాడ', మహాకవి శ్రీశ్రీ, మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు, అమరజీవి పొట్టి శ్రీరాములు, సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం, తెలుగు నాటక దినోత్సవం సంస్మరణల వంటి కార్యక్రమాలు నిర్వహించుకుంటూ తమ సంస్కృతీ సాంప్రదాయాలను పరిరక్షించుకుంటూ వస్తున్నారు. ఇక్కడ నివసిస్తున్న తెలుగువారిలో ఎంతోమంది సాహిత్య, సాంస్కృతిక, సామాజిక, రాజకీయ రంగాల్లో సేవలందిస్తూ వస్తున్నారు.

**సాహిత్యరంగంలో...**

తెలుగు సాహిత్య రంగంలో ఛత్తీస్‌గఢ్‌లోని తెలుగువారు చేసిన/చేస్తున్న కృషి గుర్తింపదగినదే అవుతుంది. తెలుగు సాహిత్యంలో ఏర్పడిన అన్ని ధోరణులపైనా స్పందించి రచనలు చేశారు. కవిత, కథ, వ్యాసం, నాటకం, విమర్శ తదితర అన్ని ప్రక్రియల్లోనూ రచనలు వెలువడ్డాయి. భిలాయిలో భాగవతుల భావ నరసింహం సంపాదకీయంలో 'తెలుగువాణి' పేరుతో లిఖిత మాసపత్రిక మొట్టమొదట వెలువడింది. తర్వాత వై. రమణమూర్తి సంపాదకీయంలో 'తెలుగు వెలుగులు', సరస్వతుల సోమేశ్వరశర్మ సంపాదకీయంలో 'సుమాంజలి' లిఖిత మాసపత్రికలు ఒకటి తర్వాత మరొకటి వెలువడ్డాయి. 1977లో స్థాపించిన 'చేతన' సాహిత్య సమితి కొన్నేళ్లపాటు 'చేతన' పేరుతో మాసపత్రిక ప్రచురించింది. ఎల్. రుద్రమూర్తి సంపాదకీయంలో 'కేక' పేరుతో కొన్నాళ్లు సాహిత్య మాసపత్రిక వెలువడింది. 1973లో అభ్యుదయ రచయితల సంఘం శాఖను ఇక్కడ ప్రారంభించి దానికి ఓరుగంటి నరసింహారావు అధ్యక్షులుగా ఉండేవారు. 'శ్రీశ్రీ' మరణానంతరం, 'చేతన' ఆధ్వర్యంలో *శ్రీశ్రీ సంస్మరణ ప్రత్యేక సంచిక* వెలువడింది. 2000 డిసెంబరు నుంచి *భిలాయి వాణి* పేరుతో తెలుగు హిందీ ద్విభాషా మాసపత్రిక నేటికీ వెలువడుతూనే ఉంది. గూడ శ్రీరాములు *విమర్శ వ్యాసాల సంపుటి* వెలువడింది. అలాగే అతని *విమర్శ వ్యాసాలు* వివిధ దిన, వార, పక్ష, మాస పత్రికల్లో ప్రచురించబడుతూ వస్తున్నాయి. భాగవతుల భావనరసింహారావుగారి *భావనా తరంగాలు* మరియు *సౌందర్య సోపానాలు*, ఓరుగంటి నరసింహారావుగారి *విబ్జియార్*, *అంతర్ముఖం* కవితా సంపుటాలు మరియు *అణువు అహం* నాటిక, రావాడ

శ్రీనివాసరావుగారి *కొత్త ఆకాశం* కవితా సంపుటి మరియు *ఓ మనిషీ ఏది నీ గమ్యం* నాటిక, ఆర్.ఎస్. కృష్ణమూర్తిగారి *ఛాయాచిత్రాలు* కథాసంపుటి మరియు *ది ప్యాలెట్* అనే తెలుగు అనువాద గ్రంథం, వై.ఎస్. మూర్తిగారి *హరేరామ* నాటిక, ఎల్.ఆర్. రావుగారి *చీకటి* నాటిక, ఎల్. రుద్రమూర్తిగారి *కేక* మరియు *స్వర్ణకంకణం* నాటికలు పుస్తకరూపంలో వెలువడ్డాయి. శ్రీమతి కె. సంధ్యగారి *ప్రత్యూష రాగం* నవల *కలువబాల* పత్రికలో సీరియల్‌గా వచ్చింది. రాయిపూర్‌లోని భాగవతుల కృష్ణారావుగారి *నగ్న సత్యం, గీతాసూక్తి రత్నాలు* పద్యరూపంలో వెలువడ్డాయి. కె.వి.ఆర్. శర్మగారి *మధ్యతరగతి మనిషి* కవితా సంపుటి మూడు మార్లు ప్రచురించబడింది. ఆర్. గణపతిరావుగారి *వసంతకోకిల* గేయ సంపుటి మరియు *మాటలమారి* హిందీ అనువాద నవల వెలువడ్డాయి. ఇంకా శ్రీమతి టి. సుబ్బలక్ష్మి, ప్రతాప భావనారాయణ, డి. హైమవతి, భాగవతుల లలితశర్మ, తాతా ప్రభావతి, జి. విజయలక్ష్మి, గూడ యశోద, క్షితిజ, సుభద్ర, రుద్రవజ్ఝల రామకృష్ణారావు, ఎస్. మంజుల, భాగవతుల రాజేశ్వరి, ఎం. రఘురామ రెడ్డి, ఎ. శ్రీధర్, మొరిపల్లి బాబూరావు, రత్నా సుబ్బారావు, తాతా అప్పారావు, సి.హెచ్.వి. రమణ, కైలాసరావు, ఎం. జగ్గారావు, ఆర్. పాపారావు, గుమ్ములూరి ప్రేమకుమార్ తదితరులు చత్తీస్‌గఢ్‌లో ఉంటూ కవి, కథ, నాటక రచనలు చేశారు.

తెలుగు సాహిత్యానికే కాకుండా ఇక్కడ తెలుగువారు హిందీ, ఇంగ్లీషు మరియు ఛత్తీస్‌గఢ్ సాహిత్య రంగాలకు చేసిన సేవలను కూడ ప్రస్తావించక తప్పదు. డా॥ యోగానందం రాయిపూర్‌లో ఛత్తీస్‌గఢ్ విశ్వ విద్యాలయాన్ని స్థాపించారు. ఆయన ఇంగ్లీషులో రాసిన *ఫిలాసఫీ ఆఫ్ వేదాన్* అనే గ్రంథం కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయంవారు స్వీకరించారు. సి.వి. రావుగారు జ్యోతిర్లింగాలపై ఇంగ్లీషులో రాసిన వ్యాసం స్థానిక *సెంట్రల్ క్రానికల్* దినపత్రికలో సీరియల్‌గా ప్రచురించబడింది. డా॥ జె. శ్రీహరి రావుగారు అంతర్జాతీయ స్థాయిలో వెలువడే *ది స్కాలర్* ఇంగ్లీషు పత్రికకు కొన్నాళ్ళపాటు సంపాదకీయం చేశారు. డా॥ కృష్ణమూర్తి జనస్వామి రాసిన <u>పైలెన్స్</u> అనే ఇంగ్లీషు పుస్తకం బాగా ప్రాచుర్యం పొందింది. బి. కృష్ణమూర్తి, దీవానా రాసిన హిందీ కవితా సంపుటి *వివిధ* పుస్తక రూపంలో వెలువడింది. డా॥ హనుమంత నాయుడు రాసిన *ఛత్తీస్‌గఢ్ సాహిత్య మే కావ్య తత్వ్* అనే గ్రంథం, *జలతా హువా సఫర్* గజల్ సంకలనం. *కహె దేబే సందేశ్* ఛత్తీస్‌గఢీ జానపద గేయాల సంపుటి మరియు బాల సాహిత్యంలో ఎన్నో పుస్తకాలు ప్రచురించబడ్డాయి. పి. అశోక్‌శర్మ రాసిన *బాలాజీ తిరుపతి దర్శన్* మరియు *సచ్ సచ్ సచ్* కవితా సంపుటాలు హిందీలో వెలువడ్డాయి. ప్రఖ్యాత నవలా రచయిత ఘండికోట బ్రహ్మాజీరావు రాసిన తెలుగు నవలను సుశ్రీ, అంబా మాధవి హిందీలో *శ్రమిక్ గాడి*గా, శ్రీమతి డి. వీణారావు *విజయవాడ జంక్షన్* నవలను హిందీలో అనువాదం చేశారు. జగదల్‌పూర్‌కు చెందిన ఐ. జానకి రాసిన హిందీ కథల సంపుటి కూడా బాగా ప్రాచుర్యం పొందింది. బి.ఎన్. రావుగారు విద్యార్థులకోసం రాసిన *సఫల్ ఛాత్ర* పుస్తకాన్ని ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని మిడిల్, హయ్యర్ సెకండరీ పాఠశాలల గ్రంథాలయాల్లో పొందుపర్చుకుంది. ఇంకా శకుంతలా నాయుడు, దుర్గానాయుడు, బి. శ్రీనివాసమూర్తి, బి. కామేశ్వరరావు, వి. పార్థసారథి, పి. సత్యనారాయణ, పి. అనిల్ శర్మ మొదలైనవారు కూడా హిందీలో రచనలు చేశారు.

**రాజకీయ రంగంలో...**

బిలాస్‌పూర్‌కు చెందిన ఈద్పుగంటి అశోక్‌రావు కాంగ్రెసు ప్రభుత్వంలో రాష్ట్ర మంత్రిగాను, పి.ఎస్. మూర్తి రాయిపూర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయరుగాను పదవీ బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుత బిలాస్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయరుగా శ్రీమతి వాణీరావు పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జగదల్‌పూర్‌కు చెందిన సుభాష్‌రావు ఛత్తీస్‌గఢ్ హౌసింగ్ బోర్డు ఛైర్మన్‌గాను, రాయిపూర్‌కు చెందిన జి. స్వామి స్కౌట్ అండ్ గైడ్స్ రాష్ట్ర కమీషనరుగాను, శ్రీమతి విభారావు మహిళా ఆయోగ్ అధ్యక్షురాలుగా వ్యవహరిస్తున్నారు. రాయిపూర్ నగరనిగం కార్పొరేటర్‌గా నాగభూషణరావు, బిలాస్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎస్. శ్రీనివాసరావు, రామారావు, కామేశ్వరరావు, జగదల్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కె. యశోద, అన్నపూర్ణ నాయుడు; భిలాయి మున్సిపల్ కార్పొరేషన్‌లో జి. భానుమతి, లక్ష్మీపతి రాజు, పి. శ్యామసుందరరావు, పి. శ్రీనివాసరావు, సులోచన కార్పొరేటర్లుగా సేవలందిస్తున్నారు.

**సామాజిక సేవలో...**

సామాజిక సేవలో భాగంగా ఇక్కడ కార్మిక వాడల్లో

స్థిరపడిన తెలుగువారు తమ మాతృభాషా, సంస్కృతులను పరిరక్షించుకొనే క్రమంలో భిలాయి, బిలాస్‌పూర్‌లో తెలుగు పాఠశాలలు స్థాపించుకున్నారు. భిలాయిలో ప్రవాసాంధ్ర పాఠశాల, ఎమ్.వి.ఎన్. రావు మెమోరియల్ పాఠశాల, అభ్యుదయ ఆంధ్ర పాఠశాల, దామోదర సంజీవయ్య మెమోరియల్ పాఠశాల, టి.టి.పి. మెమోరియల్ పాఠశాల, ఆదర్శ ఆంధ్ర పాఠశాల, చరోదా తెలుగు పాఠశాల, బిలాస్‌పూర్ ఆంధ్ర సమాజం ఆధ్వర్యంలో తెలుగు పాఠశాలలు నెలకొన్నాయి. ఈ పాఠశాలలకు కావలసిన గదులు, ఫర్నిచర్, ప్రయోగశాల, గ్రంథాలయంవంటి ఇతరత్రా అవసరాలతోపాటు పనిచేసే సిబ్బందికి చెల్లించే వేతనాలు ఈ కార్మికుల పిల్లల నుంచి వచ్చే నెలసరి చందాలపైనే కావడంవల్ల వారికి కనీస వేతనాలు చెల్లించలేక అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను కోల్పోవలసి వచ్చింది. ఆర్థిక పరిస్థితులు ప్రభావం వలన నేడు నాలుగు పాఠశాలలే మిగిలాయి. ఆ నాలుగులో ఒకటి తప్ప మిగిలిన పాఠశాలలు హిందీ మీడియంగా (ఒక సబ్జెక్టు తెలుగు) మార్చేశారు. రెండు పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్-ఇన్-ఎయిడ్ లభించడం వల్ల కాస్తయినా బ్రతికి ఉన్నాయి. మిగిలిన రెండు పాఠశాలలు ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నాయి. బిలాస్‌పూర్ పాఠశాలను ఇంగ్లీషు మీడియం పాఠశాలగా మార్చేశారు.

**నాటక రంగంలో...**

ప్రవాసాంధ్ర నాటక రంగ చరిత్రలో 1967-1977 వరకు నవ్య యుగం నడిచింది. ఆ దశాబ్దాన్ని తెలుగు నాటక రంగ చరిత్రలో ఒక స్వర్ణయుగం అనడంలో అతిశయోక్తి కాదు. నటన, దర్శకత్వం, నాటక రచనల్ని అత్యున్నత స్థాయికి తీసుకువెళ్ళారు. ఆంధ్ర నాటక కళాపరిషత్తులో ప్రారంభమైన పోటీ నాటక పరిషత్తులు ఎక్కడ జరిగినా ఛత్తీస్‌గఢ్ (అప్పటి అవిభాజిత మధ్యప్రదేశ్) ప్రాతినిథ్యం వహిస్తూ వచ్చింది. ఉత్తమ ప్రదర్శనలిచ్చి ఎన్నో బహుమతులు పొందారు. ఛత్తీస్‌గఢ్‌లోని భిలాయి, బిలాస్‌పూర్, రాయిపూర్‌లో అనేక నాటక సమాజాలు వెలిశాయి. ఒక్క భిలాయిలోనే ఇరవైకి పైగా నాటక సమాజాలు ఏర్పడ్డాయి. నటనాలయ, శార్వాణీ ఆర్ట్స్, శ్రీ వేంకటేశ్వర నాటక కళాసమితి, ప్రాజెక్టు ఆర్ట్స్, బాపూ ఆర్ట్స్, సత్యసాయి సమాజ్, అపోలో ఆర్ట్స్, యంగ్‌మెన్స్ అసోసియేషన్, శ్రీనివాస కళానిలయం, బాలగంధర్వ నాట్యకళామండలి, శ్రీ నీలకంఠేశ్వర నాటక సమితి, ప్రవాసాంధ్ర ప్రజా నాట్యమండలి, భానోదయ నాటక కళాసమితి, కృష్ణా ఆర్ట్స్, కళ్యాణి ఫైన్ ఆర్ట్స్, అరుణోదయ ఆర్ట్స్, పద్మాలయ ఆర్ట్స్, కళాంజలి తదితర సాంఘిక నాటక సంస్థలు, శ్రీ వేంకటేశ్వర నాట్య కళామండలి, శ్రీ మజ్జి గౌరి నాట్య కళామండలి తదితర పౌరాణిక నాటక సంస్థలు స్థాపించబడ్డాయి. బిలాస్‌పూర్‌లో ఆంధ్ర సమాజం, కోర్బాలోని తెలుగు సమితి, రాయిపూర్‌లో వందన కళా సమితి కూడా నాటికలు ప్రదర్శించాయి. భిలాయి, రాయ్‌పూర్, బిలాస్‌పూర్‌ల్లో పరిషత్తు నాటిక పోటీలు నిర్వహించబడేవి. ప్రస్తుతం ప్రవాసాంధ్ర ప్రాంతాల్లో నాటిక పోటీలు బాగా తగ్గాయి. నటులకు బాధ్యతలు పెరగటం, అవకాశాలు తగ్గటం కొంతవరకు కారణమైతే ఈ తరానికి తెలుగు రాకపోవడం మరో కారణమయ్యింది. అంతో ఇంతో నాటకాలు ప్రదర్శిస్తున్నవారిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా గుర్తించకపోవటం, నంది నాటకోత్సవాల్లో ప్రవాసాంధ్రులకు అవకాశం కల్పించకపోవడం కూడా ఇక్కడ కళాకారుల్లో నిరుత్సాహం చోటుచేసుకుంటున్నది.

**కుల ధృవీకరణ సమస్య...**

సుమారు అరవై ఏళ్ళుగా ఇక్కడ నివసిస్తున్న తెలుగువారికి సామాజిక గుర్తింపు లభించడంలేదు. ఆంధ్ర రాష్ట్రంలో బి.సి., ఎస్.సి., కులాలుగా గుర్తించబడుతున్న కులాలను ఛత్తీస్‌గఢ్‌లో గుర్తించకపోవడంతో విద్యా ఉపాధి అవకాశాల్లో ఘోరంగా వంచింపబడుతున్నారు. ఇటు స్థానిక ప్రభుత్వం, తమ గజిట్‌లో ఈ కులాలు లేవని, అటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్థానికులు కారని కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయటం లేదు.

ఛత్తీస్‌గఢ్‌లో తెలుగు పాఠశాలలు బ్రతికిబట్టకట్టాలంటే ఒరిస్సా, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో తెలుగు పాఠశాలలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్నట్టే, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్చించి ఒక ఒప్పందం కుదుర్చుకోవాలి. ఛత్తీస్‌గఢ్‌లో నివసించే తెలుగువారి కులాలకు సామాజిక గుర్తింపు కల్పించడానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో చర్చించాలి.

- ఎల్. రుద్రమూర్తి

# శంకర్



ప్రపంచపటంలో తెలుగువారి జైకేతనం మరోసారి ఎగిరింది. ఇలస్ట్రేషన్, కార్టూన్, కేరికేచర్ కళలో తెలుగువారిదెప్పుడూ పై చేయిగానే వస్తుంది. బాపూతో శ్రీకారం చుట్టబడిన ఇలస్ట్రేషన్ చిత్రకళ చంద్ర, బాలి, మోహన్, విసు, అక్బరు, అన్వర్ లాంటి లబ్ద ప్రతిష్టుల కుంచెల ద్వారా తమదంటూ ఒక ప్రత్యేకత సాధించుకుంది. అయితే ఈ శైలిలో ఒక శాఖా భేదమయిన కేరికేచర్ కళలో తనకు తానుగా ఎదిగిన స్వయంభూ పామర్తి శంకర్.

పోర్చుగల్‌కు చెందిన వరల్డ్ ప్రెస్ కార్టూన్ సంస్థ యేటా ప్రపంచ స్థాయిలో ఉత్తమ ఎడిటోరియల్ కార్టూన్‌లు, కేరికేచర్‌లకు ప్రకటించే గ్రాండ్ ప్రీ అవార్డు ఈ యేడాది ఆయనను వరించింది. 2014వ సంవత్సరానికి గాను దాదాపు 64 దేశాల నుంచి పోటీకి వచ్చిన ఎంట్రీలలో శంకర్ గీసిన హక్కుల పోరాటయోధులు నెల్సన్ మండేలా కేరికేచర్ ఉత్తమ ఎంట్రీగా ఎంపికయింది. మండేలా మరణానంతరం శంకర్ గీసిన ఈ కేరికేచర్ 7-12-2013 సాక్షి పత్రికలో ప్రచురించ బడింది.



ఎ.బి.కె. ప్రసాద్

నల్గొండ జిల్లా నాగిరెడ్డి పల్లెలో అతి సామాన్య కుటుంబానికి చెందిన పామర్తి శంకర్ దీనిని సాధించగలిగారు. కార్టూనిస్ట్ లోకంలో దీనిని ఆస్కార్‌తో సమానమైనటువంటి అవార్డుగా పరిగణిస్తారు. ఈ అవార్డు క్రింద పదివేల యూరోలు (మన రూపాయలలో ఎనిమిది లక్షలతో సమానం.) నగదు లభిస్తుంది. శంకర్ ఏడేళ్లుగా సాక్షి దినపత్రికలో కార్టూనిస్ట్ పనిచేస్తున్నారు. ఫోరం ఫర్ పొలిటికల్ కార్టూనిస్ట్ సంస్థకు అధ్యక్షుడుగా వ్యవహరిస్తున్న శంకర్ గతంలో నాలుగు సార్లు అంతర్జాతీయ స్థాయిలో బహుమతులు సాధించారు.

2007వ సంవత్సరం నుంచి కేరికేచర్లతో సోలో ప్రదర్శన ఇచ్చారు. ఈ కేరికేచర్లు ఇతర చిత్రకళా ఖండాలతో సమానంగా అమ్ముడు కావటం మంచి ప్రోత్సాహాన్ని లభించింది అని తెలిపారు శంకర్. శంకర్ స్ఫూర్తితో మరింత మంది మరింత కళాకారులు వచ్చి తెలుగు వారి ప్రత్యేకతను అంతర్జాతీయం చేస్తారని ఆశిద్దాం.



పామర్తి శంకర్



ఆమె నడిచే అందం

# అట్టమీది బొమ్మలు

ముఖచిత్రం : ఆమె నడిచే అందం ! *(లార్డ్ బైరన్ పోయమ్)* చిత్రకారుడు – ఎమిలీ వెర్నన్



**ఆమె నడిచే అందం !**
**ఆమె చెక్కిలిమీద చుక్కల వెలుగు -**
**ఎంత స్వచ్ఛంగా - మెరుస్తోంది...**
**ఆ బుగ్గలు - మృదువుగా**
**ఆ కనులు కబుర్లు చెపుతూ**
**ఆ అరనవ్వు - వెలుగు రవ్వ!**
**మనసు ప్రశాంతం -**
**ఈ ప్రపంచం అంతా తన పాదాల చెంతనే -**
**అమాయకపు హృదయం - అందమే నడుస్తోంది...**

**రెండవ అట్ట :** *లండన్ గ్రేట్ అర్మండ్ సెయింట్ హాస్పిటల్ లోని సెయింట్ క్రిస్టోఫర్ చర్చి* – సెయింట్ క్రిస్టోఫర్ క్రైస్తవ మతపు తొలిదినాల్లో, ఆ మత వ్యాప్తికి తోడ్పడిన ఒక మత ప్రవక్త. మూడవ శతాబ్దపు కాలం నాటి రోమన్ దేశాధీశు డైన డేరియస్ వేధింపులకు గురైనవాడు. క్రీస్తును వేసిన శిలువను గుర్తించి, దానిని మోస్తూ క్రైస్తవ మతాన్ని ప్రచారం చేసేవాడనే ఒక గాథ ప్రచారంలో ఉంది. మిగతా క్రైస్తవ సన్యాసులైన పీటర్, పాల్, సెబాస్టియన్లకున్నంత గుర్తింపు అతను మొదట్లో పొందలేక పోయాడు.

7వ శతాబ్దకాలం నుంచీ అతని పేరు బయటకు వచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా రోమన్ కేథలిక్కులు అతని పేర చర్చిలు, కేథిడ్రల్‌లను నిర్మించారు. చాలా చోట్ల అవి పిల్లల ఆసుపత్రికి అనుబంధంగా నిర్మించ బడ్డవే. రెండవ పేజీలో కనిపిస్తున్నవి అతని పేరున నిర్మించ బడ్డ లండన్‌లో ఉన్న చర్చి అంతర్భాగ దృశ్యం. ఇది మరీ అంత పురాతనమైనది కాదు. కాలానుగుణంగా అనేక మార్పు చేర్పులకు గురవుతూ ప్రస్తుతం ఈ విధంగా రూపుతీసుకుంది. ఒకప్పటి బైజాంటయిన్ శైలికి చెందిన మొజాయిక్ (నేలపై కార్పెట్‌లా డిజైన్ చేయబడినది) క్రిందవైపు ఉండగా, చర్చి పై కప్పు భాగాన్ని విక్టోరియన్ వెబ్ (సాలె గూడు) శైలిలో ఉంది. (ఈ పై కప్పు విక్టోరియన్ కాలం నాడు జరిగిన మార్పు.) కేవలం ఆసుపత్రిలో రోగులకు సంబంధించినది కావటంతో ప్రార్థనా స్థలం చిన్నదిగా తగుమాత్రపు ఫర్నిచర్‌ను కలిగి ఉంది.



సెయింట్ క్రిస్టోఫర్ చర్చి

**మూడవ అట్ట :** *రామేశ్వర ఆలయ వైభవం*

రావణుని మరణానంతరం తనకు చుట్టుకున్న బ్రహ్మ హత్య మహాపాతకానికి ప్రాయశ్చిత్తంగా శ్రీరాముడు రామేశ్వరంలో ఓ జ్యోతిర్లింగాన్ని ప్రతిష్ఠించాడని స్థల పురాణం చెబుతుంది. కాశీని దర్శించిన వారంతా


రామేశ్వరం

సంవత్సరంలోపు దీనిని దర్శించాలనే ఒక సంప్రదాయం ఉండటంతో ఉత్తర, దక్షిణ భారతీయులను ఏకతాటిపై సంధించే ఒక సంస్కృతిక వారధిగా రామేశ్వరం ప్రసిద్ధి చెందింది.

భారతీయ భూభాగానికి కూతవేటు దూరంలో హిందూ మహాసముద్రంలోనున్న ఒక చిన్న దీవి పంబన్. ఇక్కడ ఉన్న పట్టణం రామేశ్వరం. ఇది తమిళనాడు రాష్ట్రంలోని రామనాథపురం జిల్లాకు సంబంధించినది. చారిత్రకంగా, నైసర్గికంగా ఈ భూభాగం భారతదేశానికి చెందినదే కావటంతో అక్కడికి చేరుకోవటం కోసం పంబన్ వంతెన నిర్మించబడింది. ఈ దీవికి 22 కి.మీ దూరంలో నున్న మరో దీవి పేరు మన్నార్. ఇది శ్రీలంకలోని జాఫ్నాకు దగ్గరలో ఉండటంతో ఈ రామేశ్వర దేవాలయాన్ని పెంపొందించటంలో జాఫ్నాను ఏలిన పరాక్రమ బాహు (1153-1186) వారి సంతతివారు కూడా ఉన్నారు. 7వ శతాబ్దానికి చెందిన ముగ్గురు నాయనార్లైన అప్పర్, సుందరర్, తిరుజ్ఞాన సంబంధార్ ఈ దేవుని ప్రశంసిస్తూ అద్భుతమైన రచనలు చేసి గీతాలు ఆలపించారు.

చిన్న దేవాలయంగా వెలసిన దీనిని పన్నెండవ శతాబ్ద కాలంలో మధురను పాలించిన పాండ్యరాజులు విస్తృత పరిచారు. అందువల్ల ఈ దేవాలయపు శిల్ప శైలి నాయకరాజుల కాలంనాటి శైలితో పోలిఉండటం ఆశ్చర్యమనిపించదు. ఆ తరువాతి కాలంలో విజయనగర సామ్రాజ్యాధిపతులు, 17వ శతాబ్దపు కాలంనాటి సేతుపతి వంశీయులు, మరీ ముఖ్యంగా ప్రధాన మంత్రైన ముతురులప్ప పిళ్ళై క్రుంగిపోతున్న ఈ దేవాలయాన్ని పునరుద్ధరించారు. అన్ని దక్షిణాది దేవాలయాలలానే దీనిని చూడడానికి రెండు కళ్ళూ చాలవు. దీర్ఘ చతురస్రాకారంలో రెండు ఆవృత్తులుగా నున్న వరండాలు ప్రపంచంలో అతి పొడవైన వాటిగా పేరు గాంచాయి. దేవాలయంలోకి ప్రవేశించిన వెంటనే ఉన్న మొదటి వరండా తూర్పు నుంచి పడమరకు 400 అడుగులు పొడవు, ఉత్తరం నుండి దక్షిణకు 640 అడుగుల పొడవు కలిగి ఉంటుంది. కింద నుంచి పైకి ఎత్తు 30 అడుగులు. వరండా వైశాల్యం 21 అడుగులు. వరండాకు అటు ఇటుగా 5 అడుగుల ఎత్తులో అరుగులు వరండా పొడవునా ఆనుకొని ఉంటాయి. లోపల నున్న రెండవ వరండా తూర్పునుండి పడమరకు 224 అడుగులు, ఉత్తరం నుండి దక్షిణకు 350 అడుగులు పొడవు కలిగి ఉంటుంది. ఇక్కడ వరండా వైశాల్యం 17 అడుగులు. ఈ వరండాల పై కప్పు లతలు, పువ్వులతో అలంకరించబడి భిత్తి చిత్రాలతో నేత్రపర్వంగా ఉంటుంది. ఈ వరండాలు 1212 రాతి స్తంభాలపై ఆధారపడి ఉన్నాయి. చూడడానికి స్థూలంగా ఒకేలా అనిపించినా ప్రతి స్తంభం కొన్ని ప్రత్యేక శిల్పాలతో దేనికదేగా ఉంటాయి. దక్షిణాది శిల్ప నైపుణ్యానికి ఇవి మకుటాభిమానం. ఈ దేవాలయంలో ఉండే పూజారులు దీక్ష తీసుకున్న మహారాష్ట్ర బ్రాహ్మణులు కావటం ఒక విశేషం.

**నాల్గవ అట్ట :** వసంతం – *చిత్రకారుడు :* విలియం సావేజ్ కూపర్.


వసంతం

శిశిరం వస్తే ఆ వెంట వసంతం రాకుండా పోతుందా ? ఋతువలలో రాణి వసంతం. అత్యంత స్వల్ప వ్యవధిలో ముగిసిపోయే మధురాతి మధురమైన ఋతువు. రాత్రి పగలు సమానంగా ఉండే రోజు ఫిబ్రవరి 22. ఈ ఋతుకాలంలోనే వస్తుంది. చలి తగ్గుముఖం పడుతుంది. ఎండ ఇంకా పదును తేలదు. పువ్వుతో, ఆమనితో, సీతాకోక చిలుకలతో, కోయిల కుహూ రవళులతో ప్రకృతి నిండు గర్భిణిలా కల కలలాడుతూ వికసించే కాలమిది. ఒక నొక రోజు ఉదయకాంతులీనుతున్న సమయంలో తన ప్రియుని రాకకై నిరీక్షిస్తూ ఎదురు తెన్నులు చూస్తున్న ఒక జవ్వని చిత్రం. ఈ చిత్రంలో నున్న సుందరి పాశ్చాత్య సుందరయినా వసంత కాలపు తొలి యౌవనపు ఆరాటం అనుభూతులు, అందరికీ సమానమే.

# చాసో కథల్లో సౌందర్య దృక్పథం

- డా. కాకుమాని శ్రీనివాసరావు

సౌందర్యం అంటే ఏమిటి? అన్నది మనిషికి అంతుచిక్కని ప్రశ్న. అటు పశ్చిమ, ఇటు తూర్పు దేశాలలో శతాబ్దాలుగా దీని సమాధానం కోసం లోతైన అన్వేషణ సాగుతూనే ఉంది. చరిత్రలో దీనికి సంబంధించిన నిర్వచనాలు చాలానే ఉన్నాయి. "The beautiful is that which is benificial, useful and has power to produce something good" ఉపయోగపడేదీ, ప్రయోజనకరమైనదీ అయిన మంచిని కలిగించేదీ సౌందర్యం అని సోక్రటీస్ చెప్పి, తదనంతరం ఆయనే, "Beauty is that pleasant which comes through the senses of hearing and sight" అని ఇంద్రియజన్యమైన ఆనందంగా కూడా చెప్పాడు. Plato సౌందర్యానికీ మనిషికీ మధ్య ఒక స్పిరిట్యువల్ సంబంధాన్ని ఏర్పరచి చెబుతూ "If anything is beautiful it is beautiful for no other reason than that it partakes of absolute beauty" అని అభిప్రాయపడితే Hegel కూడా ఈ వరుసలోనే "Beauty is the shining of the Idea through matter" అని అంటాడు. *

ఈ గందరగోళం నుంచీ బయటపడేయటానికా? అన్నట్లు అరిస్టాటిల్ ఈ భావ వాదానికి వ్యతిరేకంగా "Beauty is a matter of size and order" అని వస్తువుని ప్రధానం చేసి సమస్యను మళ్లీ మొదటికి చేర్చాడు.

ఇక ఆ తర్వాతి నుండీ చరిత్రలో సౌందర్యాన్ని వస్త్వాశ్రయ, భావవాదాల వెలుగులో దర్శిస్తూ వచ్చారు. తరువాత కమ్యూనిస్టులు బయలుదేరి శ్రమైక జీవన సౌందర్యమంటూ, ప్రపంచంలోని సుందర నిర్మాణాలన్నీ మానవశ్రమ సృష్టించినవేనంటూ సౌందర్యాన్ని శ్రమ, సమాజ జీవనం కుదురులో నుండి చూడటం మొదలు పెట్టారు. రష్యన్ సౌందర్యవాది Nikolai Chernyshevsky "beauty is life as it should be" అని తేల్చేసాడు. ఇంతగా చర్చ జరిగినా బోరిస్ పాస్టర్‌నాక్ అన్నట్లు "The secret of beauty is the secret of life" అని చివరికది ఒక రహస్యమైపోయింది. తను సౌందర్యాన్ని అన్వేషించడానికి చేసిన ప్రయత్నాన్ని, ఒక సముద్ర ప్రయాణంతో పోల్చాడు, అంతూ దరీ తెలియకుండా ఆ ప్రయాణం సాగిపోతూనే ఉందని చెప్పు కొచ్చాడు.

అయితే ఈ విషయంలో భారతదేశంలో ముందు నుండీ ఒక స్పష్టత ఉంది. మనకి సౌందర్యం ఒక అనుభవం. అయితే అది రసానుభవం. భరతుడి నుండీ కళాపరంగా సాగిన ఈ సౌందర్యాన్వేషణ శ్రీ అరబిందో దగ్గర ఒక కొలిక్కి వచ్చింది. "The beauty is considered by the objectification of pleasure. It is pleasure objectified" అనీ "Beauty is Ananda taking form" అని ఆయన నిర్వచించాడు, అంటే ఆనందానికి తొడగబడ్డ రూపక సౌందర్యం. చిత్రంగా జార్జి శాంతాయనలాంటి వాళ్లు కూడా ఇలాగే "Beauty is pleasure regarded as quality of a thing" అని చెప్పటం గమనార్హం.

మొత్తానికి ప్రపంచానికీ ప్రకృతికీ మానవుడికీ మధ్యన ఉండే ఈ సౌందర్యాత్మక సంబంధాలను అధ్యయనం చేయడానికి 1750 నాటికి ఒక శాస్త్రం ఏర్పడింది.

జర్మనీలోని బెర్లిన్‌కి చెందిన Alexander Grottlieb Baumgarten (1714-1762) తన డాక్టోరల్ థీసిస్‌లో "Aesthetic" అనే పేరుతో ఈ అధ్యయనాన్ని ఒక శాస్త్రంగా మొదలుపెట్టాడు. ఆయన ప్రకారం ఈస్తటిక్స్ అంటే "Science of sensory Consciousnes. ఈ శాస్త్రంలో మనిషి ప్రకృతి నుండి చేసే ఇంద్రియపరమైన గ్రహణ,

ఆస్వాదన (Sensory and perceptical Cognition) లను గురించి ఆయన చర్చించాడు. ఈ congnitionకు మన 'ఆస్వాదన' అన్నది దగ్గరి పదం. గ్రీకు శబ్దమైన "aioontikos " అంటే perceptual congnition, అంటే ఇంద్రియపరమైన ఆస్వాదన అని అర్థం. ఈ ఆస్వాదన చర్చించబడేది సాధారణంగా లలితకళలలో కాబట్టి ఆ తర్వాత Hegel ఈ శాస్త్రాన్ని "Philosophy of fine Art" అన్నాడు. అదే 1993 నాటికి తెలుగులో "కళాతత్త్వశాస్త్రం" అయింది.

మనిషి తన పంచేంద్రియాల ద్వారా ప్రపంచం నుంచి అనుభూతులను పొందుతాడు, అవి ఆస్వాదనకుగురై ఆనందాన్ని కలిగిస్తాయి. అవి తిరిగి కళల్లో సృజించబడినపుడు వాటిని దర్శించి, అలౌకికమైన రసానందాన్ని పొందుతాడు. ఇలా భౌతికప్రపంచం కళాసృజనలో అనుభవ ప్రపంచంగా మారుతుంది. ఈ మార్పిడి ఎంత సజీవంగా, ఎంత నైపుణ్యంతో సాగితే ఆ సృజన అంతగా కళాత్మకతను సంతరించుకొని సౌందర్యాన్ని సాధిస్తుంది. ఈ ప్రక్రియలో కళాకారుడి ప్రత్యేకత, నైపుణ్యం 'ప్రతిభ' గా చెప్పబడింది. ఇక్కడ సౌందర్యంతో కేవలం ఆనందమేకాక, ఇతర మానవీయ విలువలు కూడా భాగమవుతాయి.



చాసో

సాహిత్య కళకి సంబంధించినంత వరకు ముఖ్యంగా కథకి 'జీవితం' ముడిసరుకు. తన ఎదుట మరో సమాంతర ప్రపంచం ఆవిష్కృతమై అందులో తన అనుభూతులు, సకల మానవాళి ఆశలు, ఆకాంక్షలు, జీవన సాఫల్యాలు ప్రదర్శితమవుతూ ఒక సమాంతర జీవిత ప్రస్థానం సాగడాన్ని పాఠకుడు ఆసక్తిగా గమనిస్తాడు. ఆ సమాంతర 'అనుభవ' ప్రపంచంలో భాగమైపోయి సాధారణీకరణం గావించ బడతాడు. ఈ రకమైన ఇంద్రజాలాన్ని కలిగించడంలో రచన కళాత్మకతను సంతరించుకొంటుంది. మొత్తంగా ఆ రచన పాఠకుడి మీద కలిగించే అనుభవమే సౌందర్యం. సంజీవదేవ్ దీనినే ఇలా చెబుతాడు. "మానవుని ద్వారా సృష్టించబడని సృష్టిలోని కౌశలాన్ని ప్రకృతి అంటే, మానవుని ద్వారా సృజించబడిన కౌశలాన్ని కళ అంటాం". ** సౌందర్యాన్ని గురించిన ఆయన నిర్వచనం ఈ విషయాన్నే బలపరుస్తోంది, "వ్యక్తిలోని ఆనందం తన బయటి అస్తిత్వంలో గోచరించడం సౌందర్యం".

బాహ్య ప్రపంచంలోని సౌందర్యాన్ని కళాప్రపంచంలోకి కళాకారుడు ఎలా తీసుకొస్తున్నాడనే ప్రక్రియను ఈస్తటిక్స్ వివరించగలుగుతుంది. చాసో రాసిన *దుమ్ములగొండె*, *మాతృధర్మం* లాంటి కథలలో ఈ ప్రక్రియను గమనిస్తే, వాటిలో వ్యక్తమైన సౌందర్యాన్ని అవగతం చేసుకోవచ్చు. కథలోనికి పాఠకుడిని తీసుకెళ్లడానికి చాసో తన కథల్లో చాలాచోట్ల విరివిగానే ఈ ఇంద్రియ గ్రహణం ద్వారా జరిగే ఆస్వాదనను మార్గంగా ఉపయోగించుకొన్నారు. *దుమ్ములగొండె* కథలో ఆద్యంతం ఈ రకమైన ఆస్వాదన మనకు ఎదురవుతుంది. కథలో ముగ్గురు స్నేహితులు ఒక వెన్నెలరాత్రివేళ కొండమీదికి షికారు బయలు దేరుతారు. వారి నడక చప్పుడు గురించి చెబుతూ "బూట్లనాదం మద్దెలమోత లాగుంది" అంటాడు కథకుడు. కథ చెప్పే వ్యక్తికి చెప్పులు ఉండవు. అతని అరికాళ్లు "మధ్యాహ్నపు తారురోడ్డు దోసెలరేకులా వేడెక్కి నూనె కక్కుతూ ఆవిరులొస్తున్నా భరిస్తాయి" అని చెప్పటంలో బూట్లనాదం ధ్వని అయితే ఇది స్పర్శకు సంబంధించినది.

దృశ్యపరంగా ఈ కథ గొప్ప కవితాఖండికలాంటిది. *"నల్లని నీడలో గోతెడు నీళ్ల వెన్నెలపడి తెల్లగా చెంగల్వ పువ్వులాగా వికసించాయి"* లాంటి దృగింద్రియానికి చెందిన ఆస్వాదనలు ఇందులో చాలాచోట్ల ఉన్నాయి. ఆ వెన్నెలరాత్రి వారి ప్రయాణంలో రోడ్డువార కాలువలో నక్షత్రాలు వారికన్నా వడిగా పరిగెడుతున్నాయట, గుండ్రపటి గోతినీట్లో నక్షత్రాలు గోతినిండా గడ్డిపువ్వుల్లా వికసించినట్లున్నాయని వర్ణించిన దృశ్యాలు పఠిత కన్నులకు, మనసుకు హాయిని కలిగిస్తాయి. ఈ వర్ణనలు పాఠకుడిని కథలోనికి తీసుకెళ్లడానికి పూర్తిస్థాయిలో పనిచేస్తాయి.

"చుట్టూ కొండలు వలయంగా చుట్టేస్తాయి. ఆ మధ్యనున్న భూస్థలం గంగాళం లాగున్నాది". అని వారు నిలబడిన కొండలోయను వర్ణించి, అలాంటి "గంగాళం లాంటి భూవలయంలో కళపెళ ఎసరు ఉడుకుతున్నట్లు కప్పలు మోత పెడుతున్నాయి. దిగంతాల్లోంచి ఏదో

తొణికిపోతున్నట్లు కప్పలమోత తిరగబెడుతున్నాది'' అనివర్ణించడంతో ఆ కప్పల మోత భూనభోంతరాలను సైతం వ్యాపించి హోరెత్తిస్తుందనిపిస్తుంది. కంటికీ చెవికీ నిండుగా చేరే ఈ విషయం ద్వారా ఆస్వాదన జరుగుతూ ఇతర విషయాలు మరిచిపోయి పఠిత కథలో మమేకమవుతాడు.

కథలో రచయిత చెప్పాలనుకొన్నది చీకట్లో కలిగే చిత్త భ్రాంతిని గురించి కూడా. అక్కడి కీచురాళ్లు, కీటకాల శబ్దాలు, ఎవరివో గాజుల సవ్వడిలాగా వినబడి, తుళ్లిపడి వెనక్కు చూస్తాడు. వెనక్కు తిరిగిచూస్తే ఏ అప్సరసలూ కనిపించరు. "కీటకాలు కోటానుకోట్ల తంత్రీస్వరాలు మీటు తున్నాయి. కప్పలమోత గంభీరంగా వినబడుతున్నాది. కీటకగానం వీణా నిక్వాణంల్లాగా సహస్రతంత్రుల మీంచి వినబడుతున్నాది. మా నడకకి కప్పలమోత మిలిటరీ బేండు". "దెయ్యాల్లాగ జుత్తులు విరబోసుకొని ఈతలు నడుస్తున్నాయి" లాంటి వర్ణనలు వారికి కలుగుతున్న విభ్రాంతినీ, విస్మయాన్నీ తెలియజేస్తున్నాయి.

ఆ నడక ముందుకు సాగుతుండగా "నా నుదురు మీంచి, ముక్కు మీదికి జారి ఘర్మ సలిలం ఉప్పగా వద్దాది. తడిసిపోయిన చొక్కాలోంచి సమీరం వెళ్లి నా త్వగింద్రియానికి చల్లగా చక్కిలిగింత పెడుతున్నాది", ఈ వర్ణనలో చెమట ఉప్పదనం రసనేంద్రియానికి చెందగా, చల్లటి చక్కిలిగింత స్పర్శకి చెందినది. ఇక్కడ చాసో "త్వగింద్రియం" అనే పదాన్ని కావాలనే ప్రయోగించారు. ఎందుకంటే దానిని మనకి గుర్తుచేయటం కోసమే. నిత్య నైమిత్తిక బతుకు పరుగులోపడి మనం ఇంద్రియ గ్రహణం, ఆస్వాదనల విషయం మరిచిపోయి మొద్దుబారిపోయి ఉంటాం. అందుకనే ఆ ఆస్వాదన తెలియజేయాలనే ఉద్దేశంతోనే త్వగింద్రియం అనే పదప్రయోగం ఆయన చేసారనిపిస్తుంది.

అక్కడ ఆ వెన్నెల రాత్రి కొండమీద నడుస్తున్న ఆ స్నేహితులకి ఒక నక్క కనిపిస్తుంది. అది నిజమో, భ్రాంతో తెలియదు. దుమ్ములగొండె గురించి అక్కడి జానపదుల కథలు, విశ్వాసాలను గురించి వారు చెప్పుకొంటారు. నలుగురిలో భయం ప్రవేశిస్తుంది. ఆ భయంలో అక్కడి బండరాళ్లన్నీ దుమ్ముల గొండెల వలె కనబడటం మొదలు పెట్టాయి. వారి నడక జోరుగా సాగుతోంది. అప్పుడక్కడి బండరాళ్లు వారికెలా కనిపిస్తున్నాయో చాసో ఇలా వర్ణిస్తారు. "రాళ్లన్నీ జంతువుల్లాగ కదులుతున్నాయి. ఒక రాయిని చూచి జంతువనే నిర్ధారణ చేసుకొన్నాను. దాని నడ్డీ మూతీ గాడిదాకారంలోనే కనిపించాయి. తేరిపారచూస్తే మహా వికృతమైన దుమ్ములగొండె స్వరూపం కనబడ్డాది. ఒక్కడుగు ఆగిచూస్తే రెండు బండరాళ్లు కనబడ్డాయి. కానీ రాళ్లన్నీ దుమ్ముల గొండెల్లాగా కనబడుతున్నాయి."

వారు ముందుకు నడుస్తూ ఒక మామిడి తోటలోకి వెళ్లారు. రోడ్డు నిండా మామిడిచెట్లు ఆవరించి ఉండటంతో వాటి నీడలు రోడ్డంతా తివాచీలు పరిచినట్లు ఉన్నాయని కథకుడు చెబుతాడు. ఈ వెన్నెల నీడల వ్యవహారం గురించి ఒక నేపథ్యం కథలో ఇలా ఉంటుంది. "మా వీధిమెట్ల మీద కూచుని వాకిట్లో పెద్ద పువ్వులాగ పద్ద కొబ్బరిచెట్టు నీడనీ, గోడమీద రంగవల్లికల్లాగ ఏర్పాటు అయిన తుప్పల నీడనీ చూసి ఆనందిస్తూ రాత్రి రెండు మూడు గంటలదాకా సిగరెట్లు కాలుస్తూ కూర్చున్న రోజులున్నాయి." ఇక్కడ సిగరెట్టు అని కాక, చుట్ట అని చెబితే చప్పున చాసో గారే గుర్తుకొచ్చేవారు. "నేనెరిగిన చాసో" అనే వ్యాసంలో వారి కుమార్తె చాగంటి తులసి గారు ఒక నేపథ్యాన్ని అందించారు. "చీకట్లో కూచోడం అంటే చాసోకి చాలా ఇష్టం. చీకటి చిరువెలుగుల మధ్య కొబ్బరిచెట్ల నీడలనీ, అరటిచెట్ల నీడలనీ, దట్టమైన రంగులనీ, గాలికి కదలాడే ఆ నీడల అందాన్ని చూస్తూ చుట్ట కాల్చుకోవడం అంటే ఆయనకి మహాఇష్టం. మధ్య రాత్రప్పుడు తను ఇలా వీధి తలుపులు బార్లా తీసుకొని కూచోడం, అమ్మ దెబ్బలాడ్డం మామూలు. ఏ దొంగన్నా దూరతాడు! అన్నది ఆమె భయం". మామూలు మనుషులు కుండే ఇలాంటి భయాలు చాసోకి లేవు. ఆయన ఒక చోట తనను గురించి ఇలా చెప్పుకొన్నారు. "నేను, అంటే జన పరిశీలకుణ్ణి. పని గట్టుకొనే నేను జన పరిశీలకుణ్ణి అయ్యాను." ఆయన జన పరిశీలకుడే కాదు, ప్రకృతి పరిశీలకుడు కూడా. ఒక సౌందర్యారాధకుడిగా, రాజసంతో, ఆత్మగౌరవంతో ఆయన బ్రతికినట్లు తెలుస్తోంది. ఈ సన్నివేశం గుర్తుకొచ్చినప్పుడల్లా తిలక్ 'అమృతం కురిసిన రాత్రి' జ్ఞాపకం వస్తుంది. అందులో కళ్ల చివర కాంతి సంగీత గీతాల్ని రచిస్తున్న వాడూ, ఎర్రని పెదవుల మీద తెల్లని నవ్వుల వీణల్ని మీటుతున్నవాడూ, ప్రకృతి పలికిన అనంత జీవిత చైతన్యోత్సవ ఆహ్వాన గీతాన్ని వినిపించుకున్నవాడూ చాసోనే అనిపిస్తుంది. అర్ధరాత్రివేళ వెన్నెల నీడల రూపాల్ని చూస్తూ రాత్రి రెండైనా మూడైనా ప్రకృతిలో మమేకమైపోయిన

చాసో గొప్ప ప్రకృతి ప్రేమికుడు. ఈ ప్రకృతి సౌందర్య ఆరాధనకి అడ్డుపడుతున్నదేమిటి? ఆ ఆటంకాన్నే *దుమ్ములగొండె* కథలో చూపించారు. కొండమీంచి ఆ ముగ్గురు చూడాలను కొన్న సౌందర్యం ఏమిటి? "కుమిలీ ఘాటీ మీది ఏకాంతంలో సోపానాలు, వెన్నెట్లో మనోజ్ఞంగా కోనాడ సముద్రతీరం దాకా కనపడే విశాలదృశ్యం. సర్పంలాగా మెలికలు తిరిగి మెరిసిపోతూ కనపడే చంపావతీ నదీ చూసి అనుభవానికి తెచ్చుకునే అవకాశం ఆ రాత్రి లేకపోయింది" ఎందుకని? 'భయం!'

ఈ భయాన్ని గురించిన రాసిన కథే దుమ్ములగొండె. భయం అనేది కేవలం భావమే కాదు, అది స్థాయీ భావం. దీన్ని అనుభవంలోకి తీసుకొచ్చిన వర్ణన ఈ కథలో పరాకాష్ఠ, "నా మీద దెయ్యంలాగ భయం ఆవహిస్తూంది. మేకపోతు గాంభీర్యంతో ముందుకు అడుగులు వేస్తున్నాను. కాని గుండె జారిపోతున్నాది. శరీరంలో రక్తం, మాంసం, ఎముకలూ మాయమై పోతున్నాయి. శరీరం గుల్లతేరిపోయి ఆ ఖాళీ నిండా భయం నిండిపోతున్నాది." ఇక్కడ పాఠకుడికి భయానక రసానుభవం కలుగుతుంది. భరతుని రస నిష్పత్తి క్రమం ఒకసారి గుర్తుకు తెచ్చుకోండి.

**"నహి రసాదృతే కశ్చిదప్యర్థః ప్రవర్తతే**
**తత్ర విభావాను భావ వ్యభిచారి సంయోగాద్రస నిష్పత్తిః** - *1*

దానికి ధనుంజయుని వ్యాఖ్య ఇది -

**"విభావైరను భావైశ్చ సాత్త్వికైర్వ్యభిచారిభిః**
**ఆనీయమానః స్వాదుత్వం స్థాయీ భావోరసస్మృతః"** - *2*

విభావాలు, అనుభావాలు, వ్యభిచారీ భావాలు స్థాయీ భావంతో సంయోగం చెంది, ఆ స్థాయీ భావమే రసంగా పర్యవసిస్తుంది అనేది పై శ్లోకాల తాత్పర్యం. సాహిత్యకళ భావానుభూతుల సంయోగంతో రసానుభవాన్ని కల్గించేది.

రచయితకు ఈ భావాల పట్ల సున్నితమైన వైఖరి, పరిజ్ఞానం ఉండాలి. మొత్తం భరతుడు చెప్పిన భావాలు 49. అందులో 8 స్థాయీ భావాలు రసానుభవానికి మూలాధారాలు. ఈ స్థాయీ భావాల రసనా, చర్వణా, ఆస్వాదనలే రససారం.

భయం అనేది ఒక స్థాయీ భావం కాబట్టే ఆ భావాన్ని చాసో ఇంత లోతుగా వర్ణించారు. ఈ కథ భయానక రసానికి సంబంధించింది. భరతుడు స్థాయీ భావాలను ఎనిమిదింటిని ఇలా చెప్పాడు -

**"రతిర్హాసశ్చ శోకశ్చ క్రోధోత్సాహౌ భయం తథా**
**జుగుప్సా విస్మయశ్చేతి స్థాయి భావాః ప్రకీర్తితాః"** --- *3*

ఈ స్థాయీ భావాలనుంచీ పుట్టే రసాలను ఎనిమిదింటిని భరతుడు చెబుతాడు-

**"శృంగార హాస్య కరుణ రౌద్ర వీర భయానక**
**భీభత్సాద్భుత సంజ్ఞా చేద్యష్టా నాట్యే రసాఃస్మృతాః"**

'దుమ్ములగొండె' కథలో విస్మయము అనే స్థాయీ భావం కూడా అనుభవంలోకి రావటంచేత ఇందులో అద్భుత రసానుభవం కూడా కలిగించి నట్లయింది. తన కథలో ఈ రసానుభవాల ప్రస్థావన చేయుటం ద్వారా చాసో విమర్శకులకు ఒక "క్లూ" అందించారు. కథ మొదట్లో "భయంకరమైన ఏకాంత సీమలో సుందర జాగరం" అనీ, కథ చివర్లో "ఆనాటి దుమ్ములగొండె అనుభవం జీవితంలో ఘనమైన భ్రాంతిమదాలంకారం" అని చెప్పి తన కథలో ఈ రసనానుభవం ఉన్నదని గుర్తించ మంటున్నారు చాసో. తన కథల మీద సరైన విమర్శ రాలేదని ఆయనకి ఒక అసంతృప్తి కూడా ఉండింది.

నిజానికి చాసో రాసిన కథలేవీ వాస్తవంగా జరిగినవి కావని ఆయన చెప్పారు. ఒక చిన్నాజీ తప్ప. "నా కథల్లో ఉండే పాత్రలూ, అందులో సంఘటనలూ, భాషా నేను కూర్చుకున్నవే. ఏవీ జరిగినవి కావు. కల్పించుకున్నవే అన్నీనూ! అది సహజంగా జరిగిందా? అన్న భ్రాంతి కల్గించేట్టు రాయటానికి ప్రయత్నం చేసాను" అని కూడా ఆయన చెప్పుకొన్నారు. అంటే భౌతిక ప్రపంచానికి సమాంతరంగా ఒక అనుభవ ప్రపంచాన్ని ఆయన సృష్టించినట్లే. ఆ అనుభవ ప్రపంచం భౌతిక ప్రపంచములో సహజమైనట్లు ఆయన సృష్టి చేసారు. ఈ నేర్పునే కళ అంటాం.

"కథ అంటే చెప్పేది. ఏం చెప్పినా అది కథే అవుతుంది. కానీ ఆ కథ, సాహిత్యం కావాలంటే అందుకు కళ అవసరం. కళ అంటే నేర్పు. స్వతస్సిద్ధంగా అది అబ్బవచ్చు. కళాత్మకంగా కథ రాయలేని వాళ్లు అధిక సంఖ్యాకులు. బహు తక్కువమంది మాత్రమే మంచి కథలు రాయగలరు". అని కళాత్మకత ప్రాధాన్యతను గుర్తించమంటున్నారు. కథారచన ఒక సాధనలాంటిదనీ, నిజానికిప్పుడు అలాంటి సాధకులూ, సాహిత్యాభిలాషతో కథలు రాసే వాళ్లులేరనీ, ఇప్పుడు రాస్తున్న వాళ్లంతా పత్రికలకోసం రాస్తున్నారనీ

1985 నాటి రచయితల నుద్దేశించి ఆయన అన్నారు. చాసో నిజానికి "Perfectionist". మధురాంతకం రాజారాం ఆయన్ని అలానే గుర్తించారు. చాసోకి "ఎందుకు పారేస్తానునాన్నా" కథ రాయటానికి 3సం॥లు పట్టింది. నేను చించి పారేసినన్ని కథలు ఎవడూ చించిపారేసి ఉండడు' అన్నది ఆయన మాటే. ఒక కథను నాలుగైదుసార్లు రాసి, చింపి, తిరిగి ఆరవసారి రాసే అలవాటు తనదని చాసో చెప్పుకొన్నారు. ఇలా పూర్ణమైన అభివ్యక్తిని సాధించే ప్రయత్నం చేసారు. క్రోచీ చెప్పినట్లు పరిపూర్ణ అభివ్యక్తే సౌందర్యం. ఆ రకమైన సౌందర్యం చాసో రచనల్లో కనిపిస్తుంది.

నేను దేన్నైనా చెప్పదల్చుకుంటే బొమ్మ కళ్లకి కట్టినట్లు చెప్తేకాని కథ ముందుకుసాగదని చెబుతూ *రథయాత్ర* కథలో *"బొంగరం ముల్కీ అంచుల మీంచి గిర్రున తిరిగి తికమకగా కొట్టుకుంటూ ఆగిపోయింది"* అన్న వాక్యం రాసేటప్పుడు "ఆ వాక్యం స్ఫురించక రాత్రి 10గం॥ల నుండి 2గం॥ల వరకు ఆలోచించాను, రాత్రి రెండింటికి ఆ వాక్య నిర్ధారణ జరిగాక మిగిలిన కథ చకచకా దానంతట అదే సాగింది" అని తన అనుభవాన్ని గురించి చెప్పుకొన్నారు.

ఒక ప్రక్రియగా కథలోని మర్మాలు, జవజీవాలు ఆయనకు బాగా తెలుసు. ఒక్కొక్క కథకు ఒక్కొక్క భాష ఉంటుంది. కథను బట్టి పాత్రలను బట్టి కథలు రాయాలన్నది ఆయన నమ్మకం. సంక్షిప్తత కథల్లో ఆయన సాధించిన గొప్ప విజయం. తన కథని ఒక Lyric (కవితాఖండిక) లాగా రాయాలన్నది ఆయన ఆశయం. కవిత్వంలోలాగే వ్యర్థ పదాలు లేకుండా, ఇమేజరీలు, ఆస్వాదనలతోటి, భావానుభూతులు, భావోద్వేగాల అభివ్యక్తితోటీసాగే ఆయన కథలోని డిక్షన్ గుర్తుండిపోతుంది. 'ఆఁవెత' కథను ఒక సభలో చదివాక శ్రోతలు, వన్స్‌మోర్ అని కేకలు పెట్టి, మళ్లీ మళ్లీ చదివించు కొన్నారని అందరికీ తెలుసు. కథను ఆ పరాకాష్ఠకు తీసుకెళ్ళడం చాసోకి తెలుసు.

కథకో భాష ఉండాలి అని ఆయన చెప్పిన విమర్శసూత్రం 'ఆఁవెత' కథకు బాగా సరిపోయింది. కథలోని మాండలికమే కాకుండా, ఒక గ్రామీణ రజకస్త్రీ మాట్లాడినట్లే కథంతా సాగుతుంది."బండలా మరింత బరువెక్కి బతికాను, బతుకు" లాంటి భావోక్తులు కథలో చాలా ఉన్నాయి. "ఏం చంబర పడ్డానేం చంబరపడ్డాను" అనే భావోక్తి కథా ప్రారంభంలో మొదలై, కవిత్వంలో వలే పునః పునః ఆవృత్తమయి భావ తీవ్రతను తెలియజేస్తుంది. ఈ కథలో చాసో శిల్పం విషయంలో విశ్వరూపం చూపించారు. శిల్పమంటే ఏమిటని చెప్పడానికి ఒక చిన్న కథ చెప్పు కొంటుంటారు. ఒక వృద్ధశిల్పి, పెద్ద గుండ్రని బండ ముందు కూర్చుని ఉన్నాడు. చేతిలో ఉలీ, సుత్తి ఉన్నాయి. అతని వద్దకు ఓ కుర్ర శిల్పి వస్తాడు. "ఈ బండరాయిలోనుంచీ మంచి గుర్రాన్ని చెక్కడమెలా? అని ప్రశ్నిస్తాడు. దానికి ఆ వృద్ధశిల్పి "దానిదేముంది? ఈ రాయిలో గుర్రం కాని భాగమంతా ఉలితో చెక్కి తీసిపారవేస్తే సరి! గుర్రం గెంతుతూ బయటకు వచ్చేస్తుంది" అన్నాడు. దీన్నే సెన్స్ ఆఫ్ ప్రపోర్షన్ అంటారు. చాసో ఈ విషయంలో ఒక Perfectionist. అరిస్టాటిల్ ఈ సెన్స్ ఆఫ్ ప్రపోర్షన్‌ను దృష్టిలో పెట్టుకొనే "Beauty is a matter of Size and Order" అన్నాడు. దీనిని సిమ్మెట్రీ అంటారు. ఇదిలయ (Rhythem), భారసామ్యం (Balance) సౌష్ఠవాల (Proportion) కలయిక. ఈ మూడు ఎందులో ఉంటే అది కంటికి హాయిని కలిగిస్తాయిని, వీటిని సుందరాలంటామని సంజీవదేవ్ చెబుతాడు.

చాసో ఔచిత్యవాది. భారతీయ ఆలంకారికుడు క్షేమేంద్రుడు ఔచిత్యంలో ఉన్నదే సౌందర్యమయినదని చెబుతాడు. "నాకు నేనే విమర్శకుణ్ణి. నచ్చకపోతే చించి పారేయటం ఈ నాటికీ అలవాటు. సంపూర్ణమైన ఆత్మ విశ్వాసంకల రచయితని" అని చాసో తనని తాను ప్రకటించుకొన్నాడు, ఆయన ఆత్మ గౌరవం అలాంటిది.

ఇక రెండవ కథ *వాయులీనం* గురించి, ఈ కథలో చాసో ప్రతిపాదించినది మానవ మానసిక లక్షణాలచే అభివ్యక్తీకరించబడే సౌందర్యాన్ని అందమనీ, బ్యూటీఅనీ, సౌందర్యమనీ ఈ పదం చాలా బహుళంగా వాడబడుతూ ఉంది. అందమైన అమ్మాయి, అందమైన సాయంత్రం, beautiful holiday, beautiful meal వగైరా....! వీటన్నిటిలోను ఉన్న సమాన లక్షణాలను చూచి సౌందర్యమంటారని చెప్పు కొంటుంటారు. అదే అందమైన అమ్మాయి వయసుడిగిపోయినా, జబ్బు చేసినా, అందవికారి అయిపోతుంది. మానసిక స్థితిని బట్టి అదే సాయంత్రం చీదర కలిగించవచ్చు. సహజంగా అందరూ beauty కి ugly అనే పదం వ్యతిరేకపదంగా భావిస్తుంటారు. కానీ

అరిస్టాటిల్ ఈ రెండూ ఒకదానితో ఒకటి కలిసి ఉండవచ్చని చెబుతూ ఇలా అంటాడు "The form of a work of art is always beautiful, but its subject only include the ugly." ఈ రెండూ వ్యతిరేక పదాలే అయినా కొన్ని బంధాలు ఈ రెంటినీ కలుపుతుంటాయి.

సౌందర్యానికి మనమనుకొంటున్నట్లు కేవలం అందమనే అర్థమొక్కటే కాదు, అందమన్నది దాని ఛాయల్లో ఒకటి మాత్రమే. పైగా మనం కురూపం అనుకొంటున్నది మానవ మనస్తత్వ లక్షణాల వ్యక్తీకరణలో సుందరమై పోవచ్చు. దీనికి నిరూపణ చాసో కథ వాయులీనమే.

ఈ అందం, కురూపం అనే పదాలు ఎక్కువగా వ్యక్తుల రూపాలకి, మనుషుల ముఖాలకి వాడుతుంటారు. కొన్ని సందర్భాల్లో మానవశరీరాన్ని అందంగాఉంది అన్నపుడు అక్కడ మనం కొన్ని ప్రాణశక్తిగల జంతువుల నిర్మాణాలను ఉద్దేశిస్తాము. ఉదాహరణకు 'ఆమె జవనాశ్వంలా ఉంది.' ఆ శరీరంలో సిమ్మెట్రీ లేకపోతే అది జాలి కలిగించవచ్చు, బలహీనంగా ఉండి అనారోగ్యంతో ఉన్నపుడు ఆశరీరం మరో అల్పమైన ప్రాణిలా కనిపించవచ్చు. ఈ శరీర రూపురేఖలు ఇలా జంతువుల రూపు రేఖల్ని స్ఫురింపజేయుటకు కాక, కొన్ని మానసిక లక్షణాలను కూడా వెల్లడిస్తుంటాయి, అంతేకాకుండా లోపలి మానసిక స్థితిని శరీర రూపురేఖలు తెలియపరుస్తాయి. కోపం, ద్వేషం లాంటి తాత్కాలిక భావాలు ముఖంపై కనిపించి తొలిగిపోతాయి, తొలగిపోవాలని కూడా కోరుకుంటాం.

ఇవి కాకుండా కొన్ని శాశ్వతమైన మానసిక లక్షణాలు ముఖంపై కనిపిస్తూ కోరదగినవిగా అనిపిస్తాయి. వాటిలో ముఖ్యమైనవి ఆనందం, ప్రశాంతత, ప్రేమ, సున్నితత్వం, నియంత్రణ, సంస్కారం, స్వచ్ఛత, పవిత్రత, త్యాగం, క్షమ వంటివి.

*వాయులీనం* కథలో ఉన్నత మానవీయ మానసిక లక్షణాలను రాజ్యం పాత్ర చిత్రణలో చాసో ఉపయోగించారు. రాజ్యం టైఫాయిడ్ జ్వరంతో దాదాపు చావు దాకా వెళ్లి కోలుకొంటున్న మనిషి. కథ ప్రారంభంలోనే ఆమె వంటిమీద స్పృహ లేకుండా, ఉండ కుండా, పలకకుండా పడిఉండి భర్తను హైరానాకు గురి చేస్తుంది. పిల్లల అల్లరిని కసురు కుంటున్న భర్త కేకలతో తెలివి తెచ్చుకొని, పిల్లల్ని మందలించినందుకు భర్తపై చిరాకును ప్రదర్శిస్తుంది. అదీ ఒక్క క్షణమే. 'పిలిస్తే పలకవు?' అని భర్త అంటే "అలాగనా!" అని నవ్వుతుంది. అలా మొదటిసారి కథలో ఆమె నవ్వినపుడు ఆమె వర్ణన ఎలా ఉంటుందో చూడండి, "దాని నవ్వు ముఖం చూడడానికి భయంకరంగా ఉంది. పైకి వచ్చేసిన గుడ్లగూబ కళ్లు, ముందుకు పొడుచుకు కనపడుతున్న ముందు పళ్లు మొహాన్ని భీభత్సం చేసాయి" అప్పటికీ ఆమె అసుందరంగానే చెప్పబడింది. "వొళ్లు మరిచిపోయానండీ!" అంటూ రాజ్యం మళ్లీ నవ్వింది. ఆ నవ్వు మనకీ, ఆమె భర్తకీ అలవాటయి పోయింది. ఎవరైనా నవ్వినపుడు లోపలి ఒత్తిడులు సడలి పోయి, మాయమైనట్లుగా భావిస్తాం. మనం ఆ నవ్వుని తిరిగి తిరిగి కోరుకుంటాం. ఎముకల మీద తోలు మాత్రమే మిగిలినట్లున్న ఆమె ఒంట్లో ప్రాణం ఉందా? లేదా? అనే ఆదుర్దాపడే ఆమె భర్తను కూడా అభిమానిస్తాం. కాసేపటికి రాజ్యం "ఈ యింటికి మారిన దగ్గర నుండీ నాకు హాయిగా ఉందీ" అన్నపుడు ఆ కొత్త ఇంటికి అద్దె కాస్త ఎక్కువైన విషయం ఇద్దరి మధ్య చర్చకు వస్తుంది. అప్పు తాపీగా తీర్చుకోవచ్చు, "కూడికకి ఏముంది? నా చేతిలోనే ఉంది" అని ఆమె అంటున్నపుడు బలహీనతగా ఉన్న ఆమెలో ఆత్మవిశ్వాసం, సంతోషం, నిబ్బరం కనిపిస్తాయి.

పెళ్లయిన కొత్తలో రాజ్యం ఇరవైనాలుగు గంటలూ కిల కిల నవ్వుతూ, బంతిలాగా తుళ్లిపడుతూ ఉండేది, దానికి తోడు ఆమె పాటగత్తె, వాయులీన విద్యాంసురాలు. ఆరేళ్ల తర్వాత ముగ్గురు కొడుకులకు తల్లి, అనారోగ్యం, సంగీతం మరిచిపోవడం అన్నీ జరుగుతాయి. ఎదురింటిపిల్ల సంగీతం పాడుతూ ఉంది. కామవర్ధని రాగాలాపనతో కంపిస్తూ పువ్వువెలగ వాసనతో మత్తెక్కి గాలి బరువుగా గదిలోకి ప్రవేశిస్తూ ఉండగా ఆమె పిల్లల్ని పిలిచి ఆ సంగీతం వినమంటుంది. వీధిలోనికి వెళ్ల బోతున్న భర్తను ఆపి "చీకటి పడుతూ ఉంటే ఇప్పుడెందుకూ వీధిలోకి? పెందరాళే అన్నం తినకూడదూ" అంటుంది. ఈ రెండు సందర్భాల్లోను ఆమెలోని ప్రేమ, సున్నితత్వం మనల్ని ఆకర్షిస్తాయి. తన జీవితంలో నుండీ సంగీతం నిష్క్రమించినా ఎదురింటిపిల్ల పాడుతూ ఉంటే ఎక్కడలేని సుఖాన్ని, సంతోషాన్ని ఆమె పొంద గలుగుతోందని రచయిత చెప్పడం గమనించాలి.

పిల్లల్ని సముదాయించడం, శాంతంగా సబబైన మాటలు చెప్పి అల్లరి చేయకుండా చెప్పినట్టు వినేటట్లు చెయ్యడం, మొహం మీదకి పొగ రాకుండా పొయ్యి ఊదడం

మొదలైన విద్యలన్నీ రాజ్యం అలవోకగా నేర్చుకొంది అని రచయిత ఆమె వ్యక్తిత్వంలోని ప్రశాంతత, నియంత్రణ వంటి ఉన్నత మానసిక లక్షణాలను చెప్పటంలో రాజ్యంపట్ల మనకు ఆసక్తి, గౌరవం, మొగ్గు ఏర్పడుతుంది. సౌందర్య తత్త్వమే ఇమాన్యుయల్ కాంట్ దృష్టిలో వస్తువు కలిగించే ఆనందం మూడు విషయాలాధారంగా కలుగుతుంది. ఒకటి అపేక్ష (Inclination) రెండవది అభిమానం (favour) మూడవది గౌరవం(Respect).

ఎదురింట్లో పాటపాడే అమ్మాయి తమ్ముడు వచ్చి సంగీతం చెడగొడతాడు, ఒక్క క్షణం కోపం తెచ్చుకొన్నా, వెంటనే పోనీలే "కొంచెంసేపైనా ప్రాణం హాయిగా ఉంది". అని సర్దుకొంటుంది. పిల్లలు కాళ్లూ చేతులూ పడుతుండగా పడుకొని కళ్యాణి రాగం అందుకొంటుంది. సంగతులు చిక్కుపడ్డ కురుల్లాగ అవకతవక అయిపోయాయి. పిల్లలతో మరిచిపోయాను అని చెప్పి నవ్వుతుంది. కోల్పోయిన విషయాన్ని కాకుండా పొందుతున్న (పిల్లల ప్రేమ) విషయం పట్ల ఆమెకున్న ఇష్టం, ఆమెపట్ల మనకిష్టాన్ని కలిగిస్తుంది.

పెరట్లో వెన్నెలా, పువ్వువెలగ వాసనా మహా బాగున్నాయి అంటూ భర్త తిరిగివస్తాడు. ఇద్దరి మధ్యన శారీరక సంబంధం కొన్నాళ్లుగాలేనట్లు తెలుస్తూ ఉంటుంది. ఆమెకు భర్తపట్ల, ఆయనకి భార్యపట్ల ప్రేమ ఉన్నట్లు చూపిస్తాడు రచయిత, లైంగికవాంఛ ఉన్నట్లు వర్ణించడు. రాజ్యాన్ని చూస్తే ఎవరికైనా లైంగికవాంఛ కలగదు. లైంగికవాంఛకీ Ugly కి సంబంధం ఉన్నట్లుగా సౌందర్యానికి ఉండదు. కానీ భర్త బయటికి వెళ్ళి తప్పు చేస్తున్నట్లు పాఠకులకి అనుమానం కలుగుతుంది. అక్కడి సంభాషణ కూడా అలానే సాగుతుంది. "పాపపరిహారం అయిందా?", 'ఈమధ్య ఎక్కడికో వెళ్లారు కాబోలు", "మీ మాటలు, వాలకం అలాగున్నాయి". భర్త తప్పు చేస్తున్నాడో లేదో తెలియదు, ఒకవేళ అతడు బయట శృంగారానికి పాల్పడ్డా ఆమె అతడిని క్షమిస్తుంది అనిపిస్తుంది పాఠకులకి. శృంగారానికి దూరంగా ఉన్న, వారి దాంపత్యం ప్రేమగా సాగుతున్నట్లు చెప్పడంలోనే సౌందర్యం ఉంది.

తన యౌవనం నాటి పాతరోజులకీ, తను కోల్పోయిన సంగీతానికీ, తనలో మిగిలిపోయిన కళాతృష్ణకీ ఏకైక ఆనవాలుగా ఉన్న వాయులీనాన్ని అమ్మివేసిన భర్తను సైతం ఆమె క్షమిస్తుంది. ఎలా క్షమిస్తుందో రచయిత రాసాడు, మొగుడి మనస్సు బాధపడుతున్నదని గ్రహించి తన విచారాన్ని క్షణంలో దిగమింగుకుంది. ఆ సమయంలో రాజ్యంలో మనకు సంస్కారం, స్వచ్ఛత, పవిత్రత, క్షమ, త్యాగం వంటి ఉన్నత మానవీయ మానసిక లక్షణాలు కనిపిస్తాయి. ఆమె తన విచారాన్నే కాదు, తన జీవితంలోని విషాదాన్ని సైతమూ దిగమింగుకొంది.

"పోనియ్యండి. నా నోరు నొక్కుకుపోయింది. ఇహ నా ఫిడేలు ఉండి నన్ను రక్షిస్తుందా? సరస్వతీ కటాక్షం నాకంతే ఉంది. తల్లి వెళ్లిపోయింది. వెళ్లిపోతూ తల్లి తల్లి గుణాన్ని చూపించుకుంది. నాకు ప్రాణం పోసింది. వెళ్లిపోతూ నాకో చీరా రవికల గుడ్డా పెట్టింది" అని ఉబికి వస్తున్న కన్నీటిని, జీవిత విషాదాన్ని దిగమింగుకుంటున్న రాజ్యం పట్ల మనకి పరిపూర్ణమైన ప్రేమ కలుగుతుంది. సృష్టిలో అత్యంత సుందరమైన, అమిత వాంఛనీయమైన స్త్రీ మూర్తిగా కనిపిస్తుంది. ఇదే చాసో తన ఈ కథలో సాధించాలనుకొన్న ఫలితం. సుందరం అన్నది కేవలం భౌతిక లక్షణమేకాదు, అది ఉన్నత మానవీయమైన, విలువైన మానసిక లక్షణాల అభివ్యక్తి కూడానని పాఠకుడు భావించేలా అతడి అభిరుచిని (Taste) రచయిత ఇక్కడ తీర్చిదిద్దాడు.

సౌందర్యం కేవలం ఇంద్రియ జన్య ఆస్వాదనల ఫలితమైన ఆనందమే కాదు, అది మానవ మనస్తత్వంలోని విలువైన మానసిక లక్షణాల అభివ్యక్తిలో కూడా ఉంటుందని చాసో తన ఈ రెండు కథల్లో నిరూపించారు. ఇలా సౌందర్య దృక్పథంతో చాసో కథల్ని ఎంతైనా విశ్లేషించవచ్చు.

చాసో ఎంత అభ్యుదయవాదో అంత కళాత్మకవాది. కళ కళ కోసమే అన్నది, తప్పుడు సిద్ధాంతమేనని చెప్పినా, ఆ సిద్ధాంతాన్ని నమ్మినట్లే రచయిత రాయాలని, ఆ భావం కలగజేయాలని, రచనను విశిష్ట ప్రయోజనాలకోసం ఎంచుకొన్నదానిని కళాత్మకంగా మలచటం చేయాలని చెప్పారు చాసో. వస్తువు ఎంత ప్రధానమైనా దానిని కళాత్మకంగా అందించడం జరిగినప్పుడే అది సాహిత్యం అవుతుంది అని ఆయన నమ్మారు. ☸

* * * * *

డాక్టరు కాకుమాని శ్రీనివాసరావు
కృష్ణా జిల్లా

# తెలుగు, హిందీ
## సాహిత్యాలు

*- బాలశౌరి రెడ్డి*

ప్రపంచంలో అత్యంత ప్రాచీనమైనది వైదిక భాష. వేదాలు రచింపబడిన భాష వైదికభాషగా రూపొందింది. భాషాపరిణామ క్రమంలో భారతదేశంలో అనేక భాషలు ఆవిర్భవించాయి. వాటిలో తెలుగు, తమిళం, బెంగాలి, మరాఠీ, కన్నడ, గుజరాతి, పంజాబీ మొదలైన భాషలు ముఖ్యంగా పేర్కొనదగ్గవి. తెలుగు భాష సాహిత్య, సంగీతాలకు నెలవుగా భాసిల్లింది. శబ్ద మాధుర్యంతో పాటు అర్ధగాంభీర్యానికి కూడా తెలుగు అనువైన భాష. సాహిత్యపరంగా కూడా తెలుగు పరిణతి చెందిన భాష. సంస్కృంత, ప్రాకృత భాషలతోపాటు దేశీయ భాషల పదజాలాన్ని తనలో ఇముడ్చుకొని సమృద్ధి చెందిన భాష తెలుగు.

జాతీయ ఉద్యమంతోపాటు నవజాగరణ ఉద్యమం ఊపందుకుంది. ఫలితంగా దేశభాషలు కూడా ఈ ఉద్యమానికి దోహదం కలిగించాయి. మహాత్మాగాంధీ దక్షిణ ఆఫ్రికా నుండి భారతదేశానికి చేరుకున్న తర్వాత రాజకీయ రంగ ప్రవేశం చేశారు. గోపాలకృష్ణ గోఖలే సలహా మేరకు ఆయన దేశమంతా పర్యటించి భారతదేశ పునర్నిర్మాణానికి 14 సూత్రాల ప్రణాళికను రూపొందించారు. వాటిలో గ్రామ స్వరాజ్యం, కుటీర పరిశ్రమలు, హరిజనోద్ధరణ, స్త్రీ జనోద్ధరణ, ఖద్దరు ధారణతోపాటు స్వదేశం, స్వరాజ్యం-స్వభాషా వికాసానికి పథ నిర్దేశం చేశారు. 1918లో ఇండోర్‌లో జరిగిన హిందీ సాహిత్య సమ్మేళనం 8వ మహాసభలకు అధ్యక్షతవహించి హిందీని జాతీయ భాషగా పరిగణించాలని, హిందీయేతర ప్రాంతాలలో హిందీ ప్రచారం గావించాలని తీర్మానించారు. ఆ తీర్మానాన్ని అమలుచేసే నిమిత్తం తమ పుత్రుడు దేవదాసు గాంధీని ఆనాటి మద్రాసుకు పంపారు. 17-5-1918 గోఖలే హాలులో (జార్జిటాక్) జరిగిన సభకు సర్ సి.పి. రామస్వామి అయ్యర్ అధ్యక్షత వహించారు. ఆ సభను ఆనాటి హోమ్‌రూల్ లీగ్ అధ్యక్షురాలు శ్రీమతి అనిబిసెంట్ ముఖ్య అతిథిగా పాల్గొని హిందీ ప్రచారానికి అంకురార్పణ గావించారు. ఆ ఉద్యమం మద్రాసులో దక్షిణ భారత హిందీ ప్రచారభాష ద్వారా దక్షిణ దేశంలోని ఆంధ్ర, తమిళ, కన్నడ, మళయాళం (కేరళ) ప్రాంతాలలో వేళ్లూని శాఖోపశాఖలుగా విస్తరించి, జాతీయ భాష హిందీ ప్రచారానికి తెలుగు-తమిళ, కన్నడ-మళయాళం భాషల మధ్య సాహిత్యపరంగా పరస్పర సంవాదానికి బాటలు వేసింది. 1934లో జాతీయ ప్రశస్తి గాంచిన మున్షీ ప్రేమ్‌చంద్ హిందీ ప్రచార సభ స్నాతకోత్సవాలకు ముఖ్య అతిథిగా రావడం జరిగింది. ఆ సంరక్షణలో ఆయన సంపాదకత్వంలో వెలువడుతున్న *హంస* మాసపత్రికలో ప్రచురణార్థం తెలుగు-తమిళం, కన్నడ-మళయాళ భాషల నుండి హిందీలో అనువాదాలు చేసి పంపవలసినదిగా ఆహ్వానించారు.

ఆ విధంగా హిందీ-తెలుగు భాషా సాహిత్యాల పరస్పర సంవాదానికి రూపకల్పన జరిగింది. శ్రీ వేమూరి ఆంజనేయశర్మ శ్రీ ఉన్నవ రాజ గోపాలకృష్ణయ్య ప్రభృతులు తెలుగు కథానికలను హిందీలో అనువదించి హంసలో ప్రచురింపజేశారు. హిందీ ప్రచార సభవారు ప్రాంతీయ భాషల ద్వారా సులభంగా ఇంట్లో కూర్చొని హిందీ నేర్చుకునేందుకు వీలుగా తెలుగు-హిందీ స్వబోధిని, తెలుగు-హిందీ వ్యాకరణం తెలుగు-హిందీ, హిందీ-తెలుగు నిఘంటువులు ప్రచురించారు. శ్రీ మోటూరి సత్యనారాయణగారు సభ తరపున 'హిందీ ప్రచారక్' 'దక్షిణ భారత' పేర రెండు పత్రికలు ప్రచురించేవారు. అవి అనువాదాలను విశేషంగా ప్రోత్సహించాయి.

భారత దేశానికి స్వాతంత్ర్యం లభించిన తర్వాత అప్పుడు మద్రాసు ప్రభుత్వం తరపున *దక్షిణీ హింద్* (Dakshini Hind) అనే ఒక మాసపత్రిక వెలువడింది. రామానంద శర్మ, సంపాదకులు. ఆర్. సారంగపాణి సహాయ సంపాదకులుగా నియమింపబడ్డారు. ఈ పత్రిక మద్రాసు ప్రభుత్వం తరపున 1947లో ప్రారంభింపబడింది. ఆ రోజుల్లో నేను కాశీలో చదువుకునేవాణ్ణి. నా వ్యాసం *లలితకళలు* 1948లో *ఆంధ్రపత్రిక*లో ప్రచురింపబడింది. ఆ పత్రిక తమిళం, కన్నడ,

మళయాళం భాషలతోపాటు తెలుగు రచనల అనువాదాలను విశేషంగా ప్రోత్సాహించింది. ఆంజనేయశర్మ, సత్యనారాయణ శ్రీ వెంకటాచల శర్మ ప్రభృతులు ఆ పత్రికాముఖంగా ఆశ్రమంలో దక్షిణాది విశ్వవిద్యాలయాల్లో హిందీ శాఖలు ఏర్పడడం, తద్వారా అనేకమంది యువకులు ఉభయ భాషల్లో ప్రవీణులు గావడం జరిగింది. వారంతా మౌలిక రచనలతో పాటు అనువాదాలు కూడా చేశారు. సి. కామాక్షిరావు, ప్రభావతి సూర్యనారాయణ, జి. సుందరరెడ్డి, ఆలూరి బైరాగి, అయాచితుల హనుమచ్ఛాస్త్రి, దండమూరి వెంకట కృష్ణారావు, దుర్గానంద్, పి.వి. నరసింహారావు, కుమారి దయావంతి, వాసిరెడ్డి సీతాదేవి, దండమూడి మహీదర్, డా. ఇలపావులూరి పాండురంగారావు, శ్రీమతి మంజులత, శ్రీమతి నాగపద్మిని, డా. వై.ఎన్. చంద్రశేఖర రెడ్డి, డా. పద్మజాదేవి, వారణాసి రామమూర్తి వేణు, ఆదేశ్వరరావు, డా. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, డా. పోలి విజయరాఘవ రెడ్డి, డా. పోలి నరసారెడ్డి, డా. భీమసేన్ సర్దార్, డా. మాణిక్యాంబ, డా. రంగయ్య, డా. శేషారత్నం, శ్రీమతి పారనంది నిర్మల, శ్రీమతి రాచకొండ స్వరాజ్యలక్ష్మి, శ్రీమతి మునుకుట్ల పద్మారావు, శ్రీమతి గుంటూరు రజనీ ప్రభ, ఆచార్య వై. వెంకట రమణారావు, వై.పి.వి. వెంకటరెడ్డి, శ్రీ కొమ్మిశెట్టి మోహన్, జి. లక్ష్మీరెడ్డి, పుల్లారెడ్డి ప్రభాకరరెడ్డి, శ్రీమతి డా. శకుంతలమ్మ, బి. సత్యనారాయణ, డా. మోహన్‌సింగ్ మొదలగు వందమంది నిష్ణాతులైన అనువాదకులు తెలుగు-హిందీ భాషా-సాహిత్యాల-అనుసంధాన కృషిలో నిమగ్నమై రెండు భాషల పాఠకులకు సారస్వత మధురిమను పంచిపెడుతున్నారు.

ఈ కృషిలో కేంద్ర సాహిత్య అకాడమీ ఢిల్లీ, నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్ హిందీ అకాడమీ, హైద్రాబాద్, ఇతర ప్రాంతాల ప్రచురణకర్తలు, సాహితీ సంస్థలు, విశ్వవిద్యాలయాలు ఈ కృషికి ఎంతో దోహదం కలిగిస్తున్నాయి. ఇంతవరకూ తెలుగు-హిందీ భాషలలో అనువదింప బడి ప్రచురణకు నోచుకున్న అనువాదాల సంఖ్య - నవలలు-65, కథాసంపుటాలు-35, రెండు వేలకు పైగా కథలు సేకరింపబడ్డాయి. ఇవిగాక, తెలుగు నాటకాలు, నాటికలు, వ్యాసాలు, ఇతర గద్య పద్య రచనల అనువాదాలు వంద వరకు ఉండవచ్చునని అంచనా వేయడం జరిగింది. తెలుగు నుండి హిందీలోనికి అనువదింపబడిన కావ్యాలు, కావ్య సంపుటాలు ఇంత వరకు 80కి పైగా వెలుగులోనికి వచ్చాయి. కావ్యానువాద ప్రక్రియకు శ్రీకారం చుట్టిన మొదటి వ్యక్తి శ్రీ వారణాసి రామమూర్తి వేణు. ఈయన వేమన పద్యాలను *ఆంధ్ర కబీర్ వేమన* పేర అనువదించారు. అంతేకాదు శ్రీ జాషువ రచించిన *గబ్బిలము*, ఖండకృతిని *చమగాద్* పేర హిందీలో అనువదించటం జరిగింది. అలాగే పోతన భాగవతంలోని నాలుగు ఉపాఖ్యానాలను 'భాగవత పరిమళ్' పేర అనువదించారు. శ్రీ వేణుగారు పై కవితలను గద్యంలో అనువదించగా డా॥ సూర్యనారాయణ 'భాను' చందోబద్ధంగా అనువదించారు.

**వ్యాస రచయిత గురించి :**

డా॥ బాలశౌరి 1954లో ఆంధ్ర హిందీ పరిషత్తువారి కోరికపైన *పంచామృత్* అనే పేర తిక్కన, పోతన, పెద్దన, యోగివేమన, చేమకూరి వేంకటకవి (విజయ విలాసములోని ఉలూచి అర్జున వివాహం) మొత్తం 500 పద్యాలను నాగరి లిపిలో మార్చి హిందీలో గద్య రూపంలో అనువదింపబడింది. ఈ గ్రంథానికి కేంద్ర ప్రభుత్వంతో పాటు, ఉత్తరప్రదేశ్ హిందీ సంస్థాన్ వారి పురస్కారాలు కూడా 1956లో లభించడం ఒక విశేషం.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ తరపున బైరాగి *ఆధునిక కవిత* ఒక సంపుటిని ప్రచురించారు. రెండో సంపుటికి డా. చావలి సూర్యనారాయణ మూర్తి సంపాదకత్వం వహించారు. చలసాని సుబ్బారావు వేమన రచించిన 100 పద్యాలను *సంత్ వేమన* పేర ప్రచురించారు. ఎ.సి. కామాక్షిరావు గోన బుద్దారెడ్డి రచించిన రంగనాథ రామాయణం గద్యానువాదం బీహార్ రాష్ట్ర భాషా పరిషత్ వారి కోరిక పైన గద్యంలో అనువదించి ప్రచురించారు. డా. భీమసేన్ ఎర్దేవ్, రాష్ట్ర భాషా ప్రచార సమితి, ఎర్ధా వారి కోరికపైన *కవిశ్రీమాలా* పేర కాటూరి వెంకటేశ్వరరావు, పింగళి లక్ష్మీకాంతం కవితలను హిందీలో అనువదించి సుదీర్ఘమైన పీఠికను కూడా వ్రాశారు. అలాగే తిరుపతి వెంకటకవులు కవితలను కూడ నాగరి లిపిలో మార్చి వాటి అనువాదాన్ని గద్యంలో ప్రచురించారు. ఈ కావ్యసంపుటాలు 1962 నుండి ఈనాటి వరకు రాష్ట్ర భాషా ప్రచార సమితి వార్ధా వారి తెలుగు పరీక్షార్థులకు పాఠ్య గ్రంథాలుగా ఉపయోగపడుతున్నాయి. డా. నిర్మల్ *ఆరుద్ర కవిత*లను హిందీలో అనువదించి ప్రచురించారు. అలాగే డా. నిర్మల్, డా. రంగయ్య, సి.హెచ్. రాములు, డా. బి.వి.ఆర్. శర్మ, శ్రీమతి నీరజా, పోతన

రచించిన భాగవతాన్ని శ్రీ భువన వాణి ట్రస్ట్, లక్నోవారి కోరికపైన నాగరి లిపిలో పద్యాలను మార్చి హిందీ గద్యానువాదాన్ని ప్రచురించారు.

అలాగే డా. సి. నారాయణరెడ్డి 63 కవితలను భారతీయ జ్ఞానపీఠ్, ఢిల్లీ వారి కోరికపైన అనువదించారు. భారతీయ జ్ఞానపీఠ్ పురస్కారాన్ని పొందిన ఆచార్య నారాయణరెడ్డి *విశ్వంభర* కావ్యాన్ని కూడా డా. నిర్మల్ హిందీలో అనువదించారు. సి.హెచ్. రాములు భవన్ ట్రస్ట్, లక్నో వారికి మొల్ల రామాయణం అనువదింపడం జరిగింది. ఈ విధంగా తెలుగు నుండి హిందీలోనికి ఇంతవరకు 90 కవితా సంపుటాలు అనువదింపబడ్డాయి. వాటి వివరాలు ప్రచురిస్తే ఒక మహా గ్రంథం కాగలదు. కావున కొంతమంది కవులు, వారి రచనలను మాత్రం పేర్కొనడం సముచితం.

అలాంటి సువిఖ్యాత కవులలో పేర్కొన దగ్గవారు డా. సి. నారాయణరెడ్డి, డా. దాశరథి, డా. శేషేంద్రశర్మ, దాశంథి రంగాచార్యులు, గురజాడ అప్పారావు, రాయప్రోలు సుబ్బారావు, కుందుర్తి ఆంజనేయులు, అన్నమాచార్యులు, బెజవాడ గోపాల్ రెడ్డి, ఆలూరి బైరాగి, చల్లా రాధాకృష్ణ శర్మ, ఆరుద్ర కాళోజీ నారాయణరావు, పేర్వారం జగన్నాథం, శ్రీశ్రీ, దిగంబర కవులు, కె. శివారెడ్డి, డా. యన్. గోపి పేర్కొన దగ్గవారు. వీరి కవితలను, కావ్యాలను అనువదించిన అనువాదకులు సర్వశ్రీ, ఎ.సి. కామాక్షి రావు, చావలి సూర్యనారాయణ మూర్తి, భీమసేన్ నిర్మల్, విజయరాఘవ రెడ్డి, డా. రామమూర్తి రేణు, దుర్గానంద్, నిర్మాలానంద్ వాత్స్యాయన్, దండమూరి మహీధర్, డా. ఆదేశ్వరరావు, డా. లక్ష్మీప్రసాద్, ఓం ప్రకాశ్, యం. రంగయ్య, సి.హెచ్. రాములు, ఎం. మల్లేశ్వరరావు, వేమూరి రాధాకృష్ణమూర్తి, అన్నపురెడ్డి శ్రీరామరెడ్డి, పి. ఆదేశ్వరరావు, సుంకర చంగయ్య, డా. రేగులపాటి మాధవరావు, డా. వెంకట రమణారావు, నరసారెడ్డి, డా. శాంతా సుందరీ, డా. పాండు రంగారావు, డా. మాణిక్యాంబా, డా. మోహన్ సింగ్ గార్ల పేర్లు ఈ సందర్భంలో పేర్కొన దగ్గవి. తెలుగు నుండి హిందీలో అనువదింపబడి నవలలు 60 పైగా ఉన్నాయి. డా. బాలశౌరి రెడ్డి, *రుద్రమ దేవి,* అల్పజీవి, కౌముది, *పుణ్యభూమి కళ్ళు తెరువు, దత్తత, నారాయణ భట్టీ, చంద్రగుప్తుని స్వప్నం, కౌసల్యా రాజశేఖర చరిత్ర,* ఇలాగే 125 నవలలు హిందీలో అనువదించారు.

అలాగే హిందీ నుండి బల్లేసుర ఒకరిహ, తెరవెనుక మొదలగు నవలలతోపాటు 235 కథలు సంపుటాలుగా ప్రచురించారు. పి.వి. నరసింహారావు, కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ వారి *వేయి పడగలు* అనువదించారు. సత్యనారాయణ *ఏకవీర* నవలను అంబటిపూడి అనుమయ అనువదించటం జరిగింది. వారి *విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు,* సి.హెచ్. రాములు అనువదించారు. ఉన్నవ లక్ష్మీనారాయణ మాలపల్లి నవలను బి. దయావంతి అనువదించారు. డా. జె.యల్. రెడ్డి, డా. కేశవరెడ్డి నవలలు *అతను అడివిని జయించాడు, చివరి గుడిసె* అనువదించారు. పెద్దింటి అశోక్‌కుమార్ నవలిక *జిగరే*ని కూడా హిందీలోకి అనువదించారు. డా. ఆదేశ్వరరావు త్రిపురనేని గోపీచంద్ *చీకటి గదులు* అనువదించారు. డా. బాలశౌరి రెడ్డి హిందీ నుండి తెలుగులోనికి *రామాయణ కాలంలో భారతీయ సంస్కృతి, వేశ్య* మొదలగు 10 పుస్తకాలు అనువదించారు.

అంతేకాదు, చింతా దీక్షితులు, గోపీచంద్, కొడవటిగంటి కుటుంబరావు, కొమ్మూరి వేణుగోపాల్ రావు, బలివాడ కాంతారావు, సి. ఆనందారామం, వాసిరెడ్డి సీతాదేవి, రంగనాయకమ్మ, మధురాంతకం రాజారాం లాంటి ప్రఖ్యాత రచయితల నవలలను శ్రీ రామానాయుడు దయావంతి, సుమలత, వేమూరి ఆంజనేయ శర్మ, వేమూరి రాధాకృష్ణమూర్తి, టి. వెంకట నాయుడు కామిశెట్టి మోహన్, వై.సి.వి. రెడ్డి, డా. జె.యల్. రెడ్డి గార్ల అనువాదాలు హిందీ పాఠకులను ఎంతగానో అలరించాయి అని చెబితే అతిశయోక్తి కానే కాదు.

అలాగే తెలుగు నుండి, హిందీలోకి వందల సంఖ్యల్లో, కథలు అనువదింపబడ్డాయి. వాటి పూర్తి వివరాలు ప్రచురింపగలిగితే ఒక ఉద్గ్రంథమే కాగలదు. తెలుగు నుండి హిందీలోనికి అనువదింపబడ్డ కథాసంపుటాలు 40 పైగా తెలుగులోనికి వచ్చాయి. అవే కాకుండా ఇంతవరకు తెలుగులోనికి రాని సంపుటాలు 15 నుండి 20 దాకా వుండవచ్చు. అంతేగాక పత్రికలో ప్రచురింపబడి, సంపుటాల రూపంలో ప్రచురింపబడిన కథల సంఖ్య కొన్ని వందలు వుండవచ్చు. సాహిత్య అకాడమీ, నేషనల్ బుక్‌ట్రస్ట్, ఢిల్లీ వారి పురస్కారాలు పొందిన కథా సంపుటాలను స్వయంగా ప్రచురించడం జరిగింది. అలా కాకుండా భారతీయ జ్ఞానపీఠ్, రాజపాల్ రాజకుమార్, కితాబ్‌ఘర్ లాంటి అనేక సంస్థలు

స్వచ్ఛందంగా ప్రచురించారు. అంతేగాక ఆకాశవాణి, దూరదర్శన్ ద్వారా ఎన్నో కథలు ప్రసారం చేయబడ్డాయి. వీటి వివరాలు వ్యాసంలో పొందుపరచటం సాధ్యం కాని పని. అంతేకాక దక్షిణ భారత హిందీ ప్రచార సభ, ఆంధ్రసభలు కూడా కొన్ని సంపుటాలు ప్రచురించాయి.

పై సంపుటాల అనువాదకులు, సంకలన కర్తలు ముఖ్యంగా పేర్కొన్న దగ్గవారు డా. బాలశౌరి రెడ్డి, డా. విజయ రాఘవరెడ్డి, డా. భీమసేన్ నిర్మల్, దండమూరి మహీధర్, డా. పాండు రంగారావు, వెంకటరావు, డా. వై. వెంకట రమణారావు, ఆంజనేయశర్మ, కొమ్మిశెట్టి మోహన్, డా. సి.వెంకట రెడ్డి తెలుగులో ప్రచురింపబడిన మొదటి కవి గురజాడ అప్పారావు *దిద్దుబాటు* నుండి ఈనాటి వరకు ప్రచురింపబడిన ఉత్సవం కథలను ఎన్నికచేసి ఉభయ భాషల్లోనూ పాండిత్యం సంపాదించిన రచయితలు. మంచి కథలను ఎన్నిక చేసి హిందీలో ప్రచురింపజేసి తెలుగు కథానిక వైశిష్ట్యాన్ని దేశమంతటా చాటడంలో తమ పాత్రను చక్కగా పోషిస్తున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆ కారణంగా హిందీ నుండి ఇతర భారతీయ భాషల్లోకి మన తెలుగు కథలు అనువదింపబడి ప్రశస్తి పొందుతున్నాయి. నిజం చెప్పాలంటే తెలుగు విశ్వవిద్యాలయం వారు దీనిని ఒక ప్రాజెక్ట్‌గా గ్రహించి తెలుగు వెలుగులను నలుదిశల చాటాలని నా అభిలాష.

అలాగే తెలుగు నుండి గద్య రచనలకు ముఖ్యంగా నాటకం, ఏకాంకిక, వ్యాసాలు, చరిత్రలు, పరిశోధన గ్రంథాలు, జీవిత చరిత్రలాంటి ప్రక్రియల్లో కూడా మన రచయితలు శ్రద్ధ తీసుకొని కొన్ని రచనలను హిందీలోనికి అనువదించటం జరిగింది. నేను, నార్ల వారి కొత్తగడ్డ, రాజమన్నార్ *మనోరమ*తో పాటు *అవినీతి ఎక్కడ?*, మరికొన్ని నాటకాలను హిందీలోనికి అనువదించి ప్రముఖ ప్రచురణకర్తల ద్వారా ప్రచురింప చేయడం జరిగింది. డా. భీమసేన్ నిర్మల్, డా. ఎ.వి. రాజమన్నార్ *ప్రగతి* గోరాశాస్త్రి *టీ కప్పులో తుఫాన్* తాపీ ధర్మారావు, కె. జగ్గయ్య నాటకాలను కూడా అనువదించారు. యస్.వి. శివరామశర్మ, చింతాదీక్షితుల వారి *శర్మిష్ట* నాటకాన్ని అనువదించి ప్రచురించారు. అలా వేమూరి ఆంజనేయ శర్మ, జి.వి. కృష్ణారావు *భిక్షాపాత్ర* నాటకాన్ని చక్కగా అనువదించి పాఠకుల ప్రశంసలను పొందారు.

తెలుగు నాటక చరిత్రను, నటులను గూర్చి వ్యాసాలు రచించి మన రచయితలు తెలుగు నాటక ఔన్నత్యాన్ని దేశమంతటా చాటారు. నేను తెలుగు వాఙ్మయం చరిత్ర 1964లో రచించి తెలుగు వివిధ ప్రక్రియలను హిందీ వారికి చక్కగా అవగాహన కలిగించే ప్రయత్నం చేశాను. అంతేగాక, నన్నయ నుండి నారాయణరెడ్డి, ఆంధ్ర భారతి తెలుగు సాహిత్య నిర్మాతలు, తెలుగు భాషాసాహిత్యాల వివిధ ప్రక్రియలు, తెలుగు భాషా సాహిత్యం సంస్కృతుల వివిధ రీతులు లాంటి గ్రంథాలు రచించి, తెలుగు భాషా సాహిత్యాల గూర్చి గద్య రూపంలో హిందీ పఠిత లోకానికి అవగాహన కలిగించే ప్రయత్నం చేయడం కూడా జరిగింది. ఈ దిశలో మన తెలుగు హిందీ రచయితల కృషి సర్వదా ప్రశంసనీయం. అంతేకాక, ఆంధ్రభాషా సంస్కృతిని గురించి, చరిత్రను గూర్చి తెలుగులో వెలువడి *విశ్వకోశ్ గ్రంథాల* అనువాదాలు కూడా అనేకమంది రచయితల ద్వారా ప్రచురింపబడ్డాయి.

తెలుగు నుండి హిందీలోనికి అనువదింపబడిన సర్వగ్రంథాలు ఇంతవరకు 80 వరకు వెలుగు లోనికి వచ్చాయి. వాటిలో కొన్ని ముఖ్యమైన పురుషోత్తమ కవి హిందూస్తానీ నాటకాలు మొదలైనవి. భాష, చరిత్ర, సంస్కృతిని గూర్చి అనేక గ్రంథాలు, నిర్మల్ అనువదించారు. మరి తెలుగు ప్రముఖ కవుల జీవన చరిత్రలు వీరేశలింగం, వేమన, తిరుపతి కవులు, గురజాడ, క్షేత్రయ్య, త్యాగరాజు, భక్త రామదాసు, డా. సి.ఆర్. రెడ్డి, అన్నమాచార్య, అల్లూరి సీతారామరాజు, పోతన, వేదం వెంకటరాయ శాస్త్రి మొదలగు ప్రసిద్ధ వ్యక్తుల జీవిత చరిత్రలను గూడా హిందీలోనికి అనువదించడం జరిగింది.

అలాగే హిందీ నుండి తెలుగులోనికి కూడా అసంఖ్యాకంగా రచనలు అనువదింపబడ్డాయి. తెలుగు విశ్వవిద్యాలయ కులపతి రిజిస్ట్రార్ సంచాలక సమితి పెద్దలు తెలుగు ప్రాశస్త్యాన్ని గురించిన వివరాలు సేకరించి గ్రంథ రూపంలో ప్రచురింపజేస్తే పఠితలకే గాక సామాన్య పౌరులకు కూడా అది ఎంతో ఉపయోగకారికాగలదని విశ్వసిస్తూ ఈ ప్రాజెక్టును అమలు చేసేందుకు కృషి చేస్తారని ఆశిస్తాను.

డా. వై. బాలశౌరి రెడ్డి
జ్యోతినికేతన్ 26 విడివేలు పురం,
వెస్లీమాంబళం - చెన్నై - 600 033.

# సాహిత్యంలో విమర్శ పాత్ర

*– గొల్లపూడి మారుతీరావు*

ఈ మధ్య అడ్డమయినవాళ్ళకీ – అన్ని విషయాల మీదా అడ్డదిడ్డమయిన విమర్శలూ – అవాకులూ చెవాకులూ రాసే వేదిక ఒకటి తయారయింది. దాని పేరు ఫేస్‌బుక్. విషయంలేని బాతాఖానీ అంటువ్యాధి. పరనింద వ్యసనం. ఈ రెండూ విరివిగా సాగే వేదిక అది. నన్ను మొట్టమొదట ఆ రొంపిలోకి ఈడ్చింది నిర్మాత, మిత్రుడు కె.మురారి. నా గురించో, నేను తన ఆత్మకథ మీద రాసిన అభిప్రాయం గురించో, దాని మీద మరెవరి స్పందన గురించో ఫేస్‌బుక్‌లోకి జొరబడమని మార్గంవిప్పాడు. అమాయకంగా తల దూర్చాను. అంతే. ప్రతి రోజూ – ప్రతిపూటా – కొన్ని వందల ఈ మెయిళ్ళు. హడిలిపోయాను. పిచ్చెత్తి పోయింది. భయపడిపోయి – ఈ ఫేస్‌బుక్ లోంచి బయటపడే మార్గాన్ని చెప్పమని ఒక మిత్రుడిని ఆశ్రయించాను. తెలుసుకుని బయటపడి ఊపిరి పీల్చుకున్నాను.

ఏమీ కమిట్‌మెంటూ లేని, అక్కరలేని, పోచికోలు కబుర్ల వేదికగా నాకు కనిపిస్తుంది ఫేస్‌బుక్. బహుశా అది నా తప్పు అనుభవమేమో. అయితే మంచిదే. దీనికో మంచిపేరు పెట్టారు మిత్రులు ఒకాయన. "వీధికొళాయి దగ్గర అమ్మలక్కల గాసిప్ బురద" అని.

**పరిశీలన అయిదు రకాలు :** 1. అభిప్రాయం 2. సమీక్ష 3. విమర్శ 4. విశ్లేషణ 5. అక్కసు.

**అభిప్రాయం :**

అతి సరళం. ఏకముఖం. నచ్చితే ఎందుకు నచ్చిందో చెప్పడం. నచ్చకపోతే ఎందుకు నచ్చలేదో –సాధ్యమయితే వివరించడం. తప్పు లేదు. అభిప్రాయానికి అర్హత అక్కరలేదు. ఇక సమీక్షకీ, విమర్శకీ చాలాదూరం. ఒక సంఘటన ఎప్పుడూ మనస్సులో కదులుతూంటుంది. 1970–72 మధ్యలో విజయవాడ ఆకాశవాణిలో పని చేస్తున్నాను. అప్పటి *ఆంధ్రజ్యోతి* ఎడిటరు నార్ల. పోణంగి శ్రీరామ అప్పారావుగారి పరిశోధనా గ్రంథం *నాట్యశాస్త్రం* నాకు సమీక్షకి ఇచ్చారు. ఇంకా ఉత్సాహం, కుర్రతనం పోని రోజులు. సమగ్రంగా రాస్తూనే, నాలుగైదు చురకలు కూడా పెట్టిన గుర్తు. ఓ రోజు *ఆంధ్రజ్యోతి* నుంచి ఫోన్ వచ్చింది– నార్లగారు రమ్మంటున్నారని. వెళ్లాను. ఆయన టేబిలు మీద నా కాగితాలున్నాయి. పలకరించి "మారుతీరావు గారూ! పత్రికపని ఓ రచనని పరిచయం చెయ్యడం – సమీక్ష. విమర్శకాదు. మీకభ్యంతరం లేకపోతే ఈ రెండు పేరాలు తీసేస్తాను" అన్నారు. అదేమిటి? ఆయన సంపాదకుడు. కాదనుకుంటే తీసేసే హక్కు ఆయనకుంది కదా? కాని నాకో పాఠాన్ని అందించారు. ఆనాటి సంపాదకుల *నియతి* అది. సిగ్గుపడుతూనే తీసేయమన్నాను.

**సమీక్ష :**

ఓ రచనని పరిచయం చేస్తుంది. అది ఎత్తుకున్న ఇతివృత్తాన్నీ, విషయాన్నీ వివరిస్తుంది. రచయిత చేసిన కృషిని చెప్తుంది. చక్కటి ప్రచురణ అయితే ప్రచురణ కర్తలనూ ఎత్తి చూపుతుంది. అది పరిచయం మాత్రమే. అంత వరకే సమీక్ష పని.

**విమర్శ :**

మరి కాస్త ముందుకి పోయి – రచనలో లోపాలనో, పొరపాట్లనో వివరిస్తుంది. సద్విమర్శ దుయ్యపట్టదు. రచయితకి నమ్మకం కలిగిస్తుంది. అది సహేతుకమైతే రచయిత కృతజ్ఞత చెప్పుకునే స్ఫూర్తి ఇస్తుంది. మూలాన్ని పెంచేదీ, రచయిత గొప్పదనాన్నో, లేదా కొండొకచో తప్పునడకని సవరించేదో విమర్శ. సద్విమర్శ పెద్దమనిషి. మంచి స్నేహితుడు.

నా *సాయంకాలమైంది* నవలకి ఎందరో అభిమానులున్నారు. పి.వి. నరసింహారావు దగ్గర్నుంచి, చెర్లపల్లి జైల్లో ఉన్న అలనాటి హంతకుడు మొద్దుసీను వరకూ. కాని

ఒకాయన గుంటూరు నుంచి సుదీర్ఘమైన ఉత్తరం రాస్తూ – అందులో దొర్లిన – అనేకమైన పొరపాట్లను ఎత్తి చూపుతూ – వాటి సవరణలను చెప్పారు. ఆయనెవరో నాకు తెలీదు అప్పటికి. ఆయన పేరు రవికృష్ణ. తర్వాత తెలిసిన విషయం ఆయన అక్కడ లెక్చరర్ అని. ఉత్తర చివర – ''నాకు తెలిసిన విషయాలు, అనిపించిన సవరణలూ రాస్తున్నాను. తప్పులుంటే మన్నించండి'' అన్నారు. ఆయన ప్రముఖుడు కాదు. కాని తప్పులు ఎత్తి చూపడంలో బాధ్యతాయుతమైన ప్రయత్నం ఉంది. రెండో ముద్రణవరకూ ఉత్తరాన్ని దాచి, రెండో ముద్రణలో ఆయన చెప్పిన సవరణలన్నీ చేసి, ఆయన పేరుని ఉటంకించి, కృతజ్ఞతలు చెప్పి ఆయనకి ఒక కాపీని పంపాను. తర్వాత ఎప్పుడో గుంటూరు వెళ్లిన రెండు మూడు సందర్భాలలో కలిశారు.

అమ్మ కోపగిస్తుంది. మన అసమర్థతని దుయ్యపడుతుంది. కాని మనకి కోపం రాదు. అదేమాట పక్కింటావిడ అంటే 'చెప్పడానికి మీరెవరు'? అంటాం. కారణం – మన పట్ల అమ్మ ప్రేమ మనకి పెద్ద గొడుగు. పెట్టుబడి. ఆ ప్రేమే ఆమె ఎత్తిచూపిన విమర్శకి బలం. మనకి మేలు జరగాలన్న ఆమె ఆర్తి ఆమె విమర్శలో సదుద్దేశానికి ఆలంబన. విమర్శకుడి మొదటి అర్హత తను విమర్శించే రచనని ప్రేమించాలి. అదీ చాలదు. ప్రేమించిన రుజువులు చూపించాలి – ఆయన ధోరణిలో, వ్యక్త పరిచే విధానంలో. The criticism becomes loaded and valid only when the critic invests his concern and confidence on the validity of the subject.

ఇంగ్లీషులో ఒక సామెత ఉంది Never criticise a man unless you walked a mile in his moccasins అని. మొకాసిన్స్ అంటే పాదరక్షలు. అప్పటికి అతనికి మనం మైలు దూరంలో ఉంటాం. అతని పాదరక్షలు మనతో ఉంటాయి !

మళ్లీ నార్లగారితో అనుభవం. ఆయన నా *పగ* నాటిక చదివారు. (ఇది కేవలం 44 సంవత్సరాల కిందటి మాట. విడుదలయే ఖైదీని కలవడానికి ఒకాయన సత్రంలో ఎదురుచూస్తుంటాడు. చీకటి పడ్డాక – విడుదలయిన ఖైదీ అక్కడికి వస్తాడు. నాటిక చదివి – మంచి చెడ్డలు చెప్పలేదు నార్లగారు. ''ఖైదీలను ఎప్పుడూ ఉదయమే విడుదల చేస్తారు మారుతీరావుగారూ'' అన్నారు. ఈ విషయాన్ని నేనెన్నడూ మరిచిపోను. ఖైదీల విషయం కాదు. ఆయన సరళంగా పొరపాటుని సవరించడాన్ని.

విమర్శకుడి సామర్థ్యానికి నాలుగు అర్హతలు కావాలి. He should be qualified, well informed, generous and importantly constructive. విమర్శకి attitude బలాన్నిస్తుంది. అసలు ఎందుకూ విమర్శ? ఒక రచనలో మంచిని చాటడానికా? ఒక రచయిత మీద అక్కసు తీర్చుకోడానికా? మన తెలివితేటలు ప్రదర్శించడానికా? అవకాశం ఉంది కదా అని అడ్డూ ఆపూలేని 'కొళాయి' కబుర్లు చెప్పుకోడానికా? ఒక వేళ ఆ విమర్శ సహేతుకమైనదే అయినా, సజావైనదే అయినా – బాధ్యతా రహితమైన వెక్కిరింత ఓ నిజమైన స్పందనని ఆ మేరకి బలహీన పరుస్తుంది. చెప్పిన విషయం సహేతుకమైనదయినా, చెప్పిన ధోరణి కారణంగా వీగి పోతుంది. ఇది పొరుగమ్మ కసురులాంటిది. చెప్పిన మంచికారణాన్ని వదిలి – చెప్పే వంకర విమర్శకుడి బుద్ధిని ప్రస్ఫుటం చేస్తుంది. కాగా, మన తెలివి తేటల్ని ప్రదర్శించడానికి ఒక రచనని బలిచేయనక్కరలేదు. అది వెర్రివాడి చేతిలో రాయి. అభిరుచి దారిద్ర్యానికి దగ్గర తోవ. ఆ ధోరణికి నీళ్లు పోసి ప్రోదు చేస్తే – తప్పని సరిగా సవరణ ఎలాగూ జరగదు సరికదా అది విషవృక్షమవుతుంది. రచయితకి మేలు జరగదు సరికదా the intention and motivated attitude of the critic defeats the very purpose of the criticism.

**సమీక్ష :** రచనలో మంచిని సోదాహరణంగా చూపుతుంది.
**విమర్శ :** సవరణలను సూచిస్తుంది. వీలయితే మార్గాన్ని సూచిస్తుంది. వెక్కిరించదు. సమీక్ష స్నేహితుడు. విమర్శ తల్లి.

తెలుగునాట విమర్శకు ప్రాణం పోసిన అయిదారు మంది మహానుభావులు – విమర్శకు పరిశోధనని పెట్టుబడిని చేసి తెలుగు జాతికి ఉపకారం చేశారు. వెంటనే మనస్సులో కదిలే పేర్లు – మల్లంపల్లి సోమశేఖరశర్మ, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, నిడదవోలు వెంకటరావు, వేటూరి ప్రభాకర శాస్త్రి, బులుసు వెంకటరమణయ్య, కట్టమంచి రామలింగారెడ్డి, శ్రీపాద గోపాలకృష్ణమూర్తి యిత్యాదులు.

బాధ్యతారహితమైన దూషణని, వెక్కిరింతని దేశమూ పట్టించుకోదు. రచయితా పట్టించుకోడు. వారి దూషణలో ఏ కాస్తో నిజం ఉన్నా– వారి నైజం దాన్ని బొత్తిగా కలుషితం



సర్ థామస్ మన్రో

చేస్తుంది. ఎదుటివాడిని తిట్టడం వల్ల వచ్చే ఆనందం negative wicked pleasure. అవకాశం దొరికిన అల్పుడు చేసేపని.

ఇంకా ముందుకు పోయి చెప్తే – బాధ్యతా రహితమైన విమర్శ ఒకప్పుడు ఊహించని హానినీ చెయ్యవచ్చు. ఒక ఉదాహరణ: చెన్నై సెంట్రల్ స్టేషన్‌లో దిగి ఊర్లోకి వస్తూంటే అన్నాశాలై మీద ఒకనాటి బ్రిటిష్ గవర్నరు సర్ థామస్ మన్రో విగ్రహం కనిపిస్తుంది. అద్భుతంగా చెక్కిన శిల్పమది. మన్రో గుర్రం మీద కూర్చున్న శిల్పం. చెక్కిన తర్వాత శిల్పాన్ని ప్రదర్శనకు ఉంచారు. చాలామంది వచ్చి చూస్తున్నారు. దూరంగా శిల్పి కూడా ఉన్నాడు. ఒక తండ్రీ, ఆరేళ్ల కొడుకూ (యూరోపియను) చూసేవారిలో ఉన్నారు. శిల్పాన్ని చూసి ఆ పసివాడు కిసుక్కున నవ్వాడట. కారణం అడిగాడు తండ్రి. "డాడీ! ఇదేం విగ్రహం? ఆ శిల్పికి కామన్సెన్సు కూడా లేదు. గుర్రం మీద కూర్చున్నవాడు ఎక్కడానికీ, కాళ్ల పట్టుకీ గొళ్లాలు (స్టర్రప్స్–రికాబులు) లేవేం!" అన్నాడు. శిల్పి ఈ మాటలు వింటున్నాడు. కుర్రాడి విమర్శ సహేతుకం. అతని వెక్కిరింత పసితనం. కాని దానికి మూల్యం ఉంది. శిల్పి తర్వాత ఆత్మహత్య చేసుకున్నాడట! మరొక్కసారి – విమర్శకి విచక్షణ మాత్రమేకాదు, వివేచన కూడా కావాలి. పెద్దమనసు కావాలి. విమర్శకుడికి ఈ రెండూ ఉన్న సాక్ష్యం కావాలి.

విమర్శకుడు – కొండొకచో – రచయితకంటే గొప్పవాడు కావచ్చు. కాని అతని ఉద్దేశం ఆ పెద్దరికాన్ని భుజం మీద చెయ్యిని చేస్తుంది. హితవుని చేస్తుంది. ఇంకా మల్లంపల్లి వారివంటి ఉదాత్తులయితే ఆశీర్వాదం చేస్తుంది.

నా *పిడికెడు ఆకాశం* నవల రాసి తేలికగా 47 సంవత్సరాలయింది. ఆనాటి ఎమెస్కో పాకెట్ బుక్స్ ప్రణాళికలో భాగంగా నెలానెలా ప్రచురణల్లో రెండో నెల ప్రచురణ నాది. చదివిన పాఠకుడు నాకో ఉత్తరం రాశాడు. మీ కథానాయకుడు సిగరెట్టు కాల్చడని ముందు పేజీల్లో చెప్పారు. కాని ఫలానా పేజీలో సిగరెట్టు కాల్చినట్టు చెప్పారు – అని. ఇప్పటికీ ఆ సవరణని మరిచిపోను. కారణం – 47 ఏళ్లుగా ఎదురుచూస్తున్నాను– పిడికెడు ఆకాశం నవల ప్రచురణకి – నవలకోసం కాదు, ఈ సవరణ జరపడానికి. ఇప్పటికీ ఆ ఉత్తరం రాసిన కుర్రాడి పేరు గుర్తులేదు. ఇప్పుడతనూ 70 ఏళ్లవాడయి వుంటాడు. ఈ విషయం మరిచిపోయి ఉంటాడు. కాని అతను ఎత్తి చూపిన ఆ పొరపాటు ఇంకా మనసులో నిలిచిపోయింది.

ఉద్దేశపూర్వకంగా కాకపోయినా, తొందరపాటుగా చేసిన విమర్శవల్ల జరిగిన మరొక అనర్థం చెప్తాను. ఒకావిడ పెళ్లయిన కొత్తలో కళ్లకు కాటుక పెట్టుకునేది. పెద్ద కళ్లు. కాని ఒకసారి ఏదో వాయినం పుచ్చుకు వచ్చినప్పుడు కాటుక ముఖమంతా పాకిపోయింది. భర్త చికాకుగా ఏమిటా అవతారం? అని విమర్శించాడు. తర్వాత ఆమె కాటుకని సరిగ్గా పెట్టుకునే ప్రయత్నం చెయ్యలేదు. కాటుక పెట్టుకోవడమే మానేసింది. ఎన్నేళ్లు? 52 సంవత్సరాలు. ఆమె నా భార్య. ఈ మధ్య ఏదో పేరంటానికి వెళ్లి వచ్చింది. కాటుక చక్కగా కళ్లకి ఉంది. "ఇలా పెట్టుకోవేం?" అన్నాను. అప్పుడీ విషయం చెప్పింది. ఎంత దురదృష్టం? నాకూ బాధ్యత తెలీక, మన్రో శిల్పాన్ని విమర్శించిన కుర్రాడికీ పెద్ద తేడాలేదు. ఈ విషయంలో– ఒక విమర్శ ఒక జీవితకాలం సంప్రదాయ వైభవాన్ని దూరం చేసింది, మరొకరికి జీవితాన్నే నష్టపరిచింది.

విమర్శవల్ల అరుదుగా – ఒక్కోసారి మంచీ జరుగుతుంది. ప్రముఖ నార్వే నాటక రచయిత హెన్రిక్ ఇబ్సన్ 1881లో *గోస్ట్స్* అనే నాటకం రాశాడు. ఆనాటి క్రైస్తవ సమాజం, ముఖ్యంగా మత గురువులు ఆ నాటకాన్ని దుయ్యబట్టారు. ఆ నాటకం కాపీల్ని నడిరోడ్డు మీద తగులబెట్టారు. ఇబ్సన్ బాధపడ్డాడు. కోపం వచ్చింది. ఆ అవమానాన్ని తట్టుకోలేకపోయాడు. తర్వాత ఏం చేశాడు? సమాజంలో ఒకే ఆలోచనకు ముడిపడిన మెజారిటీ పెద్దరికం ఎంత అనర్థమో వివరించే గొప్పనాటకాన్ని మరుసటి సంవత్సరమే రాశాడు : *ఎనిమీ ఆఫ్ ది పీపుల్.* అది అపూర్వమైన రచన. మరో 90 సంవత్సరాల తర్వాత తెలుగు దేశంలో ఒక మహానటుడు– కె.వెంకటేశ్వరరావు నాచేత – యీ నాటకం స్ఫూర్తితో మరో నాటకం రాయించాడు. దాని పేరు : సత్యంగారిల్లెక్కడ? అయితే ఇబ్సన్‌కి అలనాడు

సమాజం పట్ల ఉన్న ఉదాసీనత నాకు లేదు. నిజానికి మన సమాజం *గోస్ట్స్* నాటకాన్ని ఎరగదు. కాగా, మతం గర్హించిన సందర్భమూ లేదు. అప్పటి రచయిత లక్ష్యం వేరు. కాని శయ్య గొప్పది. ఈ దేశానికీ, ఈ సమాజానికీ దాదాపు నూరేళ్ల తర్వాత ఈ రచన చెయ్యాలంటే ఏం మార్పులు అవసరం? నా నాటకంలో ఆ మతం లేదు. కాని *దేవుడు* అనే పాత్రని కలిపాను. మతం – దృక్పథం. దేవుడు – లక్ష్యం. నా నాటకంలో మెజారిటీ శక్తులు దేవుడికి విషం యిస్తాయి. సమాజానికి మూలధాతువుగా నిలిచే ఆలోచననే రూపుమాపే శక్తులు 'సత్యా'న్ని గుర్తుపడతాయన్న నమ్మకం లేదంటూ – 'సత్యం' అక్కడినుండి తరలిపోతాడు. సత్యం యిక్కడ ప్రతీక. సింబల్. అదీ నాటకం. ఆనాటి సమాజపు తిరస్కారానికి – ఎదురు సమాధానం, తిట్టు ఇబ్సన్ *ఎనిమీ ఆఫ్ ది పీపుల్.* కాని ఆ ప్రమేయం లేని ఈ నాటి సమాజపు విశ్వాసాల వక్రీకరణ నా యితివృత్తం. చట్రం అదే. కాని ఉద్దేశం వేరు. మూల రచయితది కోపం. స్ఫూర్తి రచయితది అన్వయం.

తనకి దొరికిన అవకాశాన్ని చవకబారు సాధన చేసుకొనే విమర్శకుడు మూడోరకం స్థాయికి చెందినవాడు. గొప్ప విమర్శకుడు పారదర్శి. చిన్న విషయాన్ని ఎత్తి చూపినా అది తన అభిప్రాయంగానో, సహేతుకమయిన సవరణగానో చెప్పి పక్కన నిలవగలగాలి. అప్పుడే రచయిత అతని మాటని శిరస్సున ధరించి, అతని ఉనికిని గుర్తు పడతాడు. కృతజ్ఞత చెప్పుకుంటాడు. అతని పెద్దరికాన్ని అర్థం చేసుకుంటాడు.

కాగా విమర్శకుడి మొదటి పెట్టుబడి –జిజ్ఞాస, విజ్ఞానం, సద్బుద్ధి, ఆరోగ్యమైన దృక్పథం. నిజమైన విమర్శ నిజానికి కరదీపిక అవుతుంది. ఇంకా ఒకడుగు ముందుకు వేసి ఒక రచనలో ఉదాత్తతని – సహేతుకమయిన ఆలోచనకి అందని జీనియస్‌ని– ఒక supra-mental plane లో దాని మూలాలను వెలికితీస్తుంది. గొప్ప ఉదాహరణ – పోతన భాగవతంలో గజేంద్రమోక్ష ఘట్టం. పోతన మనస్సుకే అందని ఒక స్థాయి ఆలోచనా స్రవంతిని దైవానికి ముడిపెట్టిన సంస్కారం ఈ జాతిది. శ్రీరాముడే స్వయంగా వచ్చి 'అలవైకుంఠ పురంబులో నగరిలో....' అనే పద్యాన్ని రాశాడని భావించడం. విమర్శకుడు సృజనకూ ఆలోచనా సాంద్రతకూ వంతెనలు నిర్మించగల మధ్యవర్తి. మంచి విమర్శ మంచి రచనని ఆకాశంలో నిలుపుతుంది. కాని మామూలు రచనని అధః పాతాళానికి తొక్కివేయదు. సానుభూతితో పలకరిస్తుంది. తప్పుతోవ పట్టిన రచనకు చేయి అందించి ముందుకు నడిపిస్తుంది. మంచి విమర్శ ఆశావాది A critic should not destroy the creator. He should rehabilitate the creation. ఎందుకని? సమాజంలో ఒక రచన సృష్టించిన అపశృతి– అది నిజంగా అపశృతే అయినా సమాజ ధర్మాన్ని నాశనం చెయ్యలేదు. కాని బాధ్యతా రహితమైన విమర్శకుడు – గొప్ప రచన చేసే ముందు చూపుగల రచయితను సమూలంగా నాశనం చెయ్యగలడు.

Also, a critic need not destroy the creation. After all, who is he to do that? అన్నిటినీ, అందరినీ సమతుల్యంగా చూసి, బలహీనపు సృష్టిని తుడిచి పెట్టే మరో బలమైన శక్తి ఒకటి ఉంది. దాని పేరు కాలం.

విమర్శ నాశనం చేసే విధ్వంసక శక్తికాదు. కాకూడదు. ఒక సరదానో, ఒక వినోదమో, ఒక అక్కసుకి ఆధారమో, తన మాట చెల్లించుకునే అతి ప్రాథమికమైన మనస్తత్వమో కాకూడదు. Critic should be more creative than the creator. Because he has all the implements to detonate the process. దుర్విమర్శ గర్భంలో ఉన్న శిశువుని చేసే భ్రూణహత్యలాంటిది. విమర్శ పెద్ద దిక్కు కావాలి. అభిరుచికీ, అభినివేశానికీ అండగా నిలిచే మార్గసూచి కావాలి. నేలబారు రచనని కూడా సానుభూతితో పలకరించి – ఇంకా కృషికి, మంచి ఫలితానికి వేళ మించి పోలేదని భుజం మీద చెయ్యి వేసి నడిపించే హిమశృంగం కావాలి.

ఇంగ్లీషులో ఒక సామెత ఉంది. "విమర్శని పట్టించుకోకు. అది నిజంకాదా?– మరిచిపో. అది అన్యాయమా? – కోపం తెచ్చుకోకు. అది తెలివితక్కువ తనమా? – నవ్వుకో. అది సబబైనదే అయితే అది విమర్శేకాదు! తెలుసుకో. ఒక గొప్ప అనుభవాన్ని చెప్పి ఈ వ్యాసాన్ని ముగిస్తాను. ఇది తేలికగా – కనీసం 50 సంవత్సరాల కిందటిమాట. ఓ మహానుభావుడు తన తొందరపాటుని తొందరగా దిద్దుకున్న – అపూర్వమైన సంఘటన.

1962 ప్రాంతంలోననుకుంటాను – నేను చిత్తూరు ఆంధ్రప్రభలో పనిచేసే రోజుల్లో నా తొలి నవల *చీకటిలో*

*చీలికలు* అచ్చయింది. తెలిసిందంతా చెప్పాలని, తనకి చాలా తెలుసనని చెప్పాలని ఆరాటపడే- అపరిపక్వ దశ అది. ఆ రోజుల్లో చిత్తూరు మునిసిపల్ కమీషనర్ గుంటూరు శేషేంద్ర శర్మగారు. ఆయనకి ఒక నవల కాపీ యిచ్చాను. ఆయన విశ్వనాథ సత్యనారాయణ అభిమాని. వారికి చిత్తూరులో అఖండ సన్మానాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ పాఠశాల హాలులో సభ. మల్లాది వసుంధర, మల్లాది రామచంద్ర శాస్త్రి ప్రభృతులు వారితో వచ్చారు. అంతకు ముందు ఏదో సందర్భంలో విశ్వనాథవారి *కిన్నెరసాని పాటలు* పిప్పర్‌మెంట్ల పాకంలో ఉన్నాయని ఆరుద్ర విమర్శించారట. అందుకు కారణముంది. ఆయన సమగ్ర సాహిత్యాన్ని గురించి మాట్లాడుతూ "పాఠాలు చదువుకునే కుర్రాళ్లు నోట్సు రాసుకునే శ్రమ తగ్గించాడు ఆరుద్ర" అన్నారట విశ్వనాథ. ఇవి రెండూ ఇద్దరు రచయితలు తమ సునిశితమైన వాక్చాతుర్యంతో చేసిన *కొరకరాని* విమర్శలు.



విశ్వనాథ

ఆ నేపథ్యంలో విశ్వనాథ అగ్గి బుగ్గి అవుతూ చిత్తూరు వచ్చారు. ఆరుద్ర ప్రసక్తి తీసుకురాకుండానే దుయ్యబట్టిన గుర్తు. మాట్లాడుతూ మధ్యలో "ఇందాక ఓ నవల చూశాను. ఆ నవలలో రచయిత ఆకాశంలో నక్షత్రాలన్నీ మరో లోకంలోకి ఎగిరిపోతున్నట్టున్నాయంటాడు..." అంటూ ఎత్తిపొడిచారు. ఆ నవల నాది. ప్రేక్షకుల్లో మా అందరికీ అర్థమయింది - ఆయన నా నవల రెండు పేజీలు తిప్పి ఉంటారు. నా ముఖం ఎర్రబడింది. నా పక్కన ఉన్న శేషేంద్ర శర్మ, తదితరులూ - యిబ్బంది పడ్డారు. వాళ్లకీ అర్థమయింది విశ్వనాథవారి ఆగ్రహంలో నలిగిపోయిన నా పరిస్థితి. ఉపన్యాసం అయిపోయింది. మరునాడు శేషేంద్రశర్మ గారింట్లో మధ్యాహ్నం విందు ఏర్పాటు చేశారు. పెద్దలంతా వచ్చారు. ముందురోజు సాయంకాలం చేసిన ఉపన్యాసం టేపుని పెట్టారు. నేను విశ్వనాథవారి పక్కన కూర్చున్నాను. నా నవల మీద ఆయన చేసిన విమర్శ ఏ సందర్భంలో వస్తుందో అందరికీ అర్థమవుతూనే ఉంది. తీరా వచ్చింది.



శేషేంద్ర శర్మ

విశ్వనాథవారు నా వేపు చూసి "మిమ్మల్ని విమర్శించానా?" అన్నారు సాదరంగా. నేను సర్దుకున్నాను. "నా వంటి నవలా రచయితకి మీ విమర్శ కూడా అర్హతే. చాలా సంవత్సరాలు చెప్పుకుంటాను" అన్నాను. (ఇప్పుడూ ఆ పనే చేస్తున్నాను!) ఆయన బాధపడిపోయారు. బహుశా పశ్చాత్తాపమూ కలిగి వుంటుంది. నా మీద సంధించవలసిన అస్త్రం కాదది. అందువల్ల ఏ దుష్ఫలితం ఉంటుంది? అయితే ఆయన స్థాయిలో జరిగిన అనర్థానికి ఉపశమనంగా ఏం చెయ్యాలి? సవరణ- ఆయన స్థాయిలో ఎలావుంటుంది?

ఆ సాయంకాలం సంగీత నాటక అకాడమీ అధ్యక్షులు ఆర్.బి. రామకృష్ణంరాజుగారు తానే అధ్యక్షులుగా ఉన్న స్థానిక శ్రీరామవిలాస సభలో వారికి సత్కార్యాన్ని ఏర్పాటు చేశారు. సభకి ముందుగా బయలుదేరి విశ్వనాథ కొన్ని దుశ్శాలువలు కొన్నారు. ఆ సభలో నా ఒక్కరికే అయితే సవరణ. పశ్చాత్తాప ప్రకటన. మరి? ఆనాడు సభలో ఉన్న యువరచయితలందరికీ పేరు పేరునా శాలువలుకప్పారు. నేనూ, మధురాంతకం రాజారాం, రాజేంద్ర, వల్లంపాటి వెంకటసుబ్బయ్య - యిలాగ, నేను ఆయన దగ్గరికి వెళ్లడానికి మొహమాట పడుతూంటే - ఆయనే నావేపు రెండడుగులు వేసి ''పెళ్లయి, పిల్లల్ని కన్నవాళ్లకి సిగ్గెందుకండీ!" అంటూ నా భుజం మీద శాలువా కప్పారు.

విమర్శ ఓ వ్యక్తి సృజనను సమూలంగా నాశనం చేయకూడదని నమ్మిన ఓ కవిసామ్రాట్ తన తొందరపాటుని - కోరి చెయ్యకపోయినా, యాదృచ్ఛికంగా జరిగిపోయినా సవరించుకున్న అతి ఉదాత్తమయిన సంఘటన యిది. విమర్శ పదునైన ఆయుధం. వీధికొళాయి వినోదాలకు తాకట్టుపడే - బొత్తిగా అర్హతలేని, బొడ్డూడని వాళ్లంతా చేసే దురుద్దేశపూరితమైన వాచాలత్వం కాకూడదు. కానేరదు.

సద్విమర్శ ఉద్యమం. వ్రతం. ఒక జీవిత ధ్యేయం. చరిత్రకుపాదేయం. ఎందరో మహానుభావులు ఆ నిజాన్ని తమ కృషితో నిరూపించారు. నిరూపిస్తూనే ఉన్నారు.

ప్రముఖ రచయిత, మానసిక విశ్లేషకుడు డేల్ కార్నిగీ ఒక మాట అన్నాడు Any fool can criticize, condemn and complain, but it takes character and self control to understanding and forgiving. మి

గొల్లపూడి మారుతీరావు



సి. సుబ్బారావు

# సి. సుబ్బారావు

*- నాగసూరి వేణుగోపాల్*

**వా**రి మాటలలో లాలిత్యం ఉంది, నెమ్మదితనం ఉంది, సహిష్ణుత ఉంది, పక్వత ఉంది, ఎరుక ఉంది, స్పష్టత ఉంది! అట్లని కరుకుదనంకానీ, ఓపిక లేనితనంగానీ, అస్పష్టతగానీ, మొహమాటంకానీ ఉండేవి కాదు!!

ఇలా చెప్పుకోవడం సరళంగా ఉండవచ్చు, అయితే వీటిని సాధించడం అంత సులువు కాదు. వారి అధ్యయనం, పాండిత్యం, పరిశీలన, అనుభవం మేళవించి సాంద్రమై తేటపడిన తీరు ఇది. కేవలం విన్న మాటలు ద్వారా మూర్తిమత్వం రూపుకట్టించవచ్చునా? రసతపస్వి సంజీవ్‌దేవ్ గతించినపుడు హైదరాబాదులో జరిగిన సంస్మరణ కార్యక్రమంలో వారు సభలో పాల్గొనటం చూశాను. పలకరించే సాహసం చేయలేదు. వారు రెండు విధాలుగా తెలుసు-శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో చదువు కుంటున్నప్పుడు ఆచార్య ఎం.వి. రాఘవశర్మ గారు వైస్ ఛాన్సలర్. వారు క్షేత్రయ్య గురించి పరిశోధన చేసి పెద్ద పేరు తెచ్చుకున్న ఆంగ్ల భాషాపండితులు. ఇటువంటి విషయాలు ప్రస్తావించుకుంటున్నప్పుడు అదే విశ్వ విద్యాలయంలో పనిచేసిన వారిలో ముచ్చటించబడే వ్యక్తుల జాబితాలో వీరు వస్తారనే చర్చ వచ్చేది.

జి.వి. కృష్ణారావుగారి *కీలుబొమ్మలు* నవలను ఇంగ్లీషులోకి అనువదించిన దీశెట్టి కేశవరావు గారితో సాహిత్య సంగతులు మాట్లాడుకుంటున్నప్పుడు సైతం శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పనిచేసే ఆంగ్ల భాషాపండితులు, ప్రముఖులు అని ప్రస్తావన వచ్చేది. ఇది మూడు దశాబ్దాల క్రితం హిందూపురం సంగతి. కేశవరావు గారు హిందూపురంలో పనిచేసేవారు. ఆంగ్ల శాఖలో ఉద్యోగం చేస్తూ తెలుగు మీద అవగాహనతో, ప్రేమతో సాగడం అనేది అంత తరచుగా తారసపడే విషయం కాదు. అందువల్ల ఒక ప్రత్యేకమైన గౌరవం ఏర్పడింది.

మరి అటువంటి వ్యక్తి ఎదుట పడినపుడు ఎందుకు పలకరించలేకపోయాను అనే ప్రశ్న నాకే కలిగింది. చిత్రకారులు, సాహితీకారులు సంజీవ్‌దేవ్ పోయినపుడు జరిగిన సభ అది. అటువంటి సమయంలో మామూలు తరహా పరిచయాలు తగవనే భావన ఉండటం కూడా ఉంది. సంస్మరణ సభలలో ఒకరకమైన నిర్లిప్తత, ఒకరకమైన అసంతృప్తి, ఒకరకమైన వైరాగ్యం, ఒకరకమైన విషాదం వెరసి ఒకరకమైన మౌనంగా ఆవరిస్తాయి. అంత పెద్దవారు కనుమరుగు అయినపుడు ఆ మాత్రం చలనం అవసరం. బహుశా మాట కలపడానికి అడ్డంకి అయివుంటుంది. మరోవైపు విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్సలర్‌లను నిర్ణయించే స్థాయి ఉద్యోగంలో పనిచేసేవారనే గౌరవం కూడా మరింత ముడుచుకుపోయేలా చేసి ఉండవచ్చు.

కానీ ఆ రోజు చూసినపుడు వారు చాలా ప్రత్యేకంగా కనబడ్డారు. వారు హాయిగా, హడావుడి లేకుండా ఉన్నారు. అది వారి నైజం కావచ్చు. చాలా పలుచని మూర్తి. చురుకయిన కదలికలు. ఈ రెండింటికంటే ముందు మనకు స్పష్టంగా కనబడేది, గుర్తుండేది. వారి తెల్లని, ఒత్తయిన, గుబురు జుట్టు. సి. సుబ్బారావు అనగానే ఎవరికయినా వారి జీవితానుభవంతో పండిన జుట్టు తప్పక గుర్తుకు వస్తుంది. ఇంకా పరిశీలనగా అంటే తీక్షణమైన, ప్రశాంతమైన చూపులు, కుడిచేతికి పెట్టుకున్న గడియారం మదిలో మెదులుతాయి. 1938లో గుంటూరు ప్రాంతంలో రైతు కుటుంబంలో జన్మించిన సుబ్బారావు, ఆ చివరన ఉండే ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎంఏ ఇంగ్లీషులో బంగారు పతకం పొంది; ఈ చివరన ఉండే తిరుపతి విశ్వ విద్యాలయంలో చిన్నవయసులోనే ఉద్యోగం చేశారు. పిమ్మట కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో పరిశోధనచేసి, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషు శాఖను ప్రారంభించారు. తర్వాత సార్వత్రిక విశ్వవిద్యాలయంలో పనిచేసి, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ఐటీ కోర్సులు, స్కిల్స్ డెవలప్‌మెంట్ అవకాశాలు, యూనివర్శిటీ స్థాయిలో పాలనాసంస్కరణలకు సంబంధించి విశేష కృషి చేశారు.

2013 మార్చి మాసంలో బహుశా చివరివారం కావచ్చు, నేనప్పుడు కడపలో ఉన్నాను. ఆ ఉదయం సుబ్బారావు గారు ఫోన్‌చేసి తను ఫలానా అని వివరించి, కవిమిత్రులు పైడి తేరేష్ బాబుతో మొబైల్ నెంబరు తీసుకున్నానని కూడా చెప్పారు. అప్పుడే వెలువడిన కె. చంద్రహాస్ పుస్తకం - నాయుడమ్మగారి జీవిత చరిత్ర గురించి చెప్పి, మీరు చదివితే బావుంటుంది, పుస్తకం పంపుతామని చెప్పారు. నాకు చాలా సంతోషం వేసింది.

రెండు మూడు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న నాయుడమ్మ జీవిత చరిత్ర వచ్చిందని చెప్పడం, కోరకుండానే పుస్తకం పంపుతున్నామని చెప్పడం మరో సంతోషకారణం సి. సుబ్బారావుగారే ఫోన్ చేసి పలకరించడం, పరిచయం చేసుకోవడం. కట్టా చంద్రహాస్ రాసిన ఆంగ్ల పుస్తకం *ది పీపుల్స్ సైంటిస్ట్ డా. వై. నాయుడమ్మ*లో సి. సుబ్బారావు ముందుమాట రాశారు. అందులో రెండవ పేరాలో అంటారు– అంబేద్కర్ ఆదర్శాల సాధనలో డా. నాయుడమ్మ చేసిన కృషి విశేషమైనదని. ఒక రాజకీయవేత్త కలను ఒక శాస్త్రవేత్త కృషిని ముడివేసి ఒక సాహితీవేత్త విశ్లేషించడం గొప్పగా అనిపించింది. రాజకీయాలు, టెక్నాలజీ, సాహిత్యం – పూర్తిగా విభిన్నమైనవని ఇప్పటికీ చాలామంది నమ్మే సమయంలో ఒకచోట కనబడటం గొప్ప ఇంటలెక్చువల్ రిలీఫ్‌ను ఇస్తుంది.

తరువాత మరోసారి మాట్లాడుకున్నప్పుడు మా చర్చ డా. సర్దేశాయి తిరుమల రావు మీదికి మళ్ళింది. ఆయిల్ టెక్నాలజీలో అమోఘమైన అధికారం, తెలుగు సాహిత్యంలో విశేషమైన పాండిత్యం గలవారు తిరుమలరావు. సుబ్బారావు గారు అనంతపురంలో పదేళ్ళు పనిచేశారు. తిరుమలరావు గారి మీద ఒక సంకలనం తెలుస్తున్నామని వివరిస్తూ, వారికి సరైన గుర్తింపు రాలేదని అన్నాను. దాన్ని విభేదిస్తూ సుబ్బారావు తన హయాంలోనే డా. సర్దేశాయి తిరుమలరావు గారికి గౌరవ డాక్టరేటు ఇచ్చారని గుర్తుచేశారు. నా వాదనను మెరుగుపరచడానికి వారు మొహమాటపడలేదు. అంతేకాదు సుబ్బారావు మరో విషయం కూడా చెప్పారు. సర్దేశాయి తిరుమలరావు పరిశోధనల ఆధారంగా పారిశ్రామిక రంగంలో రాణిస్తున్న వారిలో ఒకరి గురించి చెప్పి, వారు మా పుస్తకం కొన్ని కాపీలు కొనగలరని వివరించారు కూడా. పుస్తకం వెలువడిన తర్వాత సదరు మిత్రుడు కొన్ని కాపీలు కొని మాకు కొంత ఆర్థిక భారాన్ని తగ్గించారు. నాయుడమ్మలో కనిపించే ప్రాక్టికల్ లీడర్‌షిప్ నాకు సుబ్బారావులోనూ ద్యోతకమైంది. నాయుడమ్మ పుస్తకం కారణంగా సి. సుబ్బారావు, కె. చంద్రహాస్ మిత్రులయ్యారు. 2014 మార్చిలో మదరాసు నుంచి హైదరాబాదుకు వచ్చి మూడు రోజులున్నప్పుడు మేము కలిసి ఉండాల్సింది. నాయుడమ్మ గారి సాంకేతిక విజ్ఞాన ఫలితాలు విశ్లేషించే సమయంలో అంబేద్కర్ గురించి ప్రస్తావించగల సుబ్బారావు అంటే నాకు చాలా గౌరవం ఏర్పడింది. షేక్స్పియర్ పాఠం చెబుతూ, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి నాటకం 'రాజరాజు'ను పోల్చి చెప్పడం సుబ్బారావు పద్ధతి అని మరలా తెలిసింది. సమాజం – సైన్స్ సంబంధించి ఆంధ్రజ్యోతి దినపత్రికలు నేను రాసిన వ్యాసాలు త్వరలో పుస్తకంగా వస్తున్నాయి. తొలి సంపుటానికి సి. సుబ్బారావు గారిని ముందుమాట రాయమని ఫోన్‌లో కోరాను. దీనికి ఆయన తనబాణిలో ఎవరైన శాస్త్రవేత్తతో రాయిద్దాం అన్నారు. సైన్స్ నుంచి కాకుండా ఇతర రంగాలవారు రాయాలని నా అభిప్రాయమని చెప్పాను. తను గుంటూరులో ఉన్నాను, మెయిల్ పంపండని చెప్పారు. 2014 అక్టోబరు 29 వారికి పంపాను. రెండురోజుల తర్వాత, ఫోన్ చేశాను మెయిల్ పంపానని చెప్పడానికి. అప్పటికే దాదాపు చదివేసి ఉన్నారు. అభినందన పూర్వకంగా పాపులర్ సైన్స్‌కు ఉండాల్సిన సెమి–లిటరరి శైలి గురించీ, దాని అవసరం గురించీ, నా రచనలలో ఉండే ఆ గుణం గురించీ చాలాసేపు వివరించారు. అంతే. మరుసటిరోజు వారి ముందుమాట మెయిల్ రెక్కలు కట్టుకుని వాలింది. అది ఎంత వేగంగా వచ్చిందంటే, నేను మెయిల్ చూసుకోవడమే ఆలస్యమైనట్టు.

2014 నవంబరు 3 న వారు ముందుమాట పంపారు. ఈ పుస్తకం 'ప్రగతికి ప్రస్థానం సైన్స్' ఇంకా వెలువడలేదు. కానీ సి. సుబ్బారావు గారు డిసెంబరు 27 తెల్లవారక ముందు (శ్రీరమణ గారు పేర్కొన్నట్టు) ఒక వేకువలో పారిజాతం రాలినంత నిశ్శబ్దంగా నిష్క్రమించారు. సుబ్బారావు కాలంలో ఉన్నత విద్యామండలిలో ఏర్పడిన సంప్రదాయాలు, రాష్ట్రానికి విద్యావ్యవస్థకు, ప్రత్యేకంగా మానవ వనరులు సమకూర్చడంలో జరిగిన కృషి విశేషమైనదని చుక్కా రామయ్య ప్రస్తుతిస్తారు. అయితే సి. సుబ్బారావు వంటి సున్నితమైన, మృదుస్వభావి అయిన మేధావిని మన మీడియా గమనించలేకపోయింది. పత్రికలలో వార్తల సద్దుగానీ చానళ్ళులో విశేషాల చప్పుడుగానీ లేకుండా సుబ్బారావు గారు వెళ్ళిపోయారు. ఇతరులను తీర్చిదిద్దటం, ఇతరుల పుస్తకాలకు ముందుమాట రాయటం వంటి పనులకే ప్రాధాన్యమిచ్చిన సుబ్బారావు తన రచనలు పుస్తకంగా వేసుకోలేదు. ఆంగ్ల పత్రికలో సమకాలీన రాజకీయాలపై కాలమ్ రాసిన సుబ్బారావు గారికి ఇది పెద్ద విషయం అనిపించలేదు. కానీ అలాంటి సంకలనం రావడం ప్రస్తుత అవసరం! మి

డాక్టరు నాగసూరి వేణుగోపాల్

# సంగీత నవావధానము

- మీగడ రామలింగ స్వామి

మన తెలుగు భాషను, తెలుగు సంస్కృతిని మన మహాకవులు, వారివారి కావ్యాలతో సుసంపన్నం చేశారు. మహోన్నత మానవ విలువలు వారి కావ్యాలనిండా పొందుపరచారు. మనిషి ఎలా బ్రతకాలో, ఎలా బ్రతక కూడదో స్పష్టంగా రాశారు. మనిషికి కావలసిన సంభాషణా చాతుర్యం, వ్యక్తిత్వ వికాసం వారి కావ్యాల ద్వారా తేటతెల్లం చేశారు. ఇవన్నీ అనేకానేక సాహితీ ప్రక్రియల ద్వారా మనకు సుబోధం చేశారు. రాబోయేతరం వాళ్ళు పది కాలాలపాటు పదిలంగా ఉండాలని, తమ జీవితాలు ధారపోసి కావ్యాలు రాశారు. సమాజ హితం, సమసమాజ సంక్షేమం కోసం, వారు అహర్నిశలూ శ్రమించారు. 'విశ్వశ్రేయః కావ్యం' అని వారు సూత్రీకరించుకున్నారు. కావ్యం చదవడంవల్ల యశస్సు, వ్యవహార జ్ఞానంతోపాటు అనేకానేక విషయాలు విదితం అవుతాయని స్పష్టంగా చెప్పారు.

ఇలా ఎన్ననుకుంటే ఏం ప్రయోజనం? ఇవన్నీ ఇప్పుడు ప్రయోజనం లేకుండా పోతున్నాయి. కళ్ళల్లో ఒత్తులు పెట్టుకొని తిరిగినా కావ్యాలు చదివేవాళ్ళు కనబడకుండా పోతున్నారు. పద్యం వినబడితే చాలు పరుగులు తీస్తున్నారు. మహాకవి గురించి మాటాడితే, మనసును మరోచోట పెడుతున్నారు. తెలుగువాళ్ళ ఆస్తి అయిన పద్యాన్ని పక్కనబెడుతున్నారు. ఇది నిజంగా బాధాకరం. ఈ బాధలో నుండి పుట్టిందే, సంగీత నవావధానము. మహాకవుల పద్యాలను మధురంగా వినిపించాలనే ఆలోచనకు ఊపిరిపోసుకున్నదే సంగీత నవావధానం. సంగీత సాహిత్యాలకు సమప్రాధాన్యం కల్పిస్తూ పండిత పామర జనరంజకంగా పరుగిడుతున్నదే, సంగీత నవావధానం. ప్రాచీన పద్య పరిరక్షణే ధ్యేయంగా, తెలుగు భాషా, సంస్కృతుల సమ్మేళనంగా, మానవ విలువల దర్పణంగా సాగుతున్నదే, సంగీతనవావధానం.

**నవావధాన విధానం :**

తెలుగు సాహిత్యాన్ని పురాణం, శతకం, ప్రబంధం, నాటకం, ఆధునికం, అవధానం అనే ఆరు ప్రక్రియలుగా తీసుకొని, వీటికి సంస్కృత భాషలోగల శ్లోకాలను కూడ గ్రహించడం జరుగుతుంది. పై ఏడు విభాగాలను ఏడుగురు ప్రాశ్నికులకు ఇవ్వడం జరుగుతుంది. ఒక్కొక్క విభాగానికి 20 పద్య / శ్లోకాలను ఇచ్చి, పక్కనే 20 రాగాల పేర్లు ఇవ్వడం జరుగుతుంది. ప్రాశ్నికులు వారిష్టమైన పద్యాన్ని, వారిష్టమైన రాగంలో పూరించమంటారు. నవావధాని, ప్రాశ్నికుడడిగిన రాగంలో అప్పటికప్పుడు, కేవలం శ్రుతి ఆధారంగా స్వరపరచి, గానం చేసి, ఆ పద్య / శ్లోక కవిని, వారి కావ్యాన్ని, విశేషాన్ని, నేటి సమాజానికి అది ఎంత ఉపయోగపడుతుందో వివరించి చెప్పడం జరుగుతుంది. ఇల్లా, ఏడుగురు అడిగిన పద్య / శ్లోకాలకు నవావధాని జనరంజనంగా స్వరపరచాలి. మధ్యలో తెలుగు భాష పుట్టుపూర్వోత్తరాలు, తెలుగు సంస్కృతిని గురించి చెపుతూ ఉండాలి. అప్పటికి ఒక ఆవృత్తం అవుతుంది.

**సంగీత నవావధానము అంటే? :**

ఏడుగురు ప్రాశ్నికులు, సంధాత, నవావధాని మొత్తం తొమ్మండుగురు కాబట్టి నవావధానం అని, కొత్తది కాబట్టి నవావధానం అని, ఉదయం అవధానం చేసి, తిరిగి మధ్యాహ్నం అవధానం చేసినా, అడిగిన పద్యంగాని, అడిగిన రాగం గాని ప్రాశ్నికులు అడుగకుండా కొత్తవి అడుగుతారు కాబట్టి, నిత్యనూతనంగా సంగీత ప్రధానంగా సాగుతుంది కాబట్టి సంగీతనవావధానం అని కూడా చెప్పుకోవచ్చు. ఇంకా, తొమ్మిది అక్షరాలతో 'సంగీత నవావధానము' అని నామకరణ చేయబడింది. కాబట్టి నవ అనే శబ్దం అర్థవంతమవుతుంది (ఇంకా చెప్పాలంటే దీని రూపకర్తనైన నా పేరు కూడా తొమ్మిది అక్షరాలే (మీగడ రామలింగస్వామి). కాబట్టి 'సంగీత నవావధానము' అని సార్థకమైంది).

**కవులు, పద్యశ్లోకాలు, రాగాలు? :**

ఇందులో 42 కవుల పద్య / శ్లోకాలు ఎంపిక చేయబడ్డాయి. ఏడుగురు ప్రాశ్నికులకు 20 పద్యాలు చొప్పున 7×20=140 పద్య / శ్లోకాలు ఇవ్వబడతాయి. 20 రాగాలలో వారు ప్రశ్నిస్తారు. అంటే 140×20=2,800 విధాలుగా ప్రాశ్నికులు అడిగినదానికి, నవావధాని

స్వరపరచడానికి సిద్ధంగా ఉండాల్సి ఉంటుంది.

**ప్రాశ్నికులు ఎలాంటివారై ఉండాలి? :**

తెలుగు చదవడం వస్తే చాలు. పద్యం వస్తే రాగంతో గాని, లేకుండా గాని చదవవచ్చు. లేదా చూసి చదవవచ్చు. అదీ కాదనుకుంటే, పద్యం మొదటి ముక్క చూసి రాగం నిర్ధేశించవచ్చు. సంగీత, సాహిత్య జ్ఞానం ఉంటే చాలామంచిది. లేకపోయినా ఫరవాలేదు.

**ఏ రాగమో? సంగీతం తెలియని వారి కెలా తెలుస్తుంది? :**

ప్రేక్షకులకు తెలియడంకోసం, ప్రాశ్నికులడిగిన రాగాన్ని ఓ సినిమా పాటతో పరిచయం చేసి, పద్యాన్ని స్వరపరచడంతో, తెలియని ప్రేక్షకుడు కూడా ఆనందం పొందుతాడు. తనకు కూడా తెలిసిన రాగమే అని భావిస్తాడు.

**ఇంతకూ ఇది అవధానమెలా అవుతుంది? :**

అవధానం అంటే, ఏకాగ్రత. ఒక రాగంలో పాడడం అలవాటున్న పద్యం/శ్లోకం. రాగం మార్చి, మరో రాగంలో పాడాలంటే, చాలా కష్టం. సాహిత్యం మరిచిపోవడం జరుగుతుంది. ఒక్కోసారి సంగీత స్వరకూర్పులోబడి, రాబోయే పదం/పద్యపాదం గుర్తుకు రాలేదు. దీనికి అవధానం కావాలి. అలాగే ముందడిగినవారు ఓ రాగంలో ప్రశ్నిస్తే, తరువాతి వారు రాగం మార్చి అడిగేసరికి, వెంటనే శ్రుతి మాత్రమే ఆధారంగా ఉండడం వలన ఈ రాగానికి సాహిత్యాన్ని ఇమడ్చడం కూడా అవధానమే.

**నవావధాన విధానం? :**

సంగీత నవావధానము, వాక్కు అర్థాల్లా ఉన్న పార్వతీ పరమేశ్వర స్తుతితో ప్రారంభమవుతుంది. 'పాలమీగడకన్న పాయసాన్నముకన్న, తీయనైనది మన తెలుగు భాష' అంటూ, మన మాతృభాష గొప్పతనం చాటుతూ ముందుకు సాగుతుంది. 'మడులు కానేకావు మాన్యాలు కావయా, సత్కవిరచనలే సంస్కృతియన' అంటూ మన సంస్కృతీ వైభవాన్ని దశదిశలా ప్రస్తుతిస్తుంది. వేదముఖులతోడ, వేదఘోషులతోడ విరసిల్లినట్టిదీ వేదభూమి! అని భారతమాతను సంస్మరిస్తూ కదం తొక్కుతుంది.

నన్నయ అక్షర రమ్యత్వాన్ని, తిక్కన తెలుగు వైభవాన్ని, పాల్కురికి, శివభక్తి పారమ్యాన్ని, ఎర్రన పద్యవైభవాన్ని, శ్రీనాథుని ఈశ్వరార్చన కళానైపుణ్యాన్ని, పోతన మందార మకరంద మాధుర్యాన్ని, శ్రీకృష్ణ దేవరాయల సంస్కృత పదభూయిష్ఠ రచనా చమత్కృతిని, అష్టదిగ్గజ కవుల ప్రతిపద బంధ ప్రబంధ ప్రాభవాన్ని, సల్లలిత కవితా ధురంధర మొల్ల కవనాన్ని ఈ సంగీత నవావధానము, వీనులకు విందు చేస్తుంది. మధ్యేమధ్యే పానీయం అన్నట్టు, సందర్భాను సారంగా, 'మనమునననుమానము' వంటి ద్వ్యక్షరులు, 'కాంచెశ్వైష్ణవుడు' వంటి గుక్క తిప్పుకోలేని సమాస పద ఘట్టనలు ఇందులో, తారసపడి, ఆశ్చర్యచకితుల్ని, ఆనందభరితుల్ని చేస్తాయి. అక్కడక్కడా ఆధునిక ప్రక్రియలతోపాటు, సినీ సంగీత ఝరులు కూడా పరవశింపజేస్తాయి. సర్వా రాధానీయమైన వాల్మీకి కాళిదాసాది కవుల శ్లోకాలు, పూర్వావధాన శేఖరుల అవధాన ఆశుకవిత్వ పటుత్వ సంపదలు మంత్రముగ్ధుల్ని చేస్తాయి.

**ఎంత సమయం? :**

ఏడుగురు ప్రాశ్నికుల పద్యాలు స్వరపరిచేసరికి, ఒక ఆవృత్తం అవుతుంది. సాధారణంగా రెండు ఆవృత్తుల య్యేసరికి, సుమారు రెండున్నర గంటల సమయం పడుతుంది. అది సభాసదులపై ఆధారపడుతుంది.

**గమ్యం? – ఆశయం? :**

ఈ సంగీత నవావధానము విద్యార్థులకు (యువతకు) చేరాలి. వాళ్ళకు వినిపించి, మన మహాకవుల ఉదాత్త భావాలు తెలియజేయాలి. అందుకే డిగ్రీ, ఇంజనీరింగ్ నుండి పదవతరగతి విద్యార్థుల వరకు రాగయుక్తంగా పద్యాలు వినిపించడమే ఆశయంగా, అదే గమ్యంగా కృషి జరుగుతోంది. రెండు గంటలకు తక్కువ కాకుండా విద్యా సంస్థల్లో కార్యక్రమాలు జరుగుతున్నాయి. విద్యార్థులంతా ఎంతో శ్రద్ధగా వింటున్నారు. విద్యార్థులకు నిర్వహించే కార్యక్రమాల్లో వ్యక్తిత్వ వికాసం, సంభాషణా చాతుర్యం, స్పష్టత మొదలైన వారికవసరమైన విషయాలు కూడా చెప్పడం జరుగుతుంది. తద్వారా, వారిలో ఆసక్తి పెరుగుతోంది. నిజానికి ప్రాచీన పద్య వైభవం వారికి అందించాలన్నదే, ప్రధాన ఆశయం. అది నెరవేరుతుందని, ఆనందంగా ఉంది.

**అదృష్టం? :**

మహాకవుల పద్యాలను రాగయుక్తంగా గానం చేసుకుంటూ, వారి కావ్యాలు గుణకీర్తనం చేసుకుంటూ, సర్వసమ్మోదాన్ని కలిగించుకుంటూ, దేశవిదేశాలలో తిరగడం నిజంగా అదృష్టం. ఇదంతా ఆ అక్షరశిల్పుల ఆశీర్వాద బలం. ఆ యశఃకాయుల అనల్ప అక్షర తపఃఫలం. సంగీత నవావధానము అనే వినూత్న విశిష్ట సాహితీ ప్రక్రియకు సమకూరిన మహా అదృష్టం. మి

**డాక్టరు మీగడ రామలింగ స్వామి, విశాఖ**

# సి. యస్. రావుతో మాటా మంతి

**– *మిసిమి***

రామోజీరావు పత్రిక *చతుర* ప్రారంభ సంచిక కోసం రాయండి అన్నారు చలసాని ప్రసాద్. అదేంటండీ, పేరున్న నవలాకారులు యద్దనపూడి, మాదిరెడ్డి– మొదలగు వారున్నారు కదా అంటే పేరున్న వారి నవలలు కాదు– నవలను బట్టి పేరు రావాలి అన్నారు ప్రసాద్. నేను రాసిన *బంగారమ్మ కమతం* 'కథ'ను, *కమలమ్మ కమతం నవలగా రాసాను.*

ఇది చతుర తొలి నవల. ఇది కమలమ్మ కమతంగా సినిమా వచ్చింది.

నా చిన్నతనంలో అంటే 1940 ప్రాంతంలో మా ఊళ్ళో తోలుబొమ్మలాట వేస్తే తెల్లవార్లూ చూసే వాళ్ళు. ఆ తర్వాత సినిమాలు కూడా ఎంతో ఆసక్తిగా చూసే వాళ్ళు. అప్పట్లో జానపద, పౌరాణిక సినిమాలు ఎక్కువగా వచ్చేవి. సాంఘికాలు చాలా తక్కువ.

1950 తర్వాత నుంచి సాంఘికాలూ వచ్చాయి. ఎంతో సందేశాత్మకంగా ఉండేవి. సాహిత్యం, సంభాషణలు, పాటలు, నటీనటుల సామర్థ్యం, దర్శకుల ప్రతిభ ప్రేక్షకులని ఆకట్టుకునేవి. ఒక్కో సినిమా కొన్ని నెలలు ఆడేది. ఇక నేను సినిమా రంగ ప్రవేశం గురించి రచయితగా వెళ్ళడం జరిగింది. దానికి ఆధారం నేను రాసిన *ఊరుమ్మడి బతుకులు* నాటకం. మా సమాజమూ ఆ నాటకం ఆడింది. ఇతర సమాజాలూ ఆడేవి. చాలా పరిషత్తుల్లో బహుమతులు వచ్చాయి. అలా పేరు రావడంతో ఆ నాటకం సినిమా పెద్దల దృష్టికి వెళ్ళింది. మొట్టమొదట నా ఊరుమ్మడి బతుకులు నాటకాన్ని సినీమా చేయాలని సరదా పడింది కె.బి.తిలక్‌గారు. నన్నడిగారు. సరేనన్నాను. ఇలా ఉండగా ఓ సందర్భంలో క్రాంతికుమార్‌గారు *ఊరుమ్మడి బతుకులు* నాటకాన్ని కమ్మర్షియల్ సినీమాగా తీయాలని, అందులో వాణిశ్రీని హీరోయిన్‌గా పెట్టి తీయాలని ఉందని నాతో అన్నారు. సరే అన్నాను. ఇలా చర్చలు జరుగుతూ ఉండగా వేజెళ్ళ సత్యనారాయణదర్శకుడు బి.ఎస్. నారాయణగారిని వెంట పెట్టుకుని నా దగ్గరకి వచ్చాడు. 'మన ఊరుమ్మడి బతుకులు నాటకాన్ని సినీమాగా చేయాలని నారాయణగారు ఉత్సాహంగా ఉన్నారు. నిర్మాతల్ని కూడా చూసుకున్నారు. తక్కిన విషయాలు మీరు మాట్లాడండి' అన్నారు నాతో. అలా నా మొదటి సినీమా, నా మొదటి నాటకం ఊరుమ్మడి బతుకులుతో ప్రారంభం అయింది. కథ, మాటలు నావి. దర్శకత్వం బిఎస్ నారాయణ. ఈ సినీమా ద్వారా రాళ్ళపల్లి, మాధవి, *టెక్కం,* నూతన్‌ప్రసాద్ మొదలైన నటీనటులకు అవకాశం రావడంతో పాటు మంచి పేరు కూడా వచ్చింది. ఈ సినీమాని అందరూ మెచ్చుకున్నారు. బాగానే ఆడింది. యువ గీతరచయిత కోపెల్ల శివరామ్ పాట కూడా రాశారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ చిత్రంగా బంగారు నంది, జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రాంతీయ చిత్రం అవార్డులు తెచ్చి పెట్టింది. ఈ సినిమా మొత్తం పసుమామల అనే గ్రామంలో హైదరాబాద్ దరిదాపుల్లోనే షూటింగ్ జరిగింది. ఈ చిత్రం ప్రారంభం నుంచి షూటింగ్ పూర్తయ్యే దాకా దర్శకుని కోరిక మేరకు ఆయనతో పాటే నేను ఉండడంతో సినిమా గురించి నేను ఎన్నో విషయాలు తెలుసుకున్నాను..

ఇక రెండవ సినిమా *తరం మారింది.* దీనికి దర్శకుడు సింగీతం శ్రీనివాసరావుగారు. కెమెరా బాలు మహేంద్ర. నిర్మాత రాధాకృష్ణమూర్తిగారు. మాదిరెడ్డి సులోచనగారి నవల ఇది. సంభాషణలు నావి. ఈ సినిమా మొత్తం జగ్గయ్యపేట దగ్గర ముక్త్యాల పాలెస్, కృష్ణానదీ తీరాన షూటింగ్ జరిగింది. అలా శ్రీనివాసరావుగారి తోటి, బాలు మహేంద్రగారితోటి నాకు బాగా పరిచయం అయింది. అప్పుడు నాకు అర్థమయిందేమిటంటే లొకేషన్‌ని బట్టి కూడా సన్నివేశాలు, సంభాషణలు మారతాయి అని. ఈ పిక్చర్ షూటింగ్‌లో కూడా నేను పూర్తిగా ఇన్వాల్వ్ అయ్యాను. దర్శక

నిర్మాతలతో పాటు కూడా ఉండి చాలా విషయాలు తెలుసుకున్నాను. ఇందులో శ్రీధర్, పల్లవి ముఖ్యపాత్రలు ధరించారు. ఎంబికె ప్రసాదరావు లాంటి సీనియర్ రంగస్థల నటులు కూడా ఇందులో పాత్రధారులయ్యారు. ఈ సినిమాను ఫిలింస్ డివిజన్ వాళ్ళు కొనుక్కోవడం జరిగింది. మాదిరెడ్డి సులోచన గారికి ఉత్తమ కథగా బహుమతి వచ్చింది. ఆవిడ చాలా ఆనందించి, 'నా నవల, ఆ జడ్జిలు చదివారా...పెట్టారా...మీ సంభాషణల వల్లనే కదా కథ వారికి తెలిసింది. నాకీ బహుమతి రావడానికి కారణం మీరే' అని అభినందించారు. అయినా బహుమతి మీదే అన్నాను.

ఆ తర్వాత నేనూ, మిత్రుడు తాళ్ళూరి నాగేశ్వరరావు కూర్చుని యువ మాసపత్రికకు ఒక సీరియల్ నవల రాస్తూ ఉన్నాం. అంటే నేను చెప్పడం, మిత్రుడు నాగేశ్వరరావు రాయడం జరుగుతోంది. అప్పట్లో యువ పత్రికకు ఘోస్ట్ సంపాదకులు తాళ్ళూరి నాగేశ్వర్రావే. ఆ సమయంలో పిఏపి వారి నుంచి నాకు పిలుపొచ్చింది. కమలమ్మ కమతం నవలను సినీమాగా తీయాలను కుంటున్నామని, నన్ను మద్రాస్ రమ్మని సింహం అనే ఒక ప్రొడక్షన్ మేనేజర్ చేత కబురు పంపించారు. రెండు మూడు రోజుల తర్వాత అంటే నేను రాస్తున్న నవల పని పూర్తయిన తర్వాత మద్రాసు వెళ్ళాను. పిఏపి సుబ్బారావుగారు నిర్మాత. చాలా హుందా అయిన మనిషి. దర్శకులు ప్రత్యగాత్మ. వారు ఆ నవలని తీసుకోవడం, సంభాషణలు నా చేతే రాయించడం జరిగింది. అందులో కృష్ణంరాజుగారు హీరో, శ్రీమతి జయంతి హీరోయిన్. ఇక వంకాయల లాంటి నటులు చాలా మంది ఉన్నారందులో. తాతినేని చలపతిరావుగారు సంగీత దర్శకులు. మోహన్‌గాంధీ అసోసియేట్ దర్శకుడు. ఈ సినిమా షూటింగ్ మొత్తం పిఏపి సుబ్బారావుగారి స్వగ్రామం అయిన పునాదిపాడులో జరిగింది. అప్పట్లో మా యూనిట్ మకాం విజయవాడ మమత హోటల్లో. ఈ సినిమాలో పల్లవి కూడా ఒక నటి. అన్ని దశల్లోనూ ఈ సినిమా నిర్మాణంలో నేను పాలు పంచుకోవడంతో సినిమా మేకింగ్ చాలా వరకు అర్థమయింది. అంటే టెక్నిక్ ఆఫ్ రైటింగ్ కూడా బాగా అర్థమయింది.


సి.యస్.రావు

ఈ సినిమాను నవయుగ వారు రిలీజ్ చేశారు. ఇలా జరుగుతూ ఉండగా *ప్రాణంఖరీదు* నాటకానికి పేరు రావడంతో నెల్లూరు టౌన్‌హాలులో ఈ నాటిక ప్రదర్శిస్తూ ఉండగా క్రాంతికుమార్‌గారు, ప్రత్యగాత్మగారి కుమారుడు వాసు వచ్చి చూశారు. ఆ నాటకంలో నేను కూడా వేషం వేశాను. అలా ఆ నాటకాన్ని క్రాంతికుమార్‌గారు తీసుకున్నారు. వాసు దర్శకత్వంలో సినిమాగా నిర్మించడానికి నిర్ణయం జరిగింది. సంభాషణలు నన్నే రాయమన్నారు. మద్రాసులో ఉండి ఈ సినిమాకు సంభాషణలు రాయడం జరిగింది. నే రాసిన సినిమాలన్నింటికీ సంభాషణలు డిక్టేషనే కావడంతో నాతో పాటు రామసూరి సంభాషణలు రాశారు. ఆయన దస్తూరీ చాలా అందంగా ఉండేది. నా గురించి సూరి క్రాంతికుమార్‌గారికి ఏం చెప్పాడో తెలియదు గాని ఆయన నాతో మాస్టారూ, మాస్టారూ అంటూ చాలా సన్నిహితంగా ఉండే వాడు. దర్శకుడు వాసు సరేసరి. ఈ పిక్చర్‌లో చాలా మంది పెద్ద నటులు నటించారు. సత్యనారాయణ గారు, రావు గోపాలరావు, నూతన్ ప్రసాద్, జయసుధ, ఒక కన్నడ అమ్మాయి మొదలైన వారు...దీని కెమెరా లోకనాథ్. చిత్రం ఏమిటంటే నిర్మాత క్రాంతికుమార్‌గారు అందరి నిర్మాతల్లాగా ఓ చోట కూచోకుండా దర్శకుడి వెనకాలే ఉండి చాలా చలాకీగా షూటింగ్‌లో పాల్గొనేవారు. నేనప్పుడే అనుకున్నాను...ఈయన తప్పకుండా దర్శకుడవు తారని. ఈ సినిమా షూటింగ్ కడియం ప్రాంతంలో ఆ పూలతోటల మధ్య, గోదావరీ తీరాన కడియపులంక అనే ఒక గ్రామంలో జరిగింది. యూనిట్ మకాం రాజమండ్రి అప్సరా హోటల్లో. ఈ సినిమాకి సంగీత దర్శకుడు చక్రవర్తి. జాలాది మొదటి పాట *యాతమేసి తోడినా ఏరు ఎండదు* ఈ సినిమా కోసమే రాశారు. ఆ పాటకు ఎస్పికి బహుమతి కూడా వచ్చింది. ఈ సినిమాకీ మంచి పేరే వచ్చింది. ఇది చిరంజీవిగారికి మొదటి సినిమా.

ఇలా నేను మద్రాసు, హైదరాబాద్ మధ్య తిరుగుతున్న సమయంలో ఓ రోజున నేనున్న హోటల్ రూమ్‌కి హరిరామజోగయ్యగారొచ్చారు. నన్ను తీసుకువెళ్ళి చలసాని గోపిగారింటికి తీసుకెళ్ళి గోపికి, ఈరంకి శర్మగారికి

పరిచయం చేశారు. వారు చివుకుల పురుషోత్తమ శాస్త్రిగారి నవల ఒకటి కొన్నారు. దాన్ని సినిమాగా తీయాలని నిర్ణయించుకున్నారు. నన్ను సంభాషణలు రాయమని అడిగారు. నేను నవల చదివి చెబుతానన్నాను. దర్శకుడు ఈరంకి శర్మగారు నా ముఖంలోకి చూసి మీ నిర్ణయం సరైనదే...చదివే చెప్పండన్నారు. ఆ నవల నాకు ఇచ్చారు. దానికి కూడా సంభాషణలు నేనే రాశాను. ఆ సినిమా పేరు *కుక్క కాటుకు చెప్పుదెబ్బ* అని నిర్ణయించారు. ఆ షూటింగ్ మొత్తం హైదరాబాద్‌లోనే జరగడంతో యూనిట్ మొత్తం నారాయణగుడా తాజ్‌మహల్ హోటల్‌లో దిగింది. శర్మగారు బాలచందర్‌గారి అసోసియేట్‌గా పని చేయడంతో ఒక విలక్షణ దర్శకుడుగా నాకనిపించారు. స్క్రిప్ట్ తయారీలోనూ, టేకింగ్‌లోనూ కూడా కొత్తగా చెప్పాలి, కొత్తగా చూపించాలి అనే తపన కనిపించేంది. ఇందులో కూడా చిరంజీవిగారు, పల్లవి, మాధవి మొదలైన నటీనటులు నటించారు. హేమసుందర్ స్క్రిప్టు రాసిపెట్టడంలో సహకరించారు. చాలా మంచి నిర్మాతలు, మంచి యూనిట్.

ఈ సినిమా తర్వాత ఒక పెద్ద సినిమాకు నాకవకాశం లభించింది. పిఏపి వారు నాగేశ్వరరావుగారితో ఓ సినిమా చేయాలని తలపెట్టి నన్ను కథ ఇమ్మన్నారు. కథ ఇవ్వడం అంటే నాగేశ్వరరావుగారికి చెప్పాలి, వారికి నచ్చాలి. అది ప్రథమ సోపానం. ఏమైతేనేం ఒకట్రెండు కథలు చెప్పిన తర్వాత మూడో కథను నాగేశ్వరరావుగారు అంగీకరించడం, అది సినిమాగా రూపు దిద్దుకోవడం జరిగింది. అదే *నాయకుడు-వినాయకుడు*. దర్శకుడు ప్రత్యగాత్మ. కథ, మాటలు నేను. ఈ సినిమా చాలా వరకు అన్నపూర్ణ స్టూడియోస్, పునాదిపాడు గ్రామంలోనూ జరిగింది. నాగేశ్వరరావుగారి సరసన శ్రీమతి జయలలిత హీరోయిన్. రావుగోపాలరావు, మంజుభార్గవి మొదలైన ఇతర నటీనటవర్గం. ఒకరకంగా జయలలితగారికి ఇది తెలుగులో ఆఖరి సినిమా. ఈ సినిమా అంత బాగా ఆడలేదు.

అలా సినిమా పరిశ్రమకి నేను బాగానే పరిచయం అయ్యాను. చాలా మంది పెద్దలకి నేను తెలిశాను. నాకూ వారు పరిచయం అయ్యారు. ఇద్దరు ముగ్గురు పెద్ద నిర్మాతలకి కథలు చెప్పడమూ జరిగింది. ఇలా ఉండగా నా మిత్రుడూ, క్లాస్‌మేటూ బందా సూర్యనారాయణ సినిమా తీయాలని తలపెట్టాడు. దర్శకుడు సింగీతం శ్రీనివాసరావుగారు.

హీరో కమల్‌హాసన్. కెమెరా బాలు మహేంద్ర. నాకు పరిచయం ఉన్న యూనిట్టే తరం మారింది ద్వారా. ఆ కథ డిస్కషన్‌కి నన్ను మద్రాసు పిలిపించారు. కొంతవరకు కథ ట్రీట్‌మెంట్‌లో శ్రీనివాసరావుగారితో కూచుని చర్చించడం. కథ ఒక రూపు దిద్దుకోవడం జరిగింది. సంభాషణలు కూడా నన్నే రాయమన్నారు. కొంత తయారైన తర్వాత నాకు తరచు మద్రాస్ వెళ్ళడం కుదరక బ్రేక్ పడింది. సంభాషణలు నాతో రాయించలేకపోయారన్న చిన్న ఇబ్బందితో దాని డిస్ట్రిబ్యూటర్ లక్ష్మీరాఘవేంద్రరావుగారు నా చేత వేషం వేయించమని నిర్మాతకి సలహా ఇచ్చారు. శ్రీనివాసరావుగారు కూడా సుపరిచితులే గనుక ఆయన నా నాటకాలూ చూశారు...తరం మారిందిలో నా చేత ఒక వేషం వేయించడంతో ఆయన కూడా సరేనన్నారు. అలా కమల్‌హాసన్ సరసన రోజారమణి తండ్రిగా *సొమ్మొకడిది-సోకొకడిది* సినిమాలో నటించాను. సినిమాకూ మంచి పేరొచ్చింది. నాకూ పేరొచ్చింది. ఆ వేషంలో నేను లుంగీతో ఉండడంతో నేను తమిళియన్ అనుకుని తమిళ సినిమాలకి నాకు రెండు మూడు ఆఫర్లొచ్చాయి. నాకు భాష రాక వెళ్ళలేదు. నేను లెక్చరర్‌గా ఉద్యోగం కూడా చేస్తూ ఉండడంతో అంత ఎక్కువ సెలవులు కూడా దొరికేవి కాదు. సినీమాలను నమ్ముకుని లెక్చరర్ ఉద్యోగం వదులుకునే ఉద్దేశం నాకెప్పుడూ లేదు. అది కూడా వెళ్ళకపోవడానికి ఒక కారణం.

దీని తర్వాత ఒక నాడు బాలూ మహేంద్ర నాకు టెలిగ్రామ్ ఇచ్చారు. సరేనని, నేను బయలుదేరి వస్తున్నానని ఆయనతో ఫోన్‌లో మాట్లాడాను. అంత క్రితమే నాతో చూచాయగా *సొమ్మొకడిది-సోకొకడిది* షూటింగ్ టైమ్‌లో తానొక సినిమా తీయబోతున్నానని, దానికి సంభాషణలు రాయాలని నన్నడిగారు. సరేనన్నాను. దాని కోసమే అయి ఉంటుందని ఆయనకి ఫోన్ చేసి నేను వస్తున్నట్టు చెప్పి బయలుదేరాను. ఆయనే స్వయంగా స్టేషన్‌కి వచ్చి రిసీవ్ చేసుకుని నన్ను పామ్‌గ్రోవ్ హోటల్‌లో దింపి రోజూ సిటింగు వారింట్లోనేనని, కారు పంపిస్తానని చెప్పి వెళ్ళిపోయారు. మరునాడు వారింట్లో కలిసినప్పుడు ఇంకొక వ్యక్తి కూడా ఆయనతో పాటున్నారు. బాలూ మహేంద్ర ఆ వ్యక్తిని నాకు పరిచయం చేశారు. ఆ వ్యక్తి కన్నడ, తెలుగు

కూడా తెలిసిన వాడు. గొబ్బి వీరన్నగారబ్బాయట. బాలూమహేంద్ర తీయబోయే సినిమా కన్నడంలో. నేను తెలుగులో సంభాషణలు చెబితే వీరన్నగారబ్బాయి సైమల్టేనియస్‌గా కన్నడంలోకి రాసుకుంటారు. అదొక చిత్రమైన సన్నివేశం. కాని గొప్పతనం ఏమిటంటే బాలూ మహేంద్ర పూనా ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ స్టూడెంట్ కావడంతో శ్రీనివాసరావుగారి లాంటి దర్శకులతో కెమెరామన్‌గా పని చేయడంతో సినిమా పట్ల ఆయనకి కచ్చితమైన అవగాహన ఉంది. సన్నివేశం విపులంగా చెప్పి లొకేషన్ కూడా చెప్పి, పాత్రలు మాట్లాడవలసిన మాటల్ని నన్ను చెప్పమనే వారు. అంటే ఒక రకంగా స్క్రీన్‌ప్లే ఆయన వివరించి నన్ను సంభాషణలు చెప్పమనే వారు. ఇది నాకొక తియ్యని అనుభూతి.నా పక్కనే ఉన్న కన్నడ రచయిత కన్నడంలోకి అనువదించుకునే వారు. అలా బాలూ మహేంద్ర తృప్తి మేరకు ఆ సంభాషణలు రాయడం జరిగింది. కన్నడంలో ఆ సినిమా పేరు కోకిల. ఇందులో తరం మారిందిలో నటించిన శోభ, రోజారమణి, కమలహాసన్, ప్రతాప్ పోతన్ మొదలైన వారు నటించారు. ఈ సినిమా ఎవరైనా తెలుగులో తీస్తే సంభాషణలు మీ పేరుతోనే ఉంటాయి. ఇప్పుడు మీ ఇద్దరి పేర్లూ ఉంటాయి అని నాకు మాటిచ్చారు బాలూ మహేంద్ర. కో టెక్నీషియన్ అని నిర్లక్ష్యం చేయకుండా సముచితంగానే నాకు పారితోషికం కూడా ఇచ్చారు. కన్నడంలో ఈ సినిమాకి ఎంతగానో ప్రేక్షకాదరణ లభించింది.

ఒక రోజున ఫిలింస్ డివిజన్ నుంచి ఒక పెద్దమనిషి వచ్చి నేను రాసిన కథ *మార్పుకిమార్గం* వాళ్లకు కావాలని, ఓ షార్ట్ ఫిలిమ్ చేయబోతున్నామని అడిగి మాట్లాడుకుని కొనుక్కుని వెళ్ళాడు. అది షార్ట్ ఫిలిమ్‌గా తీశారు. నేను చూశాను. అంతగా రక్తి కట్టలేదు. ఆ వచ్చిన ఫిలింస్ డివిజన్ వ్యక్తికి, నాకు మధ్యవర్తిగా ఉన్నది సిజె రెడ్డిగారు. ఒక రకంగా నా సినిమా యాక్టివిటీ తగ్గింది. అటువంటి సమయంలో ఒక రోజున ఛటర్జీగారు *జూదగాడు* అనే సినిమా తీయబోతున్నానని, కథ తయారుచేయమని అడిగారు. అన్నపూర్ణ హోటల్‌లో రూమ్ బుక్ చేశారు. కూర్చుని ఒక కథ తయారుచేసి తయారయిందని ఆయనకి చెప్పాను. మద్రాస్ రమ్మని నన్ను పిలిపించి ఉడ్‌లాండ్స్ హోటల్‌లో దింపారు. దానికి వి.మధుసూదనరావుగారు దర్శకుడు. కథ వరకు నేను పాల్గొన్నాను గాని సంభాషణలు రాయలేదు. ఆ పిక్చర్ శోభన్‌బాబుతో బాగానే ఆడింది. అక్కడ పరిచయం అయిన మధుసూదనరావుగారు మధు ఫిలిం ఇన్‌స్టిట్యూట్ పెట్టి హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. అప్పుడప్పుడూ రేస్‌కోర్సులో కలిసే వాళ్ళం. వారి ఇన్‌స్టిట్యూట్‌కి కూడా రెండు మూడు సార్లు నేను వెళ్ళాను. ఒక రోజున రామోజీరావుగారు తనని సినిమా తీయమంటున్నారని, కథ కావాలని అడిగారు. సరేనని ఆ మర్నాడు నేను నవలగా రాయాలనుకున్న ఒక కథను ఆయనకి చెప్పాను. ఆయన నన్ను రామోజీరావుగారి దగ్గరకు తీసుకెళ్ళి కథ వినిపించే ఏర్పాటు చేశారు. వారికి కథ చెప్పడం, అది రామోజీరావుగారికి నచ్చడం, దానికి సంభాషణలు కూడా నన్నే రాయమని రామోజీరావుగారు ఆదేశించడం జరిగింది. ఉషాకిరణ్ వారి గెస్ట్ హౌస్‌లోనే ఉండి ఆ సినిమాకు సంభాషణలు తయారుచేయడం జరిగింది. అప్పట్లో డివి నరసరాజుగారు కూడా అదే గెస్ట్‌హౌస్‌లో దిగేవారు. మా యోగక్షేమాలు చూసే బాధ్యత రామోజీరావుగారికి అతి సన్నిహితులు, వారి సినిమాలకు నిర్వాహకులు అయిన అట్లూరి రామారావు. ఈ సినిమాకి దర్శకులు మధుసూదనరావుగారు, వేటూరి పాటలు, రమేష్‌నాయుడు మ్యూజిక్. ఈ సినిమా పేరు *మల్లెమొగ్గలు.* అదే కథావస్తువు నవలగా *చతుర*లో వచ్చింది. నవల పేరు శివగంగ. ఈ సినిమా కూడా కడియం ప్రాంతంలోనే ఎక్కువ భాగం జరిగింది.

కొన్నాళ్ళ తర్వాత ఛటర్జీ సోదరులు ముఖర్జీ నా దగ్గరకి వచ్చి గుత్తా రామినీడు గారికి ఒక సినిమాకి సంభాషణలు మీరు రాయాలి అని అడిగారు. కథేమిటని అడిగా. కాళీపట్నం రామారావుగారి *యజ్ఞం* అని చెప్పారు. సరేనని నేను హైదరాబాద్‌లోనే ఉండి వారు పంపిన ఒక అసిస్టెంట్ డైరెక్టర్‌కి మొత్తం స్క్రిప్ట్ డిక్టేట్ చేశాను. తర్వాత రామినీడుగారు హైదరాబాద్ వచ్చి ఫతేమైదాన్ క్లబ్‌లో దిగి స్క్రిప్ట్ చూసుకున్నారు. తృప్తి పడ్డారు. ఈ సినిమాకు గజ్జల మల్లారెడ్డిగారు ఒక పాట రాయడం విశేషం. ఇది ఎన్ఎఫ్‌డిసి ఫిలిం. దానికి జాతీయ స్థాయిలోఅవార్డు కూడా వచ్చింది. కారా మాస్టారి కథ *యజ్ఞం* చాలా పేరున్న కథ. ఆ కథను అంతకు క్రితమే నేను గంగాధరరావుగారి చేత నాటిక చేయించి ఆడడంతో కథావస్తువు నాకు సుపరిచితం. అందులో

అప్పుల్రాముడు పాత్ర సినిమాలో పిఎల్ నారాయణ వేశారు. పిఎల్ నారాయణ పేరు రామినీడుగారికి సజెస్ట్ చేసింది పర్వతనేని సాంబశివరావుగారు. అతనికి జాతీయ స్థాయిలో బెస్ట్ సపోర్టింగ్ ఆర్టిస్ట్ అవార్డు వచ్చింది. తెలుగువారెవరికీ అంతవరకు ఆ అవార్డు రాలేదు. తన కథకు సంభాషణలు రాయగలిగిన వారు సిఎస్ రావేనని రామారావుగారే సూచించడం ఒక విశేషం. ఎందుకంటే ఆ కథ పూర్తిగా నారేటివ్. పెద్ద పెద్ద ఉపన్యాసాలతో ఉంటుంది. అది కూడా నాకొక మంచి అనుభూతే.

ఇదే సమయంలో తాతినేని ప్రకాశరావుగారు కూడా నాకు బాగా పరిచయం అయ్యారు. వారితో కూడా 'మీరూ ఆలోచించండి' అనే సీరియల్ దూరదర్శన్‌కి చేయడం జరిగింది. దాని కథ, మాటలు నావే. అప్పటికి దూరదర్శన్ ఒక్కటే ఛానల్ ఉండేది. ఆ సీరియల్‌కి ప్రతీ ఎపిసోడ్ ముందు నాగేశ్వరరావుగారు వ్యాఖ్యాతగా వ్యవహరించి ముగింపులో మీరూ ఆలోచించండి అనే వారు. ఇది కూడా ఒక ప్రత్యేకమైన అనుభూతే నాకు. అలా దర్శకులుగా ప్రకాశరావుగారు, వారి శిష్యులు మధుసూదనరావుగారు, ప్రత్యగాత్మగారు, ప్రత్యగాత్మగారి కుమారుడు వాసు, సింగీతం శ్రీనివాసరావుగారు, బాలు మహేంద్రగారు, ఈరంకి శర్మగారు, *చివరికి మిగిలేది* లాంటి సినిమా తీసిన గుత్తా రామినీడుగారు, ఆ తర్వాతి కాలంలో పర్వతనేని సాంబశివరావుగారు మొదలైన దర్శకులతో కలిసి పనిచేయడం నాకెంతో ఆనందాన్నిచ్చింది. అలాగే పెద్ద పెద్ద సంస్థలు పిఏపి, ఉషాకిరణ్ మూవీస్, క్రాంతికుమార్, హరిరామజోగయ్యగారు మొదలైన మంచి నిర్మాతలతో కలిసి పని చేయడం కూడా ఒక మంచి అనుభూతే. ఇది నా సినిమా ప్రస్థానం. టివి ప్రస్థానం చాలా ఉంది. కొనసాగుతోంది.

విజయమాధవి పిక్చర్స్ వారికి నిర్మాత వడ్డే రమేష్‌గారికి కూడా కథ మాటలు వ్రాసాను. షూటింగ్ పూర్తయింది కాని సినిమా రిలీజ్ కావాలి. డి.వి. కృష్ణారావుగారు దానికి దర్శకులు. నిర్మాత రంజిత్ కుమార్‌గారు నన్ను తీసుకువెళ్ళి బాలచందర్‌గారికి కథ చెప్పించారు. వారికి కథ నచ్చింది. కాని యాంటి సెంటిమెంటు వారికి నచ్చదని ఆ సినిమా ఆగిపోయింది.

* * * * *

**ప్రశ్న :** దేనికైనా స్క్రీన్‌ప్లే రాశారా?

**జవాబు :** ఎక్కడంటే తేడా స్క్రీన్‌ప్లే 90% డైలాగ్స్ రచయితలే రాస్తారు. కానీ స్క్రీన్‌ప్లే దర్శకుడి పేరు పైన వేసుకుంటాడు. కె.యస్. ప్రకాశ్‌రావుగారు అంటే, రాఘవేంద్రరావుగారి నాన్నగారు. *దీక్ష* అనే సినిమా తీశారు. మంచి సినిమా డైరెక్టర్. ఆయన దగ్గరికి వెళ్ళి స్క్రీన్‌ప్లే అంటే ఏమిటి అని అడిగితే యద్దనపూడి సులోచనారాణి నవల చదివేవా? అని అడిగారు. చదవలేదు అన్నాను. చదువు అన్నారు. ఏమిటండీ తెలతెలవారుతోంది. సూర్యకిరణాలు చెట్టుఆకుల్లోంచి జారి నేలపై పడుతున్నాయి. లోపలి నుంచి వచ్చిన అమ్మాయి పరికిణీ పైకి తోస్తూ కొడుకుని ఎత్తుకుంది. కళ్ళాపుజల్లిన ఇంటిముందు చుక్కలు పెడుతోంది– మధ్యలో జుట్టు పక్కకు తోసుకుంటోంది. ఏదో ఆకృతి వస్తే తనే మురిసి పోతుంది. మొత్తానికి లెఫ్ట్ సైడ్ గీతలు, రైట్ సైడ్ డైలాగులు ఇది స్క్రీన్‌ప్లే.

స్క్రీన్‌ప్లే లెఫ్ట్ సైడ్‌లో రాసుకున్నారు. ఇది first shot ఇది mid shot యిది లేకపోతే ముందుకు ఎలా ప్లాన్ చేస్తారు? screenplay is written by both dialogue writer and director – నవల్లో స్క్రీన్‌ప్లే ఎక్కువగా ఉంటుంది. మేము రాసిన వాటిల్లో కూడా left , right side వేసే వాళ్ళం. యిప్పుడు *ప్రాణం ఖరీదు* సినిమా ఉందండి. రెండు సన్నివేశాలు చెబుతాను. డైలాగ్ అంటే ఏమిటి సినిమాకి – Dialogue Importance ఏమిటి? ఎలా ఉండాలి? రావు గోపాలరావు వేషం, ఆ యింట్లో జయసుధ కాపురానికి వచ్చే సరికి తిరుగుతూ ఉంటుంది. ఫ్రాక్ వేసుకున్న 7–8 ఏళ్ళ అమ్మాయి photo పెద్దావిడ కూతురండీ వెళ్ళండి ఆవిడ పోయారు కదండీ – తారగారింట్లో ఉన్నారు, నవ్వు... పిల్ల వస్తుంది. కంపెనీ యిస్తుంది అని ఏదో ఊహించుకుని, నవ్వుతుంది. ఆ expression యివ్వాలి (యిది యాక్షన్).

ఒకనాడు fine morning అమ్మాయికి సెలవు లిచ్చేశారు. రావాలి మరి అంటాడు రావు గోపాలరావు, ఇంతలో బండి వస్తుంది. అమ్మాయిగారొచ్చారు – అమ్మాయిగా రొచ్చారని ఎడ్లబండి వెనకాలే జయసుధే వెళ్తుంది. ముందు పాలేరు – తర్వాత.

మువ్వల పట్టాలు – పరికిణీ – యిలా సీన్ వ్రాసింది మేమే. అంతా నేనే వ్రాసేది.

ఆ పిల్ల ఎగాదిగా చూస్తుంది. ఒకనాడు మధ్యాహ్నం

వరండాలో కూర్చుంటే బయట కోళ్ళు మేస్తున్నాయి. ఆవు అరుస్తుంది. పాలేరును వెళ్ళి గడ్డి వేయమని చెప్పింది జయసుధ. వెళ్ళాడు గచ్చకాయ లాడుకుంటున్నారు ఆ పిల్లా (మాధవి) ఏం చేస్తుంది – జయసుధ తొడ మీద కొట్టి – "ఏయ్ ! నువ్వే! అక్కా !

చూసింది. అక్క అనడానికి వరసకాదు, పిలవాలి అంటే అమ్మ అనడానికి నోరు రాదు. ఏయ్ అన్నాను. నా కెలా పిలిచినా ఫర్వాలేదమ్మా నాతో మాట్లాడ్డం మానెయ్యకు"

సవతితల్లి – ఏమనాలో తెలియక ఏయ్ అంది.

ఒంటరిదైపోతుంది ఈ సెక్షన్ ఎలాగా? ఉంది –dialogue importance తేలుతుంది.

అంత detailగా తీస్తేనే వస్తుంది.

* * * * *

**ప్రశ్న** : సాహిత్య పరంగా మరి నాటకానికి ఆస్కారం లేదా?

**జవాబు :** నాటకంలో సాహిత్యం ఉంది – ఒక *కన్యాశుల్కం* నాటకం – నవల కూడా! అది చదవటానికీ performanceకు మలచుకున్నాము.

ఒక కథ – ఒక నవల – ఒక్కడే తెచ్చుకుని చదువుకునే పుస్తకం – ఒక నవల్లో గాని, ఒక కథలోగాని, సైద్ధాంతికపరంగా, నీ యిష్టం వచ్చినట్టు రాయొచ్చు. బాత్ రూమ్‌లో స్నానం చేస్తున్న ఘటన నవలలో రాయొచ్చు. నాటకంలో చూపించలేవు. సామూహికం – లవ్‌లీ. అవి అక్షరాలు చదవటమే నాటకంలో చూపించలేనివి చాలా ఉంటాయి. అంటే నాటకాన్ని సాహిత్యంలాగా ఆస్వాదించటం తక్కువ. అందులో నాటకంలో ఉన్న సాహిత్యం చాలా ఈజీ నవల చేయటం. కాని నవలలో చాలా వివరాలు ఉంటాయి. ఆ వివరాలు నాటకంలో ఉండవు. కారణమేమంటే – ఇది ఆత్రేయ గారి మాట చెబుతున్నాను. *ఊరుమ్మడి బతుకులు* వచ్చిన తర్వాత రా! అని అన్నపూర్ణ హోటల్‌లో ప్రక్కనే కూర్చొబెట్టుకున్నారు. శాలువా కప్పుకున్నారు. ఎసి రూం తీసుకోవటమెందుకు – ఈ రగ్గు కప్పుకోవటమెందుకు ? అని అడిగాను. ప్రొడ్యూసర్ – తృప్తి కోసమయ్యా! ఎసిలో ఉంటే బాగా వ్రాస్తామని. ఆయన నమ్మకం – నవ్వులు.... కుర్చీలో పడుకున్నారు. సినిమా బాగా రాశావు. కాని ఈ సినిమా, నాటకాలు నీవా – intellectual సినిమాలు – మాస్‌కి పనికిరావు. అదేమిటి సార్ ? ఇప్పుడు ఆ హీరో ఏదో ఒకటి చెయ్యాలి కదా ? అప్పటిదాకా వాడికి ఏమితోచటం లేదు. ఇది జీవితం.

**ప్రశ్న** : మీరు నటులుగా కూడా చాలా చాలా స్టేజిలు ఎక్కారు గదా? నటులుగా మీ అనుభవం ఏమిటి ?

**జవాబు :** నా నాటకాల్లోనూ వేసే వాణ్ణి. ఏమకూచి వెంకటేశ్వర్లు నాటకాల్లో వేసేవాణ్ణి. గంగాధరరావు నాటకాల్లో వేశాను. నరసరాజుగారి నాటకాలు వేశాను. 50–60 నాటకాల్లో వేశాను. సినిమాల్లో నటించాను. నర్సింగరావుగారి పిక్చరు *మట్టి మనుషులు*, International Awards వచ్చాయి. దాంట్లో యాక్ట్ చేశాను.

**ప్రశ్న :** కన్నడంలో నాటకం పైకి రావటానికి కారణమేమిటి?

**జవాబు :** ప్రభుత్వ ప్రోత్సాహం. ప్రేక్షకుల అభిలాష, ఆదరణ.

**ప్రశ్న** : మీరు ఇంగ్లాండ్ వెళ్ళారా?

**జవాబు :** నేను వెళ్ళలేదు. – అమెరికా వెళ్ళాను.

అమెరికాలో నాటకాలు చూశారా?

ఆఁ ! ఒకటే నాటకంగదా ! 2–3 నెలల నుండి అదే సెంటర్స్‌లో నాటకం ఆడుతుంది. బ్రాడ్‌వేలో కాకుండా, విడిగా కమ్యూనిటీ సెంటర్లో వేసినప్పుడు కూడా చూశాను. వీధినాటకం ఉంది. స్కూల్‌లో నాటకాలు వేస్తారు వాళ్ళు. అది రిలీఫ్‌గా ఉంది. తరువాత వాషింగ్టన్‌లో లింకన్ సెంటర్ ఉంది. అచ్చంగా నాటకాలకే. నేను వెళ్ళలేదు.

చికాగో, న్యూయార్క్ వెళ్ళాను. న్యూయార్క్ రెండు సార్లు వెళ్లాను.

**ప్రశ్న** : మేమీ మధ్యన మరో మొహంజొదారో నాటకం చూశాం. ఆ నాటకం గురించి చెప్పండి?

**జవాబు :** *మరో మొహంజొదారో* 50 ఏళ్ళ తరువాత వేసింది చూశారు మీరు. నేను 50 ఏళ్ళ ప్రారంభం నుండి చూశాను. చాట్ల శ్రీరాములు దర్శకత్వంలో ఆడిన నాటకం అప్పుడే చూశాను. నందికూడా నాకు తెలుసు బాగా. ఎన్. ఆర్. నంది. అది ఆ నాటకంలో లేని వస్తువుల్ని కూడా ఉన్నట్లుగా ఊహించుకునే ఒక ప్రయోగం ఉంది. Participation of audience is important అందులో freeze introduce చేసిన ఘనత చాట్ల శ్రీరాములుదే. ఒకరకంగా ఎన్.ఆర్. నంది ఇంత నాటక పరిజ్ఞానంతో వ్రాసిన నాటకం అనే కంటే, రచయిత, డైరెక్టర్, దర్శకుడు కూర్చుని వ్రాసుకున్న నాటకం. డైరెక్టర్ తన మేధాశక్తినంతా అందులోకి వదిలి పెట్టాడు. ఆ రకంగా వచ్చిందా నాటకం.

అది కొత్తగా వేయాలన్న తపన. అది గొప్ప ప్రయోగమే.

**ప్రశ్న** : తెలుగులో ప్రయోగాత్మక నాటకమే. ఈ రకంగా మిగతా భాషల్లో ఉందా?

**జవాబు** : చాలా వస్తున్నాయి. మొన్న తనికెళ్ళ భరణి *కొక్కొరోకో* రాశారు, ఆడారు. ఇద్దరే ఉంటారు. వాళ్ళే భార్యాభర్తలు. వారే తల్లిదండ్రులు... ఏమైనా కూడా వాళ్లే. some thing is shown on screen. ఆ నాటకం ఊహించుకోమంటే, ప్రేక్షకుడు ఎంతవరకు ఊహించు కుంటాడు? ఆ నాటకం విజయవంతం కాదు. అందులో మనం రిలాక్సేషన్ కోసం వచ్చి మళ్ళీ (brain కి) పని చెప్పాలంటే ఎలాగా!

**ప్రశ్న** : *చింతామణి* నాటకం మీద మీ అభిప్రాయం ఏమిటి? మొదటి సాంఘిక నాటకం అనుకుంటా. నేను ఈ నాటికి కూడా చాలా ఎంజాయ్ చేస్తున్నాను.

**జవాబు** : కాళ్ళకూరి నారాయణరావు రాసిన నాటకాలు *చింతామణి, వరవిక్రయం.* ఈ విషయం, చాలామందికి తెలియదు కాని, ఆయన ఒక వేశ్యను పెళ్ళి చేసుకున్నాడు. వేశ్య, గడిపే జీవితం తెలుసు ఆయనకు. అదొక సంస్కరణాత్మక నాటకం.

గొప్ప researcher *మళ్ళీ ఎప్పుడొస్తారు* నాటకం యిందులో (Confidence) నేను వేశ్యను పెళ్ళిచేసుకోలేదు. నాకు వేశ్యతో సంపర్కముంది.... పరిచయాలున్నాయి. మాధవరాయుడి పాలెం అని మా గ్రామంలో అండి. ప్రక్కనే మురమండ ఉంది. మురమండలో మూడు మేళాలుండేవి; దేవుడికి ఉత్సవాలు జరిగినా, పెళ్ళిళ్ళు జరిగినా, మేళాలొచ్చేవి. మేళమంటే 10–15 మంది సానులుంటారు. ఆడేవారు, పాడేవారు, మద్దెల వాళ్ళుంటారు. కోనసీమ అంతా అదే కదా! అలాగే పెద్దాపురంలో ఉన్నారు. మానేపల్లిలో ఉన్నారు. మళ్ళీ ఎప్పుడొస్తారు నాటకంలో చేశారు.

మీరు చెప్పినవి నేను చూశాను సార్!

**జవాబు** : మీరు చూశారు – నేను వాళ్ళింట్లోకి వెళ్లాను. వాళ్ళు వచ్చేవారు, పాడేవారు.

(వాళ్ళతో ఇంటరాక్ట్ అయ్యాం. రెండుమూడు రోజులున్నాం వాళ్ళతో వండించుకు తిన్నాం.) నాగేశ్వరరావుగారు బాగానే చేస్తారు – బాగా చూస్తారు. వెన్నెల్లో కూర్చో బెట్టి డాన్స్ చేయించారు.

**ప్రశ్న** : మీకో విషయం చెప్పనా! వాళ్ళు మనకంటే షావుకార్లు.

**జవాబు** : అసలు విషయం తెలియదు మీకు – వాళ్ళు పండితులు గొప్పవాళ్ళతోనే కన్నెరికం చేయించుకుంటారు. ఫస్ట్ నైట్, పెళ్ళి. పెద్ద అయితే ఫస్ట్ మ్యారేజ్. వాళ్ళు అన్ని కులస్థుల వాళ్ళను ఒప్పుకోరు. బ్రాహ్మణ, క్షత్రియ అంటే అప్పర్ కేస్ట్ వాళ్ళనే అంగీకరిస్తారు. ఎందుకు? ఆ పుట్టే పిల్ల అందంగా లేక పోతే ఆ పిల్ల బతుకు వ్యర్థం అయిపోతుందని. పెళ్ళిళ్ళు చేసుకోరు. ఆ సాంప్రదాయంలో. ఆ కన్నెరికం చేసిన వ్యక్తి మళ్ళీ ఎప్పుడైనా వస్తే, గౌరవించాలి. గౌరవించి, పంపించాలి. అది దేవదాసీ సాంప్రదాయం.

అలాగే వాళ్ళకు అష్టపదులు, నృత్యం, సంగీతం వచ్చు. శృతి, లయ తెలుసు ఇవన్నీ గొప్ప విద్యలే. అందుకే వాళ్ళని కళావంతులని కూడా అనేవారు. కట్టుకున్న భార్యను వదిలి సాని యింటికి వెళ్ళాలని ఎందుకను కుంటాడు. అన్ని విద్యలు అక్కడున్నాయి కాబట్టి. భార్య ఆకర్షించలేని విధంగా, వాళ్ళు ఆకర్షిస్తారు కాబట్టి. అది ఒక మేధోపరమైన సంతృప్తి కోసమే కదా!

చాలామంది రచయితలు, వీళ్ళంతా వెళ్ళేది ఎందుకోసమంటే, దీనికోసమే.

మధురవాణి... చూస్తే తెలుస్తుంది. సుకన్య అని పేరు విన్నాం కదా! రాజమండ్రిలో వేశ్యే. ఆదుర్తి సుబ్బారావుతో ఉండిపోయింది. నేను ఆ అమ్మాయి యింటికి వెళ్ళాను. నవలలు చదివింది. వాళ్ళింట్లో బోలెడు నవలలున్నాయి. మంచి మర్యాదస్తురాలు. ఈ మధ్యనే చనిపోయింది.

**ప్రశ్న** : ఒకప్పుడు నాటకాన్ని spring board గా వాడుకునే వారు చాలమంది నటులు – ఇప్పుడు సినిమా development తర్వాత stage నుండి cinema కు వెళ్ళేది తగ్గిపోయింది కదా !

రెండు విషయాలు – నటులకోసం, నాటకాలు చూడ్డానికి వచ్చేవారు ప్రొడ్యూసర్లు, డైరెక్టర్లు ఇదివరకు. మంచి హీరో దొరుకుతాడని. పాత నాటకాలకూ – కొత్తనాటకాలు ఆడుతుంటే వచ్చేవారు. సబ్జెక్ట్ కోసం వచ్చేవారు. ఆర్టిస్ట్ కోసం వచ్చేవారు. అప్పటికి నటశిక్షణ ల్లేవు మనకు – ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్స్ లేవు. ఏమీ తెలియని కొత్తవాడ్ని పెట్టుకోవటం కంటే, నాటకం చేసిన వాణ్ణి పెట్టుకుంటే, డైలాగ్ చెప్పడం + నటనకు శిక్షణ ఇవ్వడం సులభం కదా!

కొత్త ముఖాలు కావాలి – హీరో పెరిగిపోతే, ఆ ఖాళీ పూరించటానికైనా – next face కోసం వచ్చేవారు. independent గా ఉండేది – ఆ లెఖ్కన నాటకం ఒక సోర్సు. ఒక spring borard ఎవరు ఏమనుకున్నా కూడా ! తన కొడుకునే హీరో చెయ్యాలనుకుని ఏ ప్రొడ్యూసరు అనుకోలేదు ఇదివరకు. తన కూతుర్నే హీరోయిన్ చేయ్యాలని అనుకోలేదు ఏ ప్రొడ్యూసరే కాదు – ఏ డైరెక్టరూ అనుకోలేదప్పుడు. వాళ్ళ వృత్తివేరు – వీళ్ళ వృత్తివేరు. (కొందరైతే పిల్లల్ని సినిమా ఫీల్ట్ లోనికి రానిచ్చేవారు కాదు) ఇప్పుడు చూడండి సార్. విజయ వాహినీ పిక్చర్సు – వాళ్ళు వాళ్ళ పిల్లల్ని ఒక్కరినైనా హీరోగా చేద్దామని ట్రై చెయ్యలేదు గదా! లేదు –ఇప్పుడు హోమ్ ఇండస్ట్రీగా అయింది. కుటుంబ పరిశ్రమ – వారసత్వమైంది.

ఈ వారసత్వం నాటకానికుందా! లేదు. ఆ వారసత్వం సినిమాకు ఉంది. హీరో ఒక్కడే కాదు కదా! కథకు ఇంక ఎంతమంది ఆర్టిస్టులు కావాలి. సినిమా వేషం కాదు కదా! (సినిమాకి) మిగతా ఆర్టిస్ట్‌లకు శిక్షణ కావాలి. రామోజీ ఫిల్మ్ సిటీలో 'శిక్షణాలయం' ఉంది. రామానాయుడు, అన్నపూర్ణ స్టూడియోలో ఇన్‌స్టిట్యూట్ ఉన్నాయి. ముందు మధుసూదన రావు – మధుఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌ని పెట్టారు. మొట్టమొదట ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ పెట్టింది. మద్రాసులో D.V.S రాజుగారు రాజేంద్రప్రసాద్, చిరంజీవి అక్కడే శిక్షణ పొందారు.

**ప్రశ్న** : నాటిక, నాటకం – తప్పనిసరిగా ఒక సందేశంతో ముగియాలా?

**జవాబు** : సినిమాలాగా ఒక ఎక్స్‌ప్రెషన్ కోసం కుదరదా! మీరే సినిమానైనా చూడండి! ఏదీ చెప్పకుండా, ఏ సినిమాయైనా ఉందా? సందేశాలుండవు కదా!

**జవాబు** : ఎవరన్నారు. అన్ని సినిమాల్లో సందేశం ఉంటుంది. అవి హేవీ సందేశం కాకపోవచ్చు. తేలికపాటివి సందేశం కావచ్చు. సింగీతం శ్రీనివాసరావు – ఆదిత్య 365 జాగ్రత్తగా చూసి చెప్పండి టైమ్ మిషన్ ఒక ఎక్స్‌పెరిమెంట్. మీరన్నట్లు ఇంటర్నల్‌గా సందేశం ఉంటుంది.

**ప్రశ్న** : నాటకం చూస్తే ఒక సందేశం తప్పనిసరిగా ఉంటుంది. అదే ఒక సినిమాలో సందేశం ఉండకపోవచ్చు.

**జవాబు** : సందేశం తప్పకుండా ఉంటుంది. స్లోగన్ లాగా ఉండకూడదు. కథలోనే యిమిడి ఉంటుంది. ఏదో లక్ష్యం లేకుండా సినిమా ఉండదు.

**ప్రశ్న** : ఎక్స్‌పీరియన్స్ కోసమే ఇంగ్లీషు సినిమాలు చూస్తారు.

**జవాబు** : మీకో ఫీలింగ్ కలుగుతుంది కదా! ఆ అనుభూతి నాటకంలోనూ కలుగుతుంది. అనుభూతి ప్రధానంగానే నాటకాలు లేవా? ఉన్నాయి.

ఇంకోసీను : పిల్లాడు కెవ్వున అరిచాడు. వాణ్ణి తీసుకుని పక్కకు తిరిగి పడుకుంటుంది. వెనుక నుంచి కౌగలించుకుంటాడు. ఎడ్లబండ్లు వెళ్తుంటాయి. ఒక కారు వచ్చి పక్కన ఆగిందక్కడ. మొగుడు పెళ్ళాం, సింగిల్ హ్యాండ్‌తో డ్రైవ్ చేస్తున్నాడు. కుక్క అడ్డం వచ్చింది. బ్రేక్ వేశాడు. ఆగిపోయింది. అది డిస్టర్‌బెన్స్. తెలతెలవారుతుంది. లెగండీ! లెంగడీ! నేను ఊడ్చుకోవాలి – అది వచ్చేసింది. పనిచేసుకోవాలి కదా! ఊడ్చుతుంది. అది వెళ్ళిపోతుంది. అలాగే పడుకుని ఉంటారు. పెళ్ళాంపై చేయివేసి పడుకుని ఉంటాడు. డిస్టర్బ్‌గా ఉందని. ఒక రాయివేసి లైట్‌ని కొడతాడు. అంకుర్ సినిమాలో రాయివేస్తారు. అంతకుముందు ఈ సినిమా వచ్చింది. తన స్థితికి ఎవరు కారకులో తెలియదు. తెలియక రాయి విసిరి కొట్టారు లైట్ పైకి. తాతినేని ప్రకాశరావు, శర్మగారు యిద్దరు ముగ్గురు పెద్దవాళ్ళతో కూర్చొని చర్చిస్తున్నాము తెలుగు సినిమా గురించి. తెలుగు వాడికి సినిమా తీయటం కష్టం అన్నారు. ఎందుకంటే ఒక మిరపకాయ ఉంటుంది. కొరివి కారం పెడతారు. చల్ల మిరపకాయలున్నాయి. కూరలున్నాయి. మషాల కూరలు మిరపకాయ బజ్జీలున్నాయి. ఉల్లిపాయతో పాటు మిరపకాయ వేయించుకు తింటాడు. ఒక మిరపకాయతో యిన్ని రకాలుగా చేస్తారు. అప్పడాలు, వడియాలు మొ॥వి. ఇంగ్లీషు వాడికేముంది. బ్రెడ్, జాము అవే – బంగాళాదుంపలు. మనకు ఆవకాయలు తొంభై రకాలున్నాయి. ఇన్ని రుచులు తెలిసిన వాడికి, నచ్చే సినిమా తీయటం కష్టం. ఏ రుచి తెలియని వాడికి, ఏది పెట్టినా తింటాడు – అదే ప్రాబ్లం మనిషికి.

**ప్రశ్న** : ఇప్పటికీ, ఎవ్వరు కూడా నా సినిమా హిట్టవుతుందని చెప్పలేదు కదా!

**జవాబు** : అదివేరు, సామెత ఉందికదా! తపస్సు చేస్తున్నాడట! ఎందుకురా తపస్సు చేస్తున్నావంటే – ఏ సబ్జెక్ట్ హిట్ అవుతుందో, ఏ సబ్జెక్ట్ ఫెయిల్ అవుతుందో చెప్పండి సార్ అన్నాడట. దేవుడన్నాడట – ఆ విషయం దేముడికి కూడా తెలియదు కదా.

మనం సినిమా చూశారా ?

Good movie. There are three generations. నాగేశ్వరరావు, ప్రెజెంట్. నాగార్జున did very well. అందరూ బాగా చేశారు.

**ప్రశ్న :** మీరెంకేమైనా చెబుతారా ఫైనలుగా మీ సాహిత్యం గురించి చెప్పండి? మీరింత వరకు ఎన్ని నవలలు వ్రాశారు.

**జవాబు :** నవలలు - 15 వ్రాశాను. దొరికినవి - 10. నాటికలు - 20 అన్ని ప్రదర్శించినవే. కథలు - 80, 30 విశాలాంధ్ర వారు వేశారు. మిగిలినవి దొరకలేదు.

**సాహిత్య పరంగా ... అవార్డులు :**

*రాతిపువ్వు* నవలకు - ఆంధ్రజ్యోతి - ఉత్తమ నవల

*అమ్మకావాలి* - చక్రపాణి యువలో - కథకు

**నాటికల్లో :** *ఊరుమ్మడి బతుకులు* - ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు - ఆంధ్రనాటక కళాపరిషత్తు.

**లైఫ్ ఎచివ్‌మెంట్సు :**

గురజాడ సాహిత్య పురస్కారం - నాటక రచయితగా.

తిరుపతి - తెలుగు మహాసభలు సత్కారం నాటక రచయితగా సన్మానం.

*కర్పూర వసంత రాయలకి* -

*విష్ణుశర్మ ఇంగ్లీషు చదువులు* - బెస్ట్ స్క్రిప్ట్ అవార్డు - నంది అవార్డు.

*మళ్ళా ఎప్పుడొస్తారు* - నంది అవార్డు (నాటకంలో)

*డామిట్ కథ అడ్డం తిరిగింది* - దూరదర్శన్ సీరియల్‌కు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ కథ అవార్డు.




కందుకూరి వీరేశలింగం నాటక సాహిత్య పురస్కారం - నాటకానికి.

తెలుగు విశ్వవిద్యాలయం అవార్డు - *ఊరుమ్మడి బతుకులు.* నాటకం కేవలం ఎక్స్‌పీరియన్స్ కోసం కాదు. నాటకం స్లోగన్‌గా ఉండకూడదు. అండర్ కరెంటులా ఉండాలి. ఒక అనుభూతి కలిగించాలి. వందేళ్ళ cinema కాలమాన పరిస్థితుల బట్టి, ఆసక్తిని బట్టి - ఎంతో మార్పు చెందింది. ఆ రోజుల్లో వెన్నెల బ్లాక్ అండ్ వైట్‌లో బాగా చూపించేవారు. ఇప్పుడు కలర్. ఏ వస్తువు ఏ రంగులో ఉందో ఆ రంగు లో చూపించడానికి సౌలభ్యం ఉంది.

**ప్రశ్న :** మీకు నచ్చిన సినిమాలు?

**జవాబు :** నాకు నచ్చిన పాత సినిమాలు - మూగమనసులు - పాతాళ భైరవి, మాయాబజార్, Ten commandments తెలుగు సినిమా : రంగారావు, నాగేశ్వర్రావు గురించి చెప్పండి.

వాళ్ళిద్దరు కూడా - ప్రారంభదశలో పాత్ర అనే దానిలో యిమిడి పోయారు. అంటే నటుడనేవాడు నీరు వంటి వాడు ఏ పాత్రలో పోస్తే ఆ పాత్రే కనబడాలి తప్ప, నీరు కనబడకూడదు.

ఒక దశలో - వీళ్ళుకూడా - పాత్రలా కాకుండా - వాళ్ళే కనబడాలి అనే స్థితికి వచ్చారు.

కృష్ణుడి పాత్రలో రామారావుగారు - తాండవం, లాస్యం, పాత్రలో ఒదిగారు. social లో నాగేశ్వరావుగారు అలా ఒదిగారు. చాలా డిసిప్లిన్డ్, కమిటెడ్ నటులు. కారణమేమిటంటే, చాలామందికి తెలుసో, తెలియదోకాని వేషం టేకప్ చేసే ముందు ఎంతో ఆలోచించుకుంటారు. చేస్తున్నప్పుడు, ఆలోచిస్తారు. ఇంకా ఎలా బాగా చెయ్యాలో ఆలోచించుకుంటారు. దాని మీదే మనసు పెట్టి దాని పైనే బ్రతికి, దాని పైనే జీవించి, అదే పరమార్థంగా ఫీల్ అయ్యేవారు. అందుకని వాళ్ళు రాణించారు. ఆ తరువాత, ఆ సిద్ధాంతాల్ని బట్టి వాళ్ళను అనుకరించినవారు, వాళ్ళ అడుగు జాడల్లో నడిచిన వాళ్ళు కూడా, చాలామంది. తరువాత శోభన్‌బాబు, వీళ్ళంతా అలాగే ఉన్నారు. తరువాత బ్యాచ్‌కూడా బాగుంది. అలా చేసిన వారే రాణిస్తున్నారు.

# ఆరిన గ్రంథాలయ దీపిక

ప్రొద్దున్నే విషాద వార్త !

వెంకటప్పయ్యగారు మనను వదిలి వెళ్లిపోయారని భోరున విలపించారు మిత్రుడు కొడాలి సుదర్శన బాబు, కల్లూరి చంద్రమౌళిగారి మనవడు సెల్‌ఫోన్‌లో – అదెలా? ఎలా జరిగిందిది ! ఏమైంది? ఎన్నడూ చీది ఎరుగడు – తలనొప్పి అనలేదు – అనారోగ్యంగా వుందని ఎన్నడూ అనేవారు కారు వెంకటప్పయ్యగారు మరి.

వెంటనే – వెలగా వెంకటప్పయ్యగారిని చివరి దర్శనం చేసుకుందామని తెనాలి బయలుదేరాను. దారంతా – వెలగావారి గురించిన ఆలోచనలే. ఎన్ని జ్ఞాపకాలు! పదహారు, పదిహేడేండ్ల క్రితం మా పరిచయం. వెలగావారు సంపాదకులుగా, నేను సహ సంపాదకుడిగా *స్వర్ణభారతి* విశిష్ట సంచికలు రెండిటిని ఖమ్మం నుండి వెలువరించాము. రెండవసారి వెలువరించిన *స్వర్ణభారతి* సంచికను గురించి నాతో అయిదారుసార్లు – సుబ్బారావుగారూ – మరో యాభై ఏళ్లవరకు మనవాళ్ళు ఇటువంటి సంచికలు వెలువరించలేరు. రాదు అని ఎంతో తృప్తిగా, ఆనందంగా, నమ్మకంగా చెప్పారో – తమ పనిమీద వారికి ఎంత విశ్వాసం ! మరెంత నమ్మకం!! ఇలా నమ్మకంగా చెప్పడం వారికే తగింది – నాలాంటి వాళ్లకు కాదు. ఆత్మ విశ్వాసం తక్కువ, నాలాంటి వాళ్లకి. నేను తెనాలి వెళ్లినప్పుడల్లా – యివి చదవండి అని నా సంచి నిండా పుస్తకాలు నింపి చేతికందించేవారు. అలా వచ్చినవే – గవిని వెంకటకృష్ణారావు సంపూర్ణ సాహిత్యం. చక్రపాణి సాహిత్యం – నార్ల వెంకటేశ్వరరావు రచనలు అన్నీను. ఈ పదిహేడేళ్ళుగా – వారు ఫోన్ చేసినప్పుడల్లా – వెళ్ళాను. వారి ఆతిథ్యమూ పొందాను. అలా వారిచ్చిన పుస్తకాలు ఎన్నో నా గ్రంథ సంచయంలో చేరిపోయాయి. వర్ధమాన రచయితలను ఎంతోమందిని ప్రోత్సహించారు. వారిలో ఏమాత్రం స్పార్క్ ఉన్నా అతనితో చెప్పి మరీ మరీ ఆనందించేవారు.

తన భార్య శ్రీమతి నాగేంద్రమ్మగారి అనారోగ్యం గురించే ఆందోళన పడినారు కానీ, తన ఆరోగ్యం గురించి అంతగా ఎన్నడూ పట్టించుకోలేదు. పట్టించుకోడానికి ఏముంది? వారు నియమబద్ధంగా ఉంటారు. శాఖాహారి, మితాహారి. ఎప్పుడూ నోట్లో వెల్లుల్లి రెబ్బ – రక్తశుద్ధికిగాను వాడేవారు. మరటువంటి వెంకటప్పయ్యగారికి గుండెపోటు రావడం ఏమిటి? అయ్యంకి వెంకట రమణయ్యగారు పోయాక గ్రంథాలయాలకు ఉచ్ఛ్వాసనిశ్వాసలయ్యారు వెంకటప్పయ్య గారు. గ్రంథాలయాల ఎడ ప్రభుత్వ ఉదాసీనతకు, తనలో తనే అనుకోకుండా, పెద్దలతో కూడా గ్రంథాలయాల పరిస్థితి గురించి, జరగవలసిన పనుల గురించి ఎంతో వివరంగా తన మనసులోని బాధను చెప్తుండేవారు. తన వాదనను, తన అభ్యర్థనను ఎవరూ వినడం లేదని కినిసిపోయారేమో వెంకటప్పయ్యగారు!

వెలగా చనిపోయిన రోజే, మండలి బుద్ధ ప్రసాద్‌గారు, శ్రీమతి నన్నపనేని రాజకుమారిగారితో పాటు అక్కడ చేరిన పరిచయస్థులతో 'యిలా జరిగిందేమి', ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, వెలగా వారికి పద్మశ్రీ పురస్కారం ఇవ్వమని కేంద్ర ప్రభుత్వానికి సూచించాము. ఫలితం తెలియకుండానే వెంకటప్పయ్యగారు మనల్ని వదిలి వెడలి పోవడం దురదృష్టకరం అని. వెంకటప్పయ్యగారి గురించి డిసెంబరు నెల ***మిసిమి*** సంచికలో ఓ వ్యాసం వ్రాసాను. తిరిగి ఇప్పుడు వెంకటప్పయ్య గారు పోయారన్న విషాద వార్తను ***మిసిమి*** పాఠకులకు వారితో నాకు గల వ్యక్తిగత పరిచయాన్ని గురించి వ్రాయాల్సి వస్తుందనుకోలేదు.

వెంకటప్పయ్యగారు జీవితమంతా నియబద్ధంగా గడిపారు. సమయపాలన వారిక తెలిసినంతగా నాలాంటి వాళ్ళకు తెలియదు. సెల్‌ఫోనులో మాట్లాడే విధానం గురించి నా భార్యతో అప్పుడప్పుడు అంటుండేవాణ్ణి; "ఏమిటి, నీవు గంటలతరబడి మాట్లాడుతున్న దాంట్లో ప్రత్యేక విషయాలేమయినా ఉన్నాయా" అని. చెప్పవలసి రెండు మాటలు చెప్పాలిగాని ఇలా పనికిరాని చెత్తనంతా మాట్లాడితే వెంకటప్పయ్యగారు వినిపించుకోరు, ఫోన్ పెట్టాస్తారు నిర్మొహమాటంగా, సెల్‌ఫోన్లు ఉన్నవారందరికి వెంకటప్పయ్యగారి ద్వారా కోచింగ్ ఇప్పించాలని అంటుండేవాణ్ణి. దురదృష్టం ఆ అవకాశమే రాకుండా పోయింది.

సమయపాలనంటే వెంకటప్పయ్యగారికి అమిత ఇష్టం. మొదట అనుకున్నట్లుగా, సరిగా తొమ్మిది గంటలకే వారి కుటుంబ సభ్యులు తెనాలి స్వర్గపురిలో వెంకటప్పయ్యగారి దహన క్రియలు పూర్తిచేశారు. అక్కడ వెంకటప్పయ్యగారి బంధుమిత్రులు, గ్రంథాలయాధికారుల, వారి శిష్యకోటి, రచయితలు, కవులు, వారినెరిగిన అనేక మంది మిత్రులు అశ్రునయనాలతో కడసారి వీడ్కోలు పలుకుతుండగా గ్రంథాలయ దీపిక వెంకటప్పయ్యగారు పంచభూతాలలో కలిసిపోయారు.

అమ్మ – నాగేంద్రమ్మ కన్నీటిని ఎవరాపగలరు? వెంకటప్పయ్యగారు కొనసాగించిన గ్రంథాలయ ఉద్యమ దివిటీని ఎవరందుకుంటారన్నదే తెలుగువారి ఈ నాటి ప్రశ్న. మి

**– గుడిపూడి సుబ్బారావు, హైదరాబాదు.**

# తూర్పు యూరప్ కవిత్వం

*- ముకుంద రామారావు*

**యూ**రప్‌లో మాత్రం, నెలకొన్న మొదటి సంస్కృతి, క్రీ.పూ. 700లో, గ్రీకు రోమన్‌ల కాలం నాటిది. ఆ సంస్కృతి, అప్పటి - భాష, విద్య, తెలివి, కళలు, విజ్ఞానం, తత్త్వశాస్త్రం మొదలైన అన్నింటి మీదా, యూరప్ ఖండమంతా ప్రభావం చూపించింది.

రోమన్ గణతంత్ర రాజ్యం కూడా అదే విలువల వ్యవస్థని అనుసరించింది. రోం లో అంతర్యుద్ధం తరువాత, అప్పటి రాజు కన్స్టంటైన్, తన రాజధానిని రోం నుండి బైజంటైన్ కి మార్చాడు. దానికి కన్స్టంటినోప్ల్ గా నామకరణం చేసాడు. అదే ఇప్పటి ఇస్తాంబుల్. రోమన్ సామ్రాజ్యం, అనేక దండయాత్రల మూలంగా విచ్చిన్నమవుతూ వచ్చింది. మొట్టమొదటి సారిగా జర్మన్లు, విసిగోథ్స్ నాయకత్వంలో రోం ను జయించి అక్కడ పాగావేసారు. వారు ఆ సామ్రాజ్యాన్ని విస్తరించి, ఒక కొత్త భాష, లాటిన్ ను ప్రవేశపెట్టారు. ఇప్పుడు తూర్పు యూరప్‌గా పిలవబడుతున్న ప్రాంతం అప్పటి ఈ జర్మన్ల సామ్రాజ్యమే.

500-1000 కి మధ్య కాలాన్ని అంధకారయుగం గానే భావిస్తారు. క్రైస్తవం ఒక్కటే అక్కడి మతం. క్రీస్తు తప్ప మరో దేవుడెవరూ తెలియని కాలం. అదే కాలంలో ముస్లిం ప్రపంచం ఎక్కువ ప్రాముఖ్యత సంతరించుకోవడం మొదలైంది. క్రైస్తవం యూరప్ అంతా వ్యాపించినా, ముస్లింలతో తమనుతాము అంచనా వేసుకునేవారు. 1000 నాటికి ఇస్లాం వ్యాప్తి చెంది, యూరప్‌లో ముఖ్యంగా రోం, పారిస్, ఇప్పటి ఇస్తాంబుల్‌లాంటి ప్రాంతాల్లో, 300 వేల వరకూ ఇస్లాం ని స్వీకరించారు. రోంలో చర్చి (ఇప్పటి వాటికాన్ నగరం) చుట్టూ క్రైస్తవుల ముఖ్య కేంద్రమయింది. ఇంగ్లాండ్ ఒక్కటే క్రీ.శ. 100 నుండి ఆల్ఫ్రెడ్ రాజు అధీనంలో స్వతంత్ర రాజ్యంగా ఉంది. వంద శాతం క్రైస్తవం తో, ఇస్లాం అక్కడ ప్రభావం చూపలేక పోయింది. క్రీ.శ. 1054లో ఒకటిగా ఉన్న చర్చి, క్రైస్తవ సాంప్రదాయక చర్చి, రోమన్ కేథలిక్ చర్చిగా విడిపోయింది. ముస్లింల వ్యాప్తిని అరికట్టడానికి, క్రైస్తవం కోసం 1396లో అతి పెద్ద యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో స్పెయిన్, ఫ్రాన్స్, లిథుయానియా, బైజంటైన్ సామ్రాజ్యం కలిసి పోరాడాయి.

యూరప్ లో కులీనపాలన, భూస్వామ్యవ్యవస్థ మూలంగా అశాంతి చెలరేగింది. ప్రపంచవ్యాప్త వ్యాధితో 60 శాతం వరకూ జనం మరణించారు. 14వ శతాబ్దం తర్వాత, యూరప్‌లో వచ్చిన పునరుజ్జీవనోద్యమం, పారిశ్రామిక విప్లవంతో బ్రహ్మాండమైన అభివృద్ధి మొదలైంది. అది యూరప్‌కి ఒక స్వర్ణయుగం. ఫలితంగా 1500-1800 వరకూ యూరప్‌లో ఒక కొత్త ప్రారంబం మొదలయింది. ఇటలీలో మొదలైన పునరుజ్జీవనోద్యమం, ఉత్తర పశ్చిమ యూరప్ ఖండానికంతా పాకింది. అది యూరప్‌ను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో నిలబెట్టింది. ఆ సమయంలో గ్రీకు, రోమన్ సంస్కృతులు కూడా ఎక్కువగా ప్రాచుర్యం పొందాయి. గ్రీకులు, రోమన్లు, యోరోపియన్లు ఈ కాలాన్ని ఆయా దేశాలకు స్వర్ణయుగంగా భావిస్తారు. బంగారంను కనుగొన్నదీ ఈ కాలంలోనే. ఆధునిక యూరప్ చరిత్ర, ఇంగ్లాండ్ గ్రీస్ దేశాలకు పట్టిందల్లా బంగారం చేసింది. రోం, గ్రీస్, ఫ్రాన్స్ అనేక మార్పులకు లోనయింది. ఆసియా నుండి అరబ్బులు; ఆఫ్రికా నుండి క్రైస్తవులు; ముస్లిం రాజులతో పడక, ఇంగ్లాండ్, ఫ్రాన్స్ దేశాలకు, వలసపోవడం ప్రారంభమయింది. యూరప్‌కి ప్రముఖంగా మూడు ద్వీపకల్పాలున్నాయి. ఆగ్నేయంలో బల్కన్, దక్షిణంలో ఐబేరియన్ (స్పెయిన్, పోర్చుగల్ దేశాలున్న భాగం), ఇటాలియన్ ద్వీపకల్పాలు. బల్కన్ ద్వీపకల్పంలో గ్రీస్, అల్బానియా, మసెడోనియా, బల్గేరియా, రుమేనియా, క్రోసియా, యుగోస్లావియా (సెర్బియా, మోంటెనెగ్రో), బోస్నియా, హెర్జెగోవినా, యూరప్ టర్కీ (ఇస్తాంబుల్ చుట్టూ ఉన్న చిన్న ప్రాంతం) దేశాలున్నాయి.

సాంస్కృతిక ప్రభావాలు, వైరుధ్యాల మూలంగా యూరప్‌ని, రెండు భాగాలు చేసి – తూర్పు యూరప్ , పశ్చిమ యూరప్‌లుగా చూడొచ్చు. పశ్చిమ భాగం లాటిన్‌ని చాలావరకూ అంగీకరించినా, తూర్పు భాగం దానికి దూర మయింది. రోమన్ సామ్రాజ్యం ఈ మార్పుకి ముఖ్య కారణం.

పశ్చిమ యూరప్, మధ్య యుగ కాలంలో విఫలమైంది. అయినా అప్పట్లో బైజంటైన్ సామ్రాజ్యం, కన్స్టంటైన్ చక్రవర్తి కాలంలో ఇస్లాం వ్యాప్తి పుంజుకుని, ముస్లింల సంఖ్య పెరగడం మొదలైంది. తూర్పు, పస్చిమ యూరప్ దేశాలలో అది విభజనలకు దారితీసింది. పైగా ఆ సమయంలో తూర్పు యూరప్ మంగోలుల అధీనంలోకి పోయింది. క్రైస్తవంలో కూడా రోమన్ కేథలిక్‌లు, తూర్పు సాంప్రదాయకుల మధ్య ఘర్షణ వాతావరణం ఉండేది.

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత యూరప్ – తూర్పు యూరప్, పశ్చిమ యూరప్ కూటాలుగా వేరుచేయబడ్డాయి. తూర్పు యూరప్ – అనేక సంస్కృతులు, స్వజాతీయులు, భాషలు, చరిత్రలు కలగలిసి ఉన్న ప్రాంతం. అయితే ఈ దేశాల్ని ఇలానే వర్గీకరించడం ఒక్కోమారు వివాదాలకు దారితీసినా, విశాల ప్రాతిపాదికమీద ఈ వర్గీకరణ ఒక విషయంలో అన్నింటికీ వర్తిస్తుంది. అది – ఇనపతెరగా అభివర్ణించబడ్డ బెర్లిన్ గోడ కూల్చకముందు, కమ్యూనిస్ట్ ప్రాభవంలో ఉన్న దేశాలు, మరోలా తీసుకుంటే, ఈ గోడ చాలావరకూ యూరప్‌ని రెండు భాగాలు – తూర్పు యూరప్, పశ్చిమ యూరప్‌లుగా మార్చింది.

ఈ విభజనలో ఆ తరువాత జరిగిన పరిణామాల్లో, తూర్పు యూరప్ లోవిగా తీసుకున్న దేశాలు ఇవి – ఆర్మేనియా, అజర్బైజాన్, బెలారస్, ఎస్టోనియా, జార్జియా, లట్వియ, లిథువానియా, మొల్డోవా, పోలాండ్, రష్యా, టర్కీ, ఉక్రైన్, తూర్పు జర్మనీ, రుమేనియా, బల్గేరియా, హంగరీ, అల్బానియా, యుగోస్లావియా, స్లొవెనియా, క్రోసియా, బోస్నియా హెర్జెగోవినా, మోంటెనెగ్రో, మసెడోనియా, కొసావొ, సెర్బియా, జెకోస్లోవాకియా, స్లొవకియా, సైప్రస్, వాటికన్‌లు. సోవియట్ ఆధిపత్యం నుండి విముక్తి చెందిన దేశాలు వీటిల్లో కొన్ని ఉన్నాయి. అవి – పోలాండ్, తూర్పు జర్మనీ, జెకోస్లోవాకియా, రుమేనియా, బల్గేరియా, హంగరీ, అల్బానియా, యుగోస్లావియా దేశాలు.

ఈ దేశాల్లో కొన్నింటిని ఈ వ్యాస పరంపరలో చదివాం. అవి – ఆర్మేనియా, అజర్బైజాన్, బెలారస్, ఎస్టోనియా, జార్జియా, లట్వియ, లిథువానియా, మొల్డోవా, పోలాండ్, రష్యా, టర్కీ, ఉక్రైన్ దేశాలు. ఇక తూర్పు యూరప్ లో, మిగిలిన దేశాలు – తూర్పు జర్మనీ, రుమేనియా, బల్గేరియా, హంగరీ, అల్బానియా, యుగోస్లావియా, స్లొవెనియా, క్రోసియా, బోస్నియా హెర్జెగోవినా, మోంటెనెగ్రో, మసెడోనియా, కొసావొ, సెర్బియా, జెకోస్లోవాకియా, స్లొవకియా, సైప్రస్, వాటికన్‌లు. ఆ యా దేశాల కవిత్వ చరిత్ర తెలుసుకోవల్సి ఉంది.

ఇనుపతెర బెర్లిన్ గోడ కూల్చాక – తూర్పు జర్మనీ, పశ్చిమ జర్మనీతో తిరిగి కలిసిపోయింది. బలవంతం మీద యుగోస్లావియా – స్లొవెనియా, క్రోసియా, బోస్నియా హెర్జెగోవినా, మోంటెనెగ్రో, మసెడోనియా, కొసావొ, సెర్బియా దేశాలుగా విడిపోయాయి. జెకోస్లోవాకియా – జెకోస్లోవాకియా, స్లొవకియా దేశాలుగా విడిపోయాయి.

తూర్పు యూరప్, దాదాపు యురప్ లో సగభాగం. ఆర్మీయన్, ఎస్టోనియా, లట్వియన్, లిథువానియన్, పోలిష్, జర్మన్, జెకోస్లోవన్, జార్జియన్, హంగేరియన్, రుమానియన్, యూక్రేనియన్, రష్యన్, బల్గేరియన్, యుగోశ్లావ్, ఇడ్డిష్ మొదలైన 15 భాషలు వాడుకలో ఉన్నాయి.

**జెకోస్లోవాకియా చరిత్ర :**

మధ్య యుగం ప్రారంబానికి అక్కడ జనసంచారం ఉన్నట్టు తేలింది. సెల్టిక్ల నుండి మొదలై, జర్మనీ ఆదివాసులు, స్లావిక్ ప్రజల వరకూ, మొదటి నుండీ అనేక తెగలు నివసించిన ప్రాంతం ఇది. 9వ శతాబ్దానికి అది బలమైన బొహిమియా రాజ్యంగా ఉద్భవించింది. అయితే ఈ రాజ్యం రోమన్ సామ్రాజ్యం అధీనంలో ఉండటంతో, అనేక రాజులు ఈ రాజ్యాన్ని పరిపాలించారు. 1342లో ఈ బొహిమియా రాజ్యం నాలుగవ చార్లెస్ చక్రవర్తి పరిపాలనలో ఉన్నత స్థితికి వెళ్లింది. 1800 వరకూ రోమన్ సామ్రాజ్యం అధీనంలోనే ఈ ప్రాంతం కొనసాగింది. ఆ తరువాత ఆస్ట్రియన్లు, హబ్స్బర్గ్ సామ్రాజ్యం అధీనంలోకి ఈ ప్రాంతం వెళ్లక తప్పలేదు.

మొదటి ప్రపంచ యుద్ధం తరువాత, 1918లో ఆస్ట్రియన్ సామ్రాజ్యం నుండి, జెక్లు, స్లోవాక్ల ప్రాంతాల్ని కలుపుకుని జెకోస్లోవాకియా దేశం యేర్పడింది. రెండవ ప్రపంచ యుద్ధం ఆరంభానికి జెకొస్లోవాకియా జర్మనిలో భాగమయిపోయింది. అనేక మంది యూదులు, ఇతర అల్పసంఖ్యాకులు ఆ కాలంలో అతిగా నష్టపొయారు. యుద్ధానంతరం జెకోస్లోవాకియా, సోవియట్ సమాఖ్య అధీనంలోకి పోయి, కమ్యూనిస్ట్ పరిపాలనలో ఉండింది. 1990 లో సోవియట్ సమాఖ్య విచ్ఛిన్నమైనాక జెకొస్లోవాకియా స్వాతంత్ర్యం పునరుద్ధరించబడింది. జెక్లు, స్లోవాక్లు సంధి చేసుకుని శాంతియుతంగా, 1992లో జెకొస్లోవాకియా, స్లొవకియా - రెండు దేశాలుగా విడిపోయాయి. జెకొస్లోవాకియా గణతంత్ర రాజ్యం, చారిత్రకంగా మూడు ప్రాంతాలుగా విభజించబడింది - బొహెమియా, మొరావియా, సిలెసియాలో కొంత భాగం. సముద్రతీరం లేకుండా యూరప్ ఖండం, నడిబొడ్డున ఉన్న దేశం. 2004లో యూరోపియన్ యూనియన్లో సభ్యత్వం తీసుకుంది. రోమన్ లిపిలో రాసే జెక్, వీరి అధికారిక భాష. లౌకిక రాజ్యంగా ప్రకటించుకుంది. తూర్పున యూక్రేన్, పశ్చిమాన పశ్చిమ జర్మనీ, ఈశాన్యాన పోలాండ్, దక్షిణాన ఆస్ట్రియా హంగరీ దేశాలు, వాయు వ్యాన తూర్పు జర్మనీ, సరిహద్దులుగా ఉన్నా, ఎక్కువ భాగం విశాలమైన పర్వత శ్రేణులతో చుట్టుముట్టి ఉంటుంది.

13వ శతాబ్దం వరకూ జెక్ భాషకు లిపి లేదు. ఆ భాషలో వారి మొదటి గ్రంథం బైబిల్ అనువాదమే. 14-15 శతాబ్దాలవరకూ ఎక్కువగా ధార్మిక వచనాల అనువాదాలే వచ్చాయి. 14వ శతాబ్దం నుంచీ, పశ్చిమ యూరప్తో సాన్నిహిత్యం మూలంగా, జెక్ భాష అభివృద్ధి పథంలో పయనించింది. మహాకావ్యాలు, చారిత్రక కావ్యాలు, మొదలైనవి వెలువడ్డాయి. 14వ శతాబ్ది అంతానికి జెక్ సాహిత్యం లౌకికం, ధార్మికం అని రెండు శాఖలయింది. 16వ శతాబ్దానికి జెక్ సాహిత్యం ఎక్కువగా నీతి బోధనకు, వైదుష్య ప్రకటనకు పరిమితమయింది. 18 శతాబ్ది చివరికి ఆస్ట్రియన్ ప్రభుత్వం చేసిన శాసనాల మూలంగా, జెక్ భాష సాహిత్య భాషగా వాడుక ఆగిపోయింది. కానీ ఆ నిరంకుశ చర్యలు, జెక్ భాషాభిమానాన్ని పెంచి జెక్ సాహిత్య పునరుద్ధరణకు దారితీసింది. 19వ శతాబ్దంలో జెక్ సాహిత్యం ఎక్కువగా కాల్పనికోద్యమ ప్రభావంలో పడింది.

మిగతా యూరప్లానే, జెక్ సాహిత్యంలో కూడా కాల్పనికోద్యమం, ప్రతాపం చూపింది. ఆ ఉద్యమానికి నాయకుడు గొప్ప కవి కారెల్ హైనెక్ మాచా (1810-1836). వీరి పురాణకావ్యం మాజ్, జెక్ సాహిత్యాన్ని ఒక మలుపుతిప్పింది. వీరిమీద లార్డ్ బైరన్, సర్ వాల్టర్ స్కాట్లాంటి ప్రసిద్ధ కవుల ప్రభావం ఉందని చెబుతారు. అయితే 1840 నాటికి కాల్పనికోద్యమ తీవ్రత తగ్గింది. జాతీయతావాదంతో అందర్నీ ఆకర్షించిన కవి జాన్ నెరూడా (1834-1891). ప్రముఖ చిలీ కవి, నోబెల్ బహుమతి గ్రహీత పాబ్లో నెరూడా, తన పేరులో వీరి పేరును వాడుకున్నారంటే, వారెంతగా ప్రభావితులయారో అర్థం అవుతుంది. కారెల్ హైనెక్ మాచా ప్రభావితుల్లో - విటెజ్స్లావ్ హాలెక్ (1835-1874). అరోస్లవ్ వ్రిచ్లికీ (1863-1912) ఉన్నారు. 19వ శతాబ్దం చివరికి కొత్త ధోరణులలో కవిత్వం రావడం మొదలైంది. అందులో ప్రముఖులు - ఓటకార్ బ్రెజీనా (1868-1929), పీటర్ బెజ్రుక్ (1867-1958). 1918-1945 మధ్య భావకవిత్వంతో పేరు తెచ్చుకున్న వారిలో - జోసెఫ్ హూరా (1891-1945), ఫ్రాంటిసెక్ హలాస్ (1901-1949), వితెజ్స్లావ్ నెజ్వల్ (1900-1958), యారోస్లావ్ సైఫర్ట్ (1901-1986) మొదలైనవారు, గొప్ప జీవశక్తి, వైవిధ్యం, అత్యున్నత నాణ్యతతో కూడిన కవిత్వం రాసినవారుగా పేరు తెచ్చుకున్నారు. 1960లో రాజకీయ నియంత్రణలు సడలించబడ్డాక మిరోస్లావ్ హోలబ్ (1923-1998), వ్లాడిమిర్ హోలన్ (1905-1980) లాంటివారు అద్భుతమైన కవిత్వం రాసారు. ఇతర ముఖ్య కవుల్లో ప్రముఖులు - ఫ్రాంటిసిక్ హ్రుబిన్ (1910-1971), ఆంటోనిన్ బార్టుసెక్ (1921-74), జోసెఫ్ హంజ్లిక్ (1938-2012), ఆంటోనిన్ బ్రోస్సెక్ (1941-2013), డానియెల్ సింకా (1959-), ఎరిక్ గ్రోచ్ (1957-), సిల్వా ఫిస్చెరోవా (1963-), మగ్ద బర్టొసోవా (1972-) మొదలైనవారు. నోబెల్ బహుమతికి అర్హుడుగా అనేకమార్లు పరిశీలించబడ్డ, జెకొస్లోవేకియాలో జన్మించి జెకొస్లోవేకియా మీద రచనలు చేసిన మిలన్ కుందేరా (1929-) కూడా కవిత్వం రాసారు.

**యారోస్లావ్ సైఫర్ట్ (1901-1986) :** జెకొస్లావేకియా జాతీయవాద కవుల అతిపెద్ద జాబితాలో ముఖ్యమైన వారు. 1984 నోబెల్ బహుమతి గ్రహీత, అనువాదకులు, చారిత్రకులు, బాల సాహిత్య కర్త, విలేఖరి. పెన్ను గన్ను అయినపుడు, పారిపోనిదెవరు అన్న నమ్మకం. చంపడం వధించడం కంటే, అందమైన పదాలు వెతకడం ఎంతో మంచిదని భావిస్తారు. సోవియట్ సమాఖ్యలో కమ్యూనిజం పట్ల వీరి తొలి రచనలు యవ్వన ఆశలతో నిండి ఉన్నా, 1929లో కమ్యూనిస్ట్ పార్టీ నుండి వైదొలగారు. 30వరకూ కవిత్వ సంకలనాలొచ్చాయి, 1980-90 లో వీరి కవిత్వ అనువాదాలు విరివిగా వచ్చాయి. "గొర్రె మెడలో కవిత గణగణమని మోగేబదులు, కోపం, నైరాశ్యం, కటుత్వపు - జీవితం తాగిన కవి, ఉమ్మేయాలి" అంటారు

**తత్వశాస్త్రం :**
జీవితం ఏమీకాదు, ఒక్క క్షణమని
వివేకంగల తత్వవేత్తలంటారు
అయినా మన స్నేహితురాలు కోసం
మనం ఎదురుచూస్తున్నపుడు
అది ఒక అనంతకాలం

**ఆంటోనిన్ బార్టుసెక్ (1921-74) :** తూర్పు యూరప్ కవుల్లో అరుదైన కవి. వీరి కవిత్వం మనలో కుతూహలాన్ని రేపేది కాదు, సహానుభూతితో తక్షణ ప్రతిక్రియను రేకెత్తిస్తుంది. సూచన ప్రాయమైన కవిత్వంతో, 20వ శతాబ్దం మనిషి నివసిస్తున్న వాతావరణాన్ని సృష్టిస్తుంది.

**ఆ కొన్ని సంవత్సరాలు :**
నువ్వు మానుకోడానికి ఒప్పుకోవు
నేరం చేస్తుండగా వారిని పట్టుకోవాలన్న ఆశతో
ఆశపడుతూనే ఉంటావు / ప్రతీ విపత్తు వేలిముద్రలూ
నువ్వు సేకరిస్తుంటావు / రెట్టింపు మంచు కురుస్తుంది
మనిద్దరికీ అమాంతం / నెరిసిన జుత్తు

**మిరోస్లావ్ హోలబ్ (1923-1998) :** రెండవ ప్రపంచ యుద్ధం తరువాత జెకోస్లోవాకియాలో అందరి దృష్టినీ ఆకర్షించిన శాస్త్రవేత్త కవి. కవిగా హోలబ్, శాస్త్రవేత్తగా హోలబ్, ఇద్దరూ వృత్తి సంబంధమైన వైఖరి కనబరుస్తారు. పరిహాసకరమైన చమత్కారం, అవివేకం పట్ల అసహనం, కత్తిలాంటి కవిత్వంలో ఎక్కువగా వైజ్ఞానిక భావనలు, కలగలిపేది వీరి కవిత్వం. చర్మం కింద పుర్రె కాదు, పుర్రె కింద మెదడు ఉంచుతాడని విమర్శకులంటారు. కక్షసాధించడానికి  అతిగా కరుణామయం, పరవశమవడానికి అతిగా సంశయాత్మకం - వీరి కవిత్వం.

**తలుపు:**
వెళ్లు తలుపు తెరు. / బహుశా బయట ఉంది -
ఒక చెట్టు, లేదా ఒక అడవి, / ఒక తోట, లేదా
ఒక మాయా నగరం. / వెళ్లు తలుపు తెరు.....

**సిల్వా ఫిస్చెరోవా (1963-) :** కమ్యూనిస్ట్ పాలనలో వారి గ్రంధాలన్నింటినీ బహిష్కరించబడ్డ, మార్క్సిస్ట్ కాని తత్వవేత్త కుమార్తె ఈమె. ఈమె కూడా తత్వశాస్త్రాన్ని బోధిస్తుంది. ఆరు కవిత్వ సంకలనాలొచ్చిన వీరి కవితలు అనేక భాషల్లో అనువాదమయ్యాయి.

**తల్లులు :**
తల్లులు ఎప్పుడూ నిజమే -
ప్రారబ్ధం తివాచీ ఉన్నచోట,
వారి కుక్కల వెనక, వారి దీపాలు, కత్తెరలు
పెద్ద ఫలకం మీద రంగులచిత్రాల్లా ఎదిగిన పిల్లలు.
ప్రపంచం ప్రమాదాల భరితం
చీమలు అన్నింటా పాకుతుంటాయి
ఒంటికన్ను రాక్షసుడులా
అమ్మకు ఒక కన్ను
కొలవాల్సింది ఏమీ లేకున్నా,
అమ్మా, మాలో చాలామంది తిరిగిరాలేదు

**రుమేనియా చరిత్ర :**

క్రీ.పూ. 200 నాటికి డెసియన్లుగా పిలవబడే థ్రాసియన్ ఆదివాసీలు, రుమేనియాలో ఉండేవారని చరిత్రకారుల నమ్మకం. క్రీ.పూ. 106 కి డెసియన్లను మీద, రోమన్లు, ట్రాజన్ చక్రవర్తి జయించారు. అప్పటినుండి ఆ ప్రాంతం రోమన్ ప్రాంతమయింది. 160 సంవత్సరాల తరువాత రోమన్లు ఆ ప్రాంతాన్ని వదిలిపెట్టారు. రోమన్లు అలా వదిలేసిన మొదటి ప్రాంతం అది. కొన్ని వందల సంవత్సరాల వరకూ ఆ ప్రాంతం మీద దండెత్తిన వారిలో, గోథ్లు, హన్స్‌లు, బుల్గర్లు మొదలైనవారున్నారు.

మధ్య యుగంలో మోల్డావియా ఆధిపత్యం, వల్లచియా ఆధిపత్యం, అని రెండు బృహత్ ఆధిపత్యాలు ఆ ప్రాంతం నుండి ఉద్భవించాయి. 1500లో ఒట్టోమాన్ సామ్రాజ్యం అధీనంలోకి, ఆ తరువాత 1859లో అలెగ్జాండర్ కూజా పాలనలోకి పోయాయి.  బెర్లిన్ సంధి ప్రకారం 1878లో రుమేనియాకు సంపూర్ణ స్వాతంత్ర్యం లభించింది.

మొదటి ప్రపంచ యుద్ధం తరువాత రుమేనియా ట్రాన్సిల్వానియా ప్రాంతాన్ని సాధించుకోగలిగింది, కానీ రెండవ

ప్రపంచ యుద్ధంలో పక్షాలు మారి, హిట్లర్ నాజీ జర్మనీతో కలిసింది. 1944 లో మిహాయ్ రాజు తిరుగుబాటుతో ప్రభుత్వాన్ని కూలద్రోసి, రుమేనియా మరోమారు పక్షాలు మారి జర్మనీకీ విరుద్ధంగా ఉన్న మిత్రమండలితో కలిసింది. యుద్ధానంతరం సోవియట్ సమాఖ్య రుమేనియాని ఆక్రమించి ఆ దేశాన్ని కమ్యూనిస్ట్ దేశంగా మార్చింది. 1996లో కమ్యూనిస్ట్ పాలన అంతమయి, 2007లో యూరోపియన్ యూనియన్ లో చేరింది.

తొమ్మిది చారిత్రక రాష్ట్రాలుగా ఉన్న రుమేనియా, యూరప్ కి ఆగ్నేయ దిశలో ఉంది. రుమేనియా జర్మనీ కంటే కాస్త చిన్న దేశం. యూరప్‌లో 12వ అతి పెద్ద దేశం. తూర్పు, ఉత్తరాన సోవియట్ సమాఖ్య, దక్షిణాన బల్గేరియా, నైరుతి దిక్కున యుగోశ్లావియా, పశ్చిమాన హంగరీ, ఆగ్నేయాన నల్లసముద్రం - రుమేనియాకు సరిహద్దులు. అక్కడి అధికార భాష రుమేనియా. లాటిన్ నుంచి వచ్చిన భాషలలో ఇదొకటి. ఈ భాషలో ఉన్న పదాల్లో 83 శాతం లాటిన్, 2 శ్లావిక్, మిగతా 5 శాతం ఇతర భాషలకు చెందినవి. అయితే 19వ శతాబ్దం వరకూ ఈ భాషకు సిరిలిక్ లిపినే ఉండేది. 19వ శతాబ్దం నుండీ సిరిలిక్ లిపి బదులు రోమన్ లిపి వాడటం మొదలయింది. తూర్పు సాంప్రదాయకుల జనాభానే అక్కడ అత్యధికం.

16వ శతాబ్దం నుండీ రుమేనియన్ సాహిత్యం బాగా అభివృద్ధి చెందింది. 16వ శతాబ్దం క్రైస్తవ మతానికి చెందిన ప్రార్థనలు, వ్యాఖ్యానాలు, అనువాదాలు వెలువడ్డాయి. అదే సమయంలో యూరప్‌లో పుంజుకుంటున్న పునరుజ్జీవన ఉద్యమం ప్రభావం రూమేనియాని కూడా తాకడంతో, లౌకిక సాహిత్యానికి బీజం పడింది. గ్రీకు, శ్లావిక్, బైజాంటైన్ పుస్తకాల అనువాదాలు కూడా విరివిగా జరిగాయి. 17వ శతాబ్దంలో మతపరమైన పుస్తకాల ప్రచురణ కొనసాగింది. డొసొఫ్టై గా పిలవబడే గొప్ప పండితుడు డిమిట్రీ బారిలా (1624-1693) మొట్టమొదటి సారిగా 1673లో రుమేనియన్ భాషలో పద్యాలు రాశారు. మిరోన్ కోస్టిన్ (1633-1691) దేశ చరిత్ర ఆధారంగా పద్య కావ్యం వెలువరించారు. 18వ శతాబ్దంలో ప్రాచీన గ్రీకు కవి అనాక్రియోన్ (క్రీ.పూ.582-485) సంప్రదాయాన్ని పాటిస్తూ, అలేచు వకరెస్కు (1769-1798) గేయకవిత్వం, ప్రేమగీతాలు రాశారు. వీరి కుమారుడు ఇయంచు వకరెస్కు (1786-1863) ఈ శతాబ్దంలో గొప్ప కవిగా కీర్తించబడి, అనేక పద్యకావ్యాలు రాశారు. 19వ శతాబ్దంలో రుమేనియాలో కూడా కాల్పనికోద్యమం ఇతర యూరప్ దేశాల నుంచి వ్యాపించింది. ఎలియడ్ రదులెస్కు (1802-1872) ఇటాలియన్ భాషలోనే కాక, రుమేనియన్ భాషలో కూడా కవిత్వం రాశారు. గ్రిగోర్ అలెగ్జాండ్రెస్కు (1810-1885) ఎత్తిపొడుపు కావ్యాలు వెలువరించారు. 1776-80, 1807-15 లలో రెండు భాగాలుగా, ఒక్కొక్కటి 12 సంపుటాలుగా వచ్చిన అలెసురుస్సో (1819-1859) "రుషుల జీవితాలు" గ్రంథం, బైబిల్ ను గుర్తు చేసే మహాకావ్యం. 19వ శతాబ్దం రెండవ భాగంలో ప్రముఖులైన కవుల్లో వాసిల్ అలెగ్జాండ్రి (1821-1890), మిహై ఎమినెస్కు (1850-1889) ముఖ్యులు. వీరిలో మిహై ఎమినెస్కుని రుమేనియా సాహిత్యానికి, ఆధునిక కవిత్వానికి తండ్రిగా భావిస్తారు. ఇయొన్ మినులెస్కు (1881-1944) ప్రతీకవాదాన్ని ప్రవేశపెట్టారు. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత - ఓవిడ్ డెన్సుయను (1873-1938) ప్రతీకవాదాన్ని కొనసాగించారు. నికొలెయ్ ఇయోర్గా (1871-1940) రుమేనియన్ సంస్కృతిని ప్రతిబింబిస్తూ కవిత్వం రాశారు. ఆధునిక రుమేనియన్ కవిత్వంలో గేయ కవిత్వానికి గొప్ప స్థానం ఉంది. 20వ శతాబ్దంలో త్యూడర్ ఆర్గేజ్ (1880-1967) గేయ కవిత్వంలో ముఖ్యులు.

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత, 1945లో కమ్యూనిస్ట్ పాలనలో, సామ్యవాదానికి అనుకూలంగా రచనలు విరివిగా వచ్చాయి. జియో బోగ్జా (1908-1993), డెమొస్టెనె బొటెజ్ (1893-1973), యూగెన్ జెబెలీను (1911-1991) లాంటి కవులు ఆ కోవకు చెందుతారు. మరియా బనూస్ (1914-1999) శాంతికోసం జరిపే పోరాటం గురించి, మిరోన్ పరశ్చివెస్కు (1911-1971) జానపద ఇతివృత్తాలమీద కవిత్వం రాశారు. స్టెఫన్ ఆగస్టిన్ డొయినస్ (1922-2002), లియొనిడ్ డిమోవ్ (1926-1987), అనటొల్ ఇ. బకొన్స్కి (1925-1977) లాంటి కవులు శుద్ధ కవిత్వాన్ని ప్రోత్సహించారు. నిచిత స్టానెస్కు (1933-1983) అధిభౌతిక కవిత్వం రాశారు. మారిన్ సోరెస్కు (1936-1996) నిందాస్తుతి, కల్పితకథల కవిత్వంతో యూరప్ అంతా పేరు సంపాదించారు. ఇయొన్

అలెక్సాండ్రు (1941-2000) గ్రామీణ జీవితం కవి. రుమేనియాలో గొప్ప కవయిత్రి ఆనా బ్లండియానా (1942-) కవిత్వం ఉద్విగ్నభరితం, తాత్వికం, కానీ తరువాతి కవిత్వంలో అసమ్మతి స్వరం కనిపిస్తుంది. అడ్రియన్ పవునెస్కు (1943-2010) రుమేనియన్ ప్రభుత్వానికి ఆస్థాన కవి గా ఉన్నారు. 1989 విప్లవం తరువాత మటెయ్ విస్నియెక్ (1956-) కవిత్వం చెప్పుకోతగ్గది.

ట్యుడొర్ అర్ఘెజి (1880-1969), ఇయొన్ బార్బ్ను (1895-1961), విర్గిల్ టెయొడొరెస్కు (1909-1987), పాల్ సెలన్ (1920-1970), వెరొనిక అరుంబకు (1922-1976), కవయిత్రి నిన సస్సియన్ (1924-2014), ఇయొన్ కరైఒన్ (1923-1986), ఇయొన్ ఘెరొర్ఘె (1935-), అంఘల్ దుండ్రవెయమె (1933-), గ్రిట్ టర్టెర్ (1948-), దమెల గ్రస్నం (1950-), ఇయొన్ క్రిస్టొఫెర్ (1952-) మొదలైన వారు మరికొంత మంది రుమేనియా ముఖ్య కవులు.

**మిహై ఎమినెస్కు (1850-1889) :** రుమేనియా జాతీయకవిగా భావించబడే వీరి అసలు పేరు మిహై ఎమినొవిచ్. 38 ఏళ్లకే మరణించినా, వీరి చివరి అయిదు సంవత్సరాలూ పక్షవాతంతో గడిపారు. ఆ చిన్న జీవితంలో కూడా విస్తృతంగా కవితలు, కథలు, జానపద సాహస గాథలు, మొదలైనవి రాశారు. వాటిల్లో కొన్ని మాత్రమే వారి జీవిత కాలంలో వెలుగు చూసాయి. జర్మన్ తత్వవేత్త ఆర్థర్ స్కొపెన్ హౌర్ (1780-1860) ప్రభావం వీరి మీద ఎక్కువ. జర్మన్ కవి ఫ్రెడ్రిక్ స్కిల్లెర్ (1759-1805) ని రుమేనియాలోకి అనువాదం చేశారు. వీరి కవిత్వం రుమేనియాలో అందరూ అభిమానిస్తారు. హిందూ చింతన, జర్మన్ తాత్వికత ప్రభావితుడైనా, స్వీయ సంప్రదాయంలో కూరుకు పోయినవాడు. రుమేనియన్ కవిత్వాన్ని కొత్త ఎత్తులకు తీసుకుపోయి, సాంస్కృతిక జీవితం అన్ని కోణాల్లోనూ మార్గదర్శకుడయారు. హిందూ కామదేవుని మీద అద్భుతమైన కవిత కూడ వీరిది ఉంది.

**గతాన్ని ఈడ్చుకొచ్చిన సంవత్సరాలు...**

**దేశం మీద మేఘాల్లా గతాన్ని ఈడ్చుకొచ్చిన సంవత్సరాలు**
**శాశ్వతంగా అవి వెళ్లిపోయాయి కావున అవేవీ తిరిగిరావు ఎప్పుడూ**
**జానపద గేయం ఆకర్షణలానో లేదా కాల్పనిక ప్రదేశం ఇంద్రజాలంలానో**
**అ స్వల్ప ప్రయాసకు నేనంతగా ఆనందపడను.....**

**మారిన్ సోరెస్కు (1936-1996) :** 20వ శతాబ్దం రెండవ భాగంలో అందర్నీ ఆకర్షించిన కవి, నవలాకారుడు, నాటకకర్త. వీరివి దజను పుస్తకాలకంటే ఎక్కువ ఆంగ్లంలోకి అనువదించబడ్డాయి. 20 కంటే ఎక్కువ కవిత్వ సంకలనాలు వచ్చాయి. కాలేయం కాన్సర్ మూలంగా మరణించే రెండు నెలల ముందు పూర్తి చేసిన కవిత్వ సంకలనం, వీరి మరణానంతరం 1997లో ప్రచురించబడింది. వీరి తుంటరి కవిత్వం, వ్యంగ్య నాటకాలు వీరికి విశేష ఖ్యాతిని తెచ్చి పెట్టాయి. కమ్యూనిస్ట్ నియంతృత్వ పాలన పతనమయాక, 1989లో కొన్నాళ్లు రుమేనియా సాంస్కృతిక శాఖా మంత్రిగా కూడా పని చేసారు. నోబెల్ బహుమతికోసం పరిశీలనలో ఒకమారు ఉన్న కవి.

**ప్రాప్తం :**

**గత రాత్రి నేను తెచ్చిన**
**గడ్డకట్టుకు పోయిన కోడి తిరిగి బతికింది**
**ప్రపంచంలోని అతి పెద్ద గుడ్డు పెట్టింది**
**నోబెల్ బహుమతి పొందింది......**

**ఆనా బ్లండియానా (1942-) :** ఈ కవయిత్రి అసలు పేరు ఓటిలియ వలెరియ చోమన్ రూసన్. 17 ఏళ్లకే కవిత్వంలో పడ్డారు. గేయాలు, వ్యాసాలు అనేకం రాశారు. అనువాదాలు కూడా చేశారు. రాజకీయాల పట్ల మక్కువ లేకపోయినా, పరిస్థితుల మూలంగా అందులోకి తోయబడ్డారు. అస్తిత్వవాదం, ఆధ్యాత్మిక ఆసక్తి, విషయాసక్తము నుండి సామాజిక తాత్వికత, స్త్రీల సమస్యల వరకూ వీరి కవిత్వంలో కనిపిస్తాయి.

**నిర్వచనం ప్రకారం :**

**బందీ కాకుండా తప్పించుకుందుకు**
**అతిగా మంచితనం**
**ప్రావీణ్యత ముద్ర తప్పించుకుందుకు**
**అతి పసితనం**
**లోబడి ఉండే సామర్థ్యానికి**
**అతి సంపన్నం**

**హంగరీ చరిత్ర :**

రోమన్ సామ్రాజ్యంతో సహా, ఒకప్పుడు అనేక సామ్రాజ్యాలు ఏలిన ప్రాంతం, ఇప్పటి హంగరీ. క్రీ.పూ. 895లో వచ్చిన మగ్యార్లు, ఆ తరువాత హంగేరియన్లుగా పిలబడ్డారు. క్రీ.పూ. 1000 నాటికి హంగరీ రాజ్యం ఏర్పడింది. అనేక శతాబ్దాలు ఆ

రాజ్యం క్రైస్తవ రాజ్యంగా ఉండి, ఒట్టొమాన్ సామ్రాజ్యాన్ని యూరప్ కు విస్తరించకుండా చూడగలిగింది. 11వ శతాబ్దానికే క్రైస్తవం హంగరీలో ప్రవేశించింది. 13వ శతాబ్దంలో మంగోలియన్లు హంగరీని ఆక్రమించినా, ఒక ఏడాదిలోనే వారు తరిమేయబడ్డారు. అయినా దాని మూలంగా పరిష్కారం కాని రాజవంశం వివాదాలు యుద్ధాలతో భారీ నష్టం వాటిల్లింది. 16వ శతాబ్దంలో ఒట్టొమాన్ తుర్కులు దండయాత్ర చేసి, 150 సంవత్సరాలవరకూ వారి అధీనంలో హంగరీని ఉంచుకున్నారు. 1848-1849లో ఆస్ట్రియా మీద విఫలమైన విప్లవంతో, 1867 లో చేసుకున్న రాజీ ఒప్పందంతో ఆస్ట్రో-హంగరీ ప్రభుత్వం ఏర్పడింది. కానీ అది కూడా మొదటి ప్రపంచ యుద్ధంలో జర్మనీ, ఆస్ట్రో-హంగరీ ఓటమితో నిలవలేదు. మొదటి ప్రపంచంలో ఓడిపోయాక, ఆ సామ్రాజ్యం పతనమయి పోయింది. హంగరీ చాలావరకూ శిధిలమయి పోయింది. రెండవ ప్రపంచ యుద్ధంలో కూడా జర్మనీ, ఆస్ట్రియా కూటమితో ఉన్నా, 1944లో హంగరీని జర్మనీ ఆక్రమించి. 4,44,000 మంది హంగేరియన్లను మారణహోమం చేసింది. కానీ తొందరలోనే సోవియట్ సమాఖ్య అధీనంలోకి హంగరీ పోయింది. 1956లో హంగరీ విప్లవం జరిపినా కూడా, సోవియట్ నుండి విముక్తి లభించలేదు. 1991లో సోవియట్ సమాఖ్య విచ్ఛిన్నమయేవరకూ, హంగరీ సోవియట్ అధీనంలోనే ఉండి, 1998లో స్వతంత్ర దేశమయింది. 2004లో యూరోపియన్ యూనియన్ లో భాగమయింది.

ఉత్తరాన స్లోవకియ, పూర్వోత్తరాన యుక్రైన్, ఆగ్నేయాన రుమేనియా, దక్షిణాన సెర్బియ మొంటెనెగ్రొ, నైరుతిన క్రోసియ, పశ్చిమాన స్లోవెనియ, వాయువ్యాన ఆస్ట్రియా, మధ్య యూరప్ లోని హంగరీ దేశ సరిహద్దులు. హంగేరియన్ అక్కడి అధికారిక భాష . మొదట్లో తుర్కీరూనీ లిపిలో రాయబడ్డ ఈ భాష, క్రీ.శ. 1000 నుండీ రోమన్ లిపిలోనె రాయబడుతోంది.

15వ శతాబ్దం వరకూ లిఖిత రూపంలో హంగరీకి సాహిత్యం లేదు. 19వ శతాబ్దం వరకూ హంగరీ సాహిత్య భాషగా లాటిన్ ఉండింది. అవి కూడా మత గ్రంధాలు, బైబిల్ అనువాదాలు లాంటివి. పునరుజ్జీవనోద్యమ కవి బలింట్ బలస్సి (1554-1594), మిక్లోస్ జ్రినీ (1620-1664), ఇష్టవ్ గియోంగ్యోస్సి (1620-1704), విటేజ్ మిహాలీ క్సొకొనై (1773-1805), ఫెరెంఖ్ ఫలుడి (1704-1779) మొదలైన కవులు ఆయా శతాబ్దాల్లో కవిత్వం రాశారు. అంతులేని పోరాటాల మూలంగా హంగరీ చరిత్రలో స్త్రీల మీద మోయలేనంత బరువు వేయబడింది. దానిని చిత్రించిన మొదటి కవయిత్రి కట స్జిడోనియ పెట్రోస్జి (1662-1708). 19వ శతాబ్దంలో - గొప్ప కాల్పనిక వాద కవి సాండొర్ కిస్ఫలుడీ (1772-1844), ఆధునిక హంగరీ కవిత్వ వ్యవస్థాపకుల్లో ఒకరు జానొస్ అరని (1817-1882), కొత్త కవిత్వ భాషకు ఆద్యుడుగా భావించ బడ్డ గొప్ప కవి మిహాలీ వోరోస్మర్తీ (1800-1855), హంగరీ జాతీయ కవిగా భావించబడే సాండొర్ పెటోఫి (1823-1849), ఎండ్రె ఆడి (1877-1919), లాజొస్ కస్సాక్ (1887-1967) మొదలైన వారు ముఖ్యులు. 20వ శతాబ్దం నుండి గ్యుల ఇల్యెస్ (1902-1983), అట్టిల జోజ్సెఫ్ (1905-1937), గియోర్గి సొంలియో (1920-2006), లాస్లో మేక్స్ (1895-1978), మిక్లోస్ రడ్నోటి (1909-1944), గియొర్గి ఫలుడి (1910-2006), కవయత్రి ఆనా హంజల్ (1907-1977), సందొర్ వెయొరెస్ (1913-1989), జనొస్ పెలిన్స్కి (1921-1981), ఆగ్నెస్ నెమెస్ నగి (1922-1991), గబొర్ గొర్గెయ్ (1929-), సండొర్ గ్యూరి (1930-), డెజ్సొ టండొరి (1938-), గ్యొర్గి పెత్రి (1943-2000), కవయిత్రి జ్సుజ్ర రకొవ్సికి (1950-), కవయిత్రి ఫ్లోర ఇమ్రె (1961-) మొదలైన వారు ఇంకొందరు ముఖ్య కవులు. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ప్రబలమైన భూమిక నిర్వహించిన కవయిత్రులలో ముఖ్యులు - ఆగ్నెస్ నెమెస్ నగి (1922-1991), జ్సుజ్స బెనెయ్ (1930-2006), ఆగ్నెస్ గెర్గెలి (1933-).



ముకుంద రామారావు

*మిగతా వచ్చే నెల సంచికలో....* - ముకుంద రామారావు



బాలాంత్రపు

# శతవసంతాల రజని

– ఇంద్రగంటి శ్రీకాంతశర్మ

ఒకనాడు కాదు; ఒక యేడు కాదు; ఒక తీరు రచన కాదు; ఒక తీరు సంగీతం కాదు; అందరికీ అలవాటైన లిఖిత సాహిత్య సంప్రదాయం కాదు; సరికొత్తగా దేశంలోకి ప్రవేశించిన ధ్వని మాధ్యమంతో అదే మొదలు!

ఇదీ – 'రజని' అనే బాలాంత్రపు రజనీకాంతరావు గారు అమితోత్సాహంతో పాదం మోపిన సాహిత్య రంగస్థలం. కాలం: 1942, మద్రాసు ఆకాశవాణి కేంద్రం.

భారత దేశంలోకి ప్రసార వ్యవస్థ 1927లో అడుగుపెట్టినా, దక్షిణ భారత దేశంతో ముడి, 1938 నాటి తొలి కేంద్రం మద్రాసులో స్థాపించడం!

పాఠకుడు శ్రోతగా మారి కొత్త 'వినికిడి' అనుభవంలోకి ప్రవేశించడం ఆసక్తికరమైన విశేషం.

ఉషఃకాల ఆధునిక కవులుగా ప్రసిద్ధులైన వేంకట పార్వతీశ్వర కవుల జంటలో బాలాంత్రపు వేంకటేశ్వరరావు గారి రెండవ అబ్బాయి రజనీకాంతరావు గారు. అందువల్ల సాహిత్య విషయికంగా తెలుగు, సంస్కృతం, బెంగాలీ భాషా సాహిత్య పరిమళాలు ఒంటికి పట్టిపోయాయి. వీటికి తోడు అదనంగా అబ్బినది సంగీత విద్య. మరికొంచెం ముందుకు ప్రయాణించి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆచార్య పింగళి లక్ష్మికాంతంగారి ఆచార్యకత్వంలో తెలుగు సాహిత్యంలో 'ఆనర్సు' చదువు చదివారు.

1942 నాటికి ఈ బహుముఖ ప్రజ్ఞాశాలి యువకుడు, మద్రాసు ఆలిండియా రేడియో కేంద్రంలో ప్రోగ్రాం అసిస్టెంట్‌గా ప్రవేశించి 'రజని'గా పరిణమించారు.

అక్కడ నుంచి యాత్ర ప్రారంభమైంది. మనిషిని కదిలిస్తేచాలు, పాటగా పలకటం ప్రారంభమైంది. స్వయంగా పాడడం, వివిధ సంప్రదాయ, ఆధునిక సంగీత బాణీలు ప్రయోగించడం, సందర్భానుగుణంగా పాటలు, శ్రావ్యసంగీత రూపకాలు తను వ్రాయడం, ఇతరుల చేత వ్రాయించడం ప్రవృత్తిగా మొదలైంది. రజని ఈ క్రమంలో శ్రీశ్రీ చేత తొలి సంగీత రూపకం మోహినీ రుక్మాంగద వ్రాయించారు. అలాగే కృష్ణశాస్త్రి, మల్లవరపు విశ్వేశ్వరరావు వంటి వారిచేత మేలైన రేడియో సంగీత రూపకాలు, సంగీత ప్రధాన నాటకాలు వ్రాయించారు.

రజని అనగానే ఎవరికైనాసరే మొదట పాటలు గుర్తుకు వస్తాయి. పలకరిస్తే చాలు సంగీత అభిమానులు 'ఓ విభావరి', 'స్వప్న జగతిలో', 'ఆలయమున వినపడునవిగో', 'పసిడి మెరుగుల తళతళలు', 'మన ప్రేమ', 'నటనమాడవే', 'చల్లగాలిలో యమునాతటిపై', 'మ్రోయింపు జయభేరి', 'హే భువనమనోమోహినీ' వంటి రజని పాటల్ని వెంటవెంటనే గుర్తుచేసుకోగలరు.

1947 ఆగస్టు అర్థరాత్రి స్వాతంత్ర్య సమయంలో మద్రాసు ఆకాశవాణి ప్రసారం చేసిన మొట్టమొదటి దేశభక్తిగేయం రజని రచన.

రజని పాటలు విడివిడిగాగాని, సంగీత రూపకాలలో గాని 260 పైగా వ్రాశారు. అవన్నీ 'శతపత్ర సుందరి' పేరిట తొలుత 1953లో వావిళ్ల ప్రచురణ సంస్థ – తదుపరి వ్రాస్తూ వచ్చిన అన్ని పాటలు కలిపి 2000 సంవత్సరంలో ఏకసంపుటిగా సాహిత్య మిత్రులు ప్రచురించారు.

రజని రచయితగా, స్వరకర్తగా, కార్యక్రమ నిర్వాహకులుగా మద్రాసు, హైదరాబాదు, విజయవాడ ఆకాశవాణి కేంద్రాలలో అపురూప రచనలు చేసి కలకాలం తలుచుకొనే కార్యక్రమాలు రూపొందించి ప్రసారం చేశారు.

ఇక్కడొక విషయం స్పష్టంగా చెప్పుకోవాలి. రజని కవిగా కృష్ణశాస్త్రి గారి ప్రభావంతో పడినా, రచనలో ఆయనకు నీడగా ఎప్పుడూ పరిణమించలేదు. గేయరచనలో కూడా ఆయన సొంత బాణీ ఒకటి ఉంది. రజని స్వయంగా పాడగలిగి, గేయరచన చేసే అచ్చమైన వాగ్గేయకారుడు. ఇంకా చెప్పాలంటే రజని "శ్రోతల కవి". కథ, నవల, పద్యకావ్యం వ్రాసిన "లిఖిత సంప్రదాయానికి" చెందిన రచయిత కారు. ఆయన వ్రాసిన శ్రవ్యసంగీత రూపకాలు 'విశ్వవీణ' పేరిట సంపుటిగా వెలువడ్డాయి. వీటిలో 'చండీదాసు', 'మధురానగరీ గాథ' వంటివి బాణీల సొగసుతో, రచనాలాలిత్యంతో పలువురి శ్రోతల్ని అలరించాయి. విశేషించి 'ఆదికావ్యావతరణ'మనే స్వరచిత్రమూ, 'కొండ నుంచి కడలిదాకా' అనే సంగీత రూపకం చెప్పుకోవాలి. ఈ రెండవ రచనకు జపాన్ దేశ ప్రసారాల ఉత్తమరూపక అంతర్జాతీయ బహుమతి లభించింది. అలాగే రజని సంస్కృతంలో రచించిన 'మేఘసందేశం' సంగీత రూపకానికి ఆకాశవాణి జాతీయ పురస్కారం లభించింది.

కొంతవరకు కృష్ణశాస్త్రి గారి తోడు కూడినా, రజని రచించిన 'క్షీరసాగర మథనం', 'విప్రనారాయణ' రచనలు ఆయనకు ఖ్యాతి కూర్చినవి.

సంగీత బాణీలు కూర్చడంలో మధ్యప్రాచ్య సంగీత ధోరణుల్ని మిళితం చేసి, రజని రూపొందించిన కృష్ణశాస్త్రి గారి 'అతిథి శాల' సంగీత రూపకం విశిష్టమైనది.

రేడియో విశిష్ట ప్రయోక్తగా రజని మరొక ప్రయోగం పేర్కోదగినది. అది 'సంస్కృత చతుర్భాణి' భాణ రచనలను తెలుగులో రేడియో రూపకాలు చేయడం.

అవి: తామరపువ్వు కానుక, ధూర్తవిట సంవాదం, పాదతాడితకం. వీటిని విజయవాడ కేంద్రం నుంచి ప్రసారం చేయడమేకాదు తరువాత పుస్తకంగా కూడా ప్రచురించారు. మారుపేరుతో తొలినాటి తెలుగు సినిమాలు కొన్నింటికి రచన, స్వరరచన కూడా చేశారు. ఆయన సినిమావైపు ఎక్కువగా వెళ్ళకపోవడానికి కారణం, ఆయన ప్రభుత్వ ఉద్యోగి కావడం బహుశః కావచ్చు. అది రేడియోకు మేలైంది.

ఇక్కడ విధిగా చెప్పుకోవలసిన, రజనీ సమర్థంగా నిర్వహించిన రెండు గొప్ప బాధ్యతలు ఉన్నాయి. 1. అన్నమాచార్య కీర్తనల ప్రచార ఉద్యమంలో మొదటి వరసలో నిలిచి, విజయవాడ కేంద్రం నుంచి అనేక కీర్తనలు ప్రసారం చేశారు. కొన్నింటికి స్వయంగా బాణీలు కూర్చారు. అన్నమాచార్య కీర్తనల స్వభావం గురించి పరిశోధనాత్మక పరిశీలన చేశారు. అలాగే మరొక ప్రముఖ వాగ్గేయకారుడు క్షేత్రయ్య రచనలపై పరిశోధనాకృషి చేసి కొన్నింటిని ఆంగ్లంలోకి అనువదించారు. 2. కూచిపూడి యక్షగానానికి జాతీయ స్థాయి నృత్యంగా గుర్తింపు సంపాదించడంలో ఓలేటి వెంకటేశ్వర్లు, బందా కనక లింగేశ్వరరావు గారలతో కలసి శ్రమించి, విశేష కృషి చేశారు. విశిష్ట కూచిపూడి విద్వాంసుల సాయంతో ప్రసిద్ధ యక్షగానాలను విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో నిక్షేపించారు.

రేడియో అంటే రజని, రజని అంటే రేడియో అనే రీతిలో 1971-1975 నడుమ విజయవాడ కేంద్రానికొక స్వర్ణయుగం కల్పించారు. రంగస్థలంపై సుప్రసిద్ధ నర్తకి శోభానాయుడు పూనికతో రజని ప్రశస్తమైన యక్షగానాలు రచించారు. చాలామందికి తెలుసో తెలియదో, ఘంటసాల వేంకటేశ్వరరావు గారిని రజనియే రేడియోకి పరిచయం చేశారు.

పాట - శ్రవ్యరూపకం - ఆధునిక యక్షగానం రజని చేతుల్లో సంగీత బాణీల పరంగా, రచనాపరంగా, కొత్త సొగసుల్ని సంతరించుకున్నాయి.

పరిశోధకునిగా, వచన రచయితగా రజని విశిష్ట రచనలు చేశారు. ఆంధ్రి రాగం గురించి, భారతంలో సువేరు - వేరు అంశాల ప్రస్తావన గురించి, అన్నమాచార్య భాషాప్రయోగాల గురించి రజనిగారి అభిప్రాయాలు, తీర్మానాలు, శ్రద్ధగా పరిశీలించదగినవి.

రజని పరిశోధనాపటిమని వ్యక్తం చేసే గొప్ప పుస్తకం ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము. ఆయన సాహిత్య పాండితికి తోడు సంగీత లాలస ఆయనచేత ఈ పని చేయించింది. సంగీత పరిణామ చరిత్ర ఎత్తుకొని, ఆధునిక వాగ్గేయకారుల వరకు నడిచిన విశేషాలు మొదటి సంపుటంగా - గాంధారగ్రామ చర్చతో ప్రారంభించి తెలుగులో లలిత సంగీతం, ఆధునిక యక్షగాన ప్రక్రియ వరకు వ్రాసిన వ్యాసాలు రెండవ సంపుటంగా వెలువడ్డాయి.

ఇటీవల కాలంలో 'రజని భావతరంగాలు' అనే పుస్తకం ఒకటి, రజని స్వీయ చరిత్ర ఒకటి వెలువడ్డాయి. రజని గారు నిత్యోత్సాహి. నిరంతర గాయకులు. జ్యోతిశ్శాస్త్రంలో కూడా ఆయునకు ప్రవేశం ఉంది. వేంకటపార్వతీశ్వర కవుల ప్రసిద్ధ కృతి 'ఏకాంత సేవ'ను ఇంగ్లీషులోకి అనువదించారు. క్షేత్రయ్య గురించి ఆంగ్లంలో పుస్తకం వ్రాశారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ బిరుదు ఇచ్చింది.

రేడియో అధికారిగా ఆయన ఎందరెందరో కళాకారుల్ని ప్రోత్సహించారు. అధికారిగా కాక ఎప్పుడూ ఆర్టిస్టుగానే జీవిస్తూ వచ్చారు.

ఒకప్పుడు చలంగారు రజనిగారి గురించి చలోక్తిగా "రజని కోకిలల్ని, తుమ్మెదల్ని రేడియో స్టేషన్‌కి తోలుకుపోయారు" - అంటే అన్నారుగాని,

రజని గారు ఎక్కడుంటే అక్కడే వసంతం. అక్కడే పాటలు. కేరింతలు. మధుర మనస్కులు రజనిగారే ఒక వసంతం!

వంద అంకె లెక్కేమిటి?

ఇంద్రగంటి శ్రీకాంతశర్మ
సికిందరాబాద్

# వెంకటగిరి జీవితం

*– తిరుమలసెట్టి సుధాకర్*

**మల్లెం శ్రీవేణుగోపాల్ 1910 – 2006 :**

మల్లెం శ్రీవేణుగోపాల్ వెంకటగిరిలో మాతామహుల ఇంట జన్మించారు. నాలుగోఏట తల్లి మరణించగా, మాతామహులు పెంచారు. నాల్గవతరగతి పూర్తయిన తరువాత తండ్రి బర్మా తీసుకొని వెళ్లారు. శ్రీవేణుగోపాల్ తండ్రి రంగూన్‌లో పేరున్న న్యాయవాది, ప్రజా జీవితంలో ప్రముఖులు. బి.ఎస్.సి పట్టాపుచ్చుకొని శ్రీవేణుగోపాల్ వెంకటగిరి వచ్చి జమీందారుకు పరిశ్రమల సలహాదారు ఉద్యోగంలో చేరారు. పిల్లల చదువుల కోసం 1954లో మద్రాసులో స్థిరపడ్డారు. అక్కడే దివ్యజ్ఞాన సమాజంతో అనుబంధమూ, ఆయన ఆధ్యాత్మిక మార్గంలో జీవనం ప్రారంభిచడం మొదలు కావడమూ జరిగింది.

శ్రీవేణుగోపాల్ ఇంగ్లీషులో *Autobiography of a Sohum Reyalised* రచన చేశారు. ఈ అముద్రిత రచనను మల్లెం కుటుంబానికి చెందిన శ్రీతిరుమలసెట్టి సుధాకర్ (Retd. Engineer, India Cements.) అద్భుతంగా అనువదించారు. మూలం, అనువాదం అముద్రితంగానే ఉన్నాయి. 'మిసిమి' పాఠకులకు ఆసిక్తికరంగా ఉంటుందనే భావనతో కొన్ని పుటలు పంపుతున్నా, శ్రీసుధాకర్ అనుజ్ఞతో. మిసిమి పత్రిక బాధ్యులు నా పట్ల చూపిన ఆదరానికి కృతజ్ఞతలు.

శ్రీవేణుగోపాల్‌గారు పరిశ్రమల అధికారిగా నియమింపబడిన కొంతకాలం వరకు, తన తాతగారి ఇంటిలోనే నివసించారు. ఆ తర్వాత దగ్గరవున్న మరో ఇంటికి మారారు. రెండు సంవత్సరాల తర్వాత ఆయనకు కనిజమహల్‌లో నివాసం ఇవ్వబడింది. కొంతమంది దానిని కలశమహల్ అని కూడా అంటారు. పొడవాటి సిమెంట్ కలశాలు వరుసగా వీధివరండాలో ఉండటమే అందుకు కారణం. ఈ భవనం ఇంతకు ముందు దివాన్ మహల్‌గా పిలువబడేది. – వెంకటగిరి సంస్థాన దివాన్ అధికార నివాసం కావడం వల్ల, శ్రీవేణుగోపాల్‌గారి కాలానికి దివాన్ కార్యాలయం మాఫీ చేయబడింది. శ్రీవేణుగోపాల్‌గారు సంస్థానంలోని అత్యున్నత అధికారి కావడం వల్ల. ఆయనకు ఈ భవనంలో నివాసం ఇవ్వబడింది. అది విశాలమైన భవనం; ఎన్నో పెద్ద గదులు; మధ్య కప్పులేని వరండా; పైన డాబా; వేసవిలో కుటుంబమంతా డాబాపైనే పడుకునే వారు. శ్రీవేణుగోపాల్ గారి పిల్లలు నక్షత్రాలలో వెలిగే ఆకాశం క్రింద పడుకునేందుకు ఇష్టపడేవారు. శ్రీవేణుగోపాల్‌గారు పిల్లలకు నక్షత్రసముదాయాన్ని, సప్తఋషి మండలాన్ని పోల్‌స్టార్ (ధృవనక్షత్రం అని ప్రతీతి), శుక్ర అంగారక ఇంకా ఇతర గ్రహాల్ని చూపేవారు. అమావాస్య రోజులలో వేలాది మెరిసే నక్షత్రాలు, వెలుగొందే గ్రహాలు నల్లని గగన తలాన్ని ప్రభావితం చేస్తూ అందంగా కనబడేవి. ఇక పౌర్ణమిరోజు మరోరకం అనుభవం – పసుపు పచ్చటి బంతి, మెల్లగా గగనంపైకి తేలిరావడం, చల్లని మెత్తని వెన్నెల తెర డాబామీద పడుకున్న పిల్లల్ని కప్పివేయడం.

ఇంటివెనుక పెరడు చాలా పెద్దది. అందులో తోట. తోటలో గులాబిరంగు కస్తూరి పూల, పరిమళభరిత పారిజాత చెట్లు. ప్రతి పొద్దున ధారాళంగా పుష్పించేవి. అనేక పండ్ల చెట్లుకూడా ఉండేవి. జామ, బత్తాయి, కిచ్చిలి, సీతాఫలం, దానిమ్మ, మామిడి మొదలైనవి. టాయిలెట్లు ప్రధాన భవనం నుండి తొలగింపబడి, పెరట్లో చివర నిర్మింపబడ్డాయి. ప్రధాన భవనంలో చివర స్నానాలగదులు ఉన్నాయి. భవనం వెనుకభాగంలో పది అడుగుల వెడల్పు, యాభై అడుగుల పొడవు వరండా, పైకప్పుతో ఉన్నది. ప్రధానద్వారం కుడివైపు గది, శ్రీవేణుగోపాల్‌గారు కార్యాలయం గదిగా మార్చుకున్నారు. ఆయనకు అధికార ఉత్తరప్రత్యుత్తరాలు తయారుచేసేందుకు టైపిస్టు గుమాస్తా ఉండేవాడు.

వీళ్ళ ఇంటికి ఎదురుగా తహసీల్దారు కార్యాలయం ఉండేది. *(మా పద్మనాభన్న (రెండవ అన్న) ఆ ఆఫీసులో కొంత కాలం రెవిన్యూ ఆఫీసర్‌గా పనిచేశారు. ఆ తర్వాత తహసీల్దార్ అయ్యి, చివరకు డిప్యూటీ కలెక్టరు అయ్యారు.)* ఆ కార్యాలయం పక్క సందులో కెళితే బాలికల ఉన్నత

పాఠశాల. అందులో శ్రీవేణుగోపాల్‌గారి ఏకైక కుమార్తె పరిమళ చదువుతూ ఉండేది. రమణ మూడు సంవత్సరాల పసివాడిగా ఉన్నప్పుడు, అక్కతో పాటు బడికి వెళ్ళి, తరగతి గదిలో ఆమె ప్రక్కన కూర్చుంటుండేవాడు. ఆ పాఠశాల దాటాక, బాట కొద్దిగా సన్నమై, కొద్దిగా కిందకు దిగుతూ, ఎడమవైపు కొద్దిగా మలుపు తిరిగి, కైవల్యానది ఒడ్డుకు దారితీసేది. ఇక్కడి నుండి దక్షిణం వైపు యాభై గజాల తర్వాత నది, ఒక రోడ్డు వంతెన కిందగా వెళుతుంది. ఈ బ్రిడ్జ్ కట్టించినవారు రాజా శ్రీ రాజాగోపాలకృష్ణ బహదూర్‌వారు. మనుషుల, బండ్ల ప్రయాణాలకు అనుకూలంగా కట్టించారు. ఈ బ్రిడ్జ్. నది ఒడ్డున చాకలివారు బట్టలు ఉతికేవారు; బెస్తవారు వలలు విసురుతూండే వాళ్ళు. ఏటినీరు శుభ్రంగా, స్వచ్ఛంగా ఉండేది. వర్షా కాలంలో ఏరు నిండునదిగా, ఉధృతంగా ప్రవహించేది.

శ్రీవేణుగోపాల్‌గారి పెద్దకుమారుడు హనుమంతరావు ఆర్.వి.యమ్ హైస్కూల్‌లో స్కూల్ ఫైనల్ వరకు చదివాడు. ఆర్.వి.యమ్ హైస్కూల్‌ను విపులీకరిస్తే – రాజా వెలుగోటి ముద్దుకృష్ణయాచేంద్ర బహదూర్ హైస్కూల్. హను మంచి విద్యార్థి. తరగతిలో ఎప్పుడూ ప్రథమశ్రేణిలో ఒకడుగా ఉంటూ వచ్చేవాడు. తన సహవిద్యార్థి ఎస్. పాండురంగా రావుతో ఆరోగ్యకరమైన పోటీ ఉండేది. పాండురంగారావు తదనంతరం ప్రభుత్వ ఉద్యోగంలో చేరి, హైదరాబాద్ ఇంటర్మీడియట్ బోర్డులో జాయింట్ సెక్రటరీగా పదవీవిరమణ చేశాడు. బాల్యమిత్రులు ఇప్పటికీ ఒకళ్ళతో ఒకళ్ళు సంబంధాలు కొనసాగిస్తూనే ఉన్నారు. *(మా శ్రీనాథ్ అన్న (నాల్గవ అన్న) ఆ స్నేహబృందంలో ఒకరు. శ్రీనాథ్ అన్న గోఖలే, మోహన్‌రాజా, ఎమ్.హెచ్. రావ్‌గారు (ఈ కథలోని 'హను'), స్వామినాయుడు, మొదలైన వాళ్ళు. ఇప్పటికీ కలుస్తూ స్నేహబంధాన్ని కొనసాగిస్తున్నారు.)*

ఆ రోజుల్లో విద్యుచ్ఛక్తి వెంకటగిరికి ఇంకా రాలేదు. నగరి భవనం జనరేటర్ల ద్వారా వెలిగించబడేది. శ్రీవేణుగోపాల్‌గారి ఇంట్లో గ్యాస్ లైట్లు అనబడే పెట్రోమాక్స్ లాంతర్లు, కొన్ని హరికేన్ లాంతర్లు ఉండేవి. శ్రీవేణుగోపాల్‌గారు తొమ్మిది అంగుళాల ఎత్తుగల బ్యాటరీతో పనిచేసే, తేలికగా తీసుకుపోగల, ట్యూబ్ లైట్ కొన్నారు. పెట్రోమాక్స్ లైట్ అడుగున వున్న చిన్న హాండిల్, వేగంగా పైకీ కిందకు ఊపడం ద్వారా, పెట్రోమాక్స్ లైట్‌లో వ్రేలాడే సన్నని ఫిలమెంట్ వెంటనే ప్రకాశవంతంగా ఎలక్ట్రిక్ బల్బులాగా వెలిగేది. ప్రతిరోజు సాయంత్రం సూర్యాస్తమయం తర్వాత లైట్లు వెలిగించబడేవి. శ్రీవేణుగోపాల్‌గారి ఇంట్లో రెండు మూడు పెట్రోమాక్స్ లైట్లు ఉండేవి.

సాయంత్రం ట్యూషన్ తరగతులకు *(వెంకటగిరిలో మగపిల్లలకు ఠాగూర్‌సింగ్ ట్యూషన్, ఆడపిల్లలకు విమలమ్మ ట్యూషన్ ప్రసిద్ధి)* వెళ్లే పిల్లలు చీకటి పడ్డాక తిరిగివచ్చేప్పుడు, ఒక చేతిలో హరికేన్ లాంతరు, ఇంకోచేతిలో పలకాపుస్తకాలు పట్టుకునేవాళ్ళు. ఇప్పటి శ్రీవేణుగోపాల్‌గారి మనుమలు, మనుమరాళ్లు, ఈ విషయం చదివి, వాళ్ళ తండ్రులు మామలు చిన్నప్పుడు హరికేన్ లాంతర్లు, పలకాపుస్తకాలు పట్టుకొని సాయంత్రం ట్యూషన్ క్లాసులకు వెళ్ళే దృశ్యాలను ఆసక్తికరంగా ఊహించుకోవచ్చు. పలకలు వెంకటగిరి కర్మాగారంలో తయారుకాబడేవి. ప్రతివీధి చివరి మలుపులో పొడవైన దీపస్తంభం ఉండేది. దానిపైన కిరోసిన్ దీపం, పెద్దఒత్తి ఉండేది. ప్రతిరోజు సాయంత్రం, సూర్యాస్తమయానికి ముందు దీపాలు వెలిగించే వ్యక్తి, ఒక నిచ్చెన ఒక కిరోసిన్ డబ్బా పట్టుకొని వచ్చి, నిచ్చెన ద్వారా పైకెక్కి వీధి దీపాలు వెలిగించేవాడు. దీపాలు రాత్రంతా వెలిగేవి. అటువంటి వీధి దీపాలు అన్ని వీధి మలుపులలో, కూడళ్ళల్లో ఉండేవి. రాత్రికాపలాదారుడు (వాచ్‌మ్యాన్) రాత్రి పహారా కాసేవాడు. ఊరంతా తిరుగుతూ తన చేతికఱ్ఱతో శబ్దం చేస్తూ, తన ఉనికి చాటుతూండేవాడు.

**సమయం ప్రకటన :**

ఆ రోజుల్లో చేతిగడియారాలు కొద్దిమందికే ఉండేవి. మెకానికల్‌గా తిరిగే గోడ గడియారాలు చాలా ఇళ్ళల్లో ఉండేవి కావు. నగార – నౌబతు ప్రకటించే సమయాన్ని బట్టి నగర ప్రజలు నడుచుకునేవాళ్ళు. నగరి భవనానికి ముందు, భవంతి మొదటి అంతస్తులో వాయిద్యగాళ్లు కూర్చొని, డ్రమ్ములు మ్రోగిస్తూ, షహనాయి వాయిస్తూ, నగారా మోగిస్తూ సమయసూచన చేసేవారు. నాలుగు ఝాములు ఉండేవి. మొదటి ఝాము ఉదయం 9.30 గంటలకి, రెండవ ఝాము మధ్యాహ్నం 12 గంటలకి, మూడవ ఝాము మధ్యాహ్నం 2.30 గంటలకి, నాల్గవ ఝాము సాయంత్రం 5.00 గంటలకి. ఊరి ప్రజలు తమ దినచర్యలు – భోజనం, సాయంత్రం టీ మొదలైనవి

ఝాములు విని, చేసేవారు. ఝాములు వింటూ జనాలు "అరె, రెండవ ఝాము మ్రోగుతోంది. భోజనానికి వెళ్ళాలి" అనో, ''నాల్గవ ఝాము మ్రోగుతోంది, టీ సమయం అయింది" అనో అనడం ఆసక్తికరంగా ఉండేది.

**పశువుల మంద :**

ఇప్పుడు చెప్పబోయే విషయం వెనుకటి కాలం నుండి అనాదిగా జరుగుతూన్నది. అనాదిగా అంటే – వేలసంవత్సరాల ముందు నుండి; రామాయణ, భారత ఇతిహాసాల కాలాల ముందు నుండి. భారత, భాగవతాలలో శ్రీకృష్ణుని గోపబాలకునిగా, గోకుల నాయకుని కొడుకుగా వర్ణించారు. ఆయన అనేక నామాలలో గోపాలుని నామం కూడా ఒకటి. అతను, అతని సహచర గోపబాలకులు, పెద్ద గోవుల మందను తోలుకొని ద్వారక ఊరి బయట, గోవులను మేపేందుకు తీసుకువెళ్ళేవారు.

గోవులు నింపాదిగా మేత మేస్తుండగా, కృష్ణుడు వేణువును ఊదేవాడు. గోపబాలకులు, ఆడుతూ నాట్యాలు చేస్తూండేవాళ్ళు. అదే విధంగా, వెంకటగిరిలో ప్రతిరోజూ ప్రొద్దున, యజమానులు గోవుల నుండి పాలు పితికాక, వాటిల్ని ఊరిబయటకు మందలుగా, పంపేవాళ్ళు. ఆ మంద పోనుపోను ఎక్కువ అవుతూ ఉండేది. మొదటి ఝాము మోగాక ఈ ప్రస్థానం సాగేది. చాలా వరకు ఆవులు, బఱ్ఱెలు ఎవ్వరి ప్రమేయం లేకుండానే, తమ శాలలు వదిలి ప్రధాన మందను కలిసేవి. శ్రీవేణుగోపాల్‌గారి ఇల్లు కైవల్యా నది నుండి వంద గజాల దూరం మాత్రమే ఉన్నందున, గోవుల మంద ఇంటి ప్రాంతానికి చేరేప్పటికి పూర్తిమందగా తయారై వుండేది. మూడు నాలుగు వందల పశువులు, తమ వెయ్యికి పైగా కాలిగిట్టలతో పద్ధతి ప్రకారం నడుస్తూ, బాటమీద దుమ్మురేపుతూండేవి. 'ము' 'మూ' అనే పశువుల ధ్వనులు 'హేహే', 'డ్ర్‌ర్' అనే కాపర్ల అదిలింపులు, కాపరులు తమ కర్రలతో పశువులను దారిలో పెడుతూండేవారు. పశువుల మంద శ్రీవేణుగోపాల్‌గారి ఇంటు ముందు నుండి వెళ్ళి, బాలికల ఉన్నత పాఠశాల సందులోకి తిరిగి, నదిబాట పట్టేవి. గోమంద వెళ్ళాక దుమ్ము తగ్గడానికి కొన్ని నిముషాలు పట్టేది. నదిలో కడుపారా త్రాగాక, మళ్ళీ కదిలేవి. నది దాటి, విశాలమైన పచ్చికమేత దొరికే మైదానం వరకు వెళ్ళేవి. అక్కడ కాపరులు, పశువులను కడుపు నిండేదాక పచ్చిక మేసేందుకు వదిలేవారు. పశువుల కాపరులు తమతోపాటు మధ్యాహ్న భోజనానికి సద్దిఅన్నం, ఉల్లి, రాగిసంకటి తెచ్చుకొనేవారు. పశువులను మేతకు వదిలాక, ఆటలు మొదలెట్టేవాళ్ళు. మధ్యాహ్నమయ్యాక, అన్నంతిని చెట్టునీడన కునుకుతీసే వాళ్ళు. లేకుంటే, పెద్ద చెట్ల కొమ్మలెక్కి కూర్చునేవాళ్ళు. కొంతమంది పిల్లనగ్రోవి ఊదేవాళ్ళు, మిగతావాళ్ళు పాటలతో, కేరింతలతో గడిపేవాళ్ళు. నాల్గవ ఝాము నగారా మ్రోగేది. గాలివాటం ద్వారా వాళ్ళకు వినవచ్చేది. పశువుల మందను దగ్గరికి చేర్చి తిరుగు ప్రయాణానికి సిద్ధపడేవాళ్ళు. తిరుగు ప్రయాణంలో పశువుల మంద కనిజమహల్ దాటే సమయానికి, సూర్యుడు నారింజ పండు రంగులో, ఊరికి పడమట ఉన్న నల్లమలై కొండల వెనుకకు జారుతుండేవాడు. వేలాది పశువుల గిట్టల తాకిడికి లేచిన దుమ్ము మెల్లగా విడిపోతూండగా, చీకట్లు కమ్ముకునేవి; లాంతరు దీపాలు వెలిగించే వ్యక్తి కిరోసిన్, నిచ్చెన పట్టుకొని వచ్చేవాడు. ఇక్కడ మరో ప్రకృతి విచిత్రం జరిగేది. పెద్ద పశువుల మంద కదులుతూండగా, ఒక్కో ఆవు, ఒక్కో బఱ్ఱె, సహజ జ్ఞానంతో ప్రధానమందను వదిలి, తమ తమ సందులలోకి మరలి, తమ ఇళ్ళకు, పశువుల శాలలకు చేరేవి. పశువుల కాపరి ఎవరూ వాటిని మళ్ళించనవసరం లేదు. తమ ఇంటి పశుశాలలకు దారి, తమ మనసులలో చిత్రించి పెట్టి ఉన్నట్లు, అవి సరైన దిశలో వెళ్ళిపోయేవి. చివరకు ఒక్క పశువుగాని, ఒక్క బఱ్ఱెగాని తప్పిపోదు; వెనుకబడదు.

ఇంద్రమహల్, రాజమహల్ భవనాలు, పచ్చని భూమి నుండి ఎత్తుగా, ఎంతో దూరం నుండే కనిపిస్తూంటాయి. రైల్వేస్టేషన్ నుండి చూస్తే, ఈ రాజభవనాలు, వెనుక ఘనంగా, గంభీరంగా, రాజసంగా నిలిచివున్న నల్లమలై కొండలు కమనీయ దృశ్యాలు; సహజ ప్రకృతి అందాలు. ఈ కొండలలో ప్రాచీన బలీయమైన 'దుర్గం' అనబడే కోట ఉండేది. ఈ దుర్గంకు వెళ్ళేదారిలో 'కోన' అనబడే జలపాతం ఉంది *(కోనమల్లేశ్వర కోన అనేవారు).* దుర్గంకు, కోనకు వెళ్ళేమార్గం అరణ్యంగుండా వుంది. ఆ అరణ్యంలో నల్ల ఎలుగులు, నక్కలు, తోడేళ్ళు, చిరుతలు ఇంకా కుందేళ్ళు, అడవి ఉడతలు సంచరించేవి. అనేక రకాల రంగురంగుల పక్షులు ఈ అడవిలో గూళ్ళు కుట్టుకుని వుండేవి. విడిగాకాక, గుంపుగా, మనుషులు కోనలో స్నానం చేసేందుకు అడవి

గుండా వెళ్ళేవాళ్ళు. ఒంటరిగా వెళితే క్రూరజంతువులు అటకాయించే ప్రమాదం ఉంది. *(శ్రీవేణుగోపాల్‌గారి రెండవ అబ్బాయి రమణ, వెంకటగిరిలో బాల్యం గురించి 'లిటిల్ ఫోక్స్' అనే పుస్తకం రాశారు. ఆ పుస్తకానికి ముందుమాట రాస్తూ ఎమ్. హెచ్. రావ్ గారు, తమ చిన్నప్పటి కోన విహారయాత్ర (సాహసయాత్ర అనొచ్చు) గురించి ప్రస్తావించి, అక్కడ ఎలుగుబంటిని ఎదుర్కోవడం, కోనలో తమ మిత్ర బృందం దారి తప్పిపోతే, వాళ్ళ నాన్నగారు (శ్రీవేణుగోపాల్‌గారు) 'సెర్చింగ్ టీం' ను పంపడం, వగైరాలు ఆసక్తికరంగా రాశారు).* అయినా పేదజనాలు అడవిలోకి వెళ్ళి, కట్టెలు కొట్టి, ఊళ్ళో అమ్మి జీవనం సాగించేవాళ్ళు. తలనిండా – బరువు కట్టెలు ఎనిమిది అణాలకు అమ్మే వాళ్ళు. వాళ్ళను యానాదులు అనేవాళ్ళు. వొంటిమీద గోచి తప్ప ఇంకో దుస్తులు ఉండేవి కావు. రోజంతా అడవిలో కట్టెలు కొట్టి చీకటి పడేవేళకు, కట్టెలు మోపుగా కట్టి, ఆ బరువును మోస్తూ ఊరివీధుల్లో 'మోప్, కట్టెమోప్' అని అరుస్తూ, బరువుకు మెల్లగా నడుస్తూ ఉండేవాళ్ళు. ఇళ్ళల్లోని ఆడవాళ్ళు బయటకు వచ్చి, వారిని కేకవేసి పిలిచేవాళ్ళు. వాళ్ళు ఆ ఇంటిముందు ఆగి, మెల్లగా కట్టెలమోపు దించి, నిలువుగా, ఒకవైపు తల ఆధారంగా, ఇంకోవైపు నేలమీద ఆన్చి, ఉంచేవాళ్ళు. అవసరమైతే తనే ఒంటిగా తలకెత్తుకునేందుకు ఆ భంగిమ. ఆడవాళ్ళు కొంత తక్కువ ధరకు అడిగేవాళ్ళు. అది నచ్చకపోతే, మోపు మెల్లగా తలకెత్తుకొని, ముందుకు సాగేవాళ్ళు. మాటలుండేవి కావు. ధర నచ్చితే, గబుక్కున మోపు కింద పడవేసేవాళ్ళు. ఆ కిందపడిన మోపు, మళ్ళీ పైకెత్తుకోవాలంటే ఒక మనిషివల్ల అయ్యేపనికాదు. యానాది మోపు కిందపడవేస్తూనే, ఆడవాళ్ళు గతుక్కుమనేవాళ్ళు – 'అయ్యో! ఇంకొంచెం తక్కువ ధరకి అడగకపోతినే' అని. గొడ్డలితో కట్టెలు చీల్చి, చిన్న ముక్కలుగా చేసి, ఇంట్లో పెట్టేవాళ్ళు. వాళ్ళిచ్చిన ఎనిమిది అణాలు తీసుకొని, చీకటి పడినవేళ, ఊరి చివరి *(ఊరిబయట అనవచ్చు)* తమ గుడిసెలకు వెళ్ళేవాళ్ళు. దారిలో చిన్న అంగడిలో, ఆ డబ్బుతో *(ఎనిమిది అణాలు – అంటే అర్ధరూపాయి)* ఆ పూటకు కావాల్సిన బియ్యం, ఇతర వంటసామాగ్రి, ఇతర సరంజామా, సారసీసా, కొనేవాళ్ళు. *(డబ్బులు ఆదాచేయడం అంటే లేదు. రేపటి గురించి చింతే లేదు. గుడిసెలకు వెళ్ళి, అప్పుడు వంట ప్రయత్నం మొదలు పెట్టేవాళ్ళు. కడుపునిండా తిన్నాక, గానాబజానా – సల్లని రాజా ఓ సందమామా – డుబ్బుస్కు డుబ్బుస్కు డుబ్బుస్కు – ఆ...)* ఆడవాళ్ళు అడవిలో పుష్కలంగా దొరికే చిన్న చిన్న పండ్లు కలేపండ్లు, బిక్కిని పండ్లు, నేరేడు, రేగి వగైరాలు గంపకు నింపుకొని, ఊరిలో అమ్మేవాళ్ళు. డబ్బుకు గాని, బియ్యానికి గాని అమ్మేవాళ్ళు. పురాతన వస్తుమార్పిడి పద్ధతి ఇంకా ఈ బిదాబిక్కీలో ఉండేది.

వెంకటగిరి టౌన్ రోడ్డు మార్గానికి, రైలు మార్గానికి అందుబాటులో ఉండేది. రైల్వేస్టేషన్ ఊరి నుండి రెండు మైళ్ళ దూరంలో ఉండేది. ప్యాసింజర్ బండ్లు, గూడ్స్ బండ్లు ఈ వెంకటగిరి స్టేషన్లో ఆగేవి. ట్రయిన్ దిగిన జనాలు ఊరికి వెళ్ళేందుకు రెండు సాధనాలు ఉండేవి. గుఱ్ఱపు జట్కా లేదా ఎద్దుబండి. రైల్వేస్టేషన్ నుండి ఊళ్ళోకి రెండు మార్గాలు ఉండేవి. కంకర రోడ్డు – పైన ఎర్రమట్టి కప్పబడినది – ఒకమార్గం. ఆ మార్గంలో రాజాగారి కార్లు, గుఱ్ఱపు జట్కాలు, ప్రయాణీకులను రైల్వేస్టేషన్ నుండి ఊరికి, ఊరి నుండి రైల్వేస్టేషన్‌కు తీసుకువెళ్ళేవి *(గోపాల్ జట్కా మాకు బాగా పరిచయం)* ఇంకో దారి కరుకైన మోటు అడవి దారి. దట్టమైన చెట్ల మధ్య, ఎద్దుబండి ప్రయాణం. ఈ రెండవ దారి ప్రయాణం కొంచెం ఎక్కువ సమయం తీసుకుంటుంది. జట్కాలన్నీ వెళ్ళిపోతే, ఎద్దులబండి మాట్లాడుకుంటారు. కానీ, ఈ ఎద్దుబండి ప్రయాణం ఎంతో ఆసక్తికరం. సరదాగా ఉండేది. అడవిలో ప్రయాణిస్తూన్న అనుభూతి కలుగజేస్తుంది. దట్టమైన పొదలు చెట్లూ, విరగబూసిన పసుపు పచ్చని తంగేడుపూలు, చెట్ల శాఖల నుండి వ్రేలాడే గిజిగాని గూళ్ళు, నీలిరెక్కల పాలపిట్టలు ఒక చెట్టు నుండి ఇంకో చెట్టుకి ఎగురుతూండటం – లాంటి అపురూప దృశ్యాలు వీక్షించవచ్చు. బండి చెక్క చక్రాలు సన్నటి గులకమీద, రాళ్ళమీద వెళుతూన్నప్పుడు కుదుపులు, అదురులు. ఈ ప్రయాణం గురించి చదువుతూన్న శ్రీవేణుగోపాల్‌గారి మనుమలు, మనుమరాళ్ళు ఒకసారైనా ఇటువంటి ప్రయాణం చేస్తే బాగుంటుందని ఆపేక్షిస్తారు.

రాజాగారు కుటుంబంతో వేసవిలో బెంగుళూరు, మద్రాసు వెళ్ళినప్పుడు వాళ్ళందరూ రైల్వేస్టేషన్‌వరకు నగరి నుండి కార్లలో వచ్చేవాళ్ళు. రాణిగారు, ఇతర రాణీవాస స్త్రీలు కారు దగ్గర నుండి పరదాలమాటున రేల్వేస్టేషన్‌కు వెళ్ళేవారు. ట్రయిన్ వచ్చేవరకు, వాళ్ళు కార్లలో

పరదాలమాటునే కూర్చునేవారు. *(దీన్ని ఘోషా పద్ధతి అంటారు. సినిమాకు వెళ్ళినప్పుడు కూడా ఒక షో మొత్తం బుక్ చేసుకొని, హాల్‌లో పరదాలు కట్టేవాళ్ళు. మా నాన్నగారు రాజాగారి గదిలో ఆయనతో మాట్లాడుతూన్నప్పుడు రాణీగారు వచ్చేవారు. మా నాన్నగారిపట్ల మాత్రం ఆమెకు ఘోషా పట్టింపు ఉండేది కాదు. మా నాన్నగారిని పలుకరించేవారు. ఈయన మాత్రం వంచిన తల ఎత్తకుండా బదులిచ్చేవారు)* రాజాగారికి, కుటుంబ సభ్యులకు ఒక ఎయిర్‌కండీషన్డ్ కోచ్ పూర్తిగా రిజర్వ్ చేయబడేది. శ్రీవేణుగోపాల్‌గారికి మొదటి తరగతిలో ప్రయాణిం చేందుకు అనుమతిచ్చేవారు. మిగతా సేవకులు మూడోతరగతిలో ప్రయాణించేవాళ్ళు. బెంగుళూరులో 'రాజగోపాలవిలాస్' అనే రాజాగారి సొంతబంగళా ఉండేది. మద్రాసులో 'ఆస్‌బార్న్ హౌస్' అనబడే పెద్ద బంగళా కొన్నారు. *(ఆస్‌బార్న్ హౌస్, 16-వైట్స్ రోడ్, మద్రాస్-14 అనే అడ్రస్, మా అమ్మ నాన్నకు రాసే ఉత్తరాలమీద నేను చాలాసార్లు వ్రాసేవాణ్ణి.)* కాంపౌండ్‌లో ఎన్నో హెక్టార్ల స్థలం ఉండేది. *(ఆ స్థలంలో ఒకవైపు సత్యం - శివం - సుందరం అనే అతి పెద్ద సినిమా థియేటర్ కాంప్లెక్స్ కట్టారు. ఆ కాంప్లెక్స్ మద్రాసు సిటీలోనే అతి పెద్దది.)* అవి రెండు పెద్ద ఆస్తిగా పరిగణింపతగ్గవి. ఇప్పటి రియల్ ఎస్టేట్ ఖరీదులో కొన్ని కోట్ల రూపాయల విలువ చేస్తాయి. రెండు ఆస్తులు ఒక పది సంవత్సరాల క్రితం అమ్మివేయబడ్డాయి.

**తిరుమలసెట్టి సుధాకర్,**
**సేకరణ : కాళిదాసు పురుషోత్తం**

---




## ఏరియల్ చదివి ...

*నావ మీద సాగే నదీ ప్రయాణం –*
*వచన కావ్యంలో వాక్యంతో సాగినట్టుంటుంది.*
*అదే, నావ మీద సముద్రంలో ప్రయాణిస్తే*
*వ్యాకరణంతో సహవాసం చేసినట్లుంటుంది.*
*ఇలాంటి ఒక అనుభవస్థితిని దృశ్యమానం చేశారు. రచయిత ఈ గ్రంథంలో...*
*కవనభువనమంతా సౌందర్యం మాత్రమే దర్శించే ఒక సౌందర్యారాధకుని జీవితానికి అద్దం పట్టినట్లుందీ పుస్తకం. మరువం, దవనం కలిపి కదంబం కడితే, నయనం పత్ర భేదాన్ని గమనిస్తుందే తప్ప, నాసికకు గంధ భేదం అంది రాదు. ఇక్కడా, అంతే. ఆంగ్లంలోని ఆంతర్యం, తెలుగు సౌందర్యంతో సహచరిస్తోంది. ఈ వాగ్విలాసిని నడక ఒక మణిప్రవాళం. సాగరతీరాలకు ఆవల, ఊహల కందని అలనాటి జీవన శైలి పునః సృజన మీద అశ్వినీకుమార్ బలంగా ప్రకటించిన తెలుగు సంతకమిది.*

– డాక్టరు వోలేటి పార్వతీశం

**తెలుగులో తొలిసారి పెర్సీ బీష్ షెల్లీ జీవిత కథ !**
**మీ ప్రతి కోసం 'మిసిమి'ని సంప్రదించండి !**

# చదవండి...

- ఎన్నార్కె




✦ **రామాయణ దర్శనం :** భారతీయ తాత్త్వికతకు అద్దంపట్టిన రామాయణం పై కొందరు ప్రముఖులు వ్రాసిన 17 వ్యాసాల సంపుటి. దీని సంపాదకులు డాక్టరు టి. శ్రీరంగస్వామి. రామాయణం పట్ల గౌరవాభిమానాలు గల వారందరూ చదవదగ్గ రచనలు.

*పేజీలు : 152, వెల : ₹ 180/–, ప్రతులకు – విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.*




✦ **సుందరీ సందేశం :** రచయిత డాక్టర్ కపిలవాయి లింగమూర్తి. మన కవులు స్త్రీ సౌందర్యాన్ని వర్ణించినా ఆ సౌందర్యం లోకానికేం సందేశం ఇస్తుందో చెప్పలేదు. ఈ నిర్మకుట శతకంలో రచయిత ఆ పని చేశారు. శ్లేషలకన్నా, చమత్కారాల కన్నా సందేశమే కావ్యం యొక్క ప్రయోజనంగా రచన సాగింది.

*పేజీలు : 64, వెల : ₹ 50/–, ప్రతులకు – విశాలాంధ్ర బుక్‌హౌస్.*



✦ **ఆకాశయానం :** ఆంగ్ల, హిందీ, ఉర్దూ, బెంగాల్ భాషలలో కవితానువాదాలు చేసిన రచయిత ముకుంద రామారావు వ్రాసిన 42 స్వతంత్ర కవితలు. రచనలోని గాఢత మనల్ని అబ్బుర పరుస్తాయి. శివరాజు సుబ్బలక్ష్మిగారు చిత్రించిన ముఖచిత్రం, దానిని తీర్చిదిద్దిన రమణజీవి అభినందనీయులు.

*పేజీలు : 65, వెల : ₹ 60/–, ప్రతులకు – విశాలాంధ్ర, నవోదయ, పాలపిట్ట పుస్తకషాపులు.*




✦ **తూర్పు - పడమర :** అనుభవాలు– అనుభూతులు 8 మంది రచయితల (మంగళాకందూర్; ప్రమీలారాణి; నవీన్‌చంద్ర; కొమరవోలు సరోజ; వాణి మోహన్; సుధాకరరావు; మధుబాల కరవది; భాషి). కథాసంకలనం. వైవిధ్యంతో కూడిన కథలతో పాటు రెండు మంచి గేయాలు కూడా ఉన్నాయి. ప్రచురణ కర్తల పేరు సూచించబడలేదు.

*పేజీలు : 286, వెల : ₹ 200/–, ప్రతులకు – ముందుమాట వ్రాసిన వీరాజిగారి ఫోను నెంబరు : 9440571150.*



✦ **కాలాన్ని వెనకేసిన మనిషి :** బహువిధాలయిన రచనలలో అందెవేసిన కలం శ్రీ దేవరాజు మహారాజు. కాలాన్ని, ప్రకృతిని, తనకనుకూలంగా మార్చుకొన్న మానవుని సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఔన్నత్యాన్ని ప్రశంసిస్తూ చమత్కారంగా సాగిన వైజ్ఞానిక సృజన.

*పేజీలు : 92, వెల : ₹ 80/–, ప్రతులకు – విశాలాంధ్ర , నవోదయ, ప్రజాశక్తులలో...*




✦ **శ్రీకృష్ణదేవరాయల కథలు :** ఆ నాటి భువనవిజయంలో, రాయల ఆస్థానంలో ఉన్న అనేక మంది ప్రముఖులకు సంబంధించిన హాస్య, వ్యంగ్య, ఆలోచన, తెలివి చమత్కారం మొదలైన రసానుభూతులను కలిగిస్తూ పిల్లలను ఆలోచింపచేసే రచన. క్రౌన్ సైజులో నున్న ఈ పుస్తక రచయిత డాక్టర్. వి. ఆర్. రాసాని.

*పేజీలు : 130, వెల : ₹ 140/–, ప్రతులకు – విశాలాంధ్ర*

✦ **హరవిలాసం :** తెలుగు కావ్య సాహిత్యంలో శ్రీనాథునిది ప్రత్యేక స్థానం. అతను రాసిన హరవిలాసం అనే కావ్యాన్ని హైమావతీ వ్యాఖ్య సహితంగా యార్లగడ్డ బాలగంగాధర రావుగారు సర్వవిషయ నిఘంటువుగా రూపొందించారు. ఇందులోని ప్రతి పద్యానికీ అర్థము, భావము, అలంకారంతో పాటుగా విశేషాలను కూడా ప్రత్యేకించి పేర్కొన్నారు. ఈ కావ్యంలో ఉపయుక్తమయిన లోకోక్తులు, సామెతలు, జాతీయాలు అనుబంధాలలో పేర్కొన్నారు. ప్రముఖ విక్రయశాలలో లభించే ఈ పుస్తకపు వెల : 600/-, పేజీలు : 660.




✦ **జ్ఞాపక దీపిక :** బ్రహ్మసమాజ వ్యాప్తికి, సమాజాభ్యున్నతికి కృషి చేసిన బ్రహర్షి కంభంపాటి రామశాస్త్రి (తారకం) గారిపై వారి సతీమణి రాజ్యలక్ష్మి, మనుమడు శ్రీ కంభంపాటి అరుణకుమార్‌గారు వారి జీవిత విశేషాలను ఇందులో పొందుపరిచారు. కాలగతిలో కనుమరుగవుతున్న ఎందరో మహానుభావులపై అప్పుడప్పుడూ ఇటువంటి పుస్తకాలు రావటం అభినందనీయం.

*పేజీలు : 208, వెల : ₹ 100/-, ప్రతులకు – ఎమెస్కో బుక్స్.*




✦ **జీవితం :** ఆంధ్రభూమి, నది, నవ్య, విశాలాంధ్ర లాంటి అనేక పత్రికలలో ప్రచురితమైన చలపాక ప్రకాష్ వ్రాసిన 16 కథల సంపుటి. ఈ పుస్తకానికి కళాసాగర్ వేసిన ముఖచిత్రం రమ్యంగా ఉంది.

*పేజీలు : 112, వెల : ₹ 80/-, ప్రతులకు – విశాలాంధ్ర బుక్‌హౌస్.*




✦ **సి.యస్.రావు బహుమతి నవలలు :** ఆంధ్రజ్యోతి నవలా ప్రియదర్శిని పోటీలో ఉత్తమ నవలగా బహుమతి గాంచిన రాతిపువ్వుతో పాటు అమ్మ కావాలి అనే మరో నవలను కలిపి ప్రచురించిన పుస్తకం. రెండవ నవల కళాసాగర్ పురస్కారం పొందింది. నాటక రచయితగా లబ్ద ప్రతిష్టులైన సి.యస్.రావు కథా రచయితగా, వ్యాస రచయితగా, నవలా రచయితగా కూడా తన ప్రతిభను చాటాడు. కొత్త తరహా ఆలోచనలకు కేరాఫ్ అడ్రస్ సి.యస్.రావు.

*పేజీలు : 125, వెల : పేర్కొనబడలేదు. ప్రతులకు – విశాలాంధ్ర, నవోదయలలో.*




✦ **సూక్తి సుధా కలశం :** సంస్కృతాంధ్ర కావ్యాలలో కనిపించే హితవులు, సూక్తులను, ఒక్క చోట చేర్చి ఎంతో రమ్యంగా రచన సాగించారు శ్రీ యెల్లాప్రెగడ ప్రభాకరరావు, పంగులూరి హనుమంతరావుగారు. వ్యక్తిత్వ వికాసానికి ఇంగ్లీషు పుస్తకాలే అవసరం లేదు. మన ప్రాచీన సాహిత్యంలో ఇది కావలసినంత ఉందని చాటి చెబుతుంది ఈ పుస్తకం.

*పేజీలు : 200, వెల : ₹ 200/-, ప్రతులకు – శ్రీ కౌండిన్య పబ్లికేషన్స్, శాలివాహన నగర్, దిల్‌సుఖ్ నగర్ – 500 036.*



✦ **మానవజీవనం - మహాప్రస్థానం :** నవజీవనాన్ని ఆశిస్తూ డాక్టరు అట్లా వెంకటరామిరెడ్డి రాసిన సమగ్ర నీతి కావ్యమిది.

*పేజీలు : 134, వెల : ₹ 60/-, ప్రతులకు – విశాలాంధ్ర, నవోదయలలో.*



**మిసిమి** *విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!*

**మిసిమి** పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా **₹300/-** తో పాటు పంపండి. బయటి **చెక్కులకు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు** అదనంగా **₹30/-** కలపండి.

1. **పేరు :** ..................................................

2. **చిరునామా :**
   - ఇం.నెం. ..................................................
   - వీధి ..................................................
   - పేట ..................................................
   - ఊరు ..................................................
   - పిన్ ..................................................
   - సెల్ ..................................................

3. **సంతకం :** ..................................................

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |



★ నాలుగు సంవత్సరాల చందా దారులకు **నా కథ *చార్లీ చాప్లిన్* గ్రంథం బహుమతి.**

---

మీరు బహుమతిగా **మిసిమి** మాసపత్రిక పంపండి.

**మీ** ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవే కదా.

మీకు ప్రియమైన వారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యం కదా. వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెల నెలా పంపవచ్చు. మీరూ ఒక బహుమతిని పొందవచ్చు.

ప్రక్కన వున్న పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంపిక చేసుకోండి. దాన్ని మీకు బహుమతిగా పంపిస్తాం.

మీ ఊరి గ్రంథాలయానికి, లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం **మిసిమి**కి చందా ₹ **300** పంపండి. వారి పూర్తి చిరునామా ఈ క్రింద గడులలో ఇవ్వండి.

మీరు ఇచ్చిన చిరునామాకు నెల నెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం.

ప్రతినెలా మీరు వారిని పలకరించినట్లే – మంచి సారస్వతంతో...

ఈ క్రింది పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంచుకోండి

1. సిద్ధార్థ, 2. అంతర్వీక్షణం, 3. దూర తీరాలలో, 4. నాలో నేను 5. మిసిమి వ్యాసాలు, 6. ఓ ఖైదీ వీరగాథ, 7. బుద్ధుని దీర్ఘ సంభాషణలు

**చిరునామా :**

..................................................

..................................................

..................................................

..................................................

..................................................

**మిసిమి**
మాసపత్రిక
**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
Visit us at : www.misimi-monthly.com



రామేశ్వర ఆలయ వైభవం

MISIMI / **మిసిమి** / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2015-17
Date of Posting: On 29th & 30th of every month.
Date of Publication: 25.01.2015



వసంతం